13 تفہیم السنۃ

جنت کا بیان

# స్వర్గ సందర్శనం

కూర్పు

**మౌలానా ముహమ్మద్ ఇఖ్బాల్ కైలానీ**

అనువాదం

**ముహమ్మద్ జీలాని**

ప్రకాశకులు

**హదీస్ పబ్లికేషన్స్**

**హైద్రాబాద్, ఏ.పి. ఇండియా**

**Swarga Sandarsanam** (Telugu) جنت کا بیان

| | | |
|---|---|---|
| Written by | : | **Muhammad Iqbal Kailani** |
| Translated by | : | **Muhammad Jeelani** |
| Edited by | : | Hafiz Md. Abdur Rawoof umari |
| First Edition | : | March 2007 |
| Copies | : | 3,000 |
| **Price** | **:** | **Rs. 50** |

*Published by*

**HADITH PUBLICATION**
**S. Abdul Wahid** H.No. 8-4-549/ 314
Netaji Nagar, Erragadda, Hyderabad-18
Ph : 23700081, 9908083615

***Copies can be had from***

**MD. ABDUL MASTAN**
H.No. 19-428/30, Z.P.Colony
Chikalpudi,
Machilipatnam
Krishna Dist. 521002
Phone : 250027

**HUSSAMI BOOK DEPOT.**
Machili Kaman, Hyderabad.

**MUNEER AHMED UMARI**
masjide ahle hadees,
farooq nagar, Vijayawada - 7.
Cell : 9848095304

**AL-ATHER ISLAMIC CENTRE**
Purani Haveli, Hyderabad.
Phone : 040-32901219

**NIZAM MOHIUDDIN**
H.No. 51-987A, Plot. No.17
SBI Colony,
Near Water Works,
Kurnool - 518003
Phone : 251525,
Cell : 99899642435

**G.K. COMMINICATIONS**
K.G. Road,
Nandikotkur, Kurnool dit
Cell :9866466685,
9885955981

**AZIZUR RAHMAN YUNUS**
B1/79, Western Colony,
Srisailam Dam (East), Kurnool Dist
Cell : 9866024962, 9849492445

**DECCAN TRADERS**
Near Water tank, Hyderabad-2

# విషయానుక్రమణిక

విషయం | పేజీ


| విషయం | పేజీ |
|---|---|
| 1. బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ | 01 |
| 2. స్వర్గలోకపు ఉనికి నిరూపణ | 41 |
| 3. స్వర్గం పేర్లు | 42 |
| 4. ఖుర్ఆన్ వెలుగులో స్వర్గం | 44 |
| 5. స్వర్గం వైభవం | 56 |
| 6. స్వర్గం విస్తృతి | 59 |
| 7. స్వర్గలోకపు ద్వారాలు | 61 |
| 8. స్వర్గపు స్థాయిలు | 66 |
| 9. స్వర్గలోకపు భవంతులు | 69 |
| 10. స్వర్గపు గుడారాలు | 73 |
| 11. స్వర్గలోకపు సంత | 74 |
| 12. స్వర్గలోకపు చెట్లు | 75 |
| 13. స్వర్గలోకపు పండ్లు | 79 |
| 14. స్వర్గలోకపు కాలువలు | 83 |
| 15. స్వర్గలోకపు సెలయేళ్ళు | 85 |
| 16. కౌసర్ కాలువ | 87 |
| 17. కౌసర్ కొలను | 89 |
| 18. స్వర్గవాసుల అన్నపానీయాలు | 93 |
| 19. స్వర్గవాసుల వస్త్రాలు, ఆభరణాలు | 98 |
| 20. స్వర్గవాసుల సభలు, సింహాసనాలు | 102 |

| విషయం | పేజీ |
|---|---|
| 21. స్వర్గవాసుల సేవకులు | 104 |
| 22. స్వర్గలోకపు స్త్రీలు | 105 |
| 23. స్వర్గలోకపు సుకన్యలు (హూర్) | 110 |
| 24. స్వర్గంలో అల్లాహ్ ప్రసన్నత | 113 |
| 25. స్వర్గంలో అల్లాహ్ దర్శనం | 114 |
| 26. స్వర్గవాసుల లక్షణాలు | 117 |
| 27. మానవజాతికి, స్వర్గవాసులకు, నరకవాసులకు మధ్య నిష్పత్తి | 123 |
| 28. స్వర్గంలో దైవప్రవక్త ముహమ్మద్ (స) అనుచర సమాజమే (ఉమ్మత్) ఎక్కువ సంఖ్యలో ఉంటుంది | 124 |
| 29. స్వర్గానికి కొనిపోయే ఆచరణలు కష్టంతో కూడుకున్నవి | 127 |
| 30. స్వర్గలోకపు శుభవార్తను పొందినవారు | 130 |
| 31. స్వర్గంలోకి ప్రవేశించేవారు | 138 |
| 32. ప్రారంభంలో స్వర్గానికి దూరంగా ఉండేవారు | 155 |
| 33. ఒక నిర్ణీత వ్యక్తిని స్వర్గవాసిగా పేర్కొనడం ధర్మసమ్మతం కాదు | 159 |
| 34. స్వర్గంలో గడచిన దినాల జ్ఞాపకాలు | 162 |
| 35. ఆరాఫ్ ప్రజలు | 163 |
| 36. రెండు విరుద్ధమైన విశ్వాసాలు, రెండు విరుద్ధమైన పర్యవసానాలు | 164 |
| 37. ఇహలోకంలో కొన్ని స్వర్గలోకపు సౌఖ్యాలు | 165 |
| 38. స్వర్గాన్ని కోరుకునేందుకు ఉద్దేశించబడిన ప్రార్థనలు | 167 |
| 39. వివిధ అంశాలు | 170 |

# بسم الله الرحمن الرحيم

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

అమిత దయాళువు, అమేయ కారుణ్యమూర్తి అయిన అల్లాహ్ పేరుతో...

మరణించిన తర్వాత మానవుని తదుపరి మజిలీ స్వర్గమా లేక నరకమా? అసలు స్వర్గనరకాలంటే ఏమిటి? విశ్వసించినవారికి, మంచి పనులు చేసినవారికి పరలోకంలో అల్లాహ్ సముచిత బహుమానంతో సత్కరిస్తాడని, అక్కడ వారు సుఖభోగాల్లో ఓలలా డుతారని, భోగభాగ్యాలతో కూడిన ఆ నిలయం పేరే స్వర్గమని, విశ్వసించనివారికి, చెడ్డ పనులు చేసినవారికి పరలోకంలో అల్లాహ్ వివిధ శిక్షలకు గురిచేస్తాడని, అక్కడ వారు ఎంతో కష్టభూయిష్టమైన జీవితాన్ని గడుపుతారని, శిక్షలతో కూడిన ఆ నెలవు పేరే నరకమని ప్రతి ముస్లిం ప్రాథమికంగా విశ్వసిస్తాడు.

దివ్య ఖుర్ఆన్‌లోనూ, హదీసుల్లోనూ స్వర్గనరకాలకు సంబంధించిన స్పష్టమైన వివరాలు లభ్యమవుతాయి. స్వర్గానికి సంబంధించి క్రింద పేర్కొనబడిన కొన్ని ఖుర్ఆన్ వాక్యాలను అధ్యయనం చేయండి :

1. స్వర్గం వెడల్పు భూమ్యాకాశాల విస్తృతికి సమానం. (ఆలి ఇమ్రాన్, ఆయత్:133)
2. స్వర్గలోకపు పండ్లు, వసంతాలు శాశ్వతమైనవి. (అర్రాద్, ఆయత్:30)
3. స్వర్గంలో ఆకలిదప్పులు ఉండవు. (తాహా, ఆయత్:118)
4. స్వర్గలోకవాసులు అక్కడ బంగారు కంకణాలను ఆకుపచ్చని సన్నని జలతారు పట్టువస్త్రాలను ధరిస్తారు. (అల్ కహఫ్, ఆయత్:31)
5. స్వర్గలోకవాసులు బుద్ధిని ప్రభావితంచేయని తెల్లని మధురమైన మధువు తాగుతారు. (సాఫ్ఫాత్, ఆయత్:45)
6. స్వర్గలోకవాసుల కొరకు మహా భాగ్యాల మధ్య సిగ్గులొలికే చూపులుగల సుకన్యలు ఉంటారు. ఈ స్వర్గలోకవాసులకు పూర్వం వారిని ఏ మానవుడు గానీ, ఏ జిన్నాతు గానీ తాకి ఉండలేదు. (సాఫ్ఫాత్, ఆయత్:45)

**ఇప్పుడు స్వర్గానికి సంబంధించి క్రింద పేర్కొనబడిన కొన్ని హదీసులను అధ్యయనం చేయండి :**

1. స్వర్గంలో వ్యాధి, వృద్ధాప్యం, మరణం ఉండవు. (ముస్లిమ్)
2. ఒకవేళ ఒక స్వర్గలోకవాసి తన ఆభరణాలతో సహా ప్రపంచంలోకి తొంగిచూ సినట్లయితే సూర్యుడు నక్షత్రాల కాంతిని అంతమొందించినట్లుగా సూర్యుని కాంతిని అంత మొందిస్తాడు. (తిర్మిజీ)

3. ఒకవేళ స్వర్గలోకపు మహిళ ఒకసారి ప్రపంచం వైపుకు తొంగిచూసినట్లయితే ప్రాక్పశ్చిమాలలో ఉన్న ప్రతి వస్తువునూ కాంతివంతం చేయడమే కాకుండా (వాతావరణమంతటినీ) సుగంధభరితం చేసివేస్తుంది. (బుఖారీ)

4. స్వర్గలోకపు గోడలు బంగారు ఇటుకలతోనూ, వెండి ఇటుకలతోనూ నిర్మించ బడ్డాయి. సుగంధభరితమైన కస్తూరి ఆ ఇటుకలను కలిపేందుకై ఉపయోగిం చబడింది. ముత్యాలు, వజ్రాలు కంకరరాళ్ళుగా ఉపయోగించబడ్డాయి. దాని కొరకు మట్టిగా కుంకుమపువ్వు వాడబడింది. (తిర్మిజీ)

5. స్వర్గంలో 100 స్థాయిలున్నాయి. ప్రతి రెండు స్థాయిలకు నడుమ దూరం భూమ్యాకాశాల మధ్యదూరానికి సమానం. (తిర్మిజీ)

6. స్వర్గలోకానికి చెందిన ఒక్క పండ్ల గుత్తి భూమ్యాకాశాలకు చెందిన సమస్త జీవరాశులు తిన్నప్పటికీ ఇంకా మిగిలే ఉంటుంది. (అహ్మద్)

7. స్వర్గంలో ఒక చెట్టు నీడ ఎంత పొడవుగా ఉంటుందంటే దాని నీడలో ఒక గుర్రం వంద సంవత్సరాలపాటు ప్రయాణించినప్పటికీ ఆ నీడ అంతరించదు. (బుఖారీ)

8. స్వర్గంలో ఒక విల్లుకు సమానమైన స్థలం ప్రపంచం, అందులోని సమస్త సౌఖ్యాల కంటే విలువైనది. (బుఖారీ)

9. స్వర్గంలో 'కౌసర్' అనే సెలయేరు వద్ద బంగారు గిన్నెలు, వెండి గిన్నెలు ఉంటాయి. వాటి సంఖ్య ఆకాశంలోని నక్షత్రాల సంఖ్యకు సమానంగా ఉంటుంది. (ముస్లిమ్)

**ఇక ఇప్పుడు నరకానికి సంబంధించి క్రింద పేర్కొనబడిన కొన్ని ఖుర్ఆన్ వాక్యాలను అధ్యయనం చేయండి :**

1. వారిలో అవిశ్వాసులైన వారి కొరకు అగ్ని వస్త్రాలు కత్తిరించబడి ఉన్నాయి, వారి శిరస్సులపై మరిగే నీరు పోయబడుతుంది. దానివల్ల వారి చర్మాలే కాదు, కడుపు లోపలి భాగాలు సైతం కరిగిపోతాయి. (హజ్, ఆయత్:19-20)

2. నరకలోకవాసుల కొరకయితే నరకమే పాన్పు, నరకమే దుప్పటి. (ఆరాఫ్, ఆయత్:41)

3. నరకలోకవాసుల మెడలకు కంఠపాశాలు, చేతులకు గొలుసులు, కాళ్ళకు బేడీలు వేసి అగ్నిలోకి ఈడ్చివేయడం జరుగుతుంది. (అల్ హాఖ్ఖహ్, ఆయత్ :34-35, అల్ మోమిన్, ఆయత్:71,72)

4. నరకలోకవాసులను నరకంలో 'సఊద్' అనే కొండ మీదికి ఎక్కించడం జరుగుతుంది. (ముద్దస్సిర్, ఆయత్ :17)

5. నరకలోకవాసులకు తాగేందుకై పుండ్ల నుంచి కారే చీము, రక్తాల మిశ్రమం అందించడం జరుగుతుంది. (ఇబ్రాహీమ్, ఆయత్ : 16, 17)

అలాగే నరకలోకవాసుల కొరకు దుర్గంధభరితమైన, మరుగుతున్న నీరు ఇవ్వబడుతుంది. ఆ నీరు నోటిలోకి తీసుకున్న వెంటనే ముఖాన్ని మాడ్చివేస్తుంది. (కహఫ్, ఆయత్ :29)

6. నరకలోకవాసులు తినేందుకై దుర్గంధభరితమైన, చేదయిన, ముళ్ళతో కూడిన రాకాసి జముడు (జఖ్ఖూమ్) చెట్టు ఇవ్వబడుతుంది. (సాఫ్ఫాత్, ఆయత్:62)

7. నరకలోకవాసులను దండించేందుకై నరకంలో ఇనుప గదలు ఉంటాయి. (హజ్, ఆయత్ :21, 22)

8. నరకలోకవాసులను నరకంలోని ఒక ఇరుకైన స్థలంలో కాళ్ళుచేతులు బంధించి క్రుక్కినప్పుడు వారు చావును పిలవటం ప్రారంభిస్తారు. (అప్పుడు వారితో ఇలా అనబడుతుంది) 'ఈనాడు ఒక చావునే కాదు, ఎన్నో చావుల కోసం అరవండి.' (ఫుర్ఖాన్, ఆయత్ :13, 14)

పైన పేర్కొనబడిన వాక్యాల్లో ఖుర్ఆన్ వాక్యాలకు సంబంధించిన భావమే పేర్కొనబడింది. అయితే ఆ వాక్యాలను సంపూర్ణంగా అధ్యయనం చేయాలనుకునేవారు వాటి చివర ఇవ్వబడిన సూచికలను అనుసరించి స్వయంగా ఖుర్ఆన్‌లో అధ్యయనం చేయవచ్చు.

**ఇప్పుడు నరకానికి సంబంధించి క్రింద పేర్కొనబడిన కొన్ని హదీసులను అధ్యయనం చేయండి :**

1. నరకంలో ఒంటెల పరిమాణంలో పాములు ఉంటాయి. అవి ఒక్క పర్యాయం కాటువేసిన తర్వాత నరకవాసి నలభై సంవత్సరాలపాటు దాని విషప్రభావాన్ని అనుభవిస్తూ ఉంటాడు. అలాగే నరకంలో కంచరగాడిదల పరిమాణంలో తేళ్ళు ఉంటాయి. అవి ఒక్క పర్యాయం కాటు వేసిన తర్వాత నరకవాసి నలభై సంవత్స రాలపాటు దాని విషప్రభావాన్ని అనుభవిస్తూ ఉంటాడు. (ముస్నద్ అహ్మద్)

2. నరకవాసికి చెందిన ఒక దంతం ఉహుద్ కొండతో సమానంగా ఉంటుంది. (ముస్లిమ్)

3. నరకంలో నరకవాసులు ఎంతగా రోదిస్తారంటే వారి కన్నీళ్ళలో ఓడలు నడపవచ్చు. (హాకిమ్)

4. నరకంలో ఒక అవిశ్వాసి బాహువుల మధ్య దూరం వేగంగా పయనించే వాహనం మూడు రోజులు ప్రయాణించే దూరానికి సమానంగా ఉంటుంది. (ముస్లిమ్)

5. నరకవాసి చర్మం మందం నలభై రెండు చేతులు (దాదాపు 63 అడుగులు) ఉంటుంది. (తిర్మిజీ )

6. నరకవాసి కూర్చుండే స్థలం మక్కా నుంచి మదీనా పట్టణం వరకు గల మధ్యదూరానికి సమానంగా (దాదాపు 500 కిలోమీటర్లు) ఉంటుంది. (తిర్మిజీ)

7. ప్రళయదినాన నరకాన్ని ఈడ్చుకొని వచ్చేందుకై 490 కోట్లమంది దైవదూతలు నియుక్తులై ఉంటారు. (ముస్లిమ్)

8. నరకం ఎంత లోతుగా ఉంటుందంటే అందులో పడిన వ్యక్తి 70 సంవత్సరా లపాటు క్రిందివైపుకు పోతూనే ఉంటాడు. (ముస్లిమ్)

దివ్య ఖుర్‌ఆన్ వాక్యాల ద్వారా, హదీసుల ద్వారా స్వర్గనరకాల గురించి క్లుప్తంగా పరిచయం చేయడం జరిగింది. ఈ పరిచయానికి సంబంధించిన సంపూర్ణ వివరాలు పాఠకులకు 'స్వర్గ ప్రకరణం', 'నరక ప్రకరణం'లలో ఇన్‌షా అల్లాహ్ లభ్యమవుతాయి.

## స్వర్గనరకాలు - బుద్ధివాదం

ధర్మానికి దైవవాణి (వహీ) పునాది. అందుకే దైవవాణి అనుసరణ నిత్యం మానవుల సంక్షేమానికి, ముక్తికి కారణభూతమయితే, అందుకు విరుద్ధంగా బుద్ధి అనుసరణ నిత్యం మానవుల మార్గభ్రష్టత్వానికి, వినాశనానికి కారణభూతమయింది.

దైవప్రవక్తల సందేశానికి ప్రతిస్పందనగా ఎవరయితే దైవప్రవక్తలపై అవతరించిన దైవవాణి బోధనలను విశ్వసించారో, మరణించిన తర్వాత పరలోకాన్ని, అనగా ప్రళయదినాన్ని, కర్మల లెక్క తీసుకోబడటాన్ని, స్వర్గనరకాలను విశ్వసించారో వారు సాఫల్యం పొందారు. ఎవరయితే ఆ బోధనలను బుద్ధి ప్రాతిపదికన పరీక్షించదలిచారో వారు విఫలమయ్యారు.

పవిత్ర ఖుర్‌ఆన్‌లో పలుచోట్ల అవిశ్వాసులు బుద్ధి ప్రాతిపదికన 'మరణించిన తర్వాత తిరిగి బ్రతికించబడటం అనేది బుద్ధికి అందే విషయంగా లేదు' అంటూ చేసే ఆరోపణ గురించి అల్లాహ్ పేర్కొన్నాడు. అందుకే అవిశ్వాసులు దైవప్రవక్తలను తిరస్కరించడమే కాకుండా వారిని హేళన చేసారు. ఈ విషయానికి సంబంధించి క్రింద పేర్కొనబడిన కొన్ని ఖుర్‌ఆన్ వాక్యాలను పరిశీలించవచ్చు :

1. "మేము మరణించి మట్టిగా మారిపోయినప్పటికీ, (మళ్ళీ బ్రతికించబడతామా?) ఇది చాలా విచిత్రంగా ఉంది. ఈ తిరుగు ప్రయాణం అనేది బుద్ధికి అందని విషయం." (ఖాఫ్ - 3)

2. "అవిశ్వాసులు ప్రజలతో ఇలా అంటారు, 'మీ శరీరంలోని అణువణువూ చెల్లాచెదురై పోయినప్పుడు మీరు మళ్ళీ కొత్తగా సృష్టించబడతారని తెలియజేసే వ్యక్తిని మీకు చూపమంటారా? ఈ వ్యక్తి అల్లాహ్ పేరుతో అబద్ధాలు కల్పిస్తున్నాడో లేక ఇతనికి పిచ్చి ఏమయినా పట్టిందో తెలియడం లేదు." (సబా -7, 8)

3. "అవిశ్వాసులు ఇలా అంటారు : 'ఇది పూర్తిగా మాయాజాలమే. కాకపోతే, మేము చనిపోయి మట్టిగా మారి, అస్తిపంజరంగా మిగిలిపోయినప్పుడు, మళ్ళీ మమ్మల్ని బ్రతికించి లేపటం జరిగే పనేనా? పూర్వకాలం నాటి మా తాత ముత్తాతలు సైతం లేపబడతారా?' వారితో 'అవును (లేపబడతారు) మీరు (దేవుని ముందు) నిస్సహాయులు' అని పలుకు." (సాఫ్ఫాత్ :15 - 18)

4. "ఆ సత్యతిరస్కారులు ఇలా అంటారు : 'మేమూ, మా తాతముత్తాతలూ మట్టిలో కలిసిపోయిన తర్వాత కూడా నిజంగానే మమ్మల్ని సమాధుల నుండి లేపటం జరుగుతుందా? ఇలాంటి వార్తలు ఎన్నో మాకు కూడా అందించబడ్డాయి, పూర్వం మా తాతముత్తాతలకు కూడా అందించబడుతూ ఉండేవి. కానీ ఇవి మేము పూర్వకాలం నుంచి వింటూ వస్తున్న కట్టుకథలు మాత్రమే." (నమల్ : 67 - 68)

5. "ఇతను మీకు తెలియజేసేదేమిటంటే, మీరు మరణించి మట్టిగా మారిపోయిన తర్వాత, ఎముకల గూడుగా అయిపోయిన తర్వాత, మీరు (గోరీల నుండి) బయటకు తీయబడతారట. అసంభవం, మీకు చేయబడే ఈ వాగ్దానం అసంభవం." (మూమినూన్ : 35 - 36)

దైవం తరఫు నుంచి అవతరించబడే వాణిని బుద్ధి ప్రాతిపదికన పరిశీలించే 'మేధావులు' ప్రతి యుగంలోనూ పెద్ద సంఖ్యలో ఉంటారు. అయితే పూర్వకాలంలో దైవవాణి బోధనలను తిరస్కరించేవారు ఇస్లాం పరిధిలోకి అసలు ప్రవేశించేవారే కారు. కానీ నేటి దౌర్భాగ్యమేమిటంటే నేడు దైవవాణి (వహీ) బోధనలను బుద్ధి ప్రాతిపదికన పరిశీలించి తిరస్కరించేవారు బాహిరంగా ఇస్లాం పరిధిలోకి ప్రవేశించి తమను తాము 'ముస్లింలు'గా ప్రకటించుకునేవారే!

హిజ్రీ శకం రెండవ శతాబ్దపు ప్రారంభంలో జహమ్ బిన్ సఫ్వాన్ అనే వ్యక్తి గ్రీకు తత్త్వంతో ప్రభావితమై దేవుని అస్తిత్వం, గుణగణాలు, విధిరాత ఇత్యాది విషయాల్లో దైవప్రవక్తపై ప్రోక్తమైన దైవవాణి బోధనలను స్వయంగా నిరాకరించడమే కాకుండా తనతో పాటు ఎంతోమందిని సన్మార్గం నుంచి తప్పించాడు. వారి వర్గమే ఆ తర్వాత 'జహమీ వర్గం'గా పిలువబడటం మొదలయింది. అదేవిధంగా 'మూతజిల వర్గం' స్థాపకుడైన వాసిల్ బిన్ అతా సైతం దైవవాణికి బదులుగా బుద్ధిని ప్రమాణంగా తీసుకొని స్వయంగా

మార్గభ్రష్టుడవడమే కాకుండా తనతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలను సన్మార్గం నుంచి తప్పించాడు. వారి వర్గమే 'మూతజిల వర్గం'గా పిలువబడింది.[1]

హిజ్రీ శకం నాల్గవ శతాబ్దపు మధ్యభాగంలో దైవప్రవక్తలపై అవతరించిన దైవవాణి బోధనల పట్ల విముఖులైన, బుద్ధిని ప్రమాణంగా తీసుకునే సూఫీలు ఇరాక్ లోని బాగ్దాద్ లో 'ఇఖ్వానుస్ సఫా' అనే పేరుతో ఒక సంస్థను స్థాపించారు. ఆ సంస్థ దృష్టిలో 'దైవదౌత్యం', 'దైవదూతలు', 'నమాజ్', 'జకాత్', 'రోజహ్', 'హజ్', 'పరలోకం', 'స్వర్గం', 'నరకం' మొదలయిన ధర్మానికి చెందిన పారిభాషిక పదాల న్నింటికీ రెండు అర్థాలుంటాయి. ఒకటి బహిర్గతమైన అర్థమైతే, రెండవది అంతరార్థం. బహిర్గతమైన అర్థాలన్నీ దైవప్రవక్తపై దైవవాణికి అనుగుణ మైనవయితే, వాటి అంతరార్థాలన్నింటినీ సూఫీలు తమ బుద్ధి ద్వారా స్వయంగా రూపొందించారు. సూఫీల దృష్టిలో బహిర్గతమైన అర్థాల ప్రకారం ఆచరించే ముస్లింలు అజ్ఞానులయితే, అంతరార్థాల ప్రకారం ఆచరించేవారు బుద్ధిమంతులైన జ్ఞానులు. వాస్తవానికి ఆఖరి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స.అ.వ) బోధనల ప్రకారం ఇస్లాంకు చెందిన పారిభాషిక పదాలన్నింటికీ అంతరార్థాలేమీ లేవు.

దైవవాణి బోధనలను నేరుగా తిరస్కరించే సూఫీలకు చెందిన ఈ మార్మిక వర్గం నేటికీ ప్రపంచంలోని ప్రతి దేశంలోనూ ఏదో ఒక రూపంలో కొనసాగుతూనే ఉంది.

సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ను సైతం బుద్ధిని ప్రమాణంగా తీసుకునేవారికి ప్రతీకగా తీసుకోవచ్చు. ఆయన క్రీ.శ.1868 నుంచి 1870 వరకు ఇంగ్లాండ్‌లో గడిపి తిరిగి వచ్చినప్పుడు పాశ్చాత్య శాస్త్రీయ విజ్ఞానాభివృద్ధి వల్ల, సాంకేతికత వల్ల ఎంతగా ప్రభావితు లయ్యారంటే అలీగఢ్‌లో 'ఎమ్. ఏ. ఓ' కాలేజీని స్థాపించినప్పుడు "తత్త్వం (ఫిలాసఫీ)

---

1. గుర్తుంచుకోదగిన విషయమేమిటంటే జహమీ, మూతజిల వర్గాలకు చెందినవారు దివ్య ఖుర్‌ఆన్‌లో స్పష్టంగా పేర్కొనబడిన దేవుని గుణగణాలను తిరస్కరించారు. ఉదాహరణకు అల్లాహ్ చేతులను, కాళ్ళను, ముఖాన్ని, పిక్కను కలిగి వుండటాన్ని వారు నిరాకరించారు. వాస్తవానికి వాటి గురించి ఖుర్‌ఆన్‌లో స్పష్టంగా పేర్కొనబడింది. వారు అటువంటి ఖుర్‌ఆన్ వాక్యాలకు, హదీసులకు తమ భావనలకు అనుగు ణంగా భాష్యం చెప్పుకున్నారు. ఇక విధిరాత విషయానికొస్తే 'మానవుడు ఆచరణ విషయంలో పూర్తిగా వివశుడు. అతడు దేవుడు నిర్ణీత ప్రణాళికకు బద్ధుడై, వివశుడై అసంకల్పితంగా పనులు చేస్తూ ఉంటాడు' అని జహమీ వర్గానికి చెందినవారు విశ్వసించడమే కాకుండా మానవుడిని తన స్వయం నిర్ణయాధికారాన్ని ఉపయోగించి పనులు చేయవలసిందిగా తాకీదు చేసే ఖుర్‌ఆన్ వాక్యాలకు, హదీసులకు తమ విశ్వాసానికి అనుగుణంగా భాష్యం చెప్పుకున్నారు. ఇక మూతజిల వర్గానికి చెందినవారు 'మానవుడు ఆచరణల విషయంలో సర్వ స్వతంత్రుడని, అతడి ఆచరణలకు సంబంధించిన పూర్వజ్ఞానం సైతం అల్లాహ్‌కు లేదు' అని విధిరాత విషయంలో విశ్వాసాన్ని కలిగియుండేవారు.

మన కుడిచేతిలో ఉంటే, జీవశాస్త్రం మన ఎడమచేతిలో ఉంటుంది. అలాగే 'లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్' అనే మకుటం మన శిరస్సుపై ఉంటుంది'' అనే వాక్యాలు కాలేజీకి చెందిన ఆశయాలు-లక్ష్యాలలో చేర్చబడ్డాయి. కాలేజీ అప్పటి భారతదేశపు వైస్రాయ్ లార్డ్ లిటన్ చే ప్రారంభించబడింది. అలాగే కాలేజీ ఛార్టర్ (హక్కుల పత్రం)లో కాలేజీ ప్రిన్సిపాల్ ఎల్లప్పుడూ యూరోపియనే అయి వుండాలనే నిబంధన చేర్చబడింది.

పాశ్చాత్య శాస్త్రీయ విజ్ఞానంతో, సాంకేతికాభివృద్ధితో అమితంగా ప్రభావి తులైన సయ్యద్ అహ్మద్ ఖాన్ ఖుర్ఆన్‌కు వ్యాఖ్యానం వ్రాసేందుకు ఉపక్రమించినప్పుడు దైవప్రవక్తల బోధనలను బుద్ధిని గీటురాయిగా చేసుకొని పరీక్షించడం మొదలుపెట్టి దైవప్రవక్తల అద్భుత కార్యాలను, మహిమలన్నింటినీ వరుసగా నిరాకరిస్తూ పోయారు. అలాగే భౌతికమైన అస్తిత్వాన్ని కలిగి వుండని దైవదూతల అస్తిత్వాన్ని నిరాకరించారు, జిన్నాతుల అస్తిత్వాన్ని నిరాకరించారు, సమాధిలో మృతుడు శిక్షించబడటాన్ని నిరాకరించారు, ప్రళయ సూచనలను నిరాకరించారు, ఉదాహరణకు ప్రళయానికి ముందు భూమి నుంచి విచిత్రమైన జంతువు బయల్పడటాన్ని, క్రీస్తు రెండవ రాకడను, సూర్యుడు పడమర నుంచి ఉదయించడాన్ని మొదలయినవాటిని నిరాకరించారు. అలాగే స్వర్గనరకాల ఉనికిని నిరాకరించారు. ఆ విధంగా దైవప్రవక్తపై ప్రోక్తమైన దైవవాణి బోధనలను నిరాకరించి స్వయంగా మార్గభ్రష్టుడవడమే కాకుండా తన వెనుక బుద్ధిని ప్రమాణంగా తీసుకొని దైవవాణి బోధనలను నిరాకరించే ఒక పెద్ద సమూహాన్ని విడచిపెట్టి వెళ్ళారు. ఆ సమూహానికి చెందినవారు నిత్యం ముస్లిం సమాజాన్ని సైద్ధాంతిక నాస్తికత్వం వైపుకు తీసుకెళ్తూ నేటివరకు కొనసాగుతున్నారు.

ఈ ప్రాపంచిక జీవనంలో స్వర్గనరకాలకు సంబంధించిన వివరాలు బుద్ధికి అందవనే విషయాన్ని మేము పూర్తిగా అంగీకరిస్తాము. అయితే ఏదయినా విషయం బుద్ధికి అందనంత మాత్రాన దాని ఉనికిని నిరాకరించవచ్చనే విషయం సముచి తమేనా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. సైన్స్‌తో పాటు బుద్ధి వెలుగులో దీనికి సమాధానాన్ని అన్వేషిద్దాము.

**ఖగోళ శాస్త్రవేత్తల ఆధునిక పరిశోధనల ప్రకారం :**

1. మన భూమి నిరంతరం తిరుగుతూనే ఉంది. భూమికి రెండు భ్రమణాలు ఉన్నాయి. 1. ఆత్మభ్రమణం (తన చుట్టూ తాను తిరగడం) 2. పరిభ్రమణం (సూర్యుని చుట్టూ తిరగడం)
2. సూర్యుడు స్థిరంగా ఉండి తన అక్షం చుట్టూ తాను తిరుగుతూ ఉంటాడు.
3. భూమి నుంచి సూర్యుడు 9 కోట్ల 30 లక్షల మైళ్ళ దూరంలో ఉన్నాడు.
4. భూమి కంటే సూర్యుడు 3 లక్షల 37 వేల రెట్లు పెద్దవాడు.
5. మన సౌరకుటుంబం నుంచి 400 ట్రిలియన్ల కిలోమీటర్ల దూరంలో మరొక సూర్యుడు

ఉన్నాడు. అది మన కంటికి ఒక చిన్న చుక్కలా కనిపిస్తుంది. దానినే Alfa Gentauris అని పిలుస్తారు.

6. మన సౌరకుటుంబానికి వెలుపల జుశిదీశిబిజీలిరీ అనే పేరు గల నక్షత్రం ఉంది. దాని వ్యాసం 28 కోట్ల 30 లక్షల మైళ్ళు.

ఈ భూమి తిరుగుతున్నట్లుగా మనకు అనిపిస్తుందా? మన కళ్ళకు భూమి పూర్తిగా నిశ్చలంగా ఉన్నట్లు గోచరిస్తుంది. భూమి ఏ కొంచెం కంపించినా దానిమీద నివసించేవారు కంపించిపోయి భయకంపితులయిపోతారు. అయినప్పటికీ భూమి రెండు భ్రమణాలను కలిగి వుండి నిత్యం భ్రమిస్తూ ఉందని ఎలా విశ్వసించగలము?

సూర్యుడు స్థిరంగా ఉన్నట్లు మనకు కనిపిస్తున్నాడా? ప్రతి మానవుడూ ప్రతిరోజూ తన కళ్ళతో సూర్యుడు తూర్పున ఉదయించి క్రమక్రమంగా పయనిస్తూ పడమరన అస్తమించడాన్ని చూస్తూనే ఉన్నాడు.

నిజంగానే సూర్యుడు భూమి నుంచి 3 లక్షల 37 వేల రెట్లు పెద్దగా కనిపిస్తున్నాడా? సూర్యుడు భూమి నుంచి దాదాపు తొమ్మిది లేదా పది మీటర్ల చిన్న గోళంగా మాత్రమే కనిపిస్తాడు.

అలాగే మానవుని బుద్ధి మన ఈ సౌర కుటుంబానికి అవతల ట్రిలియన్ల కిలోమీటర్ల దూరంలో సైతం మన భూమి కంటే, సూర్యుని కంటే లక్షల రెట్లు పెద్దవయిన నక్షత్రాలు గానీ గ్రహాలు గానీ ఉన్నట్లుగా అంగీకరించగలదా?

ఈ విషయాలన్నీ దృష్టికి విరుద్ధమైనవే కాకుండా బుద్ధికి సైతం అందనివి. అయినప్పటికీ ఖగోళ శాస్త్రవేత్తలు ఎంతో పరిశోధన చేసి అనుభవపూర్వకంగా ప్రకటించిన కారణంగా మనం వాటిని అంగీకరిస్తాము. దీనినిబట్టి ఏదయినా అంశం బుద్ధికి అతీతమయినంత మాత్రాన దానిని తిరస్కరించడమనేది పూర్తిగా తప్పుడు వైఖరి అని స్పష్టమవుతోంది. ఇదేవిధంగా స్వర్గనరకాల ఉనికిని, వాటి వివరాలను కేవలం బుద్ధికి అతీతమైనవిగా ఉన్న కారణంగా తిరస్కరించడమనేది పూర్తిగా తప్పుడు వైఖరి. అది కేవలం షైతాన్ మాయోపాయం తప్ప మరేమీ కాదు.

ఒకవేళ న్యూటన్ లేదా ఐన్‌స్టీన్ సూత్రాలు మనకు అర్థం కాకపోతే మనం మన అజ్ఞానాన్ని, బుద్ధిరాహిత్యాన్ని వెంటనే ఒప్పుకోవడమే కాకుండా వారి మేధస్సును ఎంతగానో ప్రశంసిస్తాము. కానీ అల్లాహ్, ఆయన ప్రవక్త (స) మనకు అందజేసిన సమాచారాన్ని కేవలం బుద్ధికి అందని కారణంగా తిరస్కరించడమే కాకుండా హేళన చేస్తాము.

అంటే న్యూటన్, ఐన్‌స్టీన్ వంటి శాస్త్రవేత్తల పరిశోధనలపై ఉన్నంత విశ్వాసం మనకు అల్లాహ్, ఆయన ప్రవక్త (స) బోధనలపై లేదని తప్ప ఇటువంటి వైఖరికి మరి ఎటువంటి అర్థాన్ని మనం ఆపాదించగలము?

స్వర్గనరకాల ఉనికిని, వాటికి సంబంధించి దైవప్రవక్త ద్వారా అందించబడిన వివరాలను సంపూర్ణంగా అంగీకరించేందుకై 'అగోచర విషయాలపై విశ్వాసం' అవసరం. మానవులు సన్మార్గం పొందేందుకై అల్లాహ్ దీనిని షరతుగా విధించాడు. పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు : "నిస్సందేహంగా ఇది అల్లాహ్ గ్రంథం. ఇందులో ఎటువంటి సందేహమూ లేదు. ఇది అగోచర విషయాలను విశ్వసించే, నమాజ్‌ను స్థాపించే, మేము ప్రసాదించినవాటిలో నుండి ఖర్చుచేసే దైవ భీతిపరులకు సన్మార్గాన్ని చూపిస్తుంది." (అల్ బఖరహ్- 2, 3)

దీనినిబట్టి విశదమవుతున్న విషయమేమిటంటే అగోచర విషయాలపై ఏ వ్యక్తి విశ్వాసమయితే పటిష్ఠంగా ఉంటుందో స్వర్గనరకాలపై అతడి విశ్వాసం కూడా అంతే పటిష్ఠంగా ఉంటుంది. అలాగే అగోచర విషయాలపై ఏ వ్యక్తి విశ్వాసమయితే బలహీనంగా ఉంటుందో స్వర్గనరకాల ఉనికిపై అతడి విశ్వాసం కూడా అంతే బలహీనంగా ఉంటుంది. కనుక ఏ వ్యక్తి బుద్ధి అయితే స్వర్గనరకాల ఉనికిని అంగీకరిం చేందుకు సిద్ధంగా లేదో అతడు తన బుద్ధి గురించి కాకుండా తన విశ్వాసం గురించి చింతించాలి. విశ్వాసుల వ్యవహార సరళి అయితే ఈ విషయంలో స్పష్టంగా పేర్కొనబడింది. ఖుర్ఆన్‌లో వారి గురించి అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు :

"ఓ మా ప్రభువా! మేము 'మీ ప్రభువును విశ్వసించండి' అంటూ విశ్వాసం వైపుకు ఆహ్వానించే వాని పిలుపును విని విశ్వసించాము." (ఆలి ఇమ్రాన్ - 193)

## స్వర్గం పట్ల ఖుర్ఆన్ భావన

పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఎన్నో చోట్ల స్వర్గం గురించి పేర్కొంటూ నీటి సెలయేళ్ళు, పాల సెలయేళ్ళు, తేనెతో కూడిన సెలయేళ్ళు, మధువుతో కూడిన కాలువలు, పండ్లు, తోటలు, గుబురు నీడలు, చల్లని నీడలు, పక్షుల మాంసం, విలువైన ఆసనాలు, దివ్యమైన కన్యలు మొదలయినవాటి గురించి పేర్కొన్నాడు. ప్రాపంచిక దృక్పథంలో ఈ వస్తువులన్నీ భోగభాగ్యాల ఉత్కృష్ట స్థాయికి చెందినవిగా పరిగణించబడతాయి. అందువల్ల కొంతమంది నాస్తికులు, భౌతికవాదులు, ధర్మాన్ని విశ్వసించని సాహిత్యకారులు, కవులు స్వర్గాన్ని హేయమైన రీతిలో వర్ణించే పయత్నం చేశారు. వారి వర్ణనల ప్రకారం స్వర్గం ఎటువంటి భోగాలకు నిలయమంటే ఇహలోకంలో ధర్మనిష్ఠాగరిష్ఠులుగా, దైవభీతిపరులుగా జీవితం గడిపినవారు స్వర్గంలోకి ప్రవేశించగానే తమ 'ధార్మిక పరాయణత' అనే ముసుగును తీసి పారవేస్తారు, సర్వత్రా మద్యం విందులు కొనసాగుతూ ఉంటాయి, గానాబజానాలతో, సంగీత వాయిద్యాలతో స్వర్గం హోరెత్తుతూ ఉంటుంది, ఎక్కడ పడితే అక్కడ స్వర్గలోక కన్యలు పెద్దసంఖ్యలో స్వర్గలోకవాసుల హృదయాలను రంజింపజేస్తూ ఉంటారు, నృత్య మందిరాలు వాటి అభిమానులతో నిండిపోయి ఉంటాయి, మద్యపాన నిలయాలు మద్యం

సేవించేవారితో నిండిపోయి ఉంటాయి. నిజంగానే స్వర్గం ఇటువంటి భోగవిలాసాలకు నిలయమా? స్వర్గాన్ని రూపొందించినవానిని, దాని సమాచారాన్ని అందించినవారినే నేరుగా ప్రశ్నించి స్వర్గం ఎలా ఉంటుందో తెలుసుకుందాం.

పవిత్ర ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు : ‘‘స్వర్గవాసులు స్వర్గంలోకి ప్రవేశించగానే వారికి స్వాగతం పలికే దైవదూతలు ‘సలామున్ అలైకుమ్’ (మీపై శుభం కలుగుగాక) అని పలికి వారికి స్వాగతం పలుకుతారు. అలాగే ‘తిబ్‌తుమ్’ (బాగా ఉండండి) అంటూ వారికి శుభాకాంక్షలు పలుకుతారు. అప్పుడు స్వర్గవాసులు ‘అల్‌హమ్‌దులిల్లాహ్’ (స్తోత్రం అల్లాహ్ కొరకే) అంటూ అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుతారు. (ఖుర్‌ఆన్, సూరయె జుముర్ - 73, 74) స్వర్గవాసులు తమ ప్రతి శ్వాసతో పాటు అల్లాహ్‌ను ‘సుబ్‌హానల్లాహ్’ (అల్లాహ్ పరమ పవిత్రుడు) అంటూ స్మరిస్తూ ఉంటారు. అలాగే ‘అల్‌హమ్‌దులిల్లాహ్’ (స్తోత్రం అల్లాహ్ కొరకే) అంటూ అల్లాహ్‌ను స్తుతిస్తూ ఉంటారు. అలాగే ఒకరినొకరు కలుసుకున్నప్పుడు ‘ అస్సలాము అలైకుమ్’ (మీపై శుభం వర్షించుగాక) అని సలామ్ చేసుకుంటారు. అలాగే పరస్పర సంభాషణ ముగిసినప్పుడు ‘అల్‌హమ్‌దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్’ (సర్వలోకాలకూ ప్రభువయిన అల్లాహ్‌కే సర్వ స్తోత్రాలూ తగియున్నవి) అనే పవిత్ర పలుకులను ఉచ్చరిస్తారు. (యూనుస్-10) స్వర్గవాసులు వ్యర్థమైన, అసభ్యమైన, అసందర్భమైన, అసత్యమైన మాటలు పలకరు, వినరు. (వాఖిఅహ్-25)

స్వర్గలోకానికి చెందిన దివ్యకన్యలు నిస్సందేహంగా స్వర్గవాసుల కొరకు ఎన్నో సౌఖ్యాలను అందజేస్తారు. అయితే ఆ దివ్యకన్యలు నీచమైనవారు, సభ్యత లేనివారు, లజ్జావిహీనులు కారు. అలాగే వారు పరపురుషులతో చూపులు కలిపేవారు కారు. వారు అత్యంత బిడియస్తులయి, సద్గుణ సంపన్నులయి, పరపురుషులను చూడనివారయి ఉంటారు. వారిని అంతకు మునుపు ఏ మానవుడూ చూసి గానీ, తాకి గానీ ఉండడు. వారు కేవలం తమ భర్తలను మాత్రమే ప్రేమించేవారుగా ఉంటారు. (ఖుర్‌ఆన్, రహ్మాన్, 56-70, వాఖిఅహ్, 22-23-35-37, బఖరహ్-25) మొదలయినవి)

పైన పేర్కొనబడిన పవిత్ర ఖుర్‌ఆన్ బోధనలను బట్టి స్వర్గం నిస్సందేహంగా సుఖభోగాల నిలయమే అయినప్పటికీ ఆ సుఖభోగాలకు సంబంధించిన భావన అల్లాహ్ తన దాసుల నుంచి ప్రాపంచిక జీవనంలో దైవభీతి, పుణ్యం, ధార్మిక పరాయణతలకు సంబంధించి ఏ విలువలనయితే కోరాడో ఆ విలువలతో కూడుకున్నట్టిది. అటువంటి మహోన్నతమైన విలువల స్థాయికి అల్లాహ్ దాసులు తమ ప్రాపంచిక జీవనంలో తమ శక్తి మేరకు సంపూర్ణంగా ప్రయత్నించి సైతం చేరుకోలేకపోయారు. అయితే వారు ఎప్పుడయితే స్వర్గంలోకి ప్రవేశిస్తారో అల్లాహ్ తన కరుణాకటాక్షాల ద్వారా వారికి దైవభీతి, పుణ్యం, ధార్మిక పరాయణత, పవిత్రతలకు సంబంధించి ఏ ప్రమాణాలకు చేరుకోమని ఇహలోకంలో వారిని ఆదేశించాడో ఆ ప్రమాణాలకు వారిని చేరవేస్తాడు.

స్వర్గానికి చెందిన వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకొని ఒక్క క్షణం ఊహిం చండి. స్వర్గంలోకి ప్రవేశించిన తర్వాత స్వర్గలోకానికి చెందిన దివ్యకన్యలను, స్వర్గలోక పానీయాలను చవిచూడటానికి ముందు మానవ మహోపకారి, విశ్వ మార్గదర్శి, పాపాత్ముల కొరకు సిఫారసు చేసేవారు, విశ్వ కారుణ్యమూర్తి, దైవప్రవక్తల నాయకులు, దైవభీతిపరుల నాయకులు అయిన హజ్రత్ ముహమ్మద్ (స.అ.వ) కాంతిమయ వదనాన్ని ఒక్క పర్యాయం చూడాలని తపించని ముస్లిం ఎవడుంటాడు? నిస్సం దేహంగా దైవప్రవక్తలు, సజ్జనులు, అమర వీరులు, పండితులు, ధర్మవేత్తలు మొదలయి నవారితో సహా కోట్లాది పవిత్ర హృదయాలు ఆఖరి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స)ను దర్శించేందుకై వేచి ఉంటారు. అలాగే ఇస్లాం అనే వృక్షాన్ని తమ రక్తంతో పెంచి పోషించిన 'అష్రయె ముబష్షిరహ్' (స్వర్గ ప్రవేశపు శుభవార్తను ఇహలోకంలోనే పొందిన పదిమంది సహాబీలు)ను, బదర్ యుద్ధంలో అమరగతుల యినవారిని, ఉహుద్ యుద్ధంలో అమరగతులయినవారిని, ఇంకా ఇతర సహాబీలను (దైవప్రవక్త సహచరులను) ఒక్కసారి చూడాలని తపించని స్వర్గవాసి ఎవరుంటారు? అలాగే సహాబీల అనుచరులు, వారి అనుచరులు, ప్రళయదినం వరకు ఇస్లాం కొరకు తమ ధనమానప్రాణాలను అర్పించిన మహానుభావులను కలుసుకునేందుకు, వారి పవిత్ర సమావేశాల్లో పాల్గొనేందుకై ప్రతి ముస్లిం హృదయం తపిస్తుంది. ఇంకా వీటన్నింటికీ మించి సృష్టికర్త అయిన అల్లాహ్‌ను దర్శించడమనేది ఎంతటి మహాభాగ్య మంటే దానిని పొందేందుకై ప్రతి విశ్వాసి హృదయం తపించిపోతుంది.

నిస్సందేహంగా స్వర్గలోక దివ్యకన్యలు, భవంతులు, దివ్యమైన ఆహారపా నీయాలు మొదలయినవన్నీ స్వర్గలోక సౌఖ్యాలలోనివే అయినప్పటికీ అవి స్వర్గలోక జీవితంలో ఒక భాగం మాత్రమే గానీ సంపూర్ణ జీవితం కాదు. స్వర్గలోకపు పవిత్రమైన, ప్రఫుల్లమైన వాతావరణంలో స్వర్గవాసుల కొరకు స్వర్గలోక దివ్యకన్యలు, భవంతులే కాకుండా ఇంకా ఎన్నో ఆసక్తికరమైన కార్యకలాపాలు ఉంటాయి. ప్రతి స్వర్గవాసీ తన ఆసక్తిని బట్టి, ఉత్సాహాన్ని బట్టి ఆయా కార్యకలాపాల్లో తనను తాను నిమగ్నం చేసుకుంటాడు. ధర్మాన్ని ద్వేషించే, ఖుర్ఆన్ పట్ల, హదీసుల పట్ల అవగాహన లేని 'మేధావుల'కు సృష్టికర్త అయిన అల్లాహ్ స్వర్గవాసుల కనులకు చల్లదనాన్ని చేకూర్చేందుకై, హృదయాలకు సాంత్వన చేకూర్చేందుకై దివ్యకన్యలు, భవంతులే కాకుండా ఇంకా ఏయే వరాలను సిద్ధంచేసి ఉంచాడో ఏం తెలుసు?

## స్వర్గం సరిహద్దులు, జీవితం

స్వర్గాన్ని అరబీ భాషలో 'జన్నత్' అంటారు. 'జన్నత్' అంటే 'తోట' అని అర్థం. 'జన్నత్'కు బహువచనం 'జన్నాత్' లేదా 'జనాన్' (తోటలు). స్వర్గం సరిహద్దులు ఏవో

తెలుసుకోవడం కష్టసాధ్యం. ఇంకా చెప్పాలంటే అసాధ్యం. పవిత్ర ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ స్వయంగా ఈ విషయం గురించి ఈ విధంగా పేర్కొన్నాడు :

"ఏ వ్యక్తీ వారి కనుల చల్లదనం కొరకు ఏయే అంశాలు వారికి మరుగుపర చబడ్డాయో ఎరుగడు. ఇది వారు చేస్తూ ఉండిన ఆచరణలకు ప్రతిఫలం."

(సజ్దహ్ - 27)

ఖుర్‌ఆన్‌ను, హదీసులను అధ్యయనం చేసిన పిదప అర్థమయ్యే విషయమే మిటంటే 'స్వర్గం' అనేది మన భూమి కంటే కోట్ల రెట్లు విస్తృతమైన దేవుని రాజ్యం. స్వర్గంలోని ఏదయినా పెద్ద నగరానికి చెందిన ఏదయినా చిన్న వాడ లేదా ఏదయినా చిన్న పట్టణం మన భూగోళానికి సమానంగా ఉండవచ్చు. దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) స్వర్గంలోకి చిట్టచివరిగా ప్రవేశించే వ్యక్తి గురించి ఒక సందర్భంలో ఈ విధంగా పేర్కొన్నారు : 'ఆ వ్యక్తికి అల్లాహ్ తరపు నుంచి స్వర్గంలోకి ప్రవేశించేందుకు అనుమతి లభించినప్పుడు ఆ వ్యక్తి ఈ విధంగా పలుకుతాడు, "ఓ అల్లాహ్! ఇప్పుడు స్వర్గంలోని ప్రదేశమంతా నిండిపోయింది. మరి నాకోసం ఏం మిగిలి వుంది?" అప్పుడు అల్లాహ్ ఈ విధంగా పలుకుతాడు : "ఒకవేళ నీకు ప్రపంచానికి చెందిన ఏ ఒక్క మహారాజుకు చెందిన పెద్ద సామ్రాజ్యంతో సమానమైన రాజ్యాన్ని ప్రసాదిస్తే నీవు సంతోషిస్తావా?" అప్పుడు ఆ దాసుడు ఇలా పలుకుతాడు: "ఓ అల్లాహ్! ఎందుకు కాదు? సంతోషిస్తాను" అప్పుడు అల్లాహ్ ఇలా సెలవిస్తాడు : "వెళ్ళు. స్వర్గంలో నీకు ప్రపంచంలోని అతి పెద్ద సామ్రాజ్యానికి సమానమైన, ఇంకా దానికి పదిరెట్లకు సమానమైన స్థలం సైతం ప్రసాదించబడ్డాయి." (ముస్లిమ్) "స్వర్గంలోకి చిట్టచివరిగా ప్రవేశించే ఆఖరి వ్యక్తికి అంతటి స్థలాన్ని ప్రసాదించిన తర్వాత కూడా స్వర్గంలో ఎంత స్థలం ఖాళీగా ఉంటుందంటే దానిని పూరించేందుకై అల్లాహ్ మరొక జీవరాశిని సృష్టిస్తాడు." (ముస్లిమ్). స్వర్గంలోని స్థాయిల గురించి తెలుపుతూ దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఇలా పేర్కొన్నారు : "దానిలో వంద స్థాయిలున్నాయి. ప్రతి రెండు స్థాయిలకు నడుమ భూమ్యాకాశాలకు సమానమైన దూరం ఉంటుంది." (తిర్మిజీ). స్వర్గంలో నీడనిచ్చే వృక్షాల గురించి తెలుపుతూ దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఇలా పేర్కొన్నారు : "ఒక్కొక్క వృక్షం నీడ ఎంత పెద్దగా ఉంటుందంటే ఒక గుర్రం అందులో వంద సంవత్సరాలపాటు ప్రయాణించినప్పటికీ ఆ నీడ ముగిసిపోదు." (బుఖారీ)

పవిత్ర ఖుర్‌ఆన్‌లో 'దహర్' అనే సూరహ్ 20 వ వాక్యంలో అల్లాహ్ స్వయంగా ఈ విధంగా తెలిపాడు : "అక్కడ మీరు ఎటు చూసినా దైవానుగ్రహాలే మీకు కనిపిస్తాయి; ఇంకా ఒక మహత్తర సామ్రాజ్య వైభవం కనిపిస్తుంది." ఒకవేళ ఇహలోకంలో ఏ వ్యక్తయినా నిరుపేదగా గడిపియున్నప్పటికీ తన మంచి పనుల కారణంగా స్వర్గంలోకి ప్రవేశించినప్పుడు తాను ఒక మహోన్నత సామ్రాజ్యానికి అధిపతిగా విరాజిల్లుతాడు.

(తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్, సంపుటి - 6, పేజీ - 200)

పైన పేర్కొనబడిన ఖుర్‌ఆన్ వాక్యాలను, హదీసులను అధ్యయనం చేసిన తర్వాత స్వర్గం సరిహద్దులను అంచనా ద్వారా నిర్ణయించడం కాదు గదా కనీసం ఊహించడం కూడా మానవునికి సాధ్యం కాదు.

స్వర్గంలో మానవులు ఎటువంటి జీవితాన్ని గడుపుతారు? స్వర్గలోకవాసుల వ్యక్తిగత లక్షణాలు ఎలా ఉంటాయి? స్వర్గలోకవాసుల వైవాహిక జీవితం ఎలా వుంటుంది? స్వర్గలోకవాసుల అన్నపానీయాలు, వ్యవహార సరళి ఎలా వుంటాయి? ఇటువంటి విషయాలకు సంబంధించి కూడా సంపూర్ణ అవగాహన సాధ్యం కాదు. అయినప్పటికీ ఖుర్‌ఆన్, హదీసుల ద్వారా నిరూపించబడే కొన్ని విషయాల వెలుగులో స్వర్గలోక జీవితపు కొన్ని పార్శ్వాలకు సంబంధించిన వివరాలు క్రింద పేర్కొనబ డుతున్నాయి :

## 1. స్వర్గలోకవాసుల వ్యక్తిగత లక్షణాలు

స్వర్గలోకవాసుల ముఖాలు కాంతివంతంగా ఉంటాయి, కనులు ప్రాకృతి కంగానే సుర్మా పూయబడి వుంటాయి, తలపై తప్ప శరీరంపై మరెక్కడా వెంట్రుకలు ఉండవు, చివరకు గడ్డం, మీసాలు కూడా వుండవు. వారి వయస్సులు ముప్పై నుంచి ముప్పై మూడు సంవత్సరాల మధ్య ఉంటాయి. వారి ఎత్తు దాదాపు తొంభై అడుగుల వరకు ఉంటుంది. స్వర్గలోకవాసులు అన్నిరకాల మాలిన్యాల నుంచి పవిత్రంగా ఉంటారు. చివరకు ఉమ్మి లేదా చీమిడిని సైతం వారు విసర్జించరు. వారి శరీరాల నుంచి చెమట విసర్జించబడుతుంది. అయితే దాని నుంచి కస్తూరి వాసన వస్తుంది. స్వర్గలోకవాసులు నిత్యం సంతోషంగా ఉంటారు. ఎవరికీ ఎటువంటి విచారమూ, ఆందోళనా ఉండవు. అలాగే వారు నిత్యం ఆరోగ్యంగా ఉంటారు. వారికి వ్యాధి గానీ, వృద్ధాప్యం గానీ, మరణం గానీ ఉండవు. ఇక స్వర్గలోకపు స్త్రీలకు సంబంధించిన ఒక ప్రత్యేక లక్షణం గురించి పవిత్ర ఖుర్‌ఆన్‌లో మాటిమాటికీ ప్రస్తావించబడింది. అదేమిటంటే వారు ఎక్కువగా బిడియస్తులయి ఉంటారు, తమ చూపులను క్రిందికి సారించేవారయి ఉంటారు, అందంలో ముత్యాల కంటే మించినవారయి ఉంటారు. దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఒక సందర్భంలో ఇలా పేర్కొన్నారు : "స్వర్గలోకపు స్త్రీ ఒకవేళ (ఒక్క క్షణంపాటు) ప్రపంచం వైపుకు తొంగి చూసినట్లయితే (ఆమె ముఖం) ప్రాక్పశ్చిమాల మధ్య ఉన్న ప్రతి వస్తువునూ కాంతిమయం చేస్తుంది. అలాగే ప్రాక్పశ్చిమాల మధ్య ఉండే వాతావరణమంతటినీ సుగంధభరితం చేస్తుంది." (బుఖారీ)

## 2. స్వర్గలోకవాసుల వైవాహిక జీవితం

స్వర్గంలో ఏ ఒక్క వ్యక్తీ అవివాహితుడిగా ఉండడు. ప్రతి వ్యక్తికీ ఇద్దరు భార్యలు ఉంటారు. ఆ ఇద్దరు భార్యలూ ఆదమ్ సంతతికి చెందినవారయి ఉంటారు. (ఇబ్నె కసీర్).

ప్రపంచానికి చెందిన ఆ ఇద్దరు స్త్రీలను స్వర్గంలోకి ప్రవేశించడానికి ముందే సృష్టికర్త అయిన అల్లాహ్ రెండవసారి పుట్టించి స్వర్గంలో సృజించబడే స్త్రీలకు (హూర్) ప్రసాదించబడే సౌందర్యాన్ని ప్రసాదిస్తాడు. ఆ స్త్రీలను సరిక్రొత్తగా పుట్టించబడిన తర్వాత ఏ ఒక్క మానవుడూ గానీ, జిన్ను గానీ తాకి ఉండడు. ఆ స్త్రీలు తమ భర్తలతో సమానమైన వయస్సుని కలిగి, బిడియస్తులై, పరదా నియమాలను పాటించేవారయి, మృదుస్వభావులై, తమ భర్తలను అమితంగా ప్రేమించేవారయి ఉంటారు. స్వర్గలోకవాసులు స్వర్గంలో తమ తమ భవంతుల్లో తమ భార్యలతో సహా చల్లని, గుబురు నీడల్లో, ప్రవహించే కాలువల ఒడ్డున, బంగారు, వెండి, ముత్యాలతో అలంకరించబడిన సింహాసనాలపై కూర్చుండి ఆనందిస్తారు. తినేందుకు గానీ, త్రాగేందుకు గానీ స్త్రీలు కష్టపడనవసరం లేకుండా వారు కోరుకునేవాటిని ముత్యాల వలె సుందరమైన, చురుకైన సేవకులు వెనువెంటనే తెచ్చిస్తారు.

ఒకవేళ ఒకే కుటుంబానికి చెందినవారు, ఉదాహరణకు తల్లిదండ్రులు, తాతయ్య, నాయనమ్మ, అమ్మమ్మ, మనవడు, మనవరాలు మొదలయినవారు స్వర్గంలో వేర్వేరు స్థాయిల్లో ఉన్నట్లయితే అల్లాహ్ తన కరుణ ద్వారా తక్కువ స్థాయిలో ఉన్నవారి స్థాయిని పెంచి అందరినీ సమానంగా చేసివేస్తాడు. "అల్లాహ్ పరమ పవిత్రుడు. సర్వ స్తోత్రాలు ఆయన కొరకే."

## 3. స్వర్గలోకవాసుల ఆహారపానీయాలు

స్వర్గంలోకి ప్రవేశించిన తర్వాత స్వర్గలోక వాసులకు అన్నింటికంటే ముందు చేప కాలేయం విందుగా అందించబడుతుంది. ఆ తర్వాత ఎద్దు మాంసం ద్వారా ఆతిథ్యం అందుకుంటారు. ఇక పానీయాల విషయానికొస్తే అన్నింటికంటే ముందు 'సల్‌సబీల్' అనే సెలయేటి నీరు వారికి అందించబడుతుంది. అందులో 'జన్‌జబీల్' కలిసి ఉంటుంది. అంతేగాకుండా స్వర్గలోకవాసులకు ఖుర్‌ఆన్‌లో ప్రత్యేకంగా ప్రస్తావించబడిన ద్రాక్షపండ్లు, దానిమ్మ పండ్లు, ఖర్జూరపండ్లు, అరటిపండ్లు మొదలయిన అన్నిరకాల రుచికరమైన ఫలాలు అందించబడతాయి.

పాలు, తేనె, 'కౌసర్' అనే సెలయేటి నీరు, 'జన్‌జబీల్' అనే సెలయేటి నీరు, కర్పూరం కలిసిన నీరు మొదలయిన మధురమైన పానీయాలు అందజేయ బడతాయి. అవన్నీ స్వర్గలోకవాసులకు గౌరవపూర్వకంగా బంగారు, వెండి, పింగాణి పాత్రల్లో అందజేయబడతాయి. స్వర్గలోకపు ఆహారపానీయాల రుచి ఎన్నటికీ చెడిపోదు. ప్రతి నిమిషం తాజాగా, మరింత రుచిగా ఉంటాయి. వాటిని సేవించడం వల్ల ఒళ్ళు బరువెక్కడం, సుస్తీ చేసినట్లుగా అనిపించడం, తలనొప్పి లేదా మత్తుకు లోనవడం వంటివేమీ జరగవు. స్వర్గలోకవాసులు ఏదయినా చెట్టు నుంచి పండును స్వయంగా కోసి తినాలనుకున్నప్పుడు పండు స్వయంగా వారి వద్దకు చేరుకుంటుంది. అలాగే ఏదయినా పక్షి మాంసాన్ని

తినాలనుకున్నప్పుడు వెనువెంటనే అది వండబడి వారి వద్దకు చేర్చబడుతుంది. స్వర్గానికి చెందిన ఈ వరానుగ్రహాలన్నీ శాశ్వతమైనవి. అవి ఎన్నటికీ తగ్గించబడవు, అంతరించవు. అలాగే అవి ఏ ఋతువుతోనూ సంబంధాన్ని కలిగి వుండవు. అన్నింటికంటే ముఖ్యమైన విషయమేమిటంటే ఆ వరానుగ్రహాలను పొందేందుకై ఏ స్వర్గలోకవాసీ ఎవరినుంచీ అనుమతిని పొందవలసిన అవసర ముండదు. ఏ స్వర్గలోకవాసి అయినా కావాలనుకున్నప్పుడు, కావలసినంతగా, కోరుకున్నదానిని తన ఇష్టానుసారం స్వయంగా పొందగలడు. ఇదే విషయాన్ని ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు : ''స్వర్గలోక వరానుగ్రహాల పరంపర ఎన్నటికీ విచ్ఛిన్నం కాదు, ఎవరినీ వాటి నుంచి నిరోధించడమూ జరగదు.'' (వాఖిఅహ్ : 33)

## 4. స్వర్గలోకవాసుల నివాసం

స్వర్గంలో ప్రతి జంట కోసం ప్రత్యేకంగా ఒక విశాలమైన రాజ్యం ఉంటుంది. వాటిలోని భవంతులు బంగారు, వెండి ఇటుకలతో, ఉన్నతమైన కస్తూరితో నిర్మించబడి ఉంటాయి. భవంతి నిర్మాణానికై కంకరరాళ్ళకు బదులు ముత్యాలు, వజ్రాలు ఉపయోగించబడి ఉంటాయి. అలాగే కుంకుమపువ్వు రాళ్ళను కలిపే మట్టిగా వినియోగించబడి ఉంటుంది. (తిర్మిజీ) ప్రతి స్వర్గవాసికీ తన స్థాయిని బట్టి రెండు విశాలమైన తోటలు ప్రసాదించబడతాయి. అల్లాహ్ కు సమీపంగా ఉండే ప్రత్యేక దాసులకు చెందిన రెండు తోటలూ బంగారంతో నిర్మించబడి ఉంటాయి. వాటిలో ప్రతి వస్తువూ బంగారంతో చేయబడి ఉంటుంది, వాటి అలంకరణ కోసం వినియోగిం చబడిన వస్తువులన్నీ బంగారంతో చేయబడినవై ఉంటాయి, చెట్లూ బంగారంతో సృజించబడి వుంటాయి, సింహాసనాలూ బంగారంతో చేయబడి వుంటాయి, పాత్రలూ బంగారంతో చేయబడి వుంటాయి, చివరకు దువ్వెనలు సైతం బంగారంతో చేయబడి వుంటాయి. ఇక సామాన్యంగా మంచివారిగా ఎంచబడినవారికి కూడా రెండు విశాలమైన తోటలు ఇవ్వబడతాయి. కానీ ఆ తోటలు వెండితో చేయబడి వుంటాయి. అనగా వాటిలో ప్రతి వస్తువూ వెండితో చేయబడి వుంటుంది. ఆ తోటల్లో మహోన్నతమైన బంగళాలుంటాయి. వాటిలో ఆకుపచ్చని పట్టు తివాచీలపై తెల్లని అపూర్వమైన దిండ్లు పరచబడి వుంటాయి. ప్రతి భవంతీ ఎంత విశాలంగా ఉంటుందంటే వాటిలో నెలకొల్పబడిన ఒక్కొక్క మండపం వెడల్పు 60 మైళ్ళు ఉంటుంది. స్వర్గలోకపు సెలయేళ్ళలో ప్రతి సెలయేటి నుంచి వెలువడే చిన్న కాలువ ద్వారా ప్రతి భవంతికీ అవసరమైన నీరు పంపిణీ అవుతుంది. భవంతుల లోపల బంగారు పొయ్యిలుంటాయి. వాటి నుంచి సుగంధభరితమైన అగరు ధూపం వెలువడి భవంతి వాతావరణమంతటినీ సుగంధభరితం చేస్తూ ఉంటుంది. అటువంటి భవంతుల్లో, మండపాల్లో, పారే సెలయేటి గుబురు ఛాయల్లో స్వర్గలోకవాసులు భోగభాగ్యాలతో కూడిన జీవితం గడుపుతారు.

## 5 . స్వర్గలోకవాసుల వస్త్రధారణ

స్వర్గలోకవాసులకు తొడిగేందుకు ఇహలోకంలో ధరించకూడదని వారించ బడిన పట్టు కంటే ఎంతో ఖరీదయిన పట్టు వస్త్రాలు ఇవ్వబడతాయి. పట్టు వస్త్రాలే కాకుండా ఇంకా ఎన్నోరకాల ధగధగలాడే వస్త్రాలు వారికి అందజేయబడతాయి. స్వర్గలోకపు స్త్రీలే కాకుండా పురుషులు కూడా స్వర్గంలో బంగారు, వెండి ఆభరణాలు ధరిస్తారు. గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే స్వర్గంలో వినియోగించబడే బంగారం ఇహలోకపు బంగారం కంటే ఎన్నో రెట్లు ఉన్నతమైనది. దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఒక సందర్భంలో ఈ విధంగా పేర్కొన్నారు: "ఒకవేళ స్వర్గలోకవాసి అయిన ఒక్క పురుషుడు తన ఆభరణాలతో సహా (ప్రపంచంలోకి) ఒక్కమారు తొంగి చూసినట్లయితే (ఆ ఆభరణాల మెరుపు) సూర్యుని వెలుగు నక్షత్రాల వెలుగును ఏవిధంగా అంతమొందిస్తుందో అదేవిధంగా సూర్యుని వెలుగును అంతమొందిస్తుంది." (తిర్మిజీ) బంగారు, వెండితో చేయబడిన ఆభరణాలే కాకుండా ఇంకా ఎన్నోరకాల ముత్యాలతో చేయబడిన ఆభరణాలు కూడా స్వర్గలోకవాసులకు తొడిగింపజేయడం జరుగుతుంది. స్వర్గలోకవాసులైన స్త్రీలకు ఎంతటి సుందరమైన, శుభ్రమైన వస్త్రాలు అందజేయబడతాయంటే వాటిని ధరించిన తర్వాత కూడా వారి కాలి పిక్కల గుజ్జు సైతం కనిపిస్తుంది. (బుఖారీ) స్వర్గలోకపు స్త్రీలు ధరించే సాధారణ వస్త్రాలు సైతం ఎంత విలువైనవిగా ఉంటాయంటే తలపై వారు కప్పుకునే చెంగు ప్రపంచం, దానిలోని సంపద మొత్తం కంటే విలువైనదయి ఉంటుంది. (బుఖారీ) స్వర్గలోకవాసుల వస్త్రాలు ఎన్నటికీ పాతబడవు. అయితే వారు ఇష్టానుసారం తమ వస్త్రాలను మార్చుకుంటారు. "మీకు వాగ్దానం చేయబడిన స్వర్గం ఔన్నత్యం ఇదీ! ఈ స్వర్గం తన ప్రభువు వైపుకు మరలే, ఆయన ఆజ్ఞానుసారం నడచుకునే ప్రతి వ్యక్తి కొరకు తయారుచేయబడింది."

(ఖుర్ఆన్, ఖాఫ్ :32)

## దైవానుగ్రహం

పైన పేర్కొనబడిన స్వర్గలోకపు వరానుగ్రహాలన్నింటికంటే మించి స్వర్గలోక వాసులకు తమ సృష్టికర్త, యజమాని, పోషకుడు అయిన 'అల్లాహ్ అనుగ్రహం' అనే మహోన్నత వరం ప్రాప్తమవుతుంది. దీనిగురించి ఖుర్ఆన్‌లో ఎన్నోచోట్ల పేర్కొనబడింది. ఖుర్ఆన్‌లో 'ఆలి ఇమ్రాన్' అనే అధ్యాయంలో అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు : "దైవభీతిపరుల కొరకు వారి ప్రభువు వద్ద తోటలు ఉన్నాయి. వాటి క్రింద సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి. వారు ఆ తోటల్లో శాశ్వతంగా నివాస ముంటారు. ఆ తోటల్లో వారి కొరకు పవిత్రమైన భార్యలు ఉంటారు. అలాగే అల్లాహ్ అనుగ్రహమనే భాగ్యాన్ని వారు పొందుతారు."

(ఖుర్ఆన్, ఆలి ఇమ్రాన్ :15)

అలాగే ఖుర్‌ఆన్‌లో 'తౌబహ్' అనే అధ్యాయంలో పేర్కొనబడింది : "విశ్వాసులైన స్త్రీ పురుషులకు క్రింద సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉండే తోటలను అందజేస్తానని అల్లాహ్ వాగ్దానం చేసి వున్నాడు. వారు వాటిలో శాశ్వతంగా నివాసముంటారు. నిత్య వసంత శోభతో విలసిల్లే ఆ తోటల్లో వారి కొరకు పవిత్రమైన నివాస స్థలాలుంటాయి. అన్నింటికంటే మించి వారికి అల్లాహ్ అనుగ్రహం ప్రాప్తమయి ఉంటుంది." (ఖుర్‌ఆన్, తౌబహ్ : 72) ఈ వాక్యం ద్వారా అల్లాహ్ స్వయంగా స్వర్గలోకపు వరానుగ్రహాలన్నింటికంటే అల్లాహ్ అనుగ్రహం ప్రాప్తమవడమే గొప్పదని పేర్కొన్నాడు. పైన పేర్కొనబడిన ఖుర్‌ఆన్ వాక్యాలకు వ్యాఖ్యానంగా దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : అల్లాహ్ స్వర్గలోకవాసులను సంబోధించి ఈ విధంగా పలుకుతాడు: "ఓ స్వర్గలోకవాసులారా!" అది విని స్వర్గలోకవాసులు ఇలా బదులిస్తారు : "ఓ మా ప్రభువా! మేము నీ సేవ కొరకు, నీ విధేయత కొరకు హాజరయి ఉన్నాము. అన్ని రకాల మేళ్ళూ నీ చేతిలోనే ఉన్నాయి." అప్పుడు అల్లాహ్ తిరిగి ఈ విధంగా పేర్కొంటాడు : "ఇప్పుడు మీరంతా సంతుష్టులయి ఉన్నారా?" అప్పుడు స్వర్గలోకవాసులు ఇలా పలుకుతారు : "ఓ మా ప్రభువా! ఎందుకు సంతుష్టులం కాము? నీవు నీ సృష్టితాలలో వేటికీ ప్రసాదించని వరానుగ్రహాలను మాకు ప్రసాదించావు" అప్పుడు అల్లాహ్ ఇలా సెలవిస్తాడు : "ఇప్పుడు మీకు ఈ వరానుగ్రహాలన్నింటికంటే మించిన వరాన్ని ప్రసాదించనా?" అప్పుడు స్వర్గలోకవాసులు ఇలా పలుకుతారు : "ఓ మా ప్రభువా! ఈ వరానుగ్రహాలన్నింటికంటే మించిన వరమేది?" అప్పుడు అల్లాహ్ ఇలా సెలవిస్తాడు : "నేను మీకు నా అనుగ్రహాన్ని ప్రసాదిస్తున్నాను. నేటి తర్వాత ఇక ఎప్పుడూ నేను మిమ్మల్ని నిరసించను." (బుఖారీ, ముస్లిమ్)

అల్లాహ్ అనుగ్రహాన్ని పొంది ఆయన ఆగ్రహానికి గురికానివారు ఎంతటి భాగ్యవంతులో కదా! అలాగే అల్లాహ్ అనుగ్రహానికి దూరమయి ఆయన ఆగ్రహానికి పాత్రులయ్యేవారు ఎంతటి దౌర్భాగ్యులో కదా! అల్లాహ్ ఇహపరలోకాల్లో ముస్లింలందరినీ తన ప్రత్యేకమైన కరుణాకటాక్షాలతో తన అనుగ్రహాన్ని ప్రసాదించి తన ఆగ్రహం నుంచి రక్షించుగాక! (ఆమీన్)

## దైవదర్శనం

ఇస్లాంకు చెందిన పలు ఇతర విషయాల వలె సృష్టికర్త అయిన అల్లాహ్‌ను దర్శించడానికి సంబంధించిన విషయంలోనూ ముస్లింలకు చెందిన పలు వర్గాలు హెచ్చుతగ్గులకు గురయ్యారు. ఒక వర్గమయితే ధ్యానం ద్వారా, ఆధ్యాత్మిక దివ్యజ్ఞానం ద్వారా ఇహలోకంలోనే అల్లాహ్ ను దర్శించవచ్చని ప్రకటించింది. మరొక వర్గం ఖుర్‌ఆన్ లోని "చూపులు ఆయనను అందుకోలేవు. కానీ ఆయన చూపులను అందుకోగలడు." (103 :6) అనే వాక్యాన్ని ఆధారంగా చేసుకొని ఇహలోకంలోనే కాకుండా పరలోకంలోనూ

అల్లాహ్‌ను చూడలేమని ప్రకటించింది. అయితే పవిత్ర ఖుర్‌ఆన్ ద్వారా, హదీసుల ద్వారా నిరూపించబడే విశ్వాసమేమిటంటే ఇహలోకంలో ఏ వ్యక్తయినా, చివరకు దైవప్రవక్త అయినా అల్లాహ్‌ను చూడడం సాధ్యం కాదు. ఖుర్‌ఆన్‌లో దైవప్రవక్త హజ్‌రత్ మూసా(అ) వృత్తాంతం ఎంతో వివరంగా పేర్కొనబడింది. హజ్‌రత్ మూసా (అ) ఫిర్‌ఔన్ నుంచి విముక్తిని పొందిన తర్వాత ఇస్రాయీల్ సంతతిని వెంటబెట్టుకొని సీనా ద్వీపకల్పానికి చేరుకున్న తర్వాత సృష్టికర్త అయిన అల్లాహ్ ఆయనను తూర్ పర్వతం మీదకు పిలిచాడు. హజ్‌రత్ మూసా(అ) నలభై రోజులు అక్కడ ఉన్న తర్వాత అల్లాహ్ ఆయనకు పలకలను అందజేసాడు. అప్పుడు హజ్‌రత్ మూసా (అ) కు అల్లాహ్‌ను దర్శించాలనే కోరిక కలిగింది. అప్పుడు హజ్‌రత్ మూసా (అ) "ఓ నా ప్రభువా! నేను నిన్ను చూడగలిగేందుకై నాకు నిన్ను చూడగలిగే శక్తిని ప్రసాదించు." అప్పుడు అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు: "ఓ మూసా! నీవు నన్ను ఏమాత్రం చూడలేవు. అయితే కొంచెం నీ ముందు ఉన్న కొండ వైపు చూడు. ఒకవేళ అది తన స్థానంలో స్థిరంగా ఉన్నట్లయితే నీవు కూడా నన్ను చూడగలవు" అప్పుడు అల్లాహ్ తన తేజోమయ కాంతిని ఆ కొండపై ప్రసరింపజేయగా అది పిండి పిండి అయిపోయింది. అది చూసి హజ్‌రత్ మూసా(అ) స్పృహ తప్పి పడిపోయారు. ఆ తర్వాత ఆయన (అ) పశ్చాత్తాపంతో ఈ విధంగా అర్థించారు : "నీ అస్తిత్వం పవిత్రమైనది. నేను నీ వైపుకు (నా కోరిక పట్ల పశ్చాత్తాపంతో) మరలుతున్నాను. అలాగే నేను అందరికంటే ముందు (అగోచర విషయాలను) విశ్వసించేవాడిని." (మరిన్ని వివరాల కొరకు ఖుర్‌ఆన్‌లోని 'ఆరాఫ్' అధ్యాయపు 143వ వాక్యాన్ని పఠించండి) ఈ వృత్తాంతాన్ని బట్టి ఇహలోకంలో అల్లాహ్‌ను చూడటమనేది సాధ్యం కాదని ఋజువవుతోంది. ఇక దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్(స) మేరాజ్ ప్రయాణం విషయానికొస్తే ఆయన (స) సతీమణి హజ్‌రత్ ఆయిషహ్ (ర) "హజ్‌రత్ ముహమ్మద్(స) తన ప్రభువును దర్శించారని పలికే వ్యక్తి అసత్యవాది" అని పేర్కొన్న విషయం కూడా దీనిని ధృవీకరిస్తోంది. (బుఖారీ, ముస్లిమ్) ఇహలోకంలో దైవప్రవక్తలు సైతం అల్లాహ్‌ను చూడలేకపోయినప్పుడు మామూలు దాసులు అల్లాహ్‌ను తాము చూశామని పేర్కొనడం అసత్యం తప్ప మరేమి కాగలదు?

పవిత్ర ఖుర్‌ఆన్ ద్వారా, ప్రామాణికమైన హదీసుల ద్వారా పరలోకంలో స్వర్గలోకవాసులు సృష్టికర్త అయిన అల్లాహ్ ను దర్శిస్తారని ఋజువవుతోంది. ఖుర్‌ఆన్‌లో 'యూనుస్' అనే అధ్యాయపు 26 వ వాక్యంలో అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు : "మంచి పనులు చేసేవారి కొరకు మంచి ప్రతిఫలంతో పాటు ఇంకా మరొక వరం ప్రసాదించబడుతుంది." ఈ వాక్యానికి వ్యాఖ్యానంగా హజ్‌రత్ సుహైబ్ రూమీ (ర) ద్వారా పేర్కొనబడిన ఒక ఉల్లేఖనం ఈ విధంగా ఉంది : దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్(స) ఈ వాక్యాన్ని పఠించిన తర్వాత ఈ విధంగా పేర్కొన్నారు: "స్వర్గ వాసులు స్వర్గంలోకి, నరకవాసులు నరకంలోకి ప్రవేశించిన తర్వాత ప్రకటించే ఒక వ్యక్తి ఈ విధంగా ప్రకటిస్తాడు : "ఓ

స్వర్గవాసులారా! అల్లాహ్ మీకు ఒక వాగ్దానం చేసి ఉన్నాడు. ఆ వాగ్దానాన్ని నేడు ఆయన నెరవేర్చాలని కోరుకుంటున్నాడు'' అప్పుడు వారు ఇలా ప్రశ్నిస్తారు: ''ఆ వాగ్దానం ఏది? అల్లాహ్ (తన కరుణ ద్వారా) మా ఆచరణలను (త్రాసులో) బరువైనవిగా మార్చివేయలేదు గదా? అల్లాహ్ మమ్మల్ని నరకాగ్ని నుంచి రక్షించి స్వర్గంలోకి ప్రవేశింపజేయలేదు గదా?'' అప్పుడు వారికి, అల్లాహ్ కు నడుమ ఉన్న పరదా తొలగించబడుతుంది. అప్పుడు స్వర్గలోకవాసులకు అల్లాహ్ ను దర్శించే మహద్భాగ్యం ప్రాప్తమవుతుంది. (హజ్రత్ సుహైబ్ (ర) ఈ విధంగా పేర్కొంటున్నారు) 'అల్లాహ్ సాక్షిగా! అల్లాహ్ దర్శనానికి మించి ప్రియమైనది, కనులకు ఆనందకరమైనది స్వర్గవాసులకు మరేదీ ఉండబోదు.' (ముస్లిమ్)

ఖుర్ఆన్‌లో మరొకచోట అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు : ''ఆ రోజు ఎన్నో వదనాలు తాజాగా కళకళలాడుతూ ఉంటాయి, తమ ప్రభువు వైపు చూస్తూ ఉంటాయి.'' (ఖుర్ఆన్, ఖియామహ్ :22-23) ఈ వాక్యంలో స్వర్గవాసులు అల్లాహ్ వైపు చూస్తూ ఉండటమనేది స్పష్టంగా పేర్కొనబడింది. హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లాహ్(ర) ఈ విధంగా ఉల్లేఖించారు : మేము దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) సన్నిధిలో హాజరయి ఉన్నాము. ఆయన (స) పున్నమి నాటి చంద్రుని వైపు చూసి ఈ విధంగా పేర్కొన్నారు : ''స్వర్గంలో మీరు నేడు ఈ చంద్రుని చూస్తున్న రీతిలోనే మీ ప్రభువును చూస్తారు. అల్లాహ్ ను చూడడం మీకు ఏమాత్రం కష్టం కాబోదు.'' (బుఖారీ)

కనుక ఇహలోకంలోనే అల్లాహ్‌ను దర్శించవచ్చని ప్రకటించినవారు మార్గభ్రష్టులయిపోయారు. అలాగే పరలోకంలోనూ అల్లాహ్ ను దర్శించడం అసాధ్యమని పేర్కొన్నవారూ మార్గభ్రష్టులయిపోయారు. నిజమైన విశ్వాసమేమిటంటే ఇహలోకంలో అల్లాహ్‌ను దర్శించడం అసాధ్యం. అయితే స్వర్గంలో స్వర్గవాసులు అల్లాహ్‌ను చూస్తారు. ఆ విధంగా అల్లాహ్ సందర్శనమనే మహోన్నతమైన అనుగ్రహం ద్వారా స్వర్గలోకపు మిగిలిన వరానుగ్రహాల పరిపూర్తి జరుగుతుంది.

## స్వర్గంలోకి ప్రవేశించేవారు

ఈ మకుటంతో ఈ పుస్తకంలో ఒక అధ్యాయం చేర్చబడింది. అందులో కొన్ని గుణాలను కలిగియున్నవారికి స్వర్గలోక ప్రవేశపు శుభవార్త అందజేయబడటం గురించి ప్రస్తావించబడింది. అయితే ఈ సందర్భంగా రెండు వివరణలు అందజేయడం సముచితం.

ఒకటి ఏమిటంటే ఆ అధ్యాయంలో పేర్కొనబడిన గుణాలు తప్ప స్వర్గలోక ప్రవేశానికి దోహదపడే గుణం మరొకటి ఏదీ ఉండదని భావం కాదు. ఆ అధ్యాయంలో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ''ఆ వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశించాడు'' లేదా ''అతడిపై స్వర్గం తప్పనిసరి కావించబడింది.'' వంటి పదాలతో పేర్కొన్న హదీసులు మాత్రమే ఎంపిక చేయబడి ప్రస్తావించబడ్డాయి. తద్వారా ఎటువంటి తప్పుడు వ్యాఖ్యానాలకూ అవకాశముండకూడదని ఆశించబడింది.

రెండవది ఏమిటంటే ఏయే గుణాల కారణంగా మానవుడు స్వర్గంలోకి ప్రవేశిస్తాడని దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) శుభవార్తను అందజేసారో వాటిలో ఏ ఒక్క గుణాన్ని కలిగి ఉండే వ్యక్తయినా నేరుగా స్వర్గంలోకి ప్రవేశిస్తాడని ఎంతమాత్రం భావించకూడదు.

గుర్తుంచుకోదగిన విషయమేమిటంటే ఇస్లామీయ ధర్మశాస్త్రానికి చెందిన ఆజ్ఞలు ఒకదానితో మరొకటి ఎంతగా ముడిపడి ఉన్నాయంటే వాటిని పరస్పరం విడదీయడం అసాధ్యం. ఉదాహరణకు ఒక వ్యక్తి ఇస్లాంకు చెందిన మూలవిధులను ఎంత సక్రమంగా నిర్వర్తిస్తున్నప్పటికీ ఒకవేళ తల్లిదండ్రుల పట్ల అవిధేయతతో మెలిగినట్లయితే ముందు అతడు ఆ మహాపాపానికి గాను శిక్షను అనుభవించేందుకై నరకంలో ప్రవేశించడం తప్పనిసరి అవుతుంది - అతడు పశ్చాత్తాపంతో అల్లాహ్ వైపుకు మరలినందున అల్లాహ్ తన ప్రత్యేకమైన కారుణ్యంతో అతడిని క్షమిస్తే తప్ప. అదేవిధంగా ఒక వ్యక్తి తన తల్లిదండ్రులకు ఎంతగా విధేయుడై నడుచుకున్నప్పటికీ నమాజ్ చదవనట్లయితే, నమాజ్‌ను విడచిపెట్టినందుకు గాను శిక్షను అనుభవిం చేందుకై నరకంలో ప్రవేశించడం తప్పనిసరి అవుతుంది - అతడు పశ్చాత్తాపంతో అల్లాహ్ వైపుకు మరలినందున అల్లాహ్ తన ప్రత్యేకమైన కారుణ్యంతో అతడిని క్షమిస్తే తప్ప. ఆ అధ్యాయంలో పేర్కొనబడిన హదీసులకు నిజమైన భావం ఇది : "ఏ వ్యక్తయితే దేవుని ఏకత్వంపై విశ్వాసముంచుతాడో, ఇస్లాం మూల విధులను నిర్వర్తించేందుకై కృషి చేస్తాడో, తోటి దాసుల హక్కులను నెరవేర్చడంలో ఎటువంటి లోపానికీ పాల్పడడో, మహాపాపాలకు దూరంగా ఉండేందుకై వీలయినంతగా ప్రయత్ని స్తాడో వానిలో పేర్కొనబడిన గుణాల్లో ఒకటి లేదా ఒకటికి మించి ఉన్నట్లయితే అల్లాహ్ తన ప్రత్యేకమైన కరుణాకటాక్షాలతో తెలియక చేసిన అతడి పాపాలను క్షమించి మొదటి దశలోనే స్వర్గంలోకి ప్రవేశింపజేసి నరకలోకపు శిక్ష నుంచి అతడిని రక్షిస్తాడు." మరొక భావం ఇది కూడా కావచ్చు: "ఏ వ్యక్తుల్లోనయితే పేర్కొనబడిన గుణాల్లో ఏ ఒక్క గుణమయినా ఉంటుందో వారు ఒకవేళ ఏదయినా మహాపాపం కారణంగా నరకానికి వెళ్ళినా చివరకు అల్లాహ్ వారి గుణాల కారణంగా వారిని నరకం నుంచి వెలికితీసి స్వర్గంలోకి తప్పకుండా ప్రవేశింపజేస్తాడు. ఈ విషయాన్నే ధృవీకరిస్తూ ఒక సందర్భంలో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : "ఏ వ్యక్తయితే పవిత్ర హృదయంతో 'లా ఇలాహ ఇల్లల్లాహ్' (అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు లేడు) అని పలికి ఉంటాడో, ఒకవేళ అతడి హృదయంలో కేవలం చీమకు సమానమైన మంచి అనేది ఉన్నట్లయితే అతడు తప్పకుండా నరకం నుంచి వెలికి తీయబడతాడు." (ముస్లిమ్) (సర్వం అల్లాహ్‌కే ఎరుక)

## ప్రారంభంలో స్వర్గానికి దూరంగా ఉండేవారు

ఈ మకుటంతో ఈ పుస్తకంలో ఒక అధ్యాయం చేర్చబడింది. అందులో కొన్ని మహాపాపాలు పేర్కొనబడ్డాయి. వాటి కారణంగా ముస్లింలు తమ పాపాలకు గాను శిక్షను

అనుభవించేందుకై నరకంలోకి ప్రవేశించి ఆ తర్వాత స్వర్గంలోకి ప్రవేశింపజేయబడతారని పేర్కొనబడింది.

ఆ అధ్యాయంలో కూడా నరకానికి దారితీసే మహాపాపాలన్నీ పేర్కొన బడలేదు. దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) "ఆ వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశించడు" లేదా "అల్లాహ్ అతడిపై స్వర్గాన్ని నిషేధించాడు" వంటి పదాలతో పేర్కొన్న హదీసులు మాత్రమే ఎంపిక చేయబడి ప్రస్తావించబడ్డాయి. తద్వారా ఎటువంటి తప్పుడు వ్యాఖ్యానాలకూ అవకాశముండకూడదని ఆశించబడింది.

గుర్తుంచుకోదగిన విషయమేమిటంటే కొన్ని చిన్న చిన్న పాపాలు పుణ్య కార్యాల కారణంగా అల్లాహ్ స్వయంగా క్షమించివేస్తాడు. కానీ మహాపాపాలు పశ్చాత్తాపం చెంది అల్లాహ్ వైపుకు మరలనంతవరకు క్షమించబడవు. మహాపాపాలకు శిక్ష నరకమే. ప్రతి మహాపాపానికి దాని స్వభావానికి అనుగుణంగా వేర్వేరు శిక్షలు నిర్ణయించబడి ఉన్నాయి. ఈ విషయమే కొన్ని హదీసుల్లో పేర్కొనబడింది. ఉదాహరణకు ఒక హదీసులో ఈ విధంగా పేర్కొనబడింది : "కొందరిని నరకాగ్ని కాలి చీలమండల వరకు ప్రభావితం చేస్తుంది, కొందరిని నడుము వరకు, కొందరిని మెడ వరకు ప్రభావితం చేస్తుంది." (ముస్లిమ్) మరొక హదీసులో ఈ విధంగా పేర్కొనబడింది : "కొందరి శరీరాలను నరకాగ్ని సంపూర్ణంగా తినివేస్తుంది. కానీ సజ్దహ్ భాగం మాత్రం అగ్ని నుంచి సురక్షితంగా ఉంటుంది." (ఇబ్నె మాజహ్) మహాపాపాలకు గాను శిక్షను అనుభవించిన తర్వాత దేవుని ఏకత్వం పై విశ్వాసముంచిన ముస్లింలందరినీ అల్లాహ్ నరకం నుంచి వెలికి తీసి స్వర్గం లోకి ప్రవేశం పజేస్తాడు.

విశ్వసించిన ముస్లింలు గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే నరకంలో ఒక్క క్షణం గడపడం సంగతి అటుంచితే, కేవలం దానిని ఒక్క క్షణం చూస్తేనే ఇహలోకపు సౌఖ్యాలు, వరానుగ్రహాలు, భోగభాగ్యాలు అన్నింటినీ మరచిపోతాము. కనుక ప్రతి ముస్లిం నరకం నుంచి రక్షణ పొంది మొదటి దశలోనే స్వర్గంలోకి ప్రవేశించేవారిలో చేరేందుకై శాయశక్తులా ప్రయత్నించాలి. అందుకై రెండు విషయాల పట్ల ప్రధానంగా శ్రద్ధ వహించాలి.

ఒకటి - మహాపాపాలకు దూరంగా ఉండేందుకై వీలయినంతగా కృషి చేయాలి. ఒకవేళ ఎప్పుడయినా పొరపాటున మహాపాపకార్యానికి పాల్పడితే వెంటనే పశ్చాత్తాపంతో అల్లాహ్ ను క్షమాపణ వేడుకొని అల్లాహ్ వైపుకు మరలాలి. అలాగే ఇకముందు అటువంటి మహాపాపానికి దూరంగా ఉండాలని దృఢంగా నిర్ణయం తీసుకోవాలి.

రెండు - అల్లాహ్ స్వయంగా చిన్న చిన్న పాపాలను క్షమించడానికి దోహదపడే పనులు విరివిగా చేయాలి. ఉదాహరణకు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఇలా పేర్కొన్నారు: "ఏ వ్యక్తయితే ప్రతి నమాజ్ తర్వాత 33 సార్లు 'సుబ్‌హానల్లాహ్', 33 సార్లు

'అల్‌హమ్‌దులిల్లాహ్', 34 సార్లు 'అల్లాహు అక్బర్' పఠించిన తర్వాత ఒక్క పర్యాయం "లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ లా షరీక లహూ లహుల్ ముల్కు వలహుల్ హమ్‌దు వహువ అలా కుల్లి షైఇన్ ఖదీర్" అని పఠిస్తాడో అతడి (చిన్న చిన్న) పాపాలన్నింటినీ, అవి సముద్రపు నురుగుకు సమానమైనవయినా సరే, అల్లాహ్ క్షమించివేస్తాడు." (ముస్లిమ్) మరొక హదీసులో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఇలా పేర్కొన్నారు : "'ఏ వ్యక్తయితే బజారులోకి ప్రవేశించడానికి ముందు 'లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహూ లా షరీక లహూ లహుల్ ముల్కు వలహుల్ హమ్‌దు యుహ్‌యీ వ యుమీతు వ హువ హయ్యుల్లాయమూతు బియదిహిల్ ఖైర్. వ హువ అలా కుల్లి షైఇన్ ఖదీర్' (అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు లేడు. ఆయన ఒక్కడే. ఆయనకు సహచరులు ఎవరూ లేరు. విశ్వసామ్రాజ్యం ఆయనదే. ఆయన మాత్రమే స్తోత్రానికి అర్హుడు. ఆయనే జీవితాన్ని ప్రసాదిస్తాడు, ఆయనే మరణాన్నీ ప్రసాదిస్తాడు. ఆయన (స్వయంగా ఎల్లప్పుడూ) సజీవుడు. ఆయన ఎన్నటికీ మరణించడు. ఆయన చేతిలోనే మేలు ఉంది. ఆయన ప్రతి వస్తువుపై అధికారం కలవాడు) పఠిస్తాడో అతడి కర్మల పత్రంలో అల్లాహ్ పదిలక్షల పుణ్యఫలాలను వ్రాస్తాడు. అలాగే పదిలక్షల పాపాలను తుడిచివేస్తాడు. అలాగే అతడి స్థాయిని పదిలక్షల స్థానాలకు పెంచుతాడు." (తిర్మిజీ)

'దురూదె షరీఫ్' పఠించడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రస్తావిస్తూ దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఇలా పేర్కొన్నారు : "'ఏ వ్యక్తయితే నా పై ఒక్క పర్యాయం దురూద్ పఠిస్తాడో అల్లాహ్ అతడిపై పది అనుగ్రహాలను అవతరింపజేస్తాడు, పది పాపాలను క్షమిస్తాడు. అలాగే అతడి స్థానాలను పది స్థానాలకు పెంచుతాడు." (నసాయీ) నఫిల్ ఆరాధనల వల్ల కలిగే ప్రయోజనం గురించి ఒక హదీసులో ఈ విధంగా పేర్కొనబడింది: "ఒక వ్యక్తి అల్లాహ్ కు ఒక సజ్దహ్ చేసినందువల్ల అల్లాహ్ అతడి కొరకు ఒక పుణ్యఫలాన్ని వ్రాస్తాడు, ఒక పాపాన్ని క్షమిస్తాడు. అలాగే అతడి స్థాయిని మరొక స్థానానికి పెంచుతాడు. కనుక విరివిగా సజ్దాలు చేస్తూ ఉండండి. (అనగా విరివిగా నఫిల్ ఆరాధనలు చేయండి) (ఇబ్నె మాజహ్)

మహాపాపాలకు పూర్తిగా దూరంగా ఉంటూ, నిత్యం పశ్చాత్తాపంతో అల్లాహ్ ను పాపాలకుగాను క్షమాపణ వేడుకుంటూ, చిన్న పాపాలను తుడిచివేసే మంచి పనులను విరివిగా చేయడంతో పాటు అల్లాహ్ సహాయం పట్ల, కరుణాకటాక్షాల పట్ల పూర్తిగా నమ్మకాన్ని కలిగి ఉండాలి. అనగా ఆయన నరకాగ్ని శిక్ష నుంచి తప్పించి తొలి దశలోనే స్వర్గంలోకి ప్రవేశించేవారిలో చేరుస్తాడనే నమ్మకాన్ని కలిగి వుండాలి. (నిస్సందేహంగా ఆయన ఎంతగానో క్షమించేవాడు, కరుణించేవాడు)

## ఒక తప్పుడు విశ్వాసం - దాని ఖండన

కొంతమంది ఈ విధంగా విశ్వాసాన్ని కలిగియుంటారు: "మహాత్ములు, అల్లాహ్‌కు ప్రీతిపాత్రులయినవారు (ఔలియా) అల్లాహ్ కు ఎంతో ప్రియమైనవారు కనుక వారి మధ్యవర్తిత్వాన్ని దొరకబుచ్చుకోవడం వల్ల లేదా వారి చేతిలో చేతిని ఉంచడం వల్ల మేము కూడా నేరుగా వారితో పాటు స్వర్గంలోకి చేరుకుంటాము." తమ ఈ విశ్వాసానికి సమర్థనగా వారు ఉన్నతాధికారులకు సంబంధించిన ఉదాహ రణలను కూడా ఈ విధంగా పేర్కొంటారు: "ఒకవేళ ఒక వ్యక్తి మంత్రిని గానీ లేదా గవర్నర్‌ను గానీ కలుసుకోవాలనుకుంటే ముందు వారికి సన్నిహితులైనవారి సిఫారసును సంపాదించవలసి ఉంటుంది. అదేవిధంగా అల్లాహ్ క్షమాపణను, ముక్తిని పొందాలంటే కూడా మధ్యవర్తిత్వాన్ని దొరకబుచ్చుకోవడం అవసరం." కొంతమంది 'మహానుభావులు' స్వయంగా ఈ విధంగా ప్రకటిస్తారు కూడా : "మా తో సంబంధాన్ని కలిగియున్నవారు నేరుగా స్వర్గంలోకి ప్రవేశించారు." దీనికి కూడా వారు ఇటువంటివే ప్రాపంచిక ఉపమానాలను పేర్కొంటారు. ఉదాహరణకు ఇంజన్‌కు వెనుక దానితో అనుసంధానించబడి వున్న బోగీలన్నీ ఇంజన్ ఎక్కడికి చేరుకుంటుందో అక్కడికే చేరుకుంటాయి.

అలాగే "ఏ దైవప్రవక్తతోనయినా, వలీ (అల్లాహ్‌కు ప్రీతిపాత్రులయిన దాసులు) లతోనయినా లేదా సజ్జనులతో సంబంధాన్ని కలిగి ఉంటే చాలు స్వర్గంలోకి ప్రవేశించగలము" అని కూడా కొందరు భావిస్తూ ఉంటారు. రండి, పవిత్ర ఖుర్‌ఆన్ వాక్యాల ద్వారా, హదీసుల ద్వారా దీని వాస్తవికతను వెలికితీద్దాం.

పవిత్ర ఖుర్‌ఆన్‌లో మాటిమాటికీ 'ప్రళయదినాన ప్రజలందరూ ఒక్కొక్కరు చొప్పున విడివిడిగా తమ కర్మల లెక్క ఇచ్చేందుకై అల్లాహ్ న్యాయస్థానంలో హాజరవుతారు. ఎవరి వద్దా ఆ రోజు సిరిసంపదలు ఉండవు, సంతానమూ ఉండదు. అలాగే ఎవరికీ దైవప్రవక్తలు లేదా ఔలియా (దేవునికి ప్రీతిపాత్రులు) లేదా ఏ మహానుభావుడూ తోడుండరు' అని పేర్కొనబడింది. ఖుర్‌ఆన్‌లో ఒకచోట అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు : "ఎవరి అండ గురించి అతడు పేర్కొంటున్నాడో వారందరూ మా వద్ద ఉండిపోతారు. ఇతడు ఒంటరిగా మా వద్ద హాజరవుతాడు." ( మర్యమ్:80) "ప్రళయదినాన ప్రజలు అల్లాహ్ సన్నిధిలో ఒక్కొక్కరు చొప్పున హాజరవుతారు." (మర్యమ్-90) ఖుర్‌ఆన్‌లో 'అన్‌ఆమ్' అనే అధ్యాయంలో అల్లాహ్ ఇలా పేర్కొన్నాడు: "ప్రళయదినాన అల్లాహ్ ఈ విధంగా పలుకుతాడు : 'చూడండి. మిమ్మల్ని మేము మొదటిసారి ఒంటరిగా ఎలా పుట్టించామో అదేవిధంగా ఒంటరిగా మీరు మా ముందు హాజరయ్యారు. మేము వేటినయితే మీకు ప్రపంచంలో ఇచ్చామో వాటిని మీరు మీ వెనుక ప్రపంచంలోనే వదిలి వచ్చారు. ఇక ఇప్పుడు మేము మీ తో పాటు మీరు ఎవరి గురించయితే 'వీరు మాకు పనికొస్తారు' అని భావించేవారో

వారిని కూడా చూడము. మీ పరస్పర సంబంధాలన్నీ తెగిపోయాయి. ఎవరి గురించయితే మీరు ఆలోచించేవారో వారంతా మీ నుంచి మాయమయిపోయారు.'' (అన్ఆమ్ : 94)

**ఈ వాక్యంలో అల్లాహ్ మూడు విషయాలను స్పష్టంగా వివరించాడు:**

1. ప్రళయదినాన ప్రజలు తమ కర్మల లెక్క చూపేందుకై ఒంటరిగానే అల్లాహ్ న్యాయస్థానంలో హాజరవుతారు.
2. ప్రళయదినాన తమ పూర్వీకులు, ఔలియా (దేవునికి ప్రీతిపాత్రులు), మహాత్ములు తమను రక్షిస్తారని నమ్మిన ప్రజలకు 'చూడండి. నేడు వారు మీకు ఎక్కడా కనిపించడం లేదు' అని తెలుపడం జరుగుతుంది.
3. ప్రళయదినాన తమ పూర్వీకులను, ఔలియా ( దేవునికి ప్రీతిపాత్రులు )లను, మహాత్ములను తమ రక్షకులుగా భావించిన ప్రజలు వారిని కలుసుకోవడానికి ప్రయత్నిస్తారు. కానీ కోరుకున్నప్పటికీ వారికి తమ పూర్వీకులను, ఔలియాలను, మహాత్ములను కలుసుకునే అవకాశం లభించదు.

ఈ విశ్వాసాన్ని మరింతగా స్పష్టపరిచేందుకై అల్లాహ్ ఖుర్ఆన్ లో కొన్ని ఉపమానాలను పేర్కొన్నాడు. ఖుర్ఆన్‌లో 'తహ్రీమ్' అనే అధ్యాయంలో అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు : "అల్లాహ్ అవిశ్వాసుల విషయంలో నూహ్ (అ), లూత్(అ)ల భార్యలను ఉదాహరణలుగా పేర్కొంటున్నాడు. వారు సజ్జనులైన మా ఇద్దరు దాసులకు భార్యలుగా ఉన్నారు. కానీ వారు తమ భర్తల పట్ల (ధర్మం విషయంలో) అవినీతికి పాల్పడ్డారు. వారు (ఇద్దరు దైవప్రవక్తలు) అల్లాహ్‌కు విరుద్ధంగా వారికి ఏమాత్రం పనికిరాలేదు. ఇద్దరు స్త్రీలతో ఈ విధంగా పేర్కొనడం జరిగింది: వెళ్ళండి! అగ్నిలోకి వెళ్ళేవారితో పాటు మీరూ వెళ్ళిపోండి.'' (తహ్రీమ్ - 10) ఈ వాక్యంలో అల్లాహ్ తన ప్రవక్తల పేర్లను సైతం పేర్కొని ఏ దైవప్రవక్తతోనయినా సంబంధాన్ని కలిగియుం డటమనేది ప్రళయదినాన నరకం నుంచి రక్షించి స్వర్గం లోనికి ప్రవేశింప జేసేందుకు సరిపోదనే విశ్వాసాన్ని స్పష్టపరిచాడు.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) తన కూతురయిన హజ్రత్ ఫాతిమా(ర)ను సంబోధించి ఇలా ఉపదేశించారు : "ఓ ఫాతిమా! నిన్ను నీవే నరకాగ్ని నుంచి రక్షించుకో. అల్లాహ్ ముందు నేను నిన్ను రక్షించడానికి ఏమాత్రం పనికిరాను.'' (ముస్లిమ్) దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్(అ) తండ్రి అయిన ఆజర్ కు సంబంధించిన వృత్తాంతాన్ని ప్రస్తావిస్తూ ఇలా పేర్కొన్నారు: "ప్రళయదినాన హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) దుమ్ము ధూళితోనూ, నల్లగానూ మారిపోయిన ముఖాన్ని కలిగియున్న తన తండ్రిని చూస్తారు. అప్పుడు హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) ఇలా పలుకుతారు: 'నేను మీకు ప్రపంచంలోనే నాకు అవిధేయత చూపవద్దు' అని చెప్పలేదా?'' అప్పుడు తండ్రి ఇలా పలుకుతాడు : 'సరే. ఈరోజు నేను నీకు అవిధేయుడనై నడచుకోను.'' అప్పుడు

హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) అల్లాహ్‌ను ఈ విధంగా వేడుకుంటారు : "ఓ నా ప్రభువా! నీవు నన్ను ప్రళయదినాన అవమాన పరచనని వాగ్దానం చేసి ఉన్నావు. అయితే నా తండ్రి నీ అనుగ్రహానికి దూరమయి ఉండటానికి మించిన అవమానం మరేముంటుంది?" అప్పుడు అల్లాహ్ ఈ విధంగా పేర్కొంటాడు : "నేను స్వర్గాన్ని అవిశ్వాసుల కొరకు నిషిద్ధం కావించాను." ఆ తర్వాత అల్లాహ్ హజ్రత్ ఇబ్రాహీమ్(అ) ను సంబోధించి ఇలా పలుకుతాడు : "ఓ ఇబ్రాహీమ్! నీ రెండు కాళ్ళ క్రింద ఏముంది?" హజ్రత్ ఇబ్రాహీమ్(అ) తన కాళ్ళ క్రింద చూడగా మాలిన్యంలో పడి వున్న ఒక నీటికుక్క కనిపిస్తుంది. దైవదూతలు దానిని పట్టుకొని నరకంలో పడవేస్తారు. (బుఖారీ) మాలిన్యంలో పడి వున్న నీటికుక్క వాస్తవానికి హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) తండ్రి అయిన ఆజరే. హజ్రత్ ఇబ్రాహీమ్(అ) తన తండ్రి ఆజర్ ను నరకంలోకి ప్రవేశిస్తుండగా మానవ రూపంలో చూసి బాధపడకూడదనే ఆజర్ కు నీటికుక్కరూపమివ్వబడుతుంది. ఏదిఏమయినప్పటికీ సృష్టికర్త అయిన అల్లాహ్ న్యాయం మాత్రం మారదు. దేవుని ఏకత్వం పై విశ్వాసం లేనంతవరకు, అలాగే మంచి పనులు చేయనంతవరకు, ఏ దైవప్రవక్తతోనయినా, వలీతో అయినా, దేవుని అనుగ్రహాన్ని పొందిన సజ్జనులతోనయినా గడపడం లేదా సంబంధాన్ని కలిగి వుండటమనేది ఎవరినీ నరకం నుంచి రక్షించజాలదు, స్వర్గంలోకి తీసుకెళ్ళదు.

**ఈ నేపథ్యంలో ఇక్కడ రెండు విషయాలను ప్రస్తావించడం సముచితం :**

ఒకటి : ప్రళయదినాన దైవప్రవక్తలు, సజ్జనులు, దైవమార్గంలో ప్రాణాలర్పించిన అమరవీరులు పాపుల కొరకు సిఫారసు చేస్తారనే విషయం నిస్సందేహంగా ఖుర్‌ఆన్ ద్వారా, హదీసుల ద్వారా నిరూపితమైన సత్యం. అయితే అల్లాహ్ ఇష్టానుసారం, ఆయన అనుమతిని పొందిన తర్వాత మాత్రమే వారు సిఫారసు చేయగలుగుతారు. ఏ దైవప్రవక్తయినా, వలీ అయినా, అమరవీరుడయినా తన ఇష్టానుసారం స్వయంగా అల్లాహ్ సన్నిధిలో ఎవరి విషయంలోనయినా సిఫారసు చేసే సాహసానికి ఒడిగట్టలేరు. అలాగే అల్లాహ్ ఏ వ్యక్తి విషయంలో అనుమతిస్తాడో అతడి కొరకు మాత్రమే వారు సిఫారసు చేయగలుగుతారు. ఖుర్‌ఆన్ లో ఒకచోట అల్లాహ్ ఇలా పేర్కొన్నాడు : "అల్లాహ్ సన్నిధిలో ఆయన అనుమతిని పొందకుండా సిఫారసు చేయగలవాడెవడు." (బఖరహ్ : 255)

రెండు : అల్లాహ్ కు ప్రీతిపాత్రుడయిన దాసుడు (వలీ) ఎవరు? ఎవరు కాదు? ప్రళయదినాన ఏ వ్యక్తికి సిఫారసు చేస్తే అనుమతి లభిస్తుంది? ఎవరికి లభించదు? ఇటువంటి విషయాలన్నీ కేవలం అల్లాహ్ జ్ఞానంలో ఉన్నాయి. ఏ వ్యక్తీ "ఫలానా వ్యక్తి అల్లాహ్ కు ప్రీతిపాత్రుడు (వలీ). కనుక తప్పకుండా ఆయనకు ప్రళయదినాన సిఫారసు చేసేందుకు అనుమతి లభిస్తుంది" అని ప్రకటించలేడు. అలాగే "నాకు అల్లాహ్ తరపు నుంచి పాపుల కొరకు తప్పకుండా సిఫారసు చేసే అనుమతి లభిస్తుంది. నేను ఫలానా వ్యక్తుల కొరకు సిఫారసు చేస్తాను" అని కూడా స్వయంగా ప్రకటించలేడు. ప్రజలు

జీవించియున్న లేదా మరణించిన ఏ వ్యక్తినయినా అల్లాహ్ కు ప్రీతిపాత్రుడయిన దాసుడి (వలీ)గా భావించినంత మాత్రాన అతడు నిజంగానే అల్లాహ్‌కు ప్రీతిపాత్రు డయిన దాసుడు (వలీ) కానక్కరలేదు. ఏ వ్యక్తినయితే ప్రజలు అల్లాహ్ కు ప్రీతిపాత్రునిగా (వలీ) భావించి, మధ్యవర్తిగా భావించి, అతడి సమాధి మీద మొక్కులు చెల్లిస్తున్నారో అతడు స్వయంగా ఏదయినా పాపం కారణంగా శిక్షను అనుభవిస్తూ ఉన్నా ఆశ్చర్యం లేదు. ఒక సందర్భంలో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) తో కొందరు మరణించిన ఒక వ్యక్తిని 'షహీద్' (దైవమార్గంలో వీరమరణం పొందినవాడు) గా స్తుతించగా, దైవప్రవక్త (స) ఇలా పేర్కొన్నారు: "ఎంతమాత్రం కాదు. నేను అతడిని యుద్ధసొత్తులో లభించినవాటిలో నుంచి ఒక దుప్పటిని అతడు దొంగిలించిన కారణంగా అగ్నిలో చూసాను." (తిర్మిజీ)

సారాంశమేమిటంటే మహాత్ములు లేదా దేవునికి ప్రీతిపాత్రులయిన దాసుల (ఔలియా) మధ్యవర్తిత్వం ద్వారా స్వర్గంలోకి ప్రవేశించవచ్చనే విశ్వాసం పూర్తిగా నిరాధారమైన, తప్పుడు విశ్వాసం. ఇది షైతాన్ మాయోపాయం వల్ల రూపుదిద్దుకున్న బూటకపు విశ్వాసం తప్ప మరేమీ కాదు. నిజంగా స్వర్గంలో ప్రవేశించాలని అభిలషించే వ్యక్తి దేవుని ఏకత్వం పై విశ్వాసముంచి మంచి పనులు ఎక్కువగా చేయాలి. ఖుర్‌ఆన్ లో ఒకచోట అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు : "ఏ వ్యక్తయితే తన ప్రభువును కలుసుకోవాలని అభిలషిస్తాడో అతడు మంచి పనులు చేయాలి. అలాగే తన ప్రభువును ఆరాధించే విషయంలో ఎవరినీ దైవానికి సహవర్తులుగా భావించకూడదు." (కహఫ్:110)

**స్వర్గానికి చేరేందుకు దోహదపడే ఋజుమార్గం ఇదే!**

## విశ్వాసులారా ! జాగ్రత్త !

సర్వ సృష్టికర్త అయిన అల్లాహ్ తొలి మానవులయిన, తొలి దైవప్రవక్త అయిన హజ్రత్ ఆదమ్ (అ)ను సృష్టించిన తర్వాత ఆయనకు సజ్దా (సాష్టాంగ ప్రణామం) చేయవలసిందిగా తన దూతలను ఆజ్ఞాపించాడు. ఇబ్లీస్ తప్ప అందరూ సజ్దా చేశారు. అల్లాహ్ ఇబ్లీస్ ను ఈ విధంగా ప్రశ్నించాడు : "నేను ఆదేశించిన తర్వాత కూడా నిన్ను ఏ విషయం సజ్దా చేయకుండా నిరోధించింది?" అప్పుడు ఇబ్లీస్ ఇలా బదులిచ్చాడు: "నేను ఆదమ్ కంటే ఉత్తముడిని. నీవు ఆయనను మట్టితో సృష్టించావు, నన్ను అగ్నితో సృష్టించావు." అప్పుడు అల్లాహ్ ఇలా పేర్కొన్నాడు : "ఇక్కడ అహంకారాన్ని ప్రదర్శించే అధికారం నీకు లేదు. కనుక ఇక్కడి నుంచి వెళ్ళిపో. నిస్సందేహంగా నీవు నీచుడివి, శాపగ్రస్తుడివి." అప్పుడు ఇబ్లీస్ తిరిగి ఈ విధంగా పలికాడు : "నాకు ప్రళయదినం వరకు గడువును ప్రసాదించు." అల్లాహ్ ఇలా పేర్కొన్నాడు : "నీకు గడువు ప్రసాదించబడింది" అప్పుడు ఇబ్లీస్ బహిరంగంగా ఇలా ప్రకటించాడు : " ఓ అల్లాహ్! ఏ విధంగానయితే నీవు నన్ను (సజ్దా చేయమని ఆదేశించి) మార్గభ్రష్టత్వంలో పడవేశావో అదేవిధంగా ఇప్పటినుంచి నేను మానవులను

సన్మార్గం నుంచి తప్పించే ప్రయత్నంలోనే నిమగ్నమయి ఉంటాను. ముందు నుంచి, వెనుక నుంచి, కుడివైపు నుంచి, ఎడమ వైపు నుంచి, అన్నివైపుల నుంచి వారిని చుట్టుముడతాను. నీవు వారిలో ఎక్కువమందిని కృతఘ్నులుగానే చూస్తావు" అప్పుడు అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు : "ఓ నీచుడా! బహిష్కృతుడా! ఇక్కడి నుంచి వెళ్ళిపో. బాగా గుర్తుంచుకో. మానవుల్లో ఎవరయితే నిన్ను అనుసరిస్తారో వారిని, నిన్ను నరకంలో పడవేస్తాను." ఆ తర్వాత అల్లాహ్ హజ్రత్ ఆదమ్ (అ)ను సంబోధిస్తూ ఇలా పేర్కొన్నాడు: "ఓ ఆదమ్! నీవు, నీ భార్య ఈ స్వర్గంలో ఉండండి. మీకు ఇష్టమయిన వాటన్నింటినీ తినండి, త్రాగండి. కానీ ఈ చెట్టు దగ్గరకు వెళ్ళకండి. లేకుంటే దుర్మార్గులలో చేరిపోతారు." అయితే అసూయతో, ప్రతీకారేచ్ఛతో రగిలి పోతున్న ఇబ్లీస్ (షైతాన్) హజ్రత్ ఆదమ్ (అ) దగ్గరికొచ్చి ఈ విధంగా పలికాడు: "మీ ప్రభువు మిమ్మల్ని ఈ చెట్టు వద్దకు వెళ్ళకూడదని నిరోధించాడు. అంటే మీరు దైవదూతలయిపోకూడదని, శాశ్వతమైన జీవితాన్ని పొందకూడదని దేవుడు భావిస్తున్నాడు." అంతేగాకుండా ఇబ్లీస్ ప్రమాణం చేసి తాను వారి నిజమైన సానుభూతిపరుడనని, శ్రేయోభిలాషినని నమ్మబలికాడు. దాని పర్యవసానంగా హజ్రత్ ఆదమ్ (అ), ఆయన సతీమణి హజ్రత్ హవ్వా (అ) దేవుని ఆజ్ఞను ధిక్కరించి, ఆ చెట్టు పండును తిని అల్లాహ్ ప్రసాదించిన మహోన్నతమైన వరప్రసాదమైన స్వర్గానికి దూరమయిపోయారు. అప్పుడు అల్లాహ్ హజ్రత్ ఆదమ్ (అ)ను, హజ్రత్ హవ్వా(అ)ను భూమి మీద నివసించమని ఆదేశించి కొన్ని ఉపదేశాలను, ఆజ్ఞలను అందజేశాడు. అంతేగాకుండా అల్లాహ్ మానవులను ఈ విధంగా హెచ్చరించాడు : "ఓ మానవులారా! షైతాన్ మీ తల్లిదండ్రులను మోసగించి స్వర్గం నుంచి తప్పించి, వారి మర్మావయవాలు బహిర్గతమయ్యేలా దుస్తులను వారి నుంచి వెలికి తీయించిన ట్లుగానే మిమ్మల్నీ మాయోపాయంలో పడవేసే అవకాశముంది." మరిన్ని వివరాల కొరకు ఖుర్ఆన్‌లో 'ఆరాఫ్' అనే అధ్యాయాన్ని అధ్యయనం చేయండి.

ఖుర్ఆన్‌లో పలుచోట్ల అల్లాహ్ విభిన్న రీతుల్లో మానవులను మాటిమాటికీ ఈ విధంగా హెచ్చరించాడు : "ఓ మానవులారా! షైతాన్ మీ బహిరంగ శత్రువు. అతడి మాయోపాయంలో చిక్కుకోకండి. లేకుంటే నష్టపోయేవారిలో మీరూ చేరే అవకాశముంది." ఈ విషయానికి సంబంధించిన కొన్ని ఖుర్ఆన్ వాక్యాలు క్రింద పేర్కొనబడుతున్నాయి :

1. "ప్రజలారా! షైతాన్‌ను అనుసరించకండి. అతడు మీ బహిరంగ శత్రువు."
(బఖరహ్ : 208)

2. "షైతాన్ ప్రజలకు వాగ్దానం చేస్తాడు, వారికి నమ్మకం కలిగిస్తాడు. కానీ (గుర్తుంచుకోండి) షైతాన్ చేసే వాగ్దానాలన్నీ మోసం తప్ప మరేమీ కావు."
(నిసా :120)

3. “(ప్రజలారా!) ఈ ఐహిక జీవితం మిమ్మల్ని మోసానికి గురి చేయకూడదు. వంచకులు మిమ్మల్ని అల్లాహ్ విషయంలో వంచనకు గురి చేయకూడదు.” (లుఖ్మాన్ :33)

సృష్టికర్త అయిన అల్లాహ్ ఇంత స్పష్టంగా హెచ్చరించినప్పటికీ ఈ మానవుడు అడుగడుగునా ఏ విధంగా షైతాన్ మాయోపాయంలో చిక్కుకొని స్వర్గానికి ఏ విధంగా స్వయంగా దూరమయిపోతున్నాడో ప్రతి మనిషీ స్వయంగా తన ఆచరణాత్మక జీవితాన్ని సమీక్షించుకొని అంచనా వేసుకోవచ్చు.

తాత్కాలికమైన, క్లుప్తమైన ఈ ఐహిక జీవితంతో పోలిస్తే పరలోక జీవితం ఎంత సుదీర్ఘంగా, శాశ్వతంగా ఉంటుందో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా బోధించారు : “ఒకవేళ ఒక వ్యక్తి తన వేలిని సముద్రంలో ముంచి తీస్తే వేలికి అంటుకునే నీటిని ఇహలోక జీవితంగా భావించాలి. ఇక సముద్రం మొత్తాన్ని పరలోక జీవితంగా భావించాలి.” (ముస్లిమ్) ఒకవేళ ఈ ఉదాహరణను మనం సంఖ్యాశాస్త్రం ప్రకారం అర్థం చేసుకోదలిస్తే దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) బోధనల ప్రకారం ఆయన (స) అనుచర సమాజానికి చెందిన వ్యక్తుల సరాసరి ఆయుష్షు 60 లేదా 70 సంవత్సరాలుంటుంది. మానవుని సగటు ఆయుర్దాయాన్ని 70 సంవత్స రాలుగా భావించి, సహజ సంఖ్యారేఖలో సంఖ్యలన్నింటినీ పరలోక జీవితపు సంవత్స రాలుగా భావించినట్లయితే సంఖ్యారేఖలో ఆఖరి సంఖ్య అంటూ లేదు గనుక పరలోకపు శాశ్వత జీవితం ఇహలోకపు జీవితంతో పోల్చడానికి సైతం వీలు లేని స్థాయిలో ఉంటుందని అర్థం చేసుకోవచ్చు. మరి మానవుడు తన శక్తీసా మర్థ్యాలను, వనరులను, సమయాన్ని ఇహలోకపు తాత్కాలిక జీవితాన్ని చక్కదిద్దు కునేందుకు వినియోగించాలా లేక శాశ్వతమైన పరలోక జీవితాన్ని చక్కదిద్దుకునేందుకు వినియోగించాలా? కానీ క్షణికమైన ఐహిక జీవితాన్ని షైతాన్ మన కొరకు ఎంత సుందరంగా మార్చివేశాడంటే మనం శాశ్వతమైన పరలోక జీవితపు వరానుగ్రహాలను వదిలి క్షణికమైన ఐహిక జీవితపు హంగుపొంగుల్లోనే నిత్యం మునిగి తేలుతున్నాము. అలాగే షైతాన్ మాయో పాయంలో చిక్కుకొని స్వర్గానికి దూరమవడానికి మార్గాలను ఏర్పరచుకుంటున్నాము.

తాత్కాలికమైన ప్రాపంచిక జీవితంలో మునిగి ఉండటాన్ని, శాశ్వతమైన పరలోకపు జీవితం పట్ల ఏమరుపాటులో ఉండటాన్ని మనం అడుగడుగునా మన జీవితాల్లో చూడవచ్చు. దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఒక సందర్భంలో ఈ విధంగా పేర్కొన్నారు: “ఫజర్ వేళ రెండు రకాతుల నమాజ్ ( సున్నతె ముఅక్కిదహ్) చదవడం ప్రపంచం, అందులో ఉన్న సమస్తం కంటే ఉత్తమమైనది.” (తిర్మిజీ)

ఆలోచించండి. ప్రపంచం, అందులోని సమస్త సంపద అంటే, అమెరికా- ఆఫ్రికా- యూరప్-ఆసియా, ఇంకా ఇతర ఖండాలన్నింటిలోని దేశాల సమస్త సంపద చేరి వుంది. అలాగే అందులో భూమి లోపల దాగియున్న సంపదలూ చేరి వున్నాయి. అలాగే మానవుడు

తన ఆసక్తి మేరకు ఊహించగల ప్రతి వస్తువూ చేరి వుంది. అయితే ఈ రెండు రకాతుల సున్నత్ నమాజ్ చదివేందుకై ఎంతమంది ముస్లింలు ఫజర్ నమాజ్ కొరకు అజాన్ ఇవ్వబడినప్పుడు నిద్రనుంచి మేల్కొంటున్నారు? అయితే ప్రాపంచిక సంపదను ఆర్జించేందుకై ఎంతోమంది ఫజర్ నమాజ్ కొరకు అజాన్ ఇవ్వబడటానికి ముందే నిద్రనుంచి మేల్కొంటున్నారు. ఎంతోమంది వ్యాపారులు తమ వ్యాపారాల కొరకు రాత్రంతా మేల్కొంటారు. అలాగే ఎంతోమంది రైతులు తమ తమ భూములను దున్నడానికై రాత్రంతా కష్టపడుతూ గడుపుతారు. అలాగే ఎంతోమంది విద్యార్థులు తమ ఉజ్జ్వల భవిష్యత్తుకై రాత్రంగా మేల్కొని చదువుతారు. కానీ ఫజర్ వేళ రెండు రకాతుల నమాజ్ చదివే సౌభాగ్యం ఎంతమందికి ప్రాప్తమవుతుంది? ప్రాపంచిక దురాశ, అందమైన కోరికల మాయ మనల్ని పరలోకంలో శాశ్వతమైన వరానుగ్రహాలతో కూడిన స్వర్గం నుంచి దూరం చేసివేస్తోంది.

ఒక సందర్భంలో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: "దానం చేయడం వల్ల డబ్బు తగ్గిపోదు." చూసేందుకు దానం చేయడం వల్ల సంపద తగ్గిపోయినట్లుగా కనిపించినప్పటికీ అల్లాహ్ అందులో ఎంతటి శుభం కలుగజేస్తాడంటే కొన్ని రూపాయలు దానం చేసినందువల్ల వేలాది అవసరాలు తీరిపోతాయి. కానీ షైతాన్ బహిరంగంగా గణించి 'వెయ్యి రూపాయల్లో నుంచి వంద రూపాయలు దానం చేస్తే తొమ్మిది వందల రూపాయలు మిగులుతాయి. డబ్బు తగ్గిపోవడమే గానీ ఎలా పెరుగుతుంది? మీ ఇంటి విస్తృతమైన ఖర్చులు, పిల్లల చదువులు, వ్యాధులు, ఇంకా ఇతర అవసరాలన్నింటి కొరకు డబ్బెలా సరిపోతుంది?' అంటూ ప్రేరేపిస్తాడు. దానితో మానవుడు తన 'నిజమైన శ్రేయోభిలాషి ఎన్నటికీ కాదు.' అయిన షైతాన్ మాయోపాయంలో చిక్కుకుంటాడు. ఈ విధంగా షైతాన్ మానవ సంతతిని స్వర్గానికి దూరం చేసేందుకై వనరులు సిద్ధం చేస్తాడు.

అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఈ విధంగా పేర్కొన్నాడు : "నేను వడ్డీ వల్ల సంపదను తగ్గిస్తాను." (బఖరహ్:276) బాహిర్యంగా వడ్డీ సంపద ఎంత ఎక్కువగా కనిపించిన ప్పటికీ అల్లాహ్ అందులో శుభాన్ని అంతరింపజేస్తాడు. దానితో లక్షల, కోట్ల రూపాయలు నీళ్ళలా ఖర్చుపెట్టబడినప్పటికీ వందల మంది అవసరాలు సైతం తీరవు. అంతేగాకుండా ఎన్నటికీ క్షీణించని దురాశ మానవుడిని పిచ్చివాడిని చేస్తుంది. రాత్రి కునుకూ ఉండదు, ఉదయం మనశ్శాంతీ లభించదు. అయినప్పటికీ షైతాన్ లెక్కలు వేసి "వెయ్యి రూపాయలకు గాను యాభై రూపాయలు వడ్డీగా లభిస్తే, లక్ష రూపాయలకు ఐదువేల రూపాయలు అధికంగా లభిస్తాయి. ఆ విధంగా ఒకవేళ బ్యాంకులో పదిలక్షల రూపాయలు జమ చేస్తే ప్రతి నెలా యాభైవేల రూపాయలు వడ్డీగా లభిస్తూ ఉంటాయి. కష్టపడే అవసరమూ లేదు, పెట్టుబడీ పదిలంగా ఉంటుంది. అలాగే నీవు మరణించిన తర్వాత నీ సంతతి కూడా సుఖంగా జీవిస్తుంది." అని పేర్కొంటూ మానవుడిని దురాశకు గురిచేస్తాడు. ధనంలో

పెరుగుదల, సుఖవంతమైన జీవితం, భార్యాబిడ్డల పట్ల ప్రేమ మొదలయినవాటికి సంబంధించిన ఆధారాలు బలంగా కనిపించడంతో మానవుడు షైతాన్ మాయోపాయంలో చిక్కుకొని స్వర్గానికి క్రమంగా దూరమయిపోతాడు.

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఒక సందర్భంలో ఈ విధంగా పేర్కొన్నారు: "అధర్మసొమ్ముతో పోషించబడిన శరీరం అన్నింటికంటే ముందు నరకంలోకి ప్రవేశిస్తుంది." (తిబ్రానీ) నరకాగ్నిలో ఒక్క క్షణం గడపడంతో మానవుడు ఇహలోకపు సుఖభోగాలన్నింటినీ తృటిలో మరచిపోతాడు. అగ్ని వస్త్రాలు, అగ్ని దుప్పట్లు, అగ్ని నీడలు, అగ్ని గొడుగులు, తాగేందుకు సలసల మరిగే నీరు, తినేందుకు విషపూరితమైన ముళ్ళకంప, అగ్నిలో నుంచి ఉద్భవించే పాములు, తేళ్ళు... ఊహిస్తేనే ఒళ్ళు గగుర్పొ డుస్తుంది. కానీ సమాజంలో జీవన విలువలను మెరుగుపరిచేందుకు, సుఖవంతమైన జీవితం గడిపేందుకు, పిల్లలను ఇంగ్లీషు స్కూళ్ళలో చదువు చెప్పిం చేందుకు, పరస్పరం గొప్పలు పోయేందుకు, ప్రాపంచిక కీర్తిప్రతిష్ఠలు ఆర్జించేందుకు, బూటకపు గౌరవ ప్రతిష్ఠలు పొందేందుకు మానవుడు తీవ్రస్థాయిలో నిమగ్నమయ్యేలా షైతాన్ అందమైన వల పన్నాడు. దానితో దైవప్రవక్త (స) హెచ్చరికపై షైతాన్ మాయోపాయం ఆధిక్యత సాధించింది. (లా హౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్)

అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో ఈ విధంగా పేర్కొన్నాడు : "అలా బిజిక్రిల్లాహి తత్‌మఇన్నల్ ఖులూబ్" (అల్లాహ్ స్మరణ ద్వారా హృదయాలకు శాంతి చేకూరుతుంది)

(ఖుర్‌ఆన్, రఅద్ :28)

అల్లాహ్ ఈ విధంగా శాంతి గురించి స్పష్టంగా పేర్కొన్నప్పటికీ షైతాన్ మానవులకు తన మాయోపాయం ద్వారా శాంతిని పొందేందుకు రకరకాల విధానాలను సూచిస్తూ వచ్చాడు. కొందరికి తమ గురువుల సమాధులపై వస్త్రాలను కప్పడం వల్ల శాంతి చేకూరుతుంది. మరికొందరికి తమ గురువుల పాదాలను చుంబించడం వల్ల శాంతి లభిస్తుంది. కొందరికి మద్యపానం వల్ల శాంతి కలుగుతుంది. మరికొందరికి పరస్త్రీల స్వరం వినడం వల్ల, సంగీతం వినడం వల్ల శాంతి లభిస్తుంది. కొందరికి బంగారం, వెండి, సిరిసంపదలను పోగేసుకోవడం వల్ల శాంతి లభిస్తుంది. మరికొం దరికి ఉన్నతమైన ప్రభుత్వోద్యోగాలను సంపాదించడం వల్ల శాంతి లభిస్తుంది. కొందరికి అసెంబ్లీ సభ్యుడవడం వల్ల లేదా మంత్రి పదవిని పొందడం వల్ల శాంతి లభిస్తుంది. మరికొందరికి అమెరికా, కెనడా లేదా యూరప్ దేశాల పౌరసత్వాన్ని పొందడం వల్ల శాంతి లభిస్తుంది. మరి మానవుల్లో అల్లాహ్ స్మరణ ద్వారా శాంతిని పొందడం పట్ల ఆసక్తి చూపేవారు ఎంతమంది ఉంటారో, షైతాన్ మాయోపాయంలో చిక్కుకున్నవారు ఎంతమంది ఉంటారో అంచనా వేయండి. ఈ పరిస్థితి గురించి అల్లాహ్ మనకు ముందే తెలియజేశాడు : "వ జయ్యన లహుముష్ షైతాను అఅ్‌మాలహుమ్ ఫసద్దహుమ్ అనిస్సబీలి వ కానూ ముస్తబ్‌సిరూన్" (షైతాన్ వారి ఆచరణలను వారి కొరకు అందమైనవిగా

మార్చేశాడు. అలాగే వారిని ఋజుమార్గంపై పయనించకుండా నిరోధించాడు. వాస్తవానికి వారు (ప్రాపంచిక దృష్టిలో) బుద్ధిమంతులు. (ఖుర్‌ఆన్, అన్‌కబూత్ :38)

ఇహలోక సాఫల్యం విషయంలో తీవ్రంగా కృషి చేయనంతవరకు జీవన వనరులు వాటంతటవే సమకూరవనే విషయాన్ని మానవులందరూ విశ్వసిస్తారు. రైతు ధాన్యాన్ని పొందేందుకై రాత్రింబవళ్ళూ పొలాల్లో పనిచేస్తాడు, వ్యాపారి లాభం పొందేందుకై రాత్రింబవళ్ళూ దుకాణంలో కూర్చుంటాడు, ఉద్యోగి జీతం పొందేందుకై నెలంతా తన విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తిస్తాడు, కూలీ తన కూలిడబ్బులు పొందేందుకై ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరాయంగా శ్రమిస్తాడు, విద్యార్థి పరీక్షలో ఉత్తీర్ణుడయ్యేందుకై సంవత్సరమంతా చదువుతాడు. మానవ జీవితంలో శ్రమించడానికి, కృషి చేయడానికి సంబంధించిన ఈ నియమం ఎంత సహజసిద్ధమైనదంటే దీనిని ఎవరికీ బోధించనక్కరలేదు. కానీ ధర్మం విషయంలో షైతాన్ మానవులను ఎంత అందంగా మోసం చేశాడంటే ముస్లింలలో ఎక్కువమంది 'అల్లాహ్ మేము స్వర్గంలోకి వెళ్ళాలో, నరకంలోకి వెళ్ళాలో ముందే రాసి ఉంచాడు. మరి శ్రమించే అవసరమే ముంది?' అని భావిస్తారు. మరికొంతమంది "అల్లాహ్ తలచినప్పుడు మేము నమాజ్ చదువుతాము లేదా అల్లాహ్ మాకు నమాజ్ చదివే సద్బుద్ధిని ప్రసాదించమని మీరు మా కొరకు దుఆ చేయండి." అని పలుకుతారు. కొంతమంది అల్లాహ్ అనంత కరుణామయుడని, ఆయన అన్నింటినీ క్షమిస్తాడనే అపోహలో ఉంటారు.

ఇహలోకం విషయంలో నిరంతర శ్రమను ప్రాతిపదికగా చేసుకోవడం, ధర్మం విషయంలో విధిరాత నెపంతో లేదా అల్లాహ్ కారుణ్యం నెపంతో ఆచరణ నుంచి తప్పించుకోవడమనేది షైతాన్ పన్నిన అందమైన వల తప్ప మరేమీ కాదు. దాని గురించి షైతానే స్వయంగా ఇలా పేర్కొన్నాడు : "ల ఇన్ అఖ్ఖర్‌తని ఇలా యౌమిల్ ఖియామతి లఅహ్‌తనికన్న జుర్రియ్యతహూ ఇల్లా ఖలీలా" (నీవు గనక నాకు ప్రళయదినం వరకు వ్యవధినిస్తే, నేను ఇతడి వంశాన్ని సమూలంగా నాశనం చేస్తాను, కేవలం కొందరు మాత్రమే నన్ను తప్పించుకోగలుగుతారు.) (ఖుర్‌ఆన్, బనీ ఇస్రాయీల్ :62)

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఇలా పేర్కొన్నారు : "ఏ వ్యక్తయితే ముస్లింలకు సంబంధించిన ఏదయినా వ్యవహారంలో బాధ్యుడుగా చేయబడ్డాడో ఒకవేళ అతడు వారి హక్కులను శ్రేయస్కరంగా నెరవేర్చనట్లయితే అతడు స్వర్గలోకపు సువాసనను సైతం పొందలేడు." (బుఖారీ, ముస్లిమ్) దైవప్రవక్త (స) యొక్క ఈ బోధన పర్యవసానంగా పూర్వకాలానికి చెందిన ఎందరో పుణ్యాత్ములు ప్రభుత్వ పదవులకు దూరంగా పరుగెత్తేవారు. ఒకవేళ ఏ వ్యక్తయినా ఇటువంటి బాధ్యతలను నెరవేర్చవలసి వస్తే అతడు దైవభీతికి, ధార్మిక పరాయణతకు, నిజాయితీకి సంబం ధించిన ఆదర్శనీయమైన ప్రమాణాలను నెలకొల్పేవాడు.

పరిపాలన, పదవి, ఉన్నతస్థానం మొదలయిన విషయాలకు దూరంగా ఉండే విషయంలో ఇమామ్ అబూహనీఫహ్ (ర) నెలకొల్పిన ఆదర్శం ఇస్లామీయ చరిత్రలో చిరస్మరణీయం. అబ్బాసీ ఖలీఫా అయిన అబూ జాఫర్ మన్‌సూర్ ఆయనను పిలిచి ప్రధాన న్యాయమూర్తి పదవిని స్వీకరించవలసిందిగా కోరగా ఇమామ్ అబూ హనీఫహ్(ర) ఈ విధంగా పేర్కొన్నారు: "నేను అందుకు యోగ్యుడిని కాను. న్యాయమూర్తి చివరకు రాజు, అతడి సంతానం లేదా సర్వసైన్యాధ్యక్షుడికి సైతం విరుద్ధంగా తీర్పునివ్వ గలిగేంత సాహసి అయి ఉండాలి. నాలో అటువంటి ధైర్యం లేదు" అప్పుడు రాజు ఆయనను బందీఖానాలో ఉంచి కొరడా దెబ్బలు కొట్టించాడు. అయినప్పటికీ ఆయన పదవిని స్వీకరించలేదు. చివరకు బందీఖానా (జైలు)లోనే ఆయన మరణించారు. స్వర్గనరకాలపై పూర్వకాలానికి చెందిన ఇటువంటి పుణ్యాత్ముల విశ్వాసం ఎంత పటిష్ఠంగా ఉండేదంటే షైతాన్ మాయోపాయాలేవీ వారి దృఢవి శ్వాసాన్ని ఏమాత్రం కదలించలేకపోయాయి.

ఈ సందర్భంలో మన సమాజం మీద దృష్టిని సారించినట్లయితే షైతాన్ తన మాయోపాయం ద్వారా ప్రభుత్వ పదవుల్లో మానవుల కొరకు ఎంతటి ఆకర్షణను రంగరించాడంటే చదువు లేని అజ్ఞానుల సంగతి అలా వుంచితే పండితులు సైతం ఇస్లాంకు, దేశానికి, జాతికి ప్రభుత్వ పదవులు పొందకుండా సేవ చేయడం అసా ధ్యమని భావించే స్థితికి చేరుకున్నారు. దీనినిబట్టి ఇటువంటి ఆకర్షణీయమైన, అందమైన ఋజువుల చాటున షైతాన్ మానవ సంతతిని స్వర్గం నుంచి తప్పించేందుకై ఏ విధంగా సాధనాలను సిద్ధం చేసుకున్నాడో పరిశీలించండి. ప్రభుత్వ పదవులు, అధికారాలను పొందేందుకై అబద్ధమా డడం, మోసం చేయడం, వాగ్దానాన్ని భంగం చేయడం, పోట్లాడడం, తిట్టడం, కొట్టడం, నిందలు వేయడం, దూషించడం, ప్రేరేపించడం, చివరకు హత్యలు చేయడం వంటి మహాపాపాలు చేయడాన్ని షైతాన్ మానవులకు సులభతరం చేస్తాడు. ఆ విధంగా మానవుడు షైతాన్ మాయోపాయంలో చిక్కుకుని స్వర్గానికి దూరమయిపోయే 'భాగ్యానికి' నోచుకుంటాడు!

ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఒకచోట ఈ విధంగా పేర్కొన్నాడు : "విశ్వాసుల వర్గంలో అశ్లీలత వ్యాపించాలని కోరేవారు, ప్రపంచంలోనూ, పరలోకంలోనూ వ్యధా భరితమైన శిక్షకు అర్హులు." (ఖుర్‌ఆన్, నూర్:19) షైతాన్ అశ్లీలతను, అసభ్య కార్యాలను మానవజాతి కొరకు ఎంత సులభతరంగా, సుందరంగా మలచివేశాడంటే అల్లాహ్ స్పష్టంగా హెచ్చరిం చినప్పటికీ షైతాన్ మాయోపాయంలో చిక్కుకున్న మానవజాతి ప్రతిచోటా అశ్లీలతను, అసభ్య కార్యాలను వ్యాపింపజేయడంలో నిమగ్నులై ఉండటాన్ని మనం చూస్తూనే ఉన్నాము. ఇక ప్రసార మాధ్యమాల విషయానికొస్తే అవి అందమైన పేర్ల ముసుగులో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, సినిమాహాళ్ళు, టీవీ, రేడియో, దినపత్రికలు, దినపత్రికల ప్రత్యేక సంచికలు, వారపత్రికలు, మాస పత్రికలు, ఇంటర్నెట్ మొదలయినవన్నీ సగర్వంగా,

సంతోషంగా షైతాన్‌కు విధేయతలో, అనుసరణలో నిమగ్నమై ఉన్నాయి. దీనికి పరాకాష్ఠ ఏమిటంటే మంచిని వ్యాపించడానికి, చెడును నిరోధించడానికి కట్టుబడి కొనసాగే కొన్ని వారపత్రికలు, మాసపత్రికలు సైతం 'సంస్థను కొనసాగించడం కొరకు' అనే సాకుతో షైతాన్ ను అనుసరిస్తూ అశ్లీలతను, అసభ్య కార్యాలను వ్యాపింపచేయడంలో నిమగ్నమై ఉన్నాయి. ఈ విధంగా అల్లాహ్ శిక్ష గురించి చేసిన హెచ్చరిక స్వర్గానికి దూరం చేసే, నరకానికి చేరువ చేసే షైతాన్ యొక్క అందమైన నిదర్శనాలు, అందమైన ఆశల చాటున మరుగు నపడిపోయింది.

హజ్రత్ ఉమర్ (ర) ఖలీఫహ్‌గా కొనసాగిన కాలంలో హిమస్ గవర్నర్ అయిన హజ్రత్ అయ్యాజ్ బిన్ అనమ్ (ర) పరమపదించగా, హజ్రత్ ఉమర్ (ర) హిమస్ గవర్నర్ గా హజ్రత్ సఅద్ బిన్ ఆమిర్ (ర) నియమించబోగా హజ్రత్ సఅద్ (ర) అందుకు తిరస్కరించారు. కానీ హజ్రత్ ఉమర్ (ర) బలవంతంగా ఆయనకు బాధ్యతలను అప్పగించారు. హజ్రత్ సఅద్ బిన్ ఆమిర్ (ర) గవర్నర్ గా కొనసాగిన కాలంలో ఆయన(ర) ధార్మిక పరాయణత ఏ స్థాయిలో ఉండేదంటే తనకు లభించే నెలసరి జీతంలో తన భార్యాబిడ్డల ఖర్చు కొరకు అవసరమైనంత ఉంచుకొని మిగిలిన డబ్బును పేదవారికి పంచేవారు. మిగిలిన డబ్బును ఎలా ఖర్చు చేస్తున్నారని భార్య ప్రశ్నించగా అప్పులిస్తున్నానని ఆయన (ర) బదులిచ్చేవారు. ఒక పర్యాయం హజ్రత్ ఉమర్ (ర) హిమస్ పర్యటనకు వచ్చినప్పుడు అక్కడి బాధ్యులతో ఈ విధంగా పలికారు: "ఇక్కడి పేదవారి జాబితాను నాకు అందించండి. తద్వారా నేను వారికి పింఛన్లు మంజూరు చేస్తాను." జాబితా సిద్ధమవగా, అందులో మొదట హజ్రత్ సఅద్ బిన్ ఆమిర్ (ర) పేరు వ్రాయబడి ఉంది. హజ్రత్ ఉమర్ (ర) "సఅద్ ఎవరు?" అని ప్రశ్నించగా ప్రజలు "హిమస్ గవర్నర్" అని పేర్కొన్నారు. "ఆయన తనకు లభించే జీతాన్ని ఏం చేస్తున్నారు?" అని హజ్రత్ ఉమర్ (ర) పేర్కొనగా "ఆయన వాటిని పేదవారికి పంచుతున్నారు" అని ప్రజలు సమాధా నమిచ్చారు. అది విని హజ్రత్ ఉమర్ (ర) కళ్ళు అశ్రుపూరితాలయ్యాయి. అప్పుడు హజ్రత్ ఉమర్ (ర) ఒక వెయ్యి దీనార్లతో కూడిన సంచిని "ఈ డబ్బును మీ వ్యక్తిగత అవసరాల నిమిత్తం ఖర్చు చేయండి" అని సూచిస్తూ హజ్రత్ సఅద్ బిన్ ఆమిర్ (ర)కు పంపారు. ఆ సంచిని అందుకున్న హజ్రత్ సఅద్ బిన్ ఆమిర్ (ర) నోటి నుంచి అప్రయత్నంగా "ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్" (నిశ్చయంగా మేము అల్లాహ్‌కు చెందినవారము మరియు ఆయన వద్దకే మరలిపోవలసినవారము) అనే వాక్యం వెలువడింది.

భార్య విని ఈ విధంగా ప్రశ్నించింది : "ఏమయింది? ఖలీఫహ్ పరమ పదించారా?"

"లేదు. అంతకంటే పెద్ద సంఘటన జరిగింది" అని సఅద్ (ర) బదులిచ్చారు.

భార్య తిరిగి ప్రశ్నించింది : “ప్రళయానికి సంబంధించిన సూచన ఏమయినా కనిపించిందా?”

“లేదు. అంతకంటే ముఖ్యమైన సంఘటన జరిగింది” అని సఅద్ (ర) బదులిచ్చారు.

భార్య తిరిగి ప్రశ్నించింది : “సరే. అసలు విషయమేమిటో చెప్పండి.”

“ప్రపంచం తన ఉపద్రవాలతో సహా నా ఇంటిలోకి వచ్చేసింది” అని సఅద్(ర) బదులిచ్చారు.

“ఆందోళన చెందకండి. దీనికి ఏదయినా పరిష్కారం ఆలోచించండి” అని భార్య పలికింది.

అప్పుడు హజ్రత్ సఅద్ బిన్ ఆమిర్ (ర) ఆ సంచిని ఒక పక్కన ఉంచి నమాజ్ కొరకు నిలబడ్డారు. రాత్రంతా అల్లాహ్ సన్నిధిలో రోదిస్తూ గడిపేశారు. ఉదయం తన ఇంటి ముందు నుంచి ఇస్లామీయ సైన్యం కొనసాగుతూ ఉండగా ఆయన (ర) చూసి సంచిలోని డబ్బంతటినీ యుద్ధవీరులకు పంచివేశారు.

హజ్రత్ హుజైఫహ్ బిన్ యమాన్(ర) మదాయిన్ గవర్నర్ గా నియుక్తులయినప్పుడు ఆయన (ర) మదాయిన్ వాసులను ఒకచోట సమావేశపరచి ఖలీఫహ్ అయిన హజ్రత్ ఉమర్ (ర) గారి ఫర్మానాను ఈ విధంగా వినిపించారు: “ప్రజలారా! హుజైఫహ్ బిన్ యమాన్(ర) మీ నాయకులుగా నియమించబడుతున్నారు. వారి ఆదేశానికి కట్టుబడి ఉండండి, వారికి విధేయులై మెలగండి. ఆయన మిమ్మల్ని ఏదయితే కోరతారో దానిని ఆయనకు అందించండి.” హజ్రత్ హుజైఫహ్ (ర) ఆ ఫర్మానాను చదవడాన్ని పూర్తి చేసిన తర్వాత ప్రజలు “మీ అవసరాలను మేము తీర్చ గలిగేందుకు గాను మీ అవసరాలేమిటో మాకు తెలియజేయండి” అని అడిగారు. అప్పుడు హజ్రత్ హుజైఫహ్(ర) ఈ విధంగా బదులిచ్చారు : “నేను ఇక్కడ ఉన్నంత వరకు రెండు పూటల తిండి, గాడిద కొరకు మేత కావాలి. అంతకు మించి నేను మీ నుంచి మరేమీ కోరను.”

విశ్వాసులారా! జాగ్రత్త! ఇహలోకం పూర్తిగా మోసం తప్ప మరేమీ కాదు. ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఈ విధంగా పేర్కొన్నాడు : “ఈ ప్రాపంచిక జీవనం కేవలం మోసగించే వస్తువు.” (ఖుర్ఆన్, ఆలి ఇమ్రాన్ :19) ఇక్కడ (ఇహలోకంలో) కనిపించే వస్తువుల వాస్తవికత పట్ల మానవులకు అవగాహన లేదు. ప్రాపంచిక సుఖభోగాల వెనుక, హంగుపొంగుల వెనుక చేదు, దుఃఖాలు ఉన్నాయి. ప్రాపంచిక సౌఖ్యాల వెనుక, వైభవాల వెనుక ఎన్నో పశ్చాత్తాపాలు ఉన్నాయి. దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : “ఇహలోకంలో తియ్యగా ఉండేది పరలోకంలో చేదుగా ఉంటుంది. ఇహలోకంలో చేదుగా ఉండేది పరలోకంలో తియ్యగా ఉంటుంది.” (అహ్మద్, తిబ్రానీ)

జకాత్ ఇవ్వబడని బంగారు, వెండి రాశులు వాస్తవానికి అగ్నిజ్వాలలు. వడ్డీ, లంచం, జూదం, దొంగతనం, లూటీ, ఇంకా ఇతర అధర్మ విధానాల ద్వారా ఆర్జించబడిన డబ్బు వాస్తవానికి డబ్బు కాదు, పాములు, తేళ్ళు! అబద్ధం, మోసం ద్వారా సంపాదించబడే పదవులు, అధికారాలు వాస్తవానికి గౌరవ ప్రతిష్ఠలు కావు, అగ్ని సంకెళ్ళు. అశ్లీలత ప్రాతిపదికన వ్యాపింపజేయబడిన వ్యాపారం వాస్తవానికి వ్యాపారం కాదు, బాధాకరమైన శిక్ష!

ఓ మానవులారా! జాగ్రత్త! ఈ ప్రపంచం కేవలం ఒక తాత్కాలికమైన నివాసం మాత్రమే. ఇక్కడ మీరు కేవలం పరీక్షించబడేందుకు మాత్రమే పంపబడ్డారు. మీ నిజమైన నివాసం స్వర్గమే. దానివైపుకు మీరు అతిత్వరలో వెళ్ళవలసి ఉంది. మీ శాశ్వత శత్రువైన షైతాన్ ఏవిధంగానయితే మీ తల్లిదండ్రులయిన హజ్రత్ ఆదమ్(అ)ను, హజ్రత్ హవ్వా(అ)ను మోసపుచ్చి స్వర్గం నుంచి బహిష్కరించబడేట్లు చేశాడో అదేవిధంగా మిమ్మల్ని కూడా ప్రాపంచిక వ్యామోహంలో మాయోపాయం ద్వారా మోసపుచ్చి స్వర్గానికి దూరం చేయాలని కోరుకుంటున్నాడు. షైతాన్ బహిరంగంగా ఈ విధంగా ఛాలెంజ్ చేశాడు : "నా ప్రభూ! ఏ విధంగానయితే నీవు నన్ను అపమార్గం పట్టించావో అదేవిధంగా ఇక నేను వారి కొరకు భూమిలో మనసును మోహింపజేసే విషయాలను సృష్టించి వారందర్నీ అపమార్గం పట్టిస్తాను." (ఖుర్ఆన్, హిజ్ర్ : 39)

"కనుక ఓ విశ్వాసులారా! జాగ్రత్త! శాపగ్రస్తుడైన షైతాన్ చేసే వాగ్దానాలన్నీ అసత్యమైనవే. అతడి మాయోపాయంలో చిక్కుకోకండి. అతడి మాయోపాయంలో చిక్కుకున్న వ్యక్తులందరినీ అతడు తనతో పాటు నరకానికి తీసుకెళ్ళి తీరతాడు. "గుర్తుంచుకోండి! ఇది బహిరంగ నష్టం." (ఖుర్ఆన్, జుమర్ :15)

## "స్వర్గ సందర్శనం" రచన ఉద్దేశ్యం

పవిత్ర ఖుర్ఆన్‌లో అల్లాహ్ మానవులకు మార్గనిర్దేశనం చేసేందుకై కొన్నిచోట్ల గతించిన జాతులకు సంబంధించిన సంఘటనలను ప్రస్తావించాడు. కొన్నిచోట్ల దైవప్రవక్తల మహిమాన్విత కార్యాలను గురించి ప్రస్తావించాడు. కొన్నిచోట్ల మానవుని పుట్టుక గురించి, మరణం గురించి ప్రస్తావించాడు. కొన్నిచోట్ల విశ్వం, అందులోని వస్తువులను గురించి పేర్కొన్నాడు. కొన్నిచోట్ల సులభగ్రాహ్యమైన ఉపమానాల ద్వారా మార్గదర్శకత్వాన్ని అందజేశాడు. కొన్నిచోట్ల సత్కార్యాల వైపుకు ప్రేరేపించేందుకై స్వర్గం, అందులోని సౌఖ్యాల గురించి పేర్కొన్నాడు. కొన్నిచోట్ల దుష్కార్యాల పర్యవసానాల గురించి హెచ్చరించేందుకై నరకం, అందులోని విభిన్న శిక్షల గురించి ప్రస్తావించాడు. ప్రతి మనిషీ తన వైఖరిననుసరించి, తన స్వభావం ప్రకారం ఆ ఖుర్ఆన్ వాక్యాల ద్వారా మార్గదర్శకత్వాన్ని, సన్మార్గాన్ని గ్రహిస్తాడు.

స్వర్గలోకపు సౌఖ్యాల గురించి చదివిన తర్వాత దానిని పొందే విషయంలో తపనను వ్యక్తంచేయని ముస్లిం ఎవడుంటాడు? వాస్తవానికి ఏ వ్యక్తయితే స్వర్గం పట్ల పటిష్ఠమైన విశ్వాసాన్ని కలిగి ఉంటాడో అతడికి స్వర్గం ముందు ఇహలోకానికి చెందిన పెద్ద పెద్ద

పరీక్షలు లేదా త్యాగాలు ఎంతో చిన్నవిగా కనిపిస్తాయి. హజ్రత్ బిలాల్ (ర), హజ్రత్ ఖబ్బాబ్ బిన్ అరత్ (ర), హజ్రత్ అబూ జర్ గఫ్ఫారీ (ర), హజ్రత్ యాసిర్(ర), హజ్రత్ సుమయ్యా బిన్తె ఖబాత్ (ర), హజ్రత్ హబీబ్ బిన్ జైద్ (ర), హజ్రత్ ఖబీబ్ బిన్ అదీ(ర), హజ్రత్ సల్మాన్ ఫార్సీ (ర), హజ్రత్ అబూ జందల్ (ర), హజ్రత్ ఇమామ్ అహ్మద్ బిన్ హంబల్ (ర.అ), హజ్రత్ ఇమామ్ మాలిక్ (ర) వంటి పూర్వకాలానికి చెందిన ఎందరో మహానుభావులకు సంబంధించిన వృత్తాంతాలు ఇస్లామీయ చరిత్రలో కాంతివంతమైన అధ్యాయాలు.

స్వర్గం పట్ల అభిలాష ప్రాపంచిక జీవితపు పెద్ద పెద్ద పరీక్షలను, త్యాగాలను సులభతరం చేయడంతో పాటు సత్కార్యాల పట్ల ఆసక్తినీ ఇనుమడింపజేస్తుంది. కొన్ని ఉదాహరణలు పేర్కొనబడుతున్నాయి :

హజ్రత్ సఈద్ బిన్ ముసైబ్ (ర) గురించి ఆయన సేవకుడు ఈ విధంగా పేర్కొన్నారు: "నలభై సంవత్సరాల కాలంలో అజాన్ పలుకబడినప్పుడు హజ్రత్ సఈద్ బిన్ ముసైబ్ (ర) మసీదులో ఉండకపోవడమనేది సంభవించలేదు."

హజ్రత్ అబూ తల్హా (ర) తన తోటలో నమాజ్ చదువుతుండగా అకస్మాత్తుగా ఆయన దృష్టి తోటలోని పచ్చని వృక్షాల వైపు, పండ్ల వైపు మళ్ళింది. దానితో ఆయన (ర) నమాజ్ రకాతుల సంఖ్యను మరచిపోయారు. నమాజ్ ముగిసిన తర్వాత ఆయన (ర) దైవప్రవక్త (స) సన్నిధిలో హాజరయి ఆ సంఘటనను వివరించి ఈ విధంగా పలికారు : "ఓ దైవప్రవక్తా (స)! ఏ వస్తువయితే నా నమాజ్‌కు ఆటంకం కలిగించిందో దానిని నేను అల్లాహ్ మార్గంలో దానం చేస్తున్నాను. మీరు దానిని మీ ఇష్టమొచ్చినట్లుగా వినియోగించండి."

హజ్రత్ వకీఅ్ బిన్ జర్రాహ్ (ర.అ) ఈ విధంగా పేర్కొన్నారు : "హజ్రత్ అఅ్మష్(ర) 70 సంవత్సరాల పాటు చదివిన నమాజుల్లో ఏ ఒక్క నమాజ్‌లోనూ 'తక్బీరె ఊలా' (నమాజ్ ప్రారంభించే సమయంలో 'అల్లాహు అక్బర్' అని పలకడం)ను సైతం విడువలేదు."

హజ్రత్ మైమూన్ బిన్ మహ్రాన్ (ర.అ) ఒక పర్యాయం మసీదులో ప్రవేశించగా అప్పటికే జమాఅత్ ముగిసిపోయింది. అప్పుడు అసంకల్పితంగా ఆయన నోటి నుంచి "ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్" అనే వాక్యం వెలువడింది. ఆయన (ర.అ) ఈ విధంగా పలికారు: "జమాఅత్‌తో చదువబడే నమాజ్ నాకు ఇరాక్ సార్వభౌమత్వం కంటే ప్రియమైనది."

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (ర) నమాజ్ కొరకు నిల్చున్నప్పుడు ఒకే రకాతులో ఖుర్‌ఆన్‌లోని 'బఖరహ్', 'ఆలి ఇమ్రాన్', 'నిసా', 'మాఇదహ్' అధ్యాయాల పఠనాన్ని ముగించారు.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ వహబ్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు : "నేను హజ్రత్ సుఫియాన్ సూరీ (ర)ను మగ్రిబ్ నమాజ్ తర్వాత సజ్దా చేస్తుండగా చూశాను. ఇషా నమాజ్ కొరకు అజాన్ ఇవ్వబడినప్పటికీ ఆయన (ర) ఇంకా సజ్దా భంగిమలోనే ఉన్నారు.

ఇటువంటి వృత్తాంతాలెన్నో చరిత్ర పుటల్లో నమోదయి ఉన్నాయి. వాటిని సాధారణ పరిస్థితుల్లో చదివినప్పుడు ఆశ్చర్యమేస్తుంది. అయితే వాస్తవానికి ఏ వ్యక్తయితే స్వర్గలోకపు సౌఖ్యాల పట్ల అవగాహన కలిగి ఉంటాడో అతడి కొరకు ప్రతి పాపం నుంచి రక్షించబడడం, ప్రతి మంచి పనినీ చేయడం ఎంతో సులభతరమయిపోతుంది.

"స్వర్గ సందర్శనం" గ్రంథ రూపకల్పనకు వెనుక గల ముఖ్యోద్దేశ్యమూ ఇదే. అనగా ప్రజల్లో స్వర్గాన్ని పొందే విషయంలో ఆసక్తిని జనింపజేయడం, స్వర్గాన్ని పొందేందుకై పాపాలకు దూరంగా ఉంటూ మంచి పనులు చేయడం పట్ల ఆసక్తిని పెంపొందింపజేయడం మొదలయిన లక్ష్యాల ప్రాతిపదికన ఈ గ్రంథం రచించబడింది. ఈ గ్రంథాన్ని అధ్యయనం చేసిన తర్వాత ఒకరు లేదా ఇద్దరయినా తమ ఆచరణాత్మక జీవితాన్ని మార్చుకున్నట్లయితే ఇన్షా అల్లాహ్ గ్రంథ రచన ముఖ్యోద్దేశ్యం నెరవేరి నట్లవుతుంది.

ప్రియమైన పాఠకులారా! "తఫ్హీముస్సున్నహ్" పరంపరలో భాగంగా "కితాబున్నికాహ్" మరియు 'కితాబుత్తలాఖ్' ల తర్వాత 'కితాబుల్ ఫితన్' (ఉపద్రవాల గ్రంథం)లో భాగంగా క్రమానుగతంగా ' ప్రళయ సూచనలు', 'దజ్జాల్ వెలుగులోకి రావడం', 'క్రీస్తు అవతరణ' మొదలయిన గ్రంథాలను రచించాలని, ఆ తర్వాత 'సూరుకొమ్ము ఊదబడటం', 'హషర్ మైదానం', 'కర్మల లెక్క, కర్మల త్రాసు', 'స్వర్గలోక ప్రవేశం కొరకు సిఫారసు', 'స్వర్గం' మరియు 'నరకం' మొదలయిన అంశాల మీద గ్రంథాలు వెలువరించాలని భావించాను. కానీ ఇస్లామీయ సందేశ ప్రచారంలో భాగంగా ఇతరులకు సందేశమిచ్చేందుకై మొదట 'స్వర్గం' మరియు 'నరకం' అనే అంశాలపై గ్రంథాలు వెలువడాలని కొంతమంది సూచించారు. ఆ కారణంగానే 'నరక విశేషాలు', 'స్వర్గ సందర్శనం' అనే గ్రంథాలు మొదట వెలువడ్డాయి. వీటితర్వాత ఇన్షా అల్లాహ్ 'కితాబుల్ ఫితన్' (ఉపద్రవాల గ్రంథం)కు చెందిన ఒక్కొక్క అధ్యాయమూ ఒక్కొక్క గ్రంథంగా క్రోడీకరించబడే పని మొదలవుతుంది.

**వమా తౌఫీఖీ ఇల్లా బిల్లాహి అలైహి తవక్కల్తు వ ఇలైహి ఉనీబ్.**

హదీసుల ప్రామాణికత విషయంలో షేఖ్ ముహమ్మద్ నాసిరుద్దీన్ అల్బానీ గారి పరిశోధన ద్వారా ప్రయోజనం పొందడం జరిగింది. అధఃసూచికల్లో వీరి గ్రంథాల వివరాలను సంఖ్యారూపంలో సూచించడం జరిగింది. ఉదాహరణకు (2/1059) అనగా రెండవ సంపుటిలో 1059వ హదీసు అని అర్థం.

ఈ గ్రంథంలోని విశిష్టతలు, ప్రయోజనాలన్నీ పరమోన్నతుడైన అల్లాహ్ కారుణ్య ఫలితాలు. ఇక గ్రంథంలో దొర్లిన తప్పులన్నీ నా అస్తిత్వపు చెడుగుల ఫలితాలు. హదీసుల గ్రంథాల్లో హదీసుల క్రమం, అధ్యాయాల విభజన, వివరణ, అనువాదం, వ్యాఖ్యానం మొదలయిన విషయాల్లో జరిగిన ప్రతి చిన్న లేదా పెద్ద తప్పు పట్ల నేను అల్లాహ్ సన్నిధిలో క్షమాపణ వేడుకుంటున్నాను. అలాగే అల్లాహ్ ఇహపరలోకాల్లో నా పాపాలు మరియు నేరాలతో కూడిన సుదీర్ఘమైన జాబితాను తన కారుణ్యపు పరదాలో మరుగుపరుస్తాడని ఆయన అమేయ కారుణ్యం పట్ల  నమ్మకముం చుతున్నాను. నిస్సందేహంగా ఆయన గొప్ప దాత, కనికరించేవాడు, రారాజు, మేలు చేసేవాడు, వాత్సల్యం చూపేవాడు మరియు కరుణించేవాడు.

చివరగా హదీసు గ్రంథాల క్రోడీకరణలో, అనువాదంలో, ప్రచురణలో, ప్రచారంలో ఏదో ఒకవిధంగా పాలుపంచుకున్న మహానుభావులందరికీ నేను కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. అల్లాహ్ వారందరినీ ప్రాపంచిక ఉపద్రవాల నుంచి రక్షించుగాక, తన రక్షణ వలయంలో ఉంచుగాక! అలాగే పరలోకంలో మనందరినీ తన కారుణ్యం ద్వారా సౌఖ్యాలతో కూడిన స్వర్గాలలోకి ప్రవేశింప జేయుగాక! ఆమీన్!

رَبَّنَا تَقَبَّلْ مِنَّا اِنَّکَ اَنْتَ السَّمِیْعُ الْعَلِیْمُ

**రబ్బనా తఖబ్బల్ మిన్నా ఇన్నక అన్త స్సమీఉల్ అలీమ్**

**ముహమ్మద్ ఇఖ్‌బాల్ కైలానీ అఫల్లాహు అన్హు**

24, రబీవుల్ అవ్వల్, 1420 హిజ్రీ, 8 జూలై, 1999
9, రబీవుల్ అవ్వల్, 1428 హిజ్రీ, 29 మార్చి, 2007

# అల్లాహుమ్మ రబ్బనా

# ఓ అల్లాహ్! ఓ మా ప్రభువా!

ఏది తప్ప ఆరాధించదగిన అస్తిత్వం మరొకటి లేదో ఆ అస్తిత్వమా! తన అస్తిత్వంలోనూ, గుణాల్లోనూ ఏకత్వాన్ని కలిగియున్న అస్తిత్వమా! తన అస్తిత్వంలోనూ, పోషకత్వంలోనూ ఏకత్వాన్ని కలిగియున్న అస్తిత్వమా! తన గొప్పతనంలోనూ, ఔన్న త్యంలోనూ సాటిలేనిదయిన అస్తిత్వమా! మొట్టమొదటిదయిన, చిట్టచివరిదయిన అస్తిత్వమా! బహిర్గతమై ఉన్న, మరుగున ఉన్న అస్తిత్వమా! నిత్య జీవమును కలిగిన అస్తిత్వమా! ప్రసాదించే, క్షమించే అస్తిత్వమా! అన్నిటినీ చూడగలిగే, అన్నింటికి సంబం ధించిన జ్ఞానాన్ని కలిగియుండే అస్తిత్వమా! అనుగ్రహించే, పాపాలను మరుగుపరిచే అస్తిత్వమా! ఆధిక్యతను చూపే, పాపాలను క్షమించే అస్తిత్వమా! సమస్త జ్ఞానాన్ని కలిగియున్న, వివేచనతో కూడుకున్న అస్తిత్వమా! కరుణించే, కనికరించే అస్తిత్వమా! అన్ని రకాల స్తోత్రాలకూ (ఎంతటి స్తోత్రం వల్ల అల్లాహ్ ఇష్టపడతాడో, సంతుష్ఠ దవుతాడో అంతటి స్తోత్రం) అర్హమైన అస్తిత్వమా!

اَللّٰھُمَّ رَبَّنَا لَکَ الْحَمْدُ حَمْداً کَثِیْراً طَیِّبَاً مُّبَارَکاً فِیْہِ کَمَا یُحِبُّ رَبُّنَا وَیَرْضیٰ

**(అల్లాహుమ్మ రబ్బనా లకల్ హమ్‌దు హమ్‌దన్ కసీరన్ తయ్యిబన్ ముబారకన్ ఫీహి కమా తుహిబ్బు రబ్బనా వ యర్‌జా)**

ఓ సర్వలోకాల ప్రభువా! నీవే విశ్వాన్ని సృజించేవాడివి, నీవే మా యజమా నివి, పరిపోషకుడివి, నీవే గడచిపోయిన రాత్రింబవళ్ళను గణించేవాడివి, నీవే వృక్షాల నుంచి రాలిపడే ఆకులకు సంబంధించిన జ్ఞానాన్ని కలిగియున్నవాడివి, నీవే ఇసుక రేణువులను గణించగలవాడివి, నీవే భూమ్యాకాశాలను కాంతితో నింపేవాడివి, నీవే నీ దాసుల చిన్న, పెద్ద ఆచరణలను స్పష్టమైన గ్రంథంలో వ్రాసి భద్రపరిచేవాడివి, నీవే సన్మార్గం చూపేవాడివి, నీవే హృదయాలలో దాగియున్న రహస్యాలను ఎరిగిన వాడివి, మనసుల్లో చెలరేగే చెడ్డ ప్రేరణలను ఎరిగినవాడివి, నీవే ప్రళయదినాన అందరినీ రెండవసారి జీవింపజేసి వారి లెక్క తీసుకునేవాడివి! నీవు తప్ప ఆరాధ్యు డెవడూ లేడు! నీ అస్తిత్వమే అన్నిరకాల స్తోత్రాలకు అర్హమైనది (ఎంతటి స్తోత్రం వల్ల అల్లాహ్ ఇష్టపడతాడో, సంతుష్ఠుడవుతాడో అంతటి స్తోత్రం)

**(అల్లాహుమ్మ రబ్బనా లకల్ హమ్‌దు హమ్‌దన్ కసీరన్ తయ్యిబన్ ముబారకన్ ఫీహి కమా తుహిబ్బు రబ్బనా వ తర్‌జా)**

ఓ కరుణామయుల్లో కెల్లా మహా కరుణామయా! మేము నీ సన్నిధిలో మా పాపాలను అంగీకరిస్తున్నాము, మేము స్వయంగా మా పైనే దౌర్జన్యానికి పాల్పడ్డాము, మా నుదుళ్ళు నీ చేతిలో ఉన్నాయి, నీ ప్రతి ఆజ్ఞ మాపై అమలవుతుంది. ఒకవేళ నీవు మమ్మల్ని కరుణించకపోతే మేము నష్టపోయేవారిలో చేరి ఉంటాము. నిస్సం దేహంగా నీ కారుణ్యం మా పాపాలతో పోలిస్తే ఎంతో విస్తృతమైనది. అలాగే నీ ఆజ్ఞలు నిస్సందేహంగా సత్యమైనవి. నీ కారుణ్యం నీ ఆగ్రహం మీద ఆధిపత్యాన్ని కలిగి వుంది. ఓ మా ప్రభువా! మేము ముందుకు పంపుకున్న పాపాలు, వెనుక విడచిపెట్టిన పాపాలు, దాగియుండి చేసిన పాపాలు, బహిరంగంగా చేసిన పాపాలు, మేము గుర్తుంచుకోని, నీవు ఎరిగిన మా పాపాలన్నింటినీ క్షమించు. నీవు ప్రతి వస్తువుపై అధికారం గలవాడివి. నీవు తప్ప మా పాపాలను క్షమించేవాడెవడూ లేడు. ఓ మా ప్రభువా! నీవు ఒక్కడివే! నీకు సహచరులెవరూ లేరు. నీ పవిత్రమైన అస్తిత్వమే అన్నిరకాల స్తోత్రాలకూ అర్హమైనది. (ఎంతటి స్తోత్రం వల్ల అల్లాహ్ ఇష్టపడతాడో, సంతుష్టుడవుతాడో అంతటి స్తోత్రం.)

**(అల్లాహుమ్మ రబ్బనా లకల్ హమ్దు హమ్దన్ కసీరన్ తయ్యిబన్ ముబారకన్ ఫీహి కమా తుహిబ్బు రబ్బనా వ యర్జా)**

మహోన్నతుడా! గౌరవనీయుడా! మేము నీ అస్తిత్వం, గుణగణాల ద్వారా నీ అనుగ్రహాన్ని అర్థిస్తున్నాము. నీ కాంతిమయ వదనపు సౌందర్యవైభవాల మధ్యవర్తిత్వంతో నీ వరానుగ్రహాలతో కూడిన స్వర్గాన్ని యాచిస్తున్నాము. నీ కారుణ్యకటాక్షాల మధ్యవర్తిత్వంతో నీ నరకం నుంచి రక్షణ కోరుకుంటున్నాము. క్షమాపణ, జాలి, కారుణ్యాలకు నీవే అధిపతివి. నీవు తప్ప మరెవరూ వాటికి అధిపతులు కారు. నీవు ప్రతి వస్తువు పైనా అధికారం కలవాడివి. మరెవరూ అధికారులు కారు.

**అల్లాహుమ్మ ఇన్నా నస్అలుక రిజ్వానక వల్ జన్నత వ నఊజు బిరహ్మతిక మినన్నార్**

"ఓ అల్లాహ్! మేము నీ నుంచి నీ అనుగ్రహాన్ని, స్వర్గాన్ని అర్థిస్తున్నాము. అలాగే నీ కారుణ్యం ద్వారా అగ్ని నుంచి రక్షణ కోరుకుంటున్నాము."

**وصلی اللہ علی نبینا محمد ﷺ وعلی آلہ واصحابہ وسلم تسلیما کثیرا**

**వ సల్లల్లాహు అలా నబియ్యినా ముహమ్మదిం వ్వ అలా ఆలిహీ**
**వ అస్హాబిహీ వ సల్లమ తస్లీమన్ కసీరన్ కసీరా**

بسم الله الرحمن الرحيم

# స్వర్గలోకపు ఉనికి నిరూపణ

## అంశం : 1

### రమజాన్ మాసంలో స్వర్గలోకపు ద్వారాలు తెరువబడతాయి.

హజ్రత్ అబూ హురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఒక సందర్భంలో ఇలా పేర్కొన్నారు: "రమజాన్ మాసం వచ్చినప్పుడు స్వర్గలోకపు ద్వారాలు తెరువబడతాయి, నరకలోకపు ద్వారాలు మూయబడతాయి, షైతానులు సంకెళ్ళలో బంధించబడతారు." (ముస్లిమ్)[1]

## అంశం : 2

### సమాధిలో స్వర్గీయుడైన వ్యక్తికి స్వర్గంలో అతడి నివాసం చూపించబడుతుంది.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఒక సందర్భంలో ఇలా పేర్కొన్నారు : "మీలో ఎవరయినా మరణించినప్పుడు అతడికి ఉదయం పూట, సాయంత్రం పూట అతడి నివాసం చూపించడం జరుగుతుంది. ఒకవేళ అతడు స్వర్గలోకవాసి అయితే స్వర్గంలో అతడి నివాసం, నరకవాసి అయితే నరకంలో అతడి నివాసం చూపించబడుతుంది." (బుఖారీ)[2]

## అంశం : 3

### దైవప్రవక్త (స) స్వర్గంలో ఉమర్ (ర) ఇంటిని చూశారు.

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు : మేము దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) సన్నిధిలో హాజరయి ఉన్నాము. దైవప్రవక్త (స) ఇలా పేర్కొన్నారు: "నేను నిద్రలో ఉండగా నేను స్వర్గంలో ఉన్నట్లుగా కనుగొన్నాను. నేను ఒక భవంతి లోపల ఒక మూల ఒక స్త్రీ వుజూ చేస్తుండగా చూసి 'ఈ మహలు ఎవరిది?' అని ప్రశ్నించాను. ఆమె 'ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర) గారిది' అప్పుడు నేను ఉమర్ (ర) బిడియాన్ని గుర్తుకు తెచ్చుకొని వెనక్కి మరలాను." అది విని హజ్రత్ ఉమర్ (ర) రోదిస్తూ ఇలా పలికారు: 'ఓ దైవప్రవక్తా(స)! నేను మిమ్మల్ని చూసి బిడియపడతానా?' (బుఖారీ)[3]

---

**అథః సూచికలు :**

1. కితాబుస్సియామ్
2. కితాబ్ బదఉల్ ఖలఖ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతిల్ జన్నహ్
3. కితాబ్ బదఉల్ ఖలఖ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతిల్ జన్నహ్

# స్వర్గం పేర్లు

## అంశం : 4

**స్వర్గానికి ఒక పేరు 'దారుస్సలామ్' (సురక్షిత నిలయం)**

"అల్లాహ్ మిమ్మల్ని దారుస్సలామ్ (శాంతి నిలయం, అనగా స్వర్గం) వైపుకు ఆహ్వాని స్తున్నాడు. (మార్గదర్శకత్వం ఆయన చేతుల్లోనే ఉంది) ఎవరినయితే ఆయన కోరుకుంటాడో వారికి సరియైన మార్గం చూపుతాడు." (ఖుర్ఆన్, యూనుస్ : 25)

## అంశం : 5

**స్వర్గానికి రెండవ పేరు 'దారుల్ ముత్తఖీన్' (దైవభీతిపరుల నిలయం)**

"దైవభీతిపరులను 'మీ ప్రభువు తరపు నుండి అవతరించిన ఈ వస్తువు ఏమిటి?' అని అడిగినప్పుడు వారు 'అత్యుత్తమమైనది అవతరించింది' అని సమాధానమిస్తారు. ఇటువంటి సజ్జనులకు ఈ ప్రపంచంలో కూడా మేలు జరుగుతుంది, ఇక పరలోక గృహమైతే తప్పనిసరిగా వారి కొరకు ఎంతో మేలైనది. భయభక్తులు కలవారిది ఎంతో మంచి ఇల్లు." (ఖుర్ఆన్, నహ్ల్ : 30)

## అంశం : 6

**స్వర్గానికి మూడవ పేరు 'దారుల్ ఖరార్' (విశ్రాంతి నిలయం)**

"నా జాతి ప్రజలారా! ఈ ప్రాపంచిక జీవితం తాత్కాలికం, శాశ్వత విశ్రాంతి నిలయం పరలోకమే." (ఖుర్ఆన్, మూమిన్ :39-40)

## అంశం : 7

**స్వర్గానికి నాల్గవ పేరు 'మఖామె అమీన్' (శాంతి నిలయం)**

"దైవభీతిపరులు శాంతిభద్రతలు గల ప్రదేశంలో, ఉద్యానవనాల్లో, సెలయేళ్ళలో ఉంటారు." (ఖుర్ఆన్, దుఖాన్ : 51-52)

## అంశం : 8

**స్వర్గం 'దారుల్ ఆఖిరహ్' (పరలోక నివాసం) అని కూడా పిలువబడింది.**

"నిశ్చయంగా పరలోక గృహం భయభక్తుల వైఖరిని అవలంబించిన వారి కొరకు శ్రేష్ఠతరం. ఇప్పుడు కూడా మీరు అర్థం చేసుకోరా?" (ఖుర్ఆన్, యూసుఫ్ :109)

## అంశం : 9

**స్వర్గాన్ని 'జన్నాతున్నఈమ్' (వరాలతో నిండిన స్వర్గాలు) అని కూడా పిలుస్తారు.**

"ముందు వారైతే ముందున్నవారే. వారే సాన్నిధ్యులు, సకల వరాలతో నిండియున్న స్వర్గవనాలలో ఉంటారు." (ఖుర్‌ఆన్, వాఖిఅహ్ :10-12)

## అంశం : 10

**స్వర్గాన్ని 'జన్నాతె అద్న్' (నిత్య వసంత స్వర్గాలు) అని కూడా పిలుస్తారు.**

"విశ్వాసుల కొరకు నిత్యహరిత వనాలు ఉన్నాయి; వాటి క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి." (ఖుర్‌ఆన్, కహఫ్ : 31)

# ఖుర్ఆన్ వెలుగులో స్వర్గం

**అంశం : 11**

**విశ్వసించిన తర్వాత మంచి పనులు చేసేవారు స్వర్గంలోకి ప్రవేశిస్తారు.**

**అంశం : 12**

**స్వర్గలోకపు పండ్లు పేర్లలో, స్వరూపాలలో ఇహలోకపు పండ్లను పోలియుంటాయి.**

**అంశం : 13**

**స్వర్గలోకపు స్త్రీలు బాహిరమైన మాలిన్యాలకు (ఉదా: ఋతుస్రావం వంటివి), అంతర్గత మాలిన్యాలకు (ఉదా: కోపం, పరోక్షనింద, అసూయ వంటివి) అతీతులై ఉంటారు.**

**అంశం : 14**

**స్వర్గలోకపు జీవితం ఎన్నటికీ క్షీణించనిదై ఉంటుంది.**

"ఓ ప్రవక్తా! ఈ గ్రంథాన్ని విశ్వసించి తమ నడవడికను తీర్చిదిద్దుకునే వారికి శుభవార్త వినిపించు. కాలువలు ప్రవహించే ఉద్యానవనాలు వారి కొరకు సిద్ధంగా ఉన్నాయి. ఆ వనాల్లోని పండ్లు ఆకారంలో భూలోకంలోని పండ్లను పోలి ఉంటాయి. తినడానికి ఏవయినా పండ్లు ఇవ్వబడినప్పుడల్లా వారు 'ఇలాంటి పండ్లే పూర్వం భూలోకంలో మాకు ఇవ్వబడేవి' అంటారు. అక్కడ వారి కొరకు పవిత్రమైన భార్యలు ఉంటారు. వారు అక్కడే శాశ్వతంగా ఉంటారు."

(ఖుర్ఆన్, 'బఖరహ్ : 25)

**అంశం : 15**

**స్వర్గవాసులు ప్రళయదినాన అన్నిరకాల అవమానాల నుంచి సురక్షితంగా ఉంటారు.**

**అంశం : 16**

**స్వర్గలోకవాసులకు స్వర్గంలో అల్లాహ్ దర్శనభాగ్యం లభిస్తుంది.**

"ఎవరయితే మంచిని చేసే విధానాన్ని అవలంబిస్తారో, వారికి మంచి కలుగుతుంది. అలాగే ఎక్కువ అనుగ్రహం కూడా లభిస్తుంది. వారి ముఖాలపై నల్లదనం గానీ, అవమానం గానీ కమ్ముకోవు. వారు స్వర్గానికి అర్హులు. అక్కడ వారు శాశ్వతంగా ఉంటారు."

(ఖుర్ఆన్, యూనుస్ : 26)

## అంశం : 17

**విశ్వాసుల్లో ఎవరిలోనయితే ఇహలోకంలో పరస్పర ద్వేషభావం లేదా అసూయ ఉండేవో స్వర్గంలోకి ప్రవేశించిన తర్వాత అల్లాహ్ వాటిని అంతమొందించేస్తాడు.**

"వీరి మనసుల్లో పరస్పరం ఏ కాస్త శత్రు భావం ఉన్నా దాన్ని మేము తొలగిస్తాము. వీరి క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. వారు ఇలా పలుకుతారు: 'మాకు ఈ మార్గాన్ని చూపిన అల్లాహ్ కొరకే స్తోత్రాలు. ఆయనే గనుక మాకు మార్గం చూపి ఉండకపోయి నట్లయితే. స్వయంగా మేము మార్గం పొంది ఉండేవారము కాదు. మా ప్రభువుచే పంపబడిన ప్రవక్తలు వాస్తవంగా సత్యాన్నే తీసుకు వచ్చారు. అప్పుడు వారికి ఈ వాణి వినిపిస్తుంది, 'మీరు చేస్తూ ఉండిన పనులకు ప్రతిఫలంగా, మీరు వారసులుగా చేయబడిన స్వర్గం మీకు ప్రతిఫలంగా అందజేయబడింది." (ఖుర్ఆన్, ఆరాఫ్ :43)

## అంశం : 18

**స్వర్గంలో స్వర్గవాసులు ఆకలిదప్పులను ఏనాడూ అనుభూతి చెందరు.**

## అంశం : 19

**స్వర్గంలో చలి తీవ్రతా ఉండదు, వేడి తీవ్రతా ఉండదు. నిత్య వసంత ఋతువు ఉంటుంది.**

"ఓ ఆదమ్! అక్కడ (స్వర్గంలో) మీరు పస్తులూ ఉండరు, దిగంబరులుగానూ ఉండరు. దప్పికా, ఎండా మిమ్మల్ని వేధించవు." (ఖుర్ఆన్, తాహా : 118-119)

## అంశం : 20

**తల్లిదండ్రులు, భార్యాబిడ్డలతో కూడిన మంచి కుటుంబానికి చెందిన సభ్యులం దరినీ స్వర్గంలో ఒక్కచోట చేర్చివేయడం జరుగుతుంది.**

"స్వయంగా వారు (స్వర్గవాసులు) కూడా వాటిలోకి (శాశ్వతమైన స్వర్గవనాల్లోకి) ప్రవేశిస్తారు. వారి తాత ముత్తాతల్లో, వారి భార్యల్లో, వారి సంతానంలో ఎవరైతే సజ్జనులో వారు కూడా వారితో అక్కడికి పోతారు. ప్రతి ద్వారం నుంచీ దైవదూతలు వచ్చి ఇలా పలుకుతారు: 'మీ పై శాంతి వర్షించుగాక! ప్రపంచంలో మీరు సహనంతో వ్యవహరించిన దాని కారణంగా ఈ రోజు మీరు దీనికి అర్హులయ్యారు.' ఎంత మంచిది ఈ పరలోక గృహం." (ఖుర్ఆన్, రాద్ : 23-24)

**అంశం : 21**

**స్వర్గంలో స్వర్గలోకవాసులు ఏ విధంగానూ శ్రమించే అవసరముండదు.**

"అక్కడ వారు ఏ శ్రమకూ గురికారు, అక్కడి నుంచి వారు బహిష్కరిం చనూబడరు."

(ఖుర్ఆన్, హిజ్ర్: 48)

**అంశం : 22**

**స్వర్గంలో స్వర్గలోకవాసులతో ఎంతో మర్యాదగా వ్యవహరించడం జరుగుతుంది.**

**అంశం : 23**

**స్వర్గలోకపు సేవకులు స్వర్గవాసుల సేవలో తెల్లని రంగు గల మధురమైన మధుపాత్రలను సమర్పిస్తారు.**

**అంశం : 24**

**స్వర్గలోకపు మధువు వివేకాన్నీ, బుద్ధిని చెడగొట్టదు, మత్తు కలిగించదు.**

**అంశం : 25**

**కోడిగుడ్డు గుల్ల క్రింద దాగి ఉండే పలుచని పొరకంటే మెత్తని, నాజూకైన, సుందరమైన పెద్ద కళ్ళు గల దేవలోక కన్యలు స్వర్గలోకవాసులకు కానుకగా అందించబడతారు.**

"వారి కొరకు అందరూ ఎరిగిన ఆహారమే ఉన్నది, రుచికరమైన అన్ని రకాల పదర్థాలూ ఉన్నాయి, భోగభాగ్యాలతో విలసిల్లే ఉద్యానవనాలు ఉన్నాయి. వాటిలో వారు సగౌరవంగా ఉంచబడతారు. ఆసనాలపై దిండ్లు ఆనించుకొని ఎదురెదురుగా కూర్చొని ఉంటారు మద్యపు చెలమల నుండి పాత్రలు మాటి మాటికీ నింపబడి వారి మధ్య తిప్పబడతాయి. మెరిసిపోతున్న మధువు, త్రాగేవారికి అది ఎంతో మధురం. దానివల్ల వారి శరీరానికి నష్టం ఉండదు, వారి బుద్ధీ చెడిపోదు. వారి దగ్గర తమ చూపులను నిగ్రహించుకునే అందమైన కళ్ళు గల స్త్రీలు ఉంటారు. వారు గ్రుడ్డు గుల్ల క్రింద దాగి ఉండే పొరలాంటి కోమ లాంగులు."

(ఖుర్ఆన్, సాఫ్ఫాత్ :41- 49)

**అంశం : 26**

**స్వర్గవాసుల కొరకు 'అదన్' (స్వర్గంలోని ఒక కోట పేరు) తోటలు ఉంటాయి. వాటి ద్వారాలు వారి కొరకు ఎల్లప్పుడూ తెరువబడి ఉంటాయి.**

**అంశం : 27**

**స్వర్గవాసులు క్షణంలోనే ఎన్నో పండ్లను ఆరగించి, పానీయాలను తాగేస్తారు. అవి వెంటనే జీర్ణమయిపోతాయి.**

**అంశం : 28**

**స్వర్గలోక కన్యలు అందమైనవారుగా, బిడియస్తులుగా, పెద్ద పెద్ద కళ్ళతో తమ భర్తలకు సమానమైన వయస్సును కలిగి ఉంటారు.**

**అంశం : 29**

**స్వర్గలోకపు వరానుగ్రహాలు క్షీణించవు, అంతరించవు.**

"ఇది ఒక ప్రస్తావన : (ఇక వినండి) భయభక్తులు కలవారి కొరకు నిశ్చయంగా ఉత్తమ నివాసం ఉన్నది; శాశ్వతమైన స్వర్గవనాలు ఉన్నాయి; వాటి ద్వారాలు వారి కొరకు తెరువబడి ఉంటాయి; వాటిలో వారు దిండ్లకు ఆనుకుని కూర్చుంటారు; ఎక్కువగా పండ్లనూ పానీయాలనూ కోరుతూ ఉంటారు; వారి ప్రక్కన సమవయస్కులైన, బిడియస్తులయిన భార్యలు ఉంటారు. ఈ వస్తువులే లెక్కల రోజున మీకు ప్రసాదించబ డతాయని వాగ్దానం చేయబడుతోంది. ఇది మా ప్రసాదం, ఇది అనంతం." (ఖుర్‌ఆన్, సాద్ : 49-54)

**అంశం : 30**

**స్వర్గవాసులు తమ పుణ్యవతులైన భార్యలతో కలిసి స్వర్గంలో సుఖవంతమైన జీవితం గడుపుతారు.**

**అంశం : 31**

**స్వర్గలోకపు జంట ముందు బంగారు పళ్ళేలు ఉంచబడతాయి. వాటిలో వివిధ రకాల పండ్లు, ఆహారపదార్థాలు ఉంటాయి. అలాగే బంగారు గిన్నెలు ఉంచబ డతాయి. వాటిలో వివిధ రకాల పానీయాలు ఉంటాయి.**

**అంశం : 32**

**స్వర్గంలో హృదయానికి, కళ్ళకు ఆనందాన్ని చేకూర్చే ప్రతి వస్తువూ ఉంటుంది**

**అంశం : 33**

**స్వర్గలోకవాసులను ప్రోత్సహించేందుకై గౌరవపూర్వకంగా ఈ విధంగా పేర్కొ**

**నబడుతుంది: "ఈ స్వర్గం,ఇందులోని వరానుగ్రహాలన్నీ మీ ఆచరణలకు ప్రతిఫలంగా అల్లాహ్‌చే మీకు ప్రసాదించబడ్డాయి."**

"మీరూ, మీ భార్యలూ స్వర్గంలో ప్రవేశించండి, మిమ్మల్ని ఆనందింపజేయడం జరుగుతుంది. వారి మధ్య బంగారు పళ్ళేలూ, గిన్నెలూ తిప్పబడతాయి. మనస్సు ఇష్టపడే, కళ్ళకు ఇంపుగా ఉండే ప్రతి వస్తువూ అక్కడ ఉంటుంది. వారితో ఇలా పేర్కొనబడుతుంది: 'ఇక మీరు ఇక్కడ శాశ్వతంగా ఉంటారు. మీరు ప్రపంచంలో చేసిన కర్మల కారణంగా మీరు ఈ స్వర్గానికి వారసులయ్యారు.'' (ఖుర్‌ఆన్, జుఖ్‌రుఫ్ :70-73)

## అంశం : 34

**స్వర్గంలో దుఃఖం గానీ, కష్టం గానీ, ఆందోళన గానీ ఉండవు. అన్నివేళలా, అన్నిచోట్లా సుఖసంతోషాలు, శాంతిశ్రేయాలూ ఉంటాయి.**

## అంశం : 35

**స్వర్గవాసుల వస్త్రాలు పల్చని, మందపాటి పట్టుతో తయారుచేయబడి ఉంటాయి.**

## అంశం : 36

**అందమైన, పెద్ద, పెద్ద కళ్ళు గల తెల్లని స్త్రీలతో స్వర్గవాసుల వివాహం జరిపించబడుతుంది.**

## అంశం : 37

**స్వర్గలోకవాసులు ఎన్నటికీ మరణించరు. వారు శాశ్వత జీవితాన్ని పొందుతారు.**

## అంశం : 38

**ప్రారంభంలో స్వర్గంలోకి ప్రవేశించేవారు నరకలోకపు శిక్ష నుంచి సంపూర్ణంగా రక్షణ పొంది ఉంటారు.**

## అంశం : 39

**అల్లాహ్ కరుణాకటాక్షాలతో తప్ప స్వర్గంలోకి ప్రవేశించడం సాధ్యం కాదు.**

## అంశం : 40

**స్వర్గంలోకి ప్రవేశించడమే నిజమైన సాఫల్యం.**

"దైవభీతి కలవారు శాంతి భద్రతలు కల ప్రదేశంలో ఉంటారు. ఉద్యానవనాల్లో,

సెలయేళ్ళలో, సన్నని పట్టు వస్త్రాలు, జరీ పట్టు వస్త్రాలు ధరించి, ఒకరికొకరు ఎదురుగా కూర్చుండి ఉంటారు. ఇలా ఉంటుంది వారి దర్పం. పసిమిరంగు మేనులూ, అందమైన విశాలమైన కళ్ళు గల స్త్రీలను వారికి ఇచ్చి వివాహం చేస్తాము. అక్కడ వారు రుచికరమైన అన్ని రకాల పదార్థాలనూ నిస్సంకోచంగా అడుగుతారు. అక్కడ వారు మరణాన్ని ఎన్నటికీ రుచి చూడరు. ప్రపంచంలో వచ్చిన మరణమే మరణం. అల్లాహ్ తన కృపతో వారిని నరక శిక్ష నుండి కాపాడుతాడు. ఇదే గొప్ప సాఫల్యం.'' (ఖుర్‌ఆన్, దుఖాన్: 51-57)

**అంశం : 41**

**స్వర్గంలో పరిశుభ్రమైన, పవిత్రమైన నీటి కాలువలు, పాలతో ప్రవహించే కాలువలు, మధువుతో కూడిన కాలువలు, తేనె కాలువలు ఉంటాయి. వాటి ప్రవాహాలోన్ని స్వర్గలోకవాసులు త్రాగుతారు.**

**అంశం : 42**

**స్వర్గలోకపు సెలయేళ్ళ పానీయాల రంగు, రుచి ఎల్లప్పుడూ ఒకేవిధంగా ఉంటాయి.**

**అంశం : 43**

**స్వర్గలోకవాసులను అల్లాహ్ పాపాలన్నింటి నుంచి పవిత్రం కావించి స్వర్గంలోకి ప్రవేశింపజేస్తాడు.**

''భయభక్తులు కలవారికి వాగ్దానం చేయబడిన స్వర్గపు వైభవం ఇలా ఉంది, అందులో నిర్మలమైన నీటి కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి, ఏ మాత్రం మారని రుచి గల పాల కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి, సేవించేవారికి మధురంగా ఉండే మధువుతో కూడిన కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. అందులో వారి కొరకు అన్ని రకాల పండ్లు ఉంటాయి. ఇంకా వారి ప్రభువు తరఫు నుంచి క్షమాభిక్ష కూడా.'' (ఖుర్‌ఆన్, ముహమ్మద్ :15)

**అంశం : 44**

**సజ్జనులైన సంతానాన్ని సజ్జనులైన వారి పూర్వీకులతో కలిపివేయడం జరుగుతుంది. ఒకవేళ వారిలో స్థాయీ భేదాలున్నప్పటికీ అందరూ సంతోషంగా ఉండేందుకై, ఒకరినొకరు చూసుకున్నప్పుడు వారి కన్నులు చల్లబడేందుకై తక్కువ స్థాయి గలవారి స్థాయిని అల్లాహ్ తన కరుణాకటాక్షాల ద్వారా పెంచి ఉన్నత స్థాయి వారితో సమానంగా చేసివేయడం జరుగుతుంది.**

''విశ్వాసుల సంతానం కూడా, విశ్వాసం విషయంలో దాదాపు వారి అడుగు జాడల్లో నడచి ఉంటే, వారి ఈ సంతానాన్ని కూడా మేము (స్వర్గంలో) వారితో కలుపుతాము.

ఇంకా వారి కర్మలలో వారికి ఏమాత్రం కలుగజేయము. ప్రతి వ్యక్తీ తాను సంపాదించిన దానికి తాకట్టుగా ఉన్నాడు." (ఖుర్‌ఆన్, తూర్ :21)

## అంశం : 45

**స్వర్గలోకవాసులకు రుచికరమైన పండ్లతో పాటు వారు ఇష్టపడే మాంసం కూడా అందించబడుతుంది.**

## అంశం : 46

**స్వర్గలోకవాసులు అన్నపానీయాలను సేవించే సమయంలో ఒకరి నుంచి మరొకరు లాక్కుంటూ వినోదిస్తారు.**

## అంశం : 47

**స్వర్గలోకవాసుల సేవకులైన బాలురు భద్రపరచబడిన సుందరమైన ముత్యాల వలె అందంగా ఉంటారు.**

"మేము వారు కోరిన విధంగా వారికి అన్ని రకాల పండ్లు, మాసం పుష్కలంగా ఇస్తూ ఉంటాము. వారు ఒకరినుండి ఒకరు మధుపాత్రలను అమితోత్సాహంతో అందుకుంటూ ఉంటారు. దానిని సేవించడం వల్ల ప్రేలాపనలూ ఉండవు, చెడు నడతా ఉండదు. వారి (సేవ) కొరకే ప్రత్యేకించబడిన, దాచబడిన ఆణిముత్యాల వంటి అందమైన బాలురు వారి సేవలో పరుగెడుతూ అటూ ఇటూ తిరుగుతూ ఉంటారు." (ఖుర్‌ఆన్, తూర్ :22 - 24)

## అంశం : 48

**స్వర్గంలో సాన్నిధ్యుల కొరకు (అల్లాహ్‌కు ప్రీతిపాత్రులైన, ప్రత్యేకమైన సజ్జనులు) రెండు రెండు తోటలు ఉంటాయి. అవి వరానుగ్రహాల ప్రాతిపదికన సాధారణ విశ్వాసుల తోటల కంటే ఉత్తమంగా ఉంటాయి.**

## అంశం : 49

**రెండు తోటల్లోనూ రెండు కాలువలు, అన్నిరకాల రుచికరమైన పండ్లు, పట్టు సింహాసనాలు ఉంటాయి.**

## అంశం : 50

**స్వర్గవాసుల భార్యలు ఎంతో బిడియస్తులుగా, పవిత్రులుగా, ముత్యాల వలె మెరుస్తూ అందంగా, కేవలం తమ భర్తలకు ఆతిథ్యమిచ్చేవారుగా ఉంటారు**

## అంశం : 51

**స్వర్గవాసుల భార్యలను స్వర్గంలోకి ప్రవేశించడానికి ముందు తిరిగి కొత్తగా పుట్టించడం జరుగుతుంది. ఆ పుట్టుక తర్వాత వారిని ఏ మానవుడూ (లేదా జిన్నాతుల భార్యలను ఏ జిన్నూ) తాకి ఉండడు.**

“తన ప్రభువు సన్నిధిలో హాజరు కావలసి ఉంటుందనే భయం కలిగి ఉండే ప్రతి వ్యక్తికీ రెండు తోటలు లభిస్తాయి. కనుక మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు నిరాకరిస్తారు? పచ్చగా, కన్నులపండువగా ఉండే కొమ్మలతో, రెమ్మలతో నిండి ఉంటాయి; మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు నిరాకరిస్తారు? రెండు తోటలలోనూ రెండు సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి. మరి మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు నిరాకరిస్తారు? రెండు తోటలలోనూ ప్రతి పండూ రెండు విధాలుగా ఉంటుంది. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు నిరాకరిస్తారు? స్వర్గవాసులు దళసరి పట్టు వస్త్రపు అంచు గల తివాచీలపై దిండ్లకు ఆనుకుని ఆసీనులై ఉంటారు. ఆ తోటలలోని చెట్ల కొమ్మలు పండ్లతో వంగిపోయి ఉంటాయి. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు నిరాకరిస్తారు? ఈ మహాభాగ్యాల మధ్య సిగ్గులొలికే చూపులు గల సుకన్యలు ఉంటారు. ఈ స్వర్గవాసులకు పూర్వం వారిని ఏ మానవుడు గానీ, ఏ జిన్నాతు గానీ తాకి ఉండలేదు. కనుక మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు నిరాకరిస్తారు? వారు కెంపుల, ముత్యాల మాదిరిగా ఎంతో అందంగా ఉంటారు. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు నిరాకరిస్తారు?”

(ఖుర్ఆన్, రహ్మాన్ :46-59)

## అంశం : 52

**సాధారణ విశ్వాసులకు కూడా రెండు రెండు తోటలు ప్రసాదించబడతాయి. అయితే అల్లాహ్ కు సమీపంలో ఉండే ప్రత్యేకమైన విశ్వాసుల తోటలతో పోలిస్తే అవి తక్కువ స్థాయిలో ఉంటాయి.**

## అంశం : 53

**ఆ తోటల్లో కూడా కాలువలు, రుచికరమైన పండ్లు ఉంటాయి.**

## అంశం : 54

**సజ్జనులైన, పవిత్రులైన, సుందరమైన, విశాలమైన కనులు గల, తెల్లని సుకన్యలు స్వర్గవాసులకు భార్యలుగా ఉంటారు. వారిని అంతకుముందు ఎవరూ తాకి ఉండరు.**

“ఆ రెండు తోటలు కాక మరో రెండు తోటలు కూడా ఉంటాయి. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరించగలరు? అవి దట్టమైన ముదురు పచ్చని తోటలు. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరించగలరు? ఆ రెండు తోటలలోనూ రెండు చెలమలు పొంగి పొరలుతూ ఉంటాయి. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరించగలరు? వాటిలో పండ్లూ, ఫలాలూ, ఖర్జూరాలూ, దానిమ్మకాయలూ పుష్కలంగా ఉంటాయి. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరించగలరు? ఈ మహాభాగ్యాల మధ్య శీలవతులూ, సౌందర్యవతులూ అయిన భార్యలు ఉంటారు. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరించగలరు? గుడారాలలో సురక్షితంగా ఉంచబడిన సుందరీమణులు ఉంటారు. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరించగలరు? ఆ స్వర్గవాసులు ఆకుపచ్చని తివాచీలపై, అందమైన, విలువైన పరుపులపై దిండ్లకు ఆనుకొని ఆసీనులై ఉంటారు. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరించగలరు? మహా మహిమాన్వితుడూ, దయామయుడూ అయిన నీ ప్రభువు పేరు ఎంతో శుభకరమైనది.”

(ఖుర్ఆన్, రహ్మాన్: 62-78)

## అంశం : 55

**జీవితమంతా ధర్మసమ్మతం కాని మనోవాంఛల నుంచి తమను తాము నిరోధించుకున్నవారు, అల్లాహ్ ఏర్పరచిన సరిహద్దులను అతిక్రమించనివారే స్వర్గంలోకి ప్రవేశిస్తారు.**

## అంశం : 56

**స్వర్గంలో వేడిమి తీవ్రతా ఉండదు, చలి తీవ్రతా ఉండదు. నిత్య వసంతాలు, ఉల్లాసాన్నిచ్చే నీడలు ఉంటాయి.**

## అంశం : 57

**స్వర్గలోకపు సేవకులు వెండి, పింగాణి పాత్రల్లో స్వర్గవాసులకు ఆతిథ్యమిస్తారు.**

## అంశం : 58

**స్వర్గలోకపు పండ్లు చెట్ల నుంచి ఎంతగా వంగి ఉంటాయంటే స్వర్గవాసులు నిలబడి, కూర్చొని లేదా పడుకొని ఇష్టమొచ్చినప్పుడు కోసుకోగలరు.**

**అంశం : 59**

**స్వర్గలోకపు 'సల్ సబీల్' అనే కాలువ నుంచి శొంఠి మిళితమైన మధువు వెలువడు తుంది. అది స్వర్గవాసులకు త్రాగించబడుతుంది.**

**అంశం : 60**

**ప్రతి స్వర్గవాసికి చెందిన తోటలు ఒక విశాలమైన సామ్రాజ్యాన్ని స్ఫురింప జేస్తాయి.**

**అంశం : 61**

**స్వర్గవాసులకు వెండి కంకణాలు తొడిగించడం జరుగుతుంది.**

"అల్లాహ్ వారి సహనానికి ప్రతిఫలంగా వారికి స్వర్గాన్నీ, పట్టు వస్త్రాలనూ ప్రసాదిస్తాడు. అక్కడ వారు ఎత్తైన పీఠాలపై దిండ్లకు ఆనుకుని కూర్చొని ఉంటారు. వారిని ఎండ వేడీ బాధించదు. చలి తీవ్రతా వేధించదు. స్వర్గచ్ఛాయలు వారి పైకి వంగి నీడను ఇస్తూ ఉంటాయి, దాని పండ్లు ఎల్లవేళలా వారికి అందుబాటులో ఉంటాయి. (వారు తమ ఇష్టానుసారం వాటిని తెంచుకొని తింటారు) వారి మధ్య వెండి పాత్రలు, గాజు గ్లాసులు అటూ ఇటూ తిప్పబడుతూ ఉంటాయి; ఆ గాజు గ్లాసులు స్ఫటికం వలె తెల్లనైన వెండితో చేయబడినటువంటివి. వాటిని (స్వర్గ నిర్వాహకులు) ఖచ్చితమైన అంచనా ప్రకారం నింపి ఉంటారు. అక్కడ వారికి శొంఠి కలిపిన మధుపాత్రలు ఇవ్వబడతాయి; ఇది స్వర్గంలోని 'సల్ సబీల్' అనే పేరు గల సెలయేరు. వారి సేవ కొరకు పరుగెత్తుతూ అటూ ఇటూ తిరిగే బాలురు ఉంటారు; వారు ఎల్లప్పుడూ బాలురుగానే ఉంటారు. మీరు వారిని చూస్తే, వెదజల్లబడిన ఆణిముత్యాలని అనుకుంటారు. అక్కడ మీరు ఎటు చూచినా దైవానుగ్రహాలే మీకు కనిపిస్తాయి; ఇంకా ఒక మహత్తర సామ్రాజ్య వైభవం కనిపిస్తుంది. వారి వంటిపై సన్నని ఆకుపచ్చని పట్టు వస్త్రాలు, ఖరీదైన జలతారు అల్లిన దుస్తులు ఉంటాయి. వారికి వెండి మురుగులు తొడుగుతారు. వారి ప్రభువు వారికి ఎంతో పరిశుద్ధమైన మద్యాన్ని ప్రసాదిస్తాడు. మీకు లభించే ప్రతిఫలం ఇది; మీరు చేసిన పనులు విలువైనవిగా గుర్తించబడ్డాయి."

(ఖుర్ఆన్, దహర్ :12-22)

**అంశం : 62**

**కాంతివంతమైన వదనాలు, తోటలు, పండ్లు, అందమైన, యువతులైన, కన్యలైన, తమ భర్తలతో సమానమైన వయస్కులైన స్త్రీలు, పవిత్రమైన మధువు, మధువుతో నిండి పొర్లుతున్న పాత్రలు, అన్నిరకాల అసభ్యతల నుంచి పవిత్రమైన వాతావరణం, పారుతున్న కాలువలు, ఎత్తయిన సింహాసనాలు, వరుసలుగా పరచబడిన దిండ్లు, అరుదైన తెల్లని తివాచీలు... ఇవన్నీ స్వర్గవాసులు అనుభవించే స్వర్గలోకపు సౌఖ్యాలు.**

“ఆ రోజున కొందరి ముఖాలు కళకళలాడుతూ ఉంటాయి, తాము చేసుకున్న సత్కార్యాలకు వారు సంతోషపడతారు, అత్యున్నతమైన స్వర్గంలో ఉంటారు. అక్కడ వారు ఎలాంటి వృధా విషయాలను వినరు, అందులో సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి. అక్కడ ఎత్తైన పీఠాలు ఉంటాయి, పాత్రలు పెట్టబడి ఉంటాయి, పెద్ద పెద్ద దిండ్లు వరుసలుగా అమర్చబడి ఉంటాయి, అందమైన తివాచీలు పరచబడి ఉంటాయి.”

(ఖుర్ఆన్, గాషియహ్: 8-16)

**అంశం : 63**

**స్వర్గంలో ముళ్ళు లేని రేగుపండ్లు ఉంటాయి.**

**అంశం : 64**

**స్వర్గవాసులకు చెందిన ఇహలోకపు భార్యలను అల్లాహ్ తిరిగి పుట్టిస్తాడు. వారిలో క్రింద పేర్కొనబడిన మూడు లక్షణాలు ఉంటాయి : (1) వారు కన్యలయి ఉంటారు. (2) తమ భర్తలకు సమానమైన వయస్సును కలిగి ఉంటారు. (3) వారు తమ భర్తలను ప్రాణప్రదంగా ప్రేమించేవారయి ఉంటారు.**

“ఇక కుడిపక్షం వారు; కుడిపక్షంవారి (అదృష్టం) గురించి ఏమనాలి. వారు ముళ్ళు లేని రేగుచెట్లు, అరటి పండ్ల గెలలు, దూరంగా వ్యాపించి ఉండే నీడలు, ఎల్లప్పుడూ ప్రవహించే నీరు, ఎన్నటికీ అంతం కాని, నిరాటంకంగా లభించే అసంఖ్యా కమైన పండ్లు మరియు ఎత్తయిన ఆసనాలు వాటి మధ్య ఉంటరు. వారి భార్యలను మేము ప్రత్యేకంగా సరికొత్త పంథాలో సృష్టిస్తాము, వారిని కన్యలుగా చేస్తాము. వారు తమ భర్తలను అమితంగా ప్రేమిస్తారు, వయస్సులో సమంగా ఉంటారు. ఇదంతా కుడిపక్షం వారి కొరకు.”

(ఖుర్ఆన్, వాఖిఅహ్ :27-38)

**అంశం : 65**

**స్వర్గంలో ‘కాఫూర్’ అనే కాలువ నుంచి కర్పూరం మిళితమైన మధువు వెలువడు తుంది. అది స్వర్గవాసులకు తాగించబడుతుంది.**

**అంశం : 66**

**స్వర్గంలో స్వర్గవాసుల పనులన్నీ కేవలం వారి కోరుకున్నంతనే వారి సంకల్పాను సారం రెప్పపాటులో నెరవేరతాయి.**

“సజ్జనులు (స్వర్గంలో) కర్పూరజలం కలిపిన మధుపాత్రలను సేవిస్తారు; ఇది ప్రవహించే ఒక సెలయేరు; దైవదాసులు దాని నీటితో పాటు మధువును సేవిస్తారు. వారు తాము కోరిన చోటికి దాని పాయలను సులభంగా తీసుకుపోతారు.” (దహ్ర్: 5-6)

**అంశం : 67**

**స్వర్గలోకపు సౌఖ్యాలు స్వర్గవాసుల హృదయాలకు, కనులకు చల్లదనాన్ని చేకూర్చే రీతిలో ఉంటాయి.**

**అంశం : 68**

**స్వర్గలోకపు సౌఖ్యాలను ఇహలోకంలో ఊహించడం సాధ్యం కాదు.**

"వారి (స్వర్గవాసుల) కర్మలకు ప్రతిఫలంగా కళ్ళకు చలువ కలిగించే ఎటువంటి సామగ్రి వారి కొరకు దాచిపెట్టబడిందో ఆ సామగ్రి గురించి ఏ ప్రాణికీ తెలియదు."

(ఖుర్ఆన్, సజ్దహ్ :17)

# స్వర్గం వైభవం

## అంశం : 69

**స్వర్గలోకపు వరానుగ్రహాల గురించి, విశిష్టతల గురించి వివరించడం లేదా ఇహలోకంలో వాటిని అర్థం చేసుకోవడం, చివరకు వాటిని ఊహించడం సైతం అసాధ్యం.**

"హజ్రత్ సహల్ బిన్ సఅద్ సాఅదీ (ర) ఈ విధంగా ఉల్లేఖించారు: నేను దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) సభలో హాజరయి ఉన్నాను. అప్పుడు దైవప్రవక్త(స) స్వర్గం గురించి వివరించారు, స్వర్గాన్ని ఎంతగానో కొనియాడారు. చివరగా ఇలా పేర్కొన్నారు: 'స్వర్గంలో ఎటువంటి సౌఖ్యాలున్నాయంటే వాటిని ఇంతవరకూ ఏ కన్నూ చూసి ఉండలేదు, ఏ చెవీ దాని గురించి విని ఉండలేదు. అలాగే ఏ మానవుడూ స్వర్గాన్ని ఊహించి ఉండలేదు.' ఆ తర్వాత ఖుర్‌ఆన్ కు చెందిన ఈ వాక్యాన్ని పఠించారు : 'వారి (స్వర్గానికి అర్హులయినవారి) వీపులు పడకలకు ఎడంగా ఉంటాయి; తమ ప్రభువును వారు (నరకలోక శిక్ష పట్ల) భయంతోనూ, (పుణ్యం పట్ల) ఆశతోనూ వేడుకుంటారు. మేము వారికి ప్రసాదించిన ఉపాధి నుంచి ఖర్చు పెడతారు. వారి కర్మలకు ప్రతిఫలంగా, కళ్ళకు చలువ కలిగించే ఎటువంటి సామగ్రి వారి కొరకు దాచి పెట్టబడిందో ఆ సామగ్రి గురించి ఏ ప్రాణికీ తెలియదు."

(ఖుర్‌ఆన్, సజ్‌దహ్: 15-17, ముస్లిమ్)[1]

## అంశం : 70

**స్వర్గంలో ఒక కర్రతో సమానమైన స్థలం ఇహలోకం, అందులో ఉన్న సమస్త సౌఖ్యాలకంటే ఉత్తమమైనది.**

"హజ్రత్ సహల్ బిన్ సఅద్ సాఅదీ (ర)ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : "స్వర్గంలో ఒక కర్రతో సమానమైన స్థలం ప్రపంచం, అందులోని ప్రతి వస్తువు కంటే ఉత్తమమైనది." (బుఖారీ)[2]

## అంశం : 71

**స్వర్గంలో ఒక విల్లుకు సమానమైన స్థలం ఇహలోకంలో సూర్యుడు ఏయే వస్తువులపై ఉదయిస్తాడో వాటన్నింటికంటే ఉత్తమమైనది.**

వివరణ కొరకు 'అంశం-135'ను అధ్యయనం చేయండి.

## అంశం : 72

**స్వర్గలోకపు వస్తువుల్లో ఏ ఒక్క వస్తువయినా గోటి పరిమాణంలో ఇహలోకంలో బహిర్గతమయినట్లయితే భూమ్యాకాశాలు కాంతివంతమవుతాయి.**

వివరణ కొరకు 'అంశం-226'ను అధ్యయనం చేయండి.

## అంశం : 73

**స్వర్గంలో ఒకవేళ మృత్యువు ఉన్నట్లయితే స్వర్గవాసులు స్వర్గలోకపు సౌఖ్యాలను చూసి సంతోషంతో మరణిస్తారు.**

"హజ్రత్ అబూ సఈద్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "ప్రళయదినాన మృత్యువు ఒక మచ్చ గల పొట్టేలు రూపంలో స్వర్గనరకాలకు నడుమ నిలబెట్టబడి బలి ఇవ్వబడుతుంది. ఆ దృశ్యాన్ని స్వర్గవాసులు, నరకవాసులు చూస్తూ ఉంటారు. ఒకవేళ సంతోషంతో మరణించడం సాధ్యమయినట్లయితే స్వర్గవాసులు సంతోషంతో మరణిస్తారు. అలాగే ఒకవేళ దుఃఖంతో మరణించడం సాధ్యమయినట్లయితే నరకవాసులు దుఃఖంతో మరణిస్తారు." (తిర్మిజీ)[3]

## అంశం : 74

**స్వర్గలోకపు సుగంధం అధిగమించేందుకు నలభై సంవత్సరాలు పట్టేంతటి దూరం నుంచి వస్తుంది.**

"హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: 'ఏ వ్యక్తయితే ఏ జిమ్మీ (ఇస్లామీయ రాజ్యంలో ఉంటూ జిజ్యహ్ పన్ను చెల్లించే ముస్లిమేతరుడు) నయినా (అన్యాయంగా) హత్య చేస్తాడో అతడు స్వర్గలోకపు సువాసనను సైతం పొందలేడు. స్వర్గలోకపు సువాసన అధిగమించేందుకు నలభై సంవత్సరాలు పట్టేంతటి దూరం నుంచి వస్తుంది." (తిర్మిజీ)[4]

## అంశం : 75

**స్వర్గలోకపు వస్తువులన్నీ ఇహలోకపు వస్తువులన్నింటికంటే ఉత్తమమైనవి. కేవలం వాటి పేర్లలో మాత్రమే సారూప్యత ఉంది.**

"హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : 'స్వర్గలోకానికి చెందిన ఏ వస్తువూ ఇహలోకపు వస్తువులను పోలి ఉండదు. కేవలం పేర్లలోనే సారూప్యత ఉంటుంది."

(అబూ నఈమ్, సహీహ్)[5]

## అంశం : 76

**ఇహలోకంలో జీవితమంతా కష్టాల్లో, బాధల్లో గడిపిన వ్యక్తి స్వర్గాన్ని ఒక్కమారు చూసినంతనే తన కష్టాలన్నింటినీ మరచిపోతాడు.**

"హజ్రత్ అనస్ బిన్ అబ్బాస్ ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : 'ప్రళయదినాన నరకంలోకి వెళ్ళాలని నిర్ణయించబడిన వ్యక్తి తీసుకురాబడతాడు. ఇహలోకంలో ఆ వ్యక్తి ఎంతగానో సుఖభోగాల్లో మునిగి తేలి ఉంటాడు. అతడిని నరకంలోకి ఒక్కసారి పడవేసి, ఆ తర్వాత ఇలా ప్రశ్నించడం జరుగుతుంది: 'ఓ ఆదమ్ కుమారుడా! ఇహలోకంలో నీవెప్పుడయినా సుఖభోగాలను చవిచూశావా? వరాను గ్రహాలను అనుభవించావా?' ఆ వ్యక్తి ఇలా పలుకుతాడు: 'ఓ నా ప్రభువా! నీ సాక్షిగా! ఎన్నడూ చవిచూడలేదు.' ఆ తర్వాత ఇహలోకంలో ఎన్నో కష్టాలు అనుభవించిన ఒక స్వర్గవాసి తీసుకురా బడతాడు. అతడిని ఒక్కసారి స్వర్గంలో పడవేసి, ఆ తర్వాత ఇలా ప్రశ్నించడం జరుగుతుంది : 'ఓ ఆదమ్ కుమారుడా! ఇహలోకంలో నీవెప్పుడయినా కష్టాలను, బాధలను చవిచూశావా?' ఆ వ్యక్తి ఇలా పలుకుతాడు: 'ఓ నా ప్రభువా! నీ సాక్షిగా! ఎప్పుడూ చవి చూడలేదు. నేను కష్టాలను గానీ, బాధలను గానీ ఎప్పుడూ అనుభవించలేదు."

(ముస్లిమ్)[6]

## అంశం : 77

**స్వర్గలోకపు సౌఖ్యాలను, స్థాయిలను చూసిన తర్వాత స్వర్గవాసుల పశ్చాత్తాపం.**

"హజ్రత్ మఆజ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఇహలోకంలో అల్లాహ్‌ను స్మరించకుండా గడిపిన క్షణం పట్ల పశ్చాత్తాపం చెందిన రీతిలో స్వర్గవాసులు స్వర్గంలో మరే విషయం పట్లా అంతగా పశ్చాత్తాపం చెందరు."

(తిబ్రానీ, సహీహ్)[7]

---

**అథః సూచికలు :**

1. కితాబ్ బదఉల్ ఖలఖ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతిల్ జన్నహ్
2. కితాబ్ బదఉల్ ఖలఖ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతిల్ జన్నహ్
3. అబ్‌వాబ్ సిఫతుల్ జన్నహ్, బాబ్ మా జాఅ ఫీ ఖులూది అహ్లిల్ జన్నహ్
4. కితాబుల్ జిహాద్ వస్సైర్, బాబ్ ఇస్మ్ మిన్ ఖతలి ముఆహిదా
5. సిల్‌సిలయె అహాదీసుస్సహీహ్, లిల్ అల్ బానీ, హదీస్ నెం:2188
6. కితాబ్ సిఫాతుల్ మునాఫిఖీన్, బాబ్ ఫిల్ కుఫ్ఫార్
7. సహీహుల్ జామిఉస్సగీర్, లిల్ అల్‌బానీ, అల్ జుజ్ఉల్ ఖామిస్, హదీస్ నెం : 5322

# స్వర్గం విస్తృతి

## అంశం : 78

**స్వర్గం విస్తృతి కనీసం సమస్త భూమ్యాకాశాల విస్తృతికి సమానంగా ఉంటుంది. అయితే స్వర్గపు గరిష్ఠ విస్తృతికి పరిమితి లేదు.**

"మీ ప్రభువు క్షమాభిక్ష వైపుకు, స్వర్గం వైపుకు పోయే మార్గంపై పరుగిడండి. ఆ స్వర్గం భూమ్యాకాశాలంత విశాలమయింది. అది భయభక్తులు కలవారి కొరకు తయారు చేయబడింది." (ఖుర్ఆన్, ఆలి ఇమ్రాన్: 133)

"వారి (స్వర్గవాసుల) కర్మలకు ప్రతిఫలంగా కళ్ళకు చలువ కలిగించే ఎటువంటి సామగ్రి వారి కొరకు దాచిపెట్టబడిందో ఆ సామగ్రి గురించి ఏ ప్రాణికీ తెలియదు." (ఖుర్ఆన్, సజ్దహ్: 17)

## అంశం : 79

**స్వర్గాన్ని చూసిన తర్వాతే అది ఎంత పెద్దగా ఉందో, దాని సౌఖ్యాలు ఎంత శ్రేష్ఠమైనవో తెలుస్తుంది.**

"అక్కడ (స్వర్గంలో) మీరు ఎటు చూసినా దైవానుగ్రహాలే మీకు కనిపిస్తాయి; ఇంకా ఒక మహత్తర సామ్రాజ్య వైభవం కనిపిస్తుంది." (ఖుర్ఆన్, దహ్ర్: 20)

## అంశం : 80

**స్వర్గంలో వంద స్థాయిలున్నాయి. ప్రతి రెండు స్థాయిలకు మధ్యదూరం భూమ్యాకాశాల మధ్యదూరానికి సమానంగా ఉంటుంది.**

వివరణ కొరకు 'అంశం :99' ను అధ్యయనం చేయండి.

## అంశం : 81

**స్వర్గంలో ఒక చెట్టు నీడ ఎంత పెద్దగా ఉంటుందంటే ఒక గుర్రం వంద సంవత్సరాల పాటు నిరంతరాయంగా ఆ నీడలో ప్రయాణించినప్పటికీ అది అంతరించదు.**

వివరణ కొరకు 'అంశం - 135'ను అధ్యయనం చేయండి.

## అంశం : 82

**స్వర్గంలో అందరికంటే ఆఖరున ప్రవేశించే వ్యక్తికి ఈ ప్రపంచానికి 10 రెట్లు విశాలమైన సామ్రాజ్యం ప్రసాదించబడుతుంది.**

“హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: ‘నరకం నుంచి అందరికంటే ఆఖరున వెలికితీయబడే వ్యక్తి గురించి నాకు తెలుసు. అతడు వెల్లకిలా దేక్కుంటూ స్వర్గంలోకి ప్రవేశించి స్వర్గంలో అందరూ తమ తమ స్థలాలను ఆక్రమించుకోవడాన్ని చూస్తాడు. (అతడి కొరకు స్థలమేమీ మిగిలి ఉండదు) అప్పుడు అతడిని ఈ విధంగా ప్రశ్నించడం జరుగుతుంది: ‘నీవు నరకంలో గడిపిన సమయం గుర్తుందా?’ ఆ వ్యక్తి ‘అవును. గుర్తుంది’ అని బదులిస్తాడు. అప్పుడు అతడిని తిరిగి ఈ విధంగా ప్రశ్నించడం జరుగుతుంది: ‘కోరుకో.’ (స్వర్గంలో నీకు ఎంత స్థలం కావాలి?) అప్పుడు అతడు కోరుకుంటాడు. అప్పుడు తిరిగి అతడితో ఈ విధంగా పేర్కొనడం జరుగుతుంది: ‘నీ కొరకు నీవు కోరుకున్నంత స్థలం స్వర్గంలో ప్రసాదించబడింది. దానితో పాటు పది ప్రపంచాలకు సమానమైన స్థలం కూడా నీకు ప్రసాదించడం జరుగుతోంది.’ అప్పుడు ఆ వ్యక్తి ఇలా పలుకుతాడు: ‘(ఓ అల్లాహ్!) నీవు రారాజువయి ఉండి కూడా నాతో పరాచికాలాడుతున్నావు.’ (స్వర్గంలోనయితే మామూలు స్థలం కూడా ఖాళీగా లేదు) ఇలా పేర్కొన్న తర్వాత దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) దవడలు సైతం కనిపించే రీతిలో నవ్వారని హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (ర) పేర్కొన్నారు. మరొక హదీసులో ఈ విధంగా పేర్కొనబడింది : అల్లాహ్ ఆ వ్యక్తికి ఈ విధంగా బదులిస్తాడు: ‘నేను నీతో పరాచికాలాడటం లేదు. నేనేమయినా చేయదలుచుకుంటే దానిని చేయడంలో సంపూర్ణ శక్తిమంతుడిని.” (ముస్లిమ్)[1]

(దాసుడు దేవుని శక్తిని తక్కువగా అంచనా వేసి ఆయన ఆదేశాన్ని అసాధ్యంగా భావించి దానిని పరాచికంగా పేర్కొనడం పట్ల దైవప్రవక్త (స) నవ్వారు.)

## అంశం : 83

**స్వర్గంలో అందరికంటే ఆఖరున ప్రవేశించే వ్యక్తికి ఈ ప్రపంచానికి 10 రెట్లు ఎక్కువ స్థలాన్ని ప్రసాదించినప్పటికీ స్వర్గంలో ఇంకా స్థలం మిగిలే ఉంటుంది. దానిని నింపేందుకు అల్లాహ్ మరొక కొత్త జీవరాశిని సృష్టిస్తాడు.**

“హజ్రత్ అనస్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : ‘స్వర్గంలో ఎంత స్థలాన్ని అల్లాహ్ ఖాళీగా విడచిపెట్టదలుచుకున్నాడో అంత మేరకు ఖాళీగా ఉండిపోతుంది. ఆ తర్వాత అల్లాహ్ తాను కోరినట్లుగా సరికొత్త జీవరాశిని దానిని నింపేందుకై సృష్టిస్తాడు.” (ముస్లిమ్)[2]

---

**అథః సూచికలు :**

1. కితాబుల్ ఈమాన్, బాబ్ ఇస్బాతుష్షఫాఅహ్
2. కితాబుల్ జన్నహ్ వ సిఫహ్, బాబ్ జహన్నమ్

# స్వర్గలోకపు ద్వారాలు

**అంశం : 84**

**స్వర్గవాసుల రాకతో దైవదూతలు స్వర్గపు ద్వారాలు తెరుస్తారు.**

**అంశం : 85**

**స్వర్గవాసులు స్వర్గపు ద్వారాల గుండా ప్రవేశించే సమయంలో దైవదూతలు స్వర్గవాసుల శ్రేయస్సు కొరకు ప్రార్థిస్తారు.**

"తమ ప్రభువు పట్ల అవిధేయతకు దూరంగా ఉన్నవారిని, బృందాలు, బృందాలుగా స్వర్గం వైపుకు తీసుకుపోవటం జరుగుతుంది. చివరకు వారు అక్కడకు చేరినప్పుడు, దాని తలుపులు ముందుగానే తెరువబడి ఉంటాయి. దాని నిర్వహణా ధికారులు వారితో ఇలా అంటారు, 'మీకు శాంతి కలుగుగాక! మీరు చక్కగా ప్రవర్తించారు. ప్రవేశించండి ఇందులోకి, శాశ్వతంగా ఉండేందుకై." (ఖుర్‌ఆన్, జుమర్: 73)

**అంశం : 86**

**అందరికంటే ముందు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) కొరకు స్వర్గలోకపు ద్వారం తెరువబడుతుంది.**

"హజ్రత్ అనస్ బిన్ మాలిక్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : 'ప్రళయదినాన నేను (అందరికంటే ముందు) స్వర్గలోకపు ద్వారం వద్దకు వచ్చి ద్వారాన్ని తెరిపిస్తాను. స్వర్గలోకపు ద్వారపాలకుడు ఇలా ప్రశ్నిస్తాడు: 'ఎవరు?' అప్పుడు నేను 'ముహమ్మద్' అని బదులిస్తాను. అప్పుడు ఆ ద్వారపాలకుడు ఇలా పలుకుతాడు : 'నాకు మీ కొరకు తప్ప మరెవరి కొరకూ ద్వారాన్ని తెరువకూడదనే ఆదేశం ఇవ్వబడింది." (ముస్లిమ్)[1]

"హజ్రత్ అనస్ బిన్ మాలిక్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: 'ప్రళయదినాన అందరికంటే నా అనుచర సమాజానికి చెందినవారే ఎక్కువ సంఖ్యలో ఉంటారు. అలాగే నేను అందరికంటే ముందు స్వర్గలోకపు తలుపు తడతాను." (ముస్లిమ్)[2]

**అంశం : 87**

**స్వర్గానికి ఎనిమిది ద్వారాలుంటాయి.**

హజ్రత్ సహల్ బిన్ సఅద్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "స్వర్గానికి ఎనిమిది ద్వారాలుంటాయి. వాటిలో ఒకదాని పేరు 'రయ్యాన్'. దాని గుండా కేవలం ఉపవాసకులు మాత్రమే ప్రవేశిస్తారు." (బుఖారీ)[3]

## అంశం : 88

**స్వర్గానికి గల ఇతర పేర్లలో కొన్ని ఇవి : 'బాబుస్సలాహ్' (నమాజ్ ద్వారం), 'బాబుల్ జిహాద్' (జిహాద్ ద్వారం), 'బాబుస్సదఖహ్' (దాన ద్వారం)**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఏ వ్యక్తయితే అల్లాహ్ మార్గంలో జోడీని ఖర్చు చేసాడో (ఉదా॥ రెండు గుర్రాలు, రెండు ఖడ్గాలు మొదలయినవి) అతడిని 'ఓ అల్లాహ్ దాసుడా! ఇదీ ఉత్తమ ప్రతిఫలం' అని స్వర్గంలో పిలవడం జరుగుతుంది. నమాజ్ చదివేవారి వర్గానికి చెందిన వ్యక్తిని 'బాబుస్సలాహ్' (నమాజ్ ద్వారం) నుంచి పిలవడం జరుగుతుంది, జిహాద్ (దైవమార్గంలో ధర్మయుద్ధం) చేసినవారి వర్గానికి చెందిన వ్యక్తిని 'బాబుల్ జిహాద్' (జిహాద్ ద్వారం) నుంచి పిలవడం జరుగుతుంది, దానాలు చేసినవారి వర్గానికి చెందిన వ్యక్తిని 'బాబుస్స దఖహ్' (దాన ద్వారం) నుంచి పిలవడం జరుగుతుంది, ఉపవాసాలుండిన వారి వర్గానికి చెందిన వ్యక్తిని 'బాబుర్రయ్యాన్' (రయ్యాన్ ద్వారం) అనే ద్వారం నుంచి పిలవడం జరుగుతుంది." అప్పుడు హజ్రత్ అబూబకర్ (ర) ఇలా అడిగారు : "ఓ దైవప్రవక్తా (స)! అన్ని ద్వారాల నుంచీ పిలువబడే వ్యక్తికి ఎటువంటి నష్టమూ వాటిల్లే అవకాశం లేదు. అన్ని ద్వారాల నుంచీ పిలువబడే వ్యక్తి ఎవరయినా ఉన్నారా?" అప్పుడు దైవప్రవక్త(స) ఇలా పేర్కొన్నారు: "అవును. మీరు వారిలోనే (ఆవిధంగా పిలువబడేవారిలో) ఒకరయి ఉంటారని నేను ఆశిస్తున్నాను." (నసాయి, సహీహ్)[4]

## అంశం : 89

**స్వర్గలోకానికి చెందిన ఒక్క ద్వారం వెడల్పు దాదాపు పన్నెండు వందలు లేదా పదమూడు వందల కిలోమీటర్లు ఉంటుంది.**

## అంశం : 90

**కర్మలు లెక్కించబడకుండానే నేరుగా స్వర్గంలో ప్రవేశించే సౌభాగ్యులు ప్రవేశించే ద్వారం పేరు 'బాబె ఐమన్.' (అల్లాహ్ తన అపారమైన కారుణ్యంతో మనల్ని కూడా వారిలో చేర్చుగాక)**

హజ్రత్ అబూహురైరహ్(ర) ద్వారా 'షఫాఅత్ హదీసు'లో ఈ విధంగా ఉల్లేఖించబడింది: (దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) సిఫారసు ముగిసిన తర్వాత) అల్లాహ్

ఇలా పేర్కొంటాడు: "ఓ ముహమ్మద్! ఎవరి కర్మల లెక్క తీసుకోవడం జరగదో వారిని 'బాబె ఐమన్' అనే ద్వారం ద్వారా స్వర్గంలోకి ప్రవేశింపజేయండి. వారు స్వర్గంలో ఇతర ద్వారాల గుండా ప్రవేశించేవారిలోనూ చేరి ఉన్నారు. (అనగా ఒకవేళ వారు స్వర్గలోకపు వేరే ద్వారం గుండా ప్రవేశించాలనుకున్నా ప్రవేశించవచ్చు) ఎవరి అధీనంలోనయితే ముహమ్మద్ (స) ప్రాణముందో ఆ అస్తిత్వం సాక్షిగా! స్వర్గలోకపు వాకిళ్ళ మధ్యదూరం మక్కా మరియు హజర్ (బహ్రైన్ కు చెందిన ఒక పట్టణం పేరు) మధ్యదూరానికి సమానంగా ఉంటుంది లేదా మక్కా మరియు బస్రా (సిరియా కు చెందిన ఒక పట్టణం పేరు) మధ్యదూరానికి సమానంగా ఉంటుంది." (ముస్లిమ్)[5]

(గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే మక్కా మరియు హజర్‌ల మధ్యదూరం 1160 కిలోమీటర్లయితే, మక్కా మరియు బస్రాల మధ్యదూరం 1250 కిలోమీటర్లు ఉంటుంది.)

## అంశం : 91

**కర్మలు లెక్కించబడకుండానే నేరుగా స్వర్గంలో ప్రవేశించే 70 వేలమంది ఒక్కమారుగా 'బాబె ఐమన్' అనే ద్వారం గుండా ప్రవేశిస్తారు. ఎవరూ ముందుండటం గానీ, వెనుకబడిపోవడం గానీ జరగదు.**

హజ్రత్ సహల్ బిన్ సఅద్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "నా అనుచర సమాజానికి చెందిన 70 వేలమంది లేదా 7 లక్షల మంది ( ఈ హదీసు ఉల్లేఖకులయిన హజ్రత్ అబూ హాజిమ్‌కు 70 వేలో, 7 లక్షలో సరిగా గుర్తులేదు) ఒకరి చేతులను మరొకరు పట్టుకుని స్వర్గంలోకి ప్రవేశిస్తారు. వారిలో ఏ ఒక్క వ్యక్తీ ఆఖరి వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశించనంతవరకు స్వర్గంలోకి ప్రవేశించడు. (అనగా అందరూ ఒకేసారిగా స్వర్గంలోకి ప్రవేశిస్తారు). ఆ స్వర్గవాసుల ముఖాలు పున్నమినాటి చంద్రుని వలె మెరిసిపోతూ ఉంటాయి." (ముస్లిమ్)[6]

**వివరణ : 'ముస్లిమ్ షరీఫ్' అనే హదీసు గ్రంథానికి చెందిన మరొక హదీసులో 70 వేలమంది అని పేర్కొనబడింది. (అల్లాహ్‌కే సర్వం ఎరుక)**

## అంశం : 92

**సరియైన రీతిలో వుజూ చేసిన తర్వాత 'కలిమయె షహాదత్' పఠించిన వ్యక్తి స్వర్గలోకపు ఎనిమిది ద్వారాలలోంచి తాను కోరిన ద్వారం గుండా స్వర్గంలోకి ప్రవేశించగలడు.**

హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "మీలో ఏ వ్యక్తయితే సరియైన రీతిలో వుజూ

చేసి 'అష్హదు అల్లా ఇలాహ ఇల్లల్లాహు వ అష్హదు అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహ్.' (అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు లేడని, హజ్రత్ ముహమ్మద్(స) అల్లాహ్ దాసులు మరియు ఆయన సందేశహరులు అని నేను సాక్ష్యమిస్తున్నాను' అని పలుకుతాడో అతడి కొరకు స్వర్గలోకపు ఎనిమిది ద్వారాలూ తెరువబడతాయి. వాటిలో నుంచి తాను కోరిన ద్వారం గుండా అతడు స్వర్గంలోకి ప్రవేశించగలడు.'' (ముస్లిమ్)[7]

**వివరణ : 'ముస్లిమ్ షరీఫ్' అనే హదీసు గ్రంథానికి చెందిన మరొక హదీసులో 70 వేలమంది అని పేర్కొనబడింది. (అల్లాహ్కే సర్వం ఎరుక)**

## అంశం : 93

**ఐదుపూటలు నమాజ్ చదివే, రమజాన్ మాసంలో ఉపవాసాలుండే, తన శీలాన్ని పరిరక్షించుకునే, తన భర్తకు విధేయురాలై నడచుకునే భార్య స్వర్గలోకపు ఎనిమిది ద్వారాలలో నుంచి తాను కోరిన ద్వారం గుండా స్వర్గంలోకి ప్రవేశిం చగలదు.**

హజ్రత్ అబూహురైరహ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: ''ఏ స్త్రీ అయితే ఐదు పూటలు నమాజ్ చదువుతుందో, రమజాన్ మాసంలో ఉపవాసాలుంటుందో, తన మర్మావయవాన్ని పరిరక్షించుకుంటుందో, తన భర్తకు విధేయురాలై నడచుకుంటుందో ఆమెతో (ప్రళయదినాన) ఈ విధంగా పలకడం జరుగుతుంది: 'స్వర్గలోకపు (ఎనిమిది) ద్వారాలలో నుంచి కోరిన ద్వారం గుండా ప్రవేశించు.''
(ఇబ్నె హబ్బాన్, సహీహ్)[8]

## అంశం : 94

**యుక్తవయస్సుకు చేరుకోకుండానే ముగ్గురు పిల్లలు మరణించడం పట్ల సహనం వహించే వ్యక్తి స్వర్గలోకపు ఎనిమిది ద్వారాలలో నుంచి తాను కోరిన ద్వారం గుండా స్వర్గం లోకి ప్రవేశించగలడు.**

హజ్రత్ అనస్ బిన్ మాలిక్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: ''ఏ ముస్లిం యొక్క ముగ్గురు యుక్తవయస్సుకు చేరుకోని పిల్లలు చనిపోయారో (అతడు సహనం వహించి ఉన్నట్లయితే) వారు అతడికి స్వర్గలోకపు ఎనిమిది ద్వారాల వద్ద ఎదురవుతారు. ఆ వ్యక్తి తాను కోరిన ద్వారం గుండా ప్రవేశిస్తాడు.'' (ఇబ్నె మాజహ్, సహీహ్)[9]

## అంశం : 95

**సోమవారం నాడు, గురువారం నాడు స్వర్గలోకపు ద్వారాలు తెరువబడతాయి.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స)

ఈ విధంగా పేర్కొన్నారు : "స్వర్గలోకపు ద్వారాలు సోమవారం నాడు, గురువారం నాడు తెరువబడతాయి. దైవత్వంలో ఇతరులను అల్లాహ్‌కు భాగస్వా ములుగా చేసే వ్యక్తి, ఇతర సోదరుని పట్ల కార్పణ్యం కలిగి ఉండే వ్యక్తి తప్ప ప్రతి ఒక్కరూ క్షమించబడతారు. (ఆ ఇద్దరు వ్యక్తుల గురించి దైవదూతలతో) ఇలా చెప్పబ డుతుంది: 'ఈ ఇద్దరు వ్యక్తులూ పరస్పరం కలుసుకునేంత వరకు వారి కొరకు వేచి ఉండండి." (ముస్లిమ్)[1]

## అంశం : 96

### రమజాన్ మాసమంతా స్వర్గలోకపు ఎనిమిది ద్వారాలూ తెరచి ఉంచబడతాయి.

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "రమజాన్ మాసం వచ్చినప్పుడు ఆకాశపు ద్వారాలు తెరువబడతాయి. నరకలోకపు ద్వారాలు మూయబడతాయి. అలాగే షైతానులు బంధించబడతారు." (బుఖారీ, ముస్లిమ్)[1]

---

**అథః సూచికలు :**

1. కితాబుల్ ఈమాన్, బాబ్ ఇస్బాతుష్షఫాఅహ్
2. కితాబుల్ ఈమాన్, బాబ్ ఇస్బాతుష్షఫాఅహ్
3. కితాబ్ బదఉల్ ఖలఖ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతిల్ జన్నహ్
4. కితాబుల్ జిహాద్, బాబ్ మిన్ అన్ఫుఖ్ జౌజైన్ ఫీ సబీలిల్లాహ్
5. కితాబుల్ ఈమాన్, బాబ్ ఇస్బాతుష్షఫాఅహ్
6. కితాబుల్ ఈమాన్, బాబుద్దలీల్ అలా దుఖూల్ తవాయిఫుల్ ముస్లిమీనల్ జన్నత బిగైరి హిసాబ్
7. కితాబుత్తహారత్, బాబుజ్జికిర్ అల్ ముస్తహబ్ అఖబుల్ వుజూ
8. సహీహ్ జామిఉస్సగీర్ వ జియాదతిహ్ లిల్ అల్బానీ, అల్ జుజ్ఉస్సాలిస్, హదీస్ నెం:673
9. కితాబుల్ జనాఇజ్, బాబ్ మా జాఅ ఫీ సవాబ్ మిన్ అసీబ్ లివాలిదహ్ (1303 /1)
10. కితాబుల్ బిర్రి వ స్సిలహ్, బాబుష్షహ్నా
11. అల్లులూలు ఉ వల్ మర్జాన్, అల్ జుజ్ఉల్ అవ్వలు, హదీస్ నెం : 652

# స్వర్గపు స్థాయిలు

## అంశం : 97

**స్వర్గలోకపు ఎత్తయిన భవంతులన్నీ స్వర్గవాసుల స్థాయిని బట్టి పైన, క్రింద నిర్మించబడి ఉంటాయి.**

"తమ ప్రభువుకు భయపడుతూ ఉండేవారికి అంతస్తుపై అంతస్తుగా కట్టబడిన ఎత్తయిన భవనాలు ఉన్నాయి. వాటి క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. ఇది అల్లాహ్ వాగ్దానం. అల్లాహ్ ఎన్నడూ తన వాగ్దానాన్ని భంగపరచడు." (ఖుర్ఆన్, జుమర్: 20)

## అంశం : 98

**స్వర్గంలో అన్నింటికంటే గొప్ప స్థాయిని 'వసీలహ్' అంటారు. అందులో మన ప్రియతమ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) విరాజిల్లుతారు.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "మీరు నా పై దురూద్ పఠించినప్పుడు నా కొరకు అల్లాహ్‌ను 'వసీలహ్' కు సంబంధించిన దుఆ (ప్రార్థన) చేయండి." అప్పుడు దైవప్రవక్త సహచరులు(ర) ఇలా ప్రశ్నించారు: "ఓ దైవప్రవక్తా (స)! వసీలహ్ అంటే ఏమిటి?" దైవప్రవక్త (స) ఇలా బదులిచ్చారు: "అది స్వర్గలోకపు అత్యున్నత స్థాయి. అది కేవలం ఒక వ్యక్తికి మాత్రమే ప్రసాదించబడుతుంది. ఆ వ్యక్తిని నేనేనని నేను ఆశిస్తున్నాను."

(దీనిని అహ్మద్ ఉల్లేఖించారు, సహీహ్)[1]

## అంశం : 99

**స్వర్గంలో వంద స్థాయిలున్నాయి. ప్రతి రెండు స్థాయిలకు మధ్యదూరం భూమ్యాకాశాల మధ్యదూరానికి సమానంగా ఉంటుంది.**

## అంశం : 100

**స్వర్గంలో అన్నింటికంటే పైన ఉండే స్థాయిని 'ఫిర్‌దౌస్' అంటారు. దాని నుంచి స్వర్గానికి చెందిన నాలుగు కాలువలు ప్రవహిస్తాయి.**

## అంశం : 101

**విశ్వసించిన ప్రతి ముస్లిం అల్లాహ్‌ను స్వర్గానికి చెందిన అత్యున్నత స్థాయి అయిన 'ఫిర్‌దౌస్'ను అర్థించాలి.**

## అంశం : 102

**'ఫిర్‌దౌస్'కు పైన అల్లాహ్ అర్ష్ (సింహాసనం) ఉంది.**

హజ్రత్ ఉబాదహ్ బిన్ సామత్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: "స్వర్గంలో వంద స్థాయిలున్నాయి. ప్రతి రెండు స్థాయిలకు మధ్యదూరం భూమ్యాకాశాల మధ్యదూరానికి సమానంగా ఉంటుంది. స్వర్గంలో అన్నింటికంటే పైన ఉండే స్థాయిని 'ఫిర్‌దౌస్' అంటారు. ఫిర్‌దౌస్ నుంచి స్వర్గానికి చెందిన నాలుగు కాలువలు (సీహాన్, జీహాన్, ఫురాత్, నీల్ అనే కాలువలు) ప్రవహిస్తాయి. ఫిర్‌దౌస్ కు పైన అల్లాహ్ అర్ష్(సింహాసనం) ఉంటుంది. అల్లాహ్‌ను (స్వర్గం కొరకు) అర్థించినప్పుడల్లా ఫిర్‌దౌస్‌ను అర్థించండి. (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[2]

## అంశం : 103

**స్వర్గంలో క్రింది స్థాయికి చెందిన భవంతుల్లో నివసించే స్వర్గవాసులకు పై స్థాయికి చెందిన భవంతులు దూరం నుంచి మెరిసే నక్షత్రాల వలె కనిపిస్తాయి.**

హజ్రత్ అబూ సఈద్ ఖుద్‌రీ(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "స్వర్గవాసులు తమ కంటే పై స్థాయికి చెందిన భవంతుల్లో నివసించే స్వర్గవాసులను చూసి దూరంగా ఆకాశంలో తూర్పు అంచున లేదా పడమర అంచున ఏదో మెరుస్తున్న నక్షత్రంగా భావిస్తారు. స్వర్గవాసుల పరస్పర స్థాయీభేదాల వల్ల వారి మధ్య అంతటి దూరం ఉంటుంది." అప్పుడు దైవ ప్రవక్త సహచరులు (ర) ఇలా ప్రశ్నించారు: "ఓ దైవప్రవక్తా (స)! అటువంటి మహోన్నత స్థాయికి దైవప్రవక్తలు కాకుండా మరెవరు చేరుకోగలరు?" దైవప్రవక్త(స) ఇలా బదులిచ్చారు: "ఎందుకు చేరుకోలేరు? ఎవరి అధీనంలోనయితే నా ప్రాణం ఉందో ఆ అస్తిత్వం సాక్షిగా! అల్లాహ్‌ను విశ్వసించి, దైవప్రవక్తలను ధృవీకరించినవారు ఆ స్థాయిల్లో ఉంటారు."

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[3]

## అంశం : 104

**స్వర్గంలో వంద స్థాయిలున్నాయి. ప్రతి రెండు స్థాయిల మధ్యదూరాన్ని అధిగమించేందుకు వంద సంవత్సరాలు పడుతుంది.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "స్వర్గంలో వంద స్థాయిలున్నాయి. ప్రతి రెండు స్థాయిల మధ్య దూరాన్ని అధిగమించేందుకు వంద సంవత్సరాలు పడుతుంది."

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[4]

## అంశం : 105

**అల్లాహ్ కొరకు ఒకరినొకరు ప్రేమించుకునేవారి ఇళ్ళు తూర్పు నుంచి లేదా పడమర నుంచి ఉదయించే కాంతివంతమైన నక్షత్రాల వలె కనిపిస్తాయి.**

హజ్రత్ అబూ సఈద్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "అల్లాహ్ కొరకు ఒకరినొకరు ప్రేమించు కునేవారి ఇళ్ళు మీకు స్వర్గంలో తూర్పు నుంచి లేదా పడమర నుంచి ఉదయించే కాంతివంతమైన నక్షత్రం వలె కనిపిస్తాయి.అప్పుడు ప్రజలు ఇలా అడుగుతారు: 'వీరు ఎవరు?' అప్పుడు వారికి ఇలా సమాధానమివ్వబడుతుంది: 'వీరు అల్లాహ్ కొరకు పరస్పరం ప్రేమించేవారు."

(దీనిని అహ్మద్ ఉల్లేఖించారు, సహీహ్)[5]

## అంశం : 106

**'సాబిఖూన్' కొరకు రెండు బంగారు తోటలు, 'అస్హాబుల్ యమీన్' కొరకు రెండు వెండి తోటలు ఉంటాయి.**

హజ్రత్ అబూబకర్ బిన్ అబూ మూసా (అష్అరీ) తన తండ్రి ద్వారా ఉల్లేఖించిన దాని ప్రకారం (ర) దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: 'సాబిఖూన్' కొరకు రెండు బంగారు తోటలు, 'అస్హాబుల్ యమీన్' కొరకు రెండు వెండి తోటలు ఉంటాయి.

(దీనిని బైహఖీ ఉల్లేఖించారు, సహీహ్)[6]

**వివరణ : 'సాబిఖూన్' అంటే విశ్వసించడంలో ముందుండేవారు అని అర్థం. అలాగే 'అస్హాబుల్ యమీన్' అంటే సజ్జనులు అని అర్థం. సాబిఖూన్‌లు అస్హాబుల్ యమీన్‌ల కంటే శ్రేష్ఠులు. (అల్లాహ్‌కే సర్వం ఎరుక)**

---

**అథః సూచికలు :**

1. ముస్నద్ అహ్మద్, హదీస్ నెం : 7588
2. అబ్వాబుల్ జన్నహ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతి దరజాతిల్ జన్నహ్ (6056/2)
3. కితాబుల్ జన్నహ్ వ సిఫతు నఈముహా
4. అబ్‌బాబుల్ జన్నహ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతి దరజాతిల్ జన్నహ్ (2054/2)
5. కితాబ్ అహ్లులుల్ జన్నహ్, బాబ్ మనాజిలుల్ ముతహాబీన ఫిల్లాహి తఆలా
6. అన్నహాయహ్ లి ఇబ్నె కసీర్, అల్ జుజ్‌ఉస్సానీ, హదీస్ నెం : 346

# స్వర్గలోకపు భవంతులు

**అంశం : 107**

**స్వర్గలోకపు భవంతులు అన్నిరకాల మాలిన్యాలకు, అపరిశుభ్రతలకు అతీతంగా, పవిత్రంగా ఉంటాయి.**

"ముస్లిమ్ స్త్రీ పురుషులకు అల్లాహ్ వాగ్దానం చేశాడు; క్రింద కాలువలు ప్రవహించే తోటల్ని వారికి ఇస్తాడు. వారు వాటిలో శాశ్వతంగా ఉంటారు. నిత్యం కళకళలాడే ఆ వనాల్లో వారి కొరకు పరిశుద్ధమైన నివాసాలు ఉంటాయి. ఇంకా అన్నింటికంటే మించి అల్లాహ్ ప్రసన్నత వారికి లభిస్తుంది. ఇదే గొప్ప సాఫల్యం." (ఖుర్ఆన్, తౌబహ్: 72)

**అంశం : 108**

**స్వర్గలోకపు భవంతుల్లో పాత్రలన్నీ బంగారంతో, వెండితో చేయబడి ఉంటాయి**

**అంశం : 109**

**స్వర్గవాసుల భవంతుల్లో నిత్యం అగరు బత్తీ వెలుగుతూ ఉంటుంది. దాని సువాసనతో వారి భవంతులు సుగంధభరితమై ఉంటాయి.**

**అంశం : 110**

**స్వర్గవాసుల చెమట నుంచి కస్తూరి వాసన వస్తుంది.**

**అంశం : 111**

**స్వర్గంలో ఉమ్మి, చీమిడి, మలవిసర్జన మొదలయినవేవీ ఉండవు.**

**అంశం : 112**

**స్వర్గవాసులందరూ పరస్పరం ప్రేమానురాగాలతో కలిసిమెలిసి ఉంటారు. వారి హృదయాలలో ఇతరుల పట్ల అసూయాద్వేషాలు ఉండవు.**

**అంశం : 113**

**స్వర్గవాసులు తమ ప్రతి శ్వాసలోనూ అల్లాహ్‌ను కీర్తిస్తారు, స్మరిస్తారు.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "స్వర్గంలో అందరికంటే ముందు ప్రవేశించే (స్త్రీ పురుషుల)

వర్గానికి చెందినవారి ముఖాలు పున్నమి నాటి చంద్రుని వలె (కాంతివంతంగా) ఉంటాయి. వారు ఉమ్మి వేయరు, చీమిడి గానీ, మలవిసర్జనం అవసరం గానీ వారికి ఉండదు. వారి పాత్రలు బంగారంతో చేయబడి ఉంటాయి. వారి దువ్వెనలు సైతం బంగారంతో, వెండితో చేయబడి ఉంటాయి. వారి పొయ్యిల నుంచి అగరు సువాసన వెలువడుతూ ఉంటుంది. స్వర్గవాసుల చెమట నుంచి కస్తూరి వాసన వస్తుంది. ప్రతి స్వర్గవాసీ ఇద్దరు భార్యలను కలిగి వుంటాడు. ఆ భార్యల అందం కారణంగా వారి కాలి పిక్కల్లోని గుజ్జు మాంసం లోపలి నుంచి కనిపిస్తూ ఉంటుంది. స్వర్గవాసులు పరస్పర విభేదాలకు గురికారు. అలాగే వారిలో అసూయా ద్వేషాలు ఉండవు. వారు కలిసిమెలిసి ఒకే ప్రాణప్రదంగా ఉంటారు. వారు రాత్రిం బవళ్ళూ అల్లాహ్‌ను స్తుతిస్తూ ఉంటారు." (దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[1]

## అంశం : 114

**స్వర్గలోకపు భవంతులు బంగారు, వెండి ఇటుకలతో నిర్మించబడ్డాయి.**

## అంశం : 115

**ముత్యాలు, వజ్రాలే స్వర్గలోకపు గులకరాళ్ళు, కుంకుమపువ్వు రంగు స్వర్గలోకపు మట్టిగా వాడబడింది.**

## అంశం : 116

**స్వర్గంలో స్వర్గవాసులకు చావు రాదు. వారు శాశ్వతంగా సజీవులై ఉంటారు.**

## అంశం : 117

**స్వర్గంలో స్వర్గవాసులకు వృద్ధాప్యం రాదు. వారు నిత్య యవ్వనులై ఉంటారు.**

హజ్రత్ అబూహురైరహ్(ర) ఈ విధంగా ఉల్లేఖించారు : నేను ఈవిధంగా ప్రశ్నించాను: "ఓ దైవప్రవక్తా (స)! జీవరాశులు దేనిచే సృష్టించబడ్డాయి?" దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఇలా బదులిచ్చారు: 'నీటిచే.' నేను తిరిగి ఇలా ప్రశ్నించాను: "ఓ దైవప్రవక్తా(స)! స్వర్గం దేనిచే తయారుచేయబడింది?" దైవప్రవక్త (స) ఇలా బదులిచ్చారు: "స్వర్గానికి చెందిన ఒక ఇటుక బంగారంతో, మరొక ఇటుక వెండితో తయారుచేయబడి ఉంటాయి. అవి తీవ్రమైన సువాసన గల కస్తూరి చే కలుపబడి ఉంటాయి. ముత్యాలు, వజ్రాలు స్వర్గలోకపు గులకరాళ్ళుగా ఉపయోగించబడ్డాయి. కుంకుమ పువ్వు రంగు స్వర్గలోకపు మట్టిగా వాడబడింది. ఏ వ్యక్తయితే స్వర్గంలోకి ప్రవేశిస్తాడో అతడు సుఖభోగాలను అనుభవిస్తాడు. ఎన్నటికీ అతడు కష్టాన్ని చవిచూడడు. అతడు శాశ్వతంగా సజీవుడై ఉంటాడు, ఎన్నటికీ చావడు. స్వర్గవాసుల వస్త్రాలు ఎన్నటికీ పాతబడవు. అలాగే స్వర్గవాసుల యవ్వనం ఎన్నటికీ అంతరించదు." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[2]

## అంశం : 118

**స్వర్గాన్ని అల్లాహ్ తన చేతితో నిర్మించాడు.**

## అంశం : 119

**స్వర్గపు భవంతులకు చెందిన ఒక ఇటుక తెల్లని ముత్యంతో చేయబడినదై, ఒక ఇటుక ఎర్రని వజ్రంతో చేయబడినదై, ఒక ఇటుక పచ్చ మణి తో చేయబడినదై ఉంటుంది. కస్తూరి స్వర్గలోకపు మట్టి అయి ఉంటుంది. ముత్యాలు స్వర్గలోకపు గులకరాళ్ళుగా ఉంటాయి. కుంకుమపువ్వు స్వర్గలోకపు గడ్డిగా ఉంటుంది.**

హజ్రత్ అనస్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "స్వర్గాన్ని అల్లాహ్ తన చేతితో నిర్మించాడు. దానికి చెందిన ఒక ఇటుక ఎర్రని వజ్రంతో చేయబడినదై, ఒక ఇటుక పచ్చ మణి తో చేయబడినదై ఉంటుంది. కస్తూరి స్వర్గలోకపు మట్టి అయి ఉంటుంది. ముత్యాలు స్వర్గలోకపు గులకరాళ్ళుగా ఉంటాయి. కుంకుమపువ్వు స్వర్గలోకపు గడ్డిగా ఉంటుంది. (స్వర్గాన్ని నిర్మించిన తర్వాత) అల్లాహ్ స్వర్గంతో ఇలా పలికాడు: "ఏమయినా పలుకు" అప్పుడు స్వర్గం ఇలా పలికింది: "విశ్వసించినవారు సాఫల్యం పొందారు." అప్పుడు అల్లాహ్ తిరిగి ఇలా పలికాడు : "నా గౌరవం, ఔన్నత్యాల సాక్షిగా! ఏ లోభీ నీలో ప్రవేశించలేడు." అప్పుడు దైవప్రవక్త (స) ఈ ఖుర్ఆన్ వాక్యాన్ని పఠించారు: "ఎవరయితే మనసు లోభం నుంచి రక్షించబడ్డారో వారు సాఫల్యం పొందారు." (దీనిని ఇబ్నె అబీ అద్దున్‌యా ఉల్లేఖించారు, సహీహ్)[3]

**వివరణ : పై హదీసులో 'లోభి' అంటే 'జకాత్ చెల్లించని వ్యక్తి' అని అర్థం.**

## అంశం : 120

**స్వర్గంలోని కొన్ని భవంతుల్లో బంగారు తోటలుంటాయి. వాటిలోని ప్రతి వస్తువూ బంగారంతో తయారుచేయబడినదై ఉంటుంది. కొన్ని భవంతుల్లో వెండి తోటలుంటాయి. వాటిలోని ప్రతి వస్తువూ వెండితో తయారు చేయబడినదై ఉంటుంది.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఖైస్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : (స్వర్గంలో స్వర్గవాసుల కొరకు) రెండు వెండి తోటలుంటాయి. వాటి పాత్రలు, ప్రతి వస్తువూ వెండితో చేయబడి ఉంటాయి. అలాగే రెండు బంగారు తోటలుంటాయి. వాటి పాత్రలు, ప్రతి వస్తువూ బంగారంతో చేయబడి ఉంటాయి. స్వర్గవాసులు స్వర్గంలో అల్లాహ్‌ను చూసే విషయంలో ఏదీ అడ్డంకి కాజాలదు, ఆయన పవిత్రమైన ముఖంపై ఉండే ఆయన ఔన్నత్యపు వస్త్రం తప్ప."

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు, సహీహ్)[4]

## అంశం : 121

**స్వర్గంలోని భవంతుల్లో పెద్ద పెద్ద బురుజులు అందమైన, తెల్లని ముత్యాలతో నిర్మించబడి ఉన్నాయి.**

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (ర) ద్వారా మేరాజ్ హదీసులో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా ఉల్లేఖించబడింది: “నన్ను స్వర్గంలోకి తీసుకెళ్ళడం జరిగింది. అందులో తెల్లని ముత్యాలతో బురుజులు నిర్మించబడి ఉన్నాయి. కస్తూరి దాని మట్టిగా ఉంది.” (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు, సహీహ్)[5]

---

**అథః సూచికలు :**

1. కితాబ్ బదఉల్ ఖలఖ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతిల్ జన్నహ్
2. అబ్‌వాబ్ సిఫతుల్ జన్నహ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతిల్ జన్నహ్ వ నఈమిహా (2050 / 2)
3. అన్నహాయహ్ లి ఇబ్నె కసీర్, అల్ జుజ్‌ఉస్సానీ, హదీస్ నెం : 352
4. కితాబుల్ ఈమాన్, బాబ్ ఇస్‌బాత్ రూయతుల్ ముఅ్మినీన ఫిల్ జన్నహ్ రబ్బిహిమ్ సుబ్‌హానహూ వ తఆలా
5. కితాబుల్ ఈమాన్, బాబుల్ ఇస్‌రా బిర్రసూలిల్లాహి ఇలస్సమావాత్

# స్వర్గపు గుడారాలు

## అంశం : 122

**ప్రతి స్వర్గవాసి భవంతిలో అందమైన గుడారాలుంటాయి. వాటిలో స్వర్గవా సులకు ప్రసాదించబడే స్వర్గలోకపు కన్యలు నివసిస్తారు.**

"(స్వర్గవాసుల కొరకు) గుడారాలలో సురక్షితంగా ఉంచబడిన సుందరీమణులు ఉంటారు. మీ ప్రభువు యొక్క ఏ యే బహుమానాలను మీరు తిరస్కరించగలరు?"

(ఖుర్‌ఆన్, రహ్మాన్: 72-73)

## అంశం : 123

**స్వర్గలోకపు ప్రతి గుడారం లోపలివైపు 60 మైళ్ళ వెడల్పు గల అందమైన ముత్యంతో చెక్కబడి తయారుచేయబడి ఉంటుంది.**

## అంశం : 124

**ఆ గుడారాలలో స్వర్గవాసుల భార్యలు ఉంటారు. వారు ప్రతిక్షణం తమ భర్తల రాకకోసం ఎదురు చూస్తూ ఉంటారు.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఖైస్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "స్వర్గంలో ముత్యంతో చేయబడిన, మధ్యలో ఖాళీగా ఉన్న ఒక గుడారం ఉంటుంది. దాని వెడల్పు 60 మైళ్ళు ఉంటుంది. ఆ గుడారపు ప్రతి మూలలోనూ (విశ్వాసుల) భార్యలు ఉంటారు. వారిని ఇతరులు (ఇతర భవంతులకు చెందినవారు దూరం మరియు విస్తృతి కారణంగా) చూడలేరు. విశ్వాసులు వారి (భార్యల) మధ్య తిరుగుతూ ఉంటారు." (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు, సహీహ్)[1]

---

అధః సూచికలు :

1. కితాబుల్ జన్నహ్ వ సిఫతు నఈమిహా

# స్వర్గలోకపు సంత

**అంశం : 125**

**స్వర్గంలో ప్రతి శుక్రవారం నాడు సంత ఏర్పాటవుతుంది.**

**అంశం : 126**

**స్వర్గంలో శుక్రవారం నాటి సంతలో పాల్గొనే స్వర్గవాసుల సౌందర్యం రెట్టింపవుతుంది.**

**అంశం : 127**

**స్వర్గంలో శుక్రవారం నాటి సంతలో స్వర్గలోకపు స్త్రీలు పాల్గొనరు. వారు తమ తమ ఇళ్ళల్లో ఉండగానే అల్లాహ్ వారి సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తాడు.**

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "స్వర్గంలో ఒక సంత ఉంది. అందులో ప్రతి శుక్రవారం స్వర్గవాసులు పాల్గొంటారు. అప్పుడు ఉత్తర దిశ నుంచి ఒక గాలి వీస్తుంది. దాని దుమ్ము (కస్తూరి, కుంకుమపువ్వులతో కూడిన దుమ్ము) స్వర్గవాసుల ముఖాలపై, వస్త్రాల మీద పడినప్పుడు వారి సౌందర్యం ఇనుమడిస్తుంది. వారు తిరిగి తమ ఇళ్ళకు చేరుకున్నప్పుడు వారి భార్యల అందచందాలు కూడా మునుపటి కంటే అధికమై ఉంటాయి. ఆ సతీమణులు తమ భర్తలతో ఇలా పేర్కొంటారు: 'అల్లాహ్ సాక్షిగా! మా నుంచి వెళ్ళిన తర్వాత మీ సౌందర్యం ఎంతో అధికమయింది.' స్వర్గవాసులు ఇలా పేర్కొంటారు : 'అల్లాహ్ సాక్షిగా! మీ అందచందాలు కూడా మునుపటి కంటే ఎంతో అధికమయ్యాయి.''

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[1]

---

**అథః సూచికలు :**

1. కితాబుల్ జన్నహ్ వ సిఫతు నఈమిహా

# స్వర్గలోకపు చెట్లు

## అంశం : 128

**స్వర్గంలో అన్నిరకాల ఫలవంతమైన చెట్లు ఉంటాయి. కానీ ఖర్జూరం, దానిమ్మ, ద్రాక్ష చెట్లు ఎక్కువగా ఉంటాయి.**

"వాటిలో పండ్లూ ఫలాలూ, ఖర్జూరాలూ, దానిమ్మ కాయలూ పుష్కలంగా ఉంటాయి. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరిస్తారు?"
(ఖుర్ఆన్, రహ్మాన్: 68-69)

"నిశ్చయంగా భయభక్తులు కలవారి కొరకు ఒక సాఫల్య స్థానం ఉంది; ఉద్యాన వనాలూ, ద్రాక్షతోటలూ ఉన్నాయి." (ఖుర్ఆన్, నబా: 32-33)

## అంశం : 129

**స్వర్గంలోని చెట్లకు ముళ్ళు ఉండవు.**

## అంశం : 130

**అరటి, రేగు చెట్లు స్వర్గంలో ఉంటాయి.**

## అంశం : 131

**స్వర్గంలో చెట్ల నీడలు ఎంతో పొడవుగా ఉంటాయి.**

"ఇక కుడిపక్షం వారు; కుడిపక్షం వారిని (అదృష్టాన్ని) గురించి ఏమనాలి? వారు ముళ్ళు లేని రేగు చెట్లు, అరటి పండ్ల గెలలు, దూరంగా వ్యాపించి ఉండే నీడలు, ఎల్లప్పుడూ ప్రవహించే నీరు, ఎన్నటికీ అంతం కాని, నిరాటంకంగా లభించే అసంఖ్యాకమైన పండ్లు మరియు ఎత్తైన ఆసనాల మధ్య ఉంటారు." (ఖుర్ఆన్, వాఖిఅహ్: 27-33)

## అంశం : 132

**స్వర్గంలోని చెట్లు ఎంత పచ్చగా కళకళలాడుతూ ఉంటాయంటే, అవి ముదురు పచ్చని రంగులో ఉంటాయి.**

## అంశం : 133

**స్వర్గంలోని చెట్లు ఎల్లప్పుడూ పచ్చగా కళకళలాడుతూ ఉంటాయి.**

"అవి దట్టమైన ముదురు పచ్చని తోటలు. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరిస్తారు?" (ఖుర్ఆన్, రహ్మాన్ : 64-65)

## అంశం : 134

**స్వర్గంలోని చెట్ల కొమ్మలు పచ్చగా, పొడవైనవిగా, దట్టమైనవిగా ఉంటాయి.**

"(స్వర్గలోకపు చెట్లు) పచ్చగా, కనుల పండువుగా ఉండే కొమ్మలతో, రెమ్మలతో నిండి ఉంటాయి. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరిస్తారు?' (ఖుర్ఆన్, రహ్మాన్ : 48-49)

## అంశం : 135

**స్వర్గంలోని ఒక చెట్టు నీడ ఎంత పొడవుగా ఉంటుందంటే ఒక గుర్రం అందులో నిరంతరాయంగా వంద సంవత్సరాల పాటు ప్రయాణించినప్పటికీ అది అంతరించదు.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "స్వర్గంలోని ఒక చెట్టు నీడ ఎంత పొడవుగా ఉంటుందంటే ఒక గుర్రం అందులో నిరంతరాయంగా వంద సంవత్సరాల పాటు ప్రయాణించినప్పటికీ అది అంతరించదు. ఒకవేళ ఖుర్ఆన్ ద్వారా దీనిని అర్థం చేసుకోవాలనుకుంటే (ఖుర్ఆన్‌లోని 'వాఖిఅహ్' సూరహ్ 30వ వాక్యం) 'వ జిల్లిమ్ మమ్దూద్' (పొడవైన నీడ)ను చదువుకోండి. స్వర్గంలో ఏదయినా వ్యక్తికి చెందిన ఒక విల్లు పట్టే స్థలం (ప్రపంచంలో) సూర్యుడు ఏయే వస్తువులపై ఉదయిస్తాడో లేదా అస్తమిస్తాడో వాటన్నింటికంటే ఉత్తమమైనది." (దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[1]

## అంశం : 136

**స్వర్గంలో అన్ని చెట్ల కాండాలూ బంగారంతో చేయబడి ఉంటాయి.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "స్వర్గంలో బంగారంతో చేయబడిన కాండాన్ని కలిగి వుండని చెట్టు ఏదీ ఉండదు." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[2]

## అంశం : 137

**(స్వర్గంలో) కొన్ని ఖర్జూరపు చెట్ల కాండం పచ్చ రంగులో ఉంటుంది. అలాగే దాని రెమ్మల మూలాలు ఎరుపు కలిసిన బంగారు రంగులో ఉంటాయి.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(ర) ఈ విధంగా పేర్కొన్నారు: "స్వర్గంలో ఖర్జూరపు చెట్టు కాండం పచ్చరంగులో ఉంటుంది. అలాగే దాని రెమ్మ మూలం ఎరుపు కలిసిన

బంగారు రంగులో ఉంటుంది. దాని కొమ్మతో స్వర్గవాసుల వస్త్రాలు తయారుచేయ బడతాయి. వారి వస్త్రాలు, అంగీలు కూడా దానితోనే తయారు చేయబడతాయి. ఖర్జూరపు పండు జాడీ లేదా బాల్చీకు సమానంగా ఉండి పాల కంటే తెల్లగా, తేనె కంటే తియ్యగా, వెన్న కంటే మెత్తగా ఉంటుంది. దానిలో కఠినత్వం ఏమాత్రం ఉండదు.'' (షరహుస్సున్నహ్)[3]

## అంశం : 138

### ఈ క్రింది స్తోత్రాన్ని పఠించడం వల్ల స్వర్గంలో నాలుగు అత్యుత్తమమైన చెట్లు నెలకొల్పబడతాయి.

హజ్రత్ అబూహురైరహ్(ర) ఈ విధంగా పేర్కొన్నారు: నేను ఒక చెట్టును నాటుతుం డగా అటువైపుగా వెళ్తున్న దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా ప్రశ్నించారు : ''ఓ అబూహురైరహ్! ఎవరికోసం చెట్టు నాటుతున్నావు?'' ''నా కోసమే'' అని నేను సమాధానమిచ్చాను. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా పలికారు : ''ఇంతకంటే మంచి చెట్టు గురించి నీకు తెలుపనా?'' ''ఓ దైవప్రవక్తా (స) తప్పకుండా తెలపండి'' అని నేను పలికాను. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా పలికారు :''సుబ్హానల్లాహ్ (అల్లాహ్ పరమ పవిత్రుడు) వల్హమ్దులిల్లాహ్ (స్తోత్రం కేవలం అల్లాహ్ కొరకే) వ లా ఇలాహ ఇల్లల్లాహు (అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు లేడు) వల్లాహు అక్బర్ (అల్లాహ్ అందరికంటే గొప్పవాడు) అని పలకడం వల్ల ప్రతి పదానికి బదులుగా నీ కొరకు స్వర్గంలో ఒక చెట్టు నాటబడుతుంది.''

(దీనిని ఇబ్నెమాజహ్ ఉల్లేఖించారు, సహీహ్)[4]

## అంశం : 139

### క్రింది వాక్యాన్ని పఠించడం వల్ల స్వర్గంలో ఖర్జూరపు చెట్టు నాటబడుతుంది:

హజ్రత్ జాబిర్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: '''ఏ వ్యక్తయితే 'సుబ్హానల్లాహిల్ అజీమి వ బిహమ్దిహీ' (మహోన్న తుడైన అల్లాహ్ తన స్తోత్రంతో సహా పరమ పవిత్రుడు'' అని పలుకుతాడో అతడి కొరకు స్వర్గంలో ఒక ఖర్జూరపు చెట్టు నాటబడుతుంది.''

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[5]

## అంశం : 140

**'తూబా' అనేది స్వర్గంలోని ఒక చెట్టు పేరు. దాని నీడ ఎంత పొడవుగా ఉంటుందంటే దానిని అధిగమించడానికి వంద సంవత్సరాలు పడుతుంది.**

## అంశం:141

**తూబా చెట్టు పండ్ల గుత్తుల ద్వారా స్వర్గవాసుల వస్త్రాలు తయారుచేయ బడతాయి.**

హజ్రత్ అబూ సఈద్ ఖుద్రీ(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "తూబా అనేది స్వర్గంలోని ఒక చెట్టు పేరు. దాని నీడ ఎంత పొడవుగా ఉంటుందంటే దానిని అధిగమించేందుకు వంద సంవత్సరాలు పడుతుంది. స్వర్గవస్త్రాలు దాని పండ్లగుత్తుల నుంచే తయారు చేయ బడతాయి."

(దీనిని అహ్మద్ ఉల్లేఖించారు, సహీహ్)[6]

## అంశం : 142

**'జైతూన్' అనేది స్వర్గంలోని ఒక చెట్టు పేరు.**

వివరణ కొరకు అంశం - 410లో పేర్కొనబడిన హదీసును అధ్యయనం చేయండి.

---

**అథః సూచికలు :**

1. కితాబ్ బదఉల్ ఖలఖ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతిల్ జన్నహ్
2. అబ్వాబ్ సిఫతుల్ జన్నహ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతి అష్జారుల్ జన్నహ్ 2049 / 2)
3. కితాబుల్ ఫితన్, బాబ్ సిఫతుల్ జన్నహ్ వ అహ్లిహా
4. కితాబుల్ అదబ్, బాబ్ ఫజ్లుత్తస్బీహ్ (3069 /2)
5. సహీహ్ జామిఉత్తిర్మిజీ, లిల్ అల్బానీ, అల్ జుజ్ఉస్సాలిస్, హదీస్ నెం:2757
6. సిల్సిలయె అహాదీస్ అస్సహీహహ్ లిల్ అల్బానీ, అల్ జుజ్ఉర్రాబిఅ, హదీస్ నెం:958

# స్వర్గలోకపు పండ్లు

## అంశం : 143

**స్వర్గవాసుల కొరకు స్వర్గలోకపు పండ్లు విస్తృతంగా లభిస్తాయి.**

## అంశం : 144

**స్వర్గంలో ప్రతి ఋతువుకు చెందిన పండు ప్రతి సమయం లభ్యమవుతుంది.**

## అంశం : 145

**స్వర్గలోకపు పండ్లను పొందేందుకై ఎవరి అనుమతినీ పొందవలసిన అవసరముండదు.**

## అంశం : 146

**స్వర్గలోకపు పండ్ల ఖజానా ఎన్నటికీ అంతరించదు.**

## అంశం : 147

**స్వర్గలోకపు పండ్లు కుళ్ళిపోకుండా సురక్షితంగా ఉంటాయి.**

## అంశం : 148

**అరటి, రేగు స్వర్గంలో ఉండే పండ్లు.**

"ఇక కుడిపక్షం వారు; కుడిపక్షం వారిని (అదృష్టాన్ని) గురించి ఏమనాలి? వారు ముళ్ళు లేని రేగు చెట్లు, అరటి పండ్ల గెలలు, దూరంగా వ్యాపించి ఉండే నీడలు, ఎల్లప్పుడూ ప్రవహించే నీరు, ఎన్నటికీ అంతం కాని, నిరాటంకంగా లభించే అసంఖ్యాకమైన పండ్లు మరియు ఎత్తైన ఆసనాల మధ్య ఉంటారు." (ఖుర్ఆన్, వాఖిఅహ్: 27-33)

"దాని (స్వర్గలోకపు) ఫలాలు శాశ్వతమైనవి; దాని నీడ అంతరించదు. భయభక్తుల వారి ప్రతిఫలం ఇలా ఉంటుంది." (ఖుర్ఆన్, రఅద్ : 35)

## అంశం : 149

**స్వర్గంలో ప్రతి స్వర్గవాసి కొరకు అతడికి ఇష్టమైన పండ్లన్నీ ఉంటాయి.**

"దైవభీతి కలవారు ఈ రోజున నీడల క్రింద సెలయేళ్ళ మధ్య ఉన్నారు. వారు ఏ పండ్లు కోరినా (అవి వారి కొరకు సిద్ధంగా ఉన్నాయి). హాయిగా తినండి, త్రాగండి, మీరు చేసి ఉండిన కర్మలకు ప్రతిఫలంగా. మేము సజ్జనులకు ఇటువంటి ప్రతిఫలాన్నే ఇస్తూ ఉంటాము." (ఖుర్ఆన్, ముర్సలాత్: 41-44)

## అంశం : 150

**స్వర్గలోకపు పండ్లు అన్నివేళలా స్వర్గవాసులకు అందుబాటులో ఉంటాయి. వారు నిలబడిన స్థితిలో, కూర్చొని ఉన్న స్థితిలో, నడుస్తూ ఉన్న స్థితిలో ఇష్టమొచ్చినప్పుడు వాటిని కోసుకొని తింటారు.**

"స్వర్గలోకపు ఛాయలు వారి పైకి వంగి నీడను ఇస్తూ ఉంటాయి. దాని పండ్లు ఎల్లవేళలా వారికి అందుబాటులో ఉంటాయి. (వారు తమ ఇష్టానుసారం వాటిని తెంచుకొని తింటారు)" (ఖుర్ఆన్, దహ్ర్: 14)

## అంశం : 151

**స్వర్గలోకపు ఖర్జూరం జాడీ పరిమాణంలో ఉంటుంది. అది పాల కంటే తెల్లగా, తేనె కంటే తియ్యగా, వెన్న కంటే మెత్తగా ఉంటుంది.**

వివరణ కొరకు అంశం - 137 లో పేర్కొనబడిన హదీసును అధ్యయనం చేయండి.

## అంశం : 152

**స్వర్గలోకపు ఒక పండ్లగుత్తి ఎంతపెద్దగా ఉంటుందంటే ఒకవేళ అది ప్రపంచంలోకి వచ్చినట్లయితే దైవప్రవక్త సహచరుల సమూహం ప్రళయదినం వరకు దానిని తినడాన్ని ముగించజాలదు.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (ర) 'కసూఫ్ నమాజ్'కు సంబంధించి ఉల్లేఖించిన దాని ప్రకారం దైవప్రవక్త సహచరులు (ర) దైవప్రవక్త (స)ను ఈ విధంగా ప్రశ్నించారు: "ఓ దైవప్రవక్తా(స)! మేము మిమ్మల్ని (నమాజ్ చదువుతున్న స్థితిలో) మీరు మీ స్థలం నుంచి ఏదో వస్తువును తీసుకోవడాన్ని చూశాము. ఆ తర్వాత మీరు (ఆ వస్తువును తీసుకోవడాన్ని) విరమించుకోవడాన్ని చూశాము." అప్పుడు దైవప్రవక్త(స) ఇలా పేర్కొన్నారు: "నేను స్వర్గాన్ని చూశాను. అలాగే దానికి చెందిన ఒక పండ్లగుత్తిని తీసుకోవాలనుకున్నాను. ఒకవేళ నేను దానిని కోసుకు న్నట్లయితే ప్రపంచమున్నంత వరకు మీరు దానిని తింటూ ఉండేవారు." (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[1]

## అంశం : 153

**స్వర్గలోకపు ఒక పండ్లగుత్తి ఒకవేళ ప్రపంచంలోకి వచ్చినట్లయితే భూమ్యాకాశాలలో ఉన్న జీవరాశులన్నీ తిన్నప్పటికీ అది అంతరించదు.**

హజ్రత్ జాబిర్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "నా ముందుకు స్వర్గం, అందులోని పండ్లు, పూలు, పచ్చదనం

వంటి సమస్త భోగ వస్తువులూ తీసుకురాబడ్డాయి. నేను వాటిలో నుండి మీ కోసం ద్రాక్షగుత్తిని తీసుకోవాలనుకున్నాను. కానీ ఆపివేయబడ్డాను. ఒకవేళ నేను ఆ పండ్లగుత్తిని మీ కోసం తీసుకువచ్చినట్లయితే భూమ్యాకాశాల్లోని జీవరాశులన్నీ దానిని ముగించేందుకై తింటాయి. (కానీ అది అయిపోదు.)'' (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు, సహీహ్)[2]

**వివరణ :** **స్వర్గలోకపు సౌఖ్యాలను వివరించే ఇటువంటి హదీసులు ముస్లిముల కయితే ఆశ్చర్యం కలిగించవు. ఎందుకంటే వారు జమ్‌జమ్ బావి గత ఆరువేల సంవత్సరాలుగా ప్రవహిస్తూ సజీవంగా ఉండటాన్ని, దాని ద్వారా విశ్వాసులు ప్రతి సంవత్సరం ప్రయోజనం పొందుతూ ఉండటాన్ని చూస్తున్నారు. రమజాన్ మాసంలోనూ, హజ్ సందర్భంలోనూ ప్రతి వ్యక్తీ కళ్ళారా ఈ వరానుగ్రహాన్ని చూస్తాడు. ప్రజలు దానిని సంతృప్తికరంగా వినియోగించు కోవడమే కాకుండా తమ తమ పట్టణాలకు, దేశాలకు తిరిగి వెళ్తూ ఎటువంటి ఆటంకమూ లేకుండా తమ ఇష్టాను సారం తమతో తీసుకెళ్తారు. అయినప్పటికీ జమ్‌జమ్ నీటిలో ఏమాత్రం తగుదలా సంభవించలేదు, అంతరించనూ లేదు. ప్రళయదినం వరకు ఈ నీరు ఇలాగే వినియో గించబడుతూ ఉంటుంది. అల్లాహ్ తన స్తోత్రంతో కూడి పరమ పవిత్రుడు, పరమోన్నతుడు.**

## అంశం : 154

**ఖర్జూరం, దానిమ్మపండు, ద్రాక్షపండ్లు స్వర్గానికి చెందిన పండ్లు.**

వివరణ కొరకు అంశం - 128లో పేర్కొనబడిన హదీసును అధ్యయనం చేయండి.

## అంశం : 155

**అత్తిపండు స్వర్గానికి చెందిన పండు.**

## అంశం : 156

**స్వర్గంలోని పండ్లన్నీ టెంకలు లేనివయి ఉంటాయి.**

హజ్రత్ అబూ దర్దా(ర) ఈ విధంగా ఉల్లేఖించారు: దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) సన్నిధిలో అత్తిపండ్లతో కూడిన ఒక పళ్ళెం సమర్పించబడింది. దైవప్రవక్త(స) ''తినండి'' అని పేర్కొన్నారు. ఆయన (స) స్వయంగా అందులో నుంచి అత్తి పండు తిన్నారు. ఆ తర్వాత ఈ విధంగా పేర్కొన్నారు: ''ఒకవేళ ఏదయినా పండు స్వర్గం నుంచి అవతరించిందని పేర్కొనవలసి వస్తే దీనినే పేర్కొంటాను. ఎందుకంటే స్వర్గలోకపు ఫలాలు టెంకలు లేకుండా ఉంటాయి. కనుక తినండి. అత్తిపండు మొలలను నయం చేస్తుంది. అలాగే కీళ్ళనొప్పులు నయమయ్యేందుకు ప్రయోజనకరం.

('తిబ్బె నబవీ' అనే గ్రంథంలో ఇబ్నె ఖయ్యిమ్ దీని గురించి ప్రస్తావించారు)[3]

## అంశం : 157

**స్వర్గవాసులు ఏదయినా చెట్టు నుంచి పండును కోసినట్లయితే దాని స్థానంలో వెంటనే కొత్త పండు ఉనికిలోకి వస్తుంది.**

హజ్రత్ సూబాన్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఏ వ్యక్తయినా స్వర్గంలో పండును కోసినట్లయితే దాని స్థానంలో మరొక పండు ఉనికిలోకి వస్తుంది." (దీనిని తిబ్రానీ ఉల్లేఖించారు, సహీహ్)[4]

---

**అథః సూచికలు :**

1. కితాబ్ సలాతుల్ కసూఫ్
2. అన్నహాయహ్ లి ఇబ్నె కసీర్ (2 / 367)
3. అత్తిబ్వున్నబీ, పేజీ నెం: 318
4. మజ్మఉజ్జవాయిద్ (10 / 414)

# స్వర్గలోకపు కాలువలు

## అంశం : 158

**స్వర్గంలో తియ్యనైన నీరు, రుచికరమైన పాలు, రుచికరమైన మద్యం, స్వచ్ఛమైన తేనెతో కూడిన కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి.**

## అంశం : 159

**స్వర్గలోకపు కాలువల పానీయాల రంగు, రుచి ఎల్లప్పుడూ ఒకేవిధంగా ఉంటాయి.**

"భయభక్తులు కలవారికి వాగ్దానం చేయబడిన స్వర్గం వైభవం ఇలా ఉంది, అందులో నిర్మలమైన నీటి కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి, ఏ మాత్రమూ మారని రుచి గల పాల కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి, సేవించే వారికి మధురంగా ఉండే మద్యపు కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి, స్వచ్ఛమైన తేనె కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి."

(ఖుర్‌ఆన్, ముహమ్మద్ : 15)

## అంశం : 160

**'సీహాన్', 'జీహాన్', 'ఫిరాత్', 'నీల్' అనేవి స్వర్గలోకపు కాలువలు.**

హజ్రత్ అబూ హురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: " 'సీహాన్', 'జీహాన్', 'ఫిరాత్', 'నీల్' అనేవి స్వర్గలోకపు కాలువలు."

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[1]

## అంశం : 161

**'కౌసర్' అనేది స్వర్గలోకానికి చెందిన ఒక కాలువ. దాని నీరు పాలకంటే తెల్లగా, తేనె కంటే తియ్యగా ఉంటుంది.**

## అంశం : 162

**'కౌసర్' అనేది అల్లాహ్ తరపు నుంచి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స)కు ఇవ్వబడిన కానుక.**

హజ్రత్ అనస్ బిన్ మాలిక్(ర) ఈ విధంగా పేర్కొన్నారు : దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స)ను ఎవరో ఇలా ప్రశ్నించారు: "కౌసర్ అంటే ఏమిటి?" దైవప్రవక్త (స) ఇలా బదులిచ్చారు: "అది అల్లాహ్ నాకు స్వర్గంలో ప్రసాదించిన ఒక కాలువ. దాని నీరు పాల కంటే తెల్లగా, తేనె కంటే తియ్యగా ఉంటుంది. అందులో ఒంటెల మెడలను పోలిన మెడలను కలిగి వుండే పక్షులు ఎగురుతూ ఉంటాయి." అప్పుడు హజ్రత్ ఉమర్ (ర) ఈ విధంగా పేర్కొంటారు: "ఆ పక్షులు ఎంతో సుఖంగా ఉన్నాయి." అప్పుడు దైవప్రవక్త(స) ఇలా పేర్కొన్నారు: "ఆ పక్షులను తినేవారు ఇంకా సుఖంగా ఉన్నారు."

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు)[2]

**వివరణ కొరకు 'కౌసర్ సెలయేరు' అనే అధ్యాయాన్ని అధ్యయనం చేయండి.**

## అంశం : 163

**స్వర్గవాసులు తమ కోరికకు అనుగుణంగా స్వర్గలోకపు కాలువల నుంచి చిన్న చిన్న కాలువలను తమ తమ భవంతుల వైపుకు మళ్ళించగలరు.**

హజ్రత్ హకీమ్ బిన్ ముఆవియహ్(ర) తన తండ్రి ద్వారా దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నట్లుగా ఉల్లేఖించారు: "స్వర్గంలో నీరు, తేనె, పాలు, మద్యంతో కూడిన కాలువలు ఉంటాయి. ఆ కాలువల నుంచి (చిన్న) కాలువలు వెలువడతాయి. (అవి స్వర్గవాసుల భవంతుల్లోకి వెళ్తాయి)"

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు)[3]

**పైన పేర్కొనబడిన హదీసుతో పాటు అంశం-166ను కూడా అధ్యయనం చేయండి.**

## అంశం : 164

**స్వర్గంలోని కాలువల్లో ఒక కాలువ పేరు 'నహ్రె హయాత్' (జీవత్వపు కాలువ). దాని నీటిని నరకం నుంచి వెలువడే వారిపై వేసినప్పుడు వారు తిరిగి విత్తనం మొలకెత్తినట్లుగా ఉద్భవిస్తారు.**

హజ్రత్ అబూ సఈద్ ఖుద్రీ(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "అల్లాహ్ తన కరుణ ద్వారా తాను కోరుకున్నవారిని స్వర్గంలోకి ప్రవేశింపజేస్తాడు. అలాగే నరకానికి అర్హులయినవారిని నరకంలోకి ప్రవేశింపజేస్తాడు. ఆ తర్వాత (తాను కోరుకున్న కాలం గడచిన తర్వాత) ఇలా పేర్కొంటాడు: "చూడండి. ఏ వ్యక్తి హృదయంలోనయితే ఆవగింజంత విశ్వాసమైతే ఉందో అతడిని నరకాగ్ని నుంచి వెలికితీయండి. అప్పుడు అటువంటి ప్రజలు బొగ్గు వలె కాలిపోయి ఉన్న స్థితిలో వెలికి వస్తారు. అప్పుడు వారు 'నహ్రె హయాత్' (జీవత్వపు కాలువ)లో పడవేయబడతారు. అప్పుడు వారు తుపానులో విత్తనం మొలకెత్తి నంత వేగంగా (సరియైన స్థితిలో) ఉద్భవిస్తారు. మీరెప్పుడయినా ఆ విత్తనం (తుపానులో) ఏవిధంగా పసుపుపచ్చగా చుట్టుకుంటూ మొలకెత్తుతుందో చూడలేదా?" (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[4]

---

**అధః సూచికలు :**

1. కితాబుల్ జన్నహ్ వ సిఫతు నఈమిహా
2. అబ్వాబుల్ జన్నహ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతి తిబ్రుల్ జన్నహ్
3. అబ్వాబుల్ జన్నహ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతిల్ అన్హారిల్ జన్నహ్ (2/ 2078)
4. కితాబుల్ ఈమాన్, బాబ్ ఇస్బాతుష్షఫాఅహ్

# స్వర్గలోకపు సెలయేళ్ళు

## అంశం : 165

**స్వర్గంలోని ఒక సెలయేరు పేరు 'సల్‌సబీల్'. దాని నుంచి శొంఠి కలిసిన మద్యం వెలువడుతుంది.**

"వారి మధ్య వెండి పాత్రలు, గాజు గ్లాసులు అటూ ఇటూ తిప్పబడుతూ ఉంటాయి; ఆ గాజు గ్లాసులు స్ఫటికం వలె తెల్లనైన వెండితో చేయబడినటువంటివి. వాటిని (స్వర్గ నిర్వాహకులు) ఖచ్చితమైన అంచనా ప్రకారం నింపి ఉంటారు. అక్కడ వారికి శొంఠి కలిపిన మధుపాత్రలు ఇవ్వబడతాయి; ఇది స్వర్గం లోని 'సల్‌సబీల్ అనే పేరు గల ఒక సెలయేరు." (ఖుర్‌ఆన్, దహ్ర్: 15-18)

## అంశం : 166

**స్వర్గంలోని ఒక సెలయేరు పేరు 'కాఫూర్'. దాని మద్యాన్ని స్వర్గవాసులు ఆస్వాదిస్తారు.**

"సజ్జనులు (స్వర్గంలో) కర్పూర జలం కలిపిన మధుపాత్రలను సేవిస్తారు; ఇది ప్రవహించే ఒక సెలయేరు; దైవదాసులు దాని నీటితో పాటు మద్యం సేవిస్తారు. వారు తాము కోరిన చోటికి దాని పాయలను సులభంగా తీసుకుపోతారు."

(ఖుర్‌ఆన్, దహ్ర్: 5-6)

## అంశం : 167

**స్వర్గంలోని ఒక సెలయేరు పేరు 'తస్‌నీమ్'. దాని స్వచ్ఛమైన నీరు కేవలం అల్లాహ్ సాన్నిధ్యం పొందిన వారికి మాత్రమే ఇవ్వబడుతుంది.**

## అంశం : 168

**సజ్జనులకు ఉత్తమమైన మద్యంలో 'తస్‌నీమ్' సెలయేటి నీటిని కలిపి తాగేందుకు ఇవ్వబడుతుంది.**

"నిస్సందేహంగా సజ్జనులు సుఖసంతోషాలలో తేలియాడుతూ ఉంటారు, ఉన్నత పీఠాలపై కూర్చుండి (స్వర్గ దృశ్యాలను) తిలకిస్తూ ఉంటారు. వారి ముఖాలలో నీకు సుఖసంతోషాల కళాకాంతులు కనిపిస్తాయి. ముద్ర వేయబడిన, సుమధుర మధువు వారికి ఇవ్వబడుతుంది. దానిపై కస్తూరి ముద్ర వేయబడి ఉంటుంది. ఇతరుల్ని మించిపోవడానికి కృషి చేయాలి. ఆ మధువులో 'తస్నీమ్' కలిసి ఉంటుంది. ఇదొక సెలయేరు, దీని జలంతో పాటు దైవసాన్నిధ్యం పొందినవారు మధువు సేవిస్తారు" (ఖుర్‌ఆన్, ముతఫ్ఫిఫీన్ : 22-28)

## అంశం : 169

**కొన్ని సెలయేళ్ళ నుంచి తెల్లని, కాంతివంతమైన, రుచికరమైన మద్యం వెలువడుతుంది.**

"వారి కొరకు అందరూ ఎరిగిన ఆహారమే ఉన్నది, రుచికరమైన అన్ని రకాల పదార్థాలు ఉన్నాయి, భోగభాగ్యాలతో విలసిల్లే ఉద్యానవనాలు ఉన్నాయి, అందు వారు సగౌరవంగా ఉంచబడతారు. సోఫాలపై ఎదురెదురుగా కూర్చుంటారు. మద్యపు చెలమల నుండి పాత్రలు మాటి మాటికీ నింపబడి వారి మధ్య తిప్పబడతాయి. మెరిసిపోతున్న మధువు, తాగేవారికి అది ఎంతో మధురం. దానివల్ల వారి శరీరానికీ నష్టం ఉండదు, వారి బుద్ధీ చెడిపోదు." (ఖుర్‌ఆన్, సాఫ్ఫాత్ : 41-45)

## అంశం : 170

**కొన్ని సెలయేళ్ళు జలపాతాల వలె ఉప్పొంగుతూ ఉంటాయి.**

"ఆ రెండు తోటలలోనూ రెండు చెలమలు పొంగి పొరలుతూ ఉంటాయి. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరిస్తారు?" (ఖుర్‌ఆన్, రహ్మాన్: 66-67)

## అంశం : 171

**స్వర్గవాసుల హృదయానికి, కళ్ళకు చల్లదనం చేకూర్చేందుకై సెలయేళ్ళు, జలపాతాలు కూడా ఉంటాయి.**

"అందులో సెలయేళ్ళు ప్రవహిస్తూ ఉంటాయి." (ఖుర్‌ఆన్, గాషియహ్: 12)

"(స్వర్గంలో) దూరంగా వ్యాపించి ఉండే నీడలు, ఎల్లప్పుడూ ప్రవహించే నీరు ఉంటాయి." (ఖుర్‌ఆన్, వాఖిఅహ్: 30-31)

## అంశం : 172

**పైన పేర్కొనబడిన సెలయేళ్ళే కాకుండా స్వర్గవాసుల ఆతిథ్యం కొరకు ఎన్నోచోట్ల వివిధ సెలయేళ్ళు ఉంటాయి.**

"దైవభీతి గలవారు శాంతి భద్రతలు గల ప్రదేశంలో ఉంటారు. ఉద్యానవాలలో, సెలయేళ్ళలో ఉంటారు." (ఖుర్‌ఆన్, దుఖాన్ : 51-52)

"దైవభీతి కలవారు ఈ రోజున నీడల క్రింద సెలయేళ్ళ మధ్య ఉన్నారు. వారు ఏ పండ్లు కోరినా (అవి వారి కొరకు సిద్ధంగా ఉన్నాయి)." (ఖుర్‌ఆన్, ముర్‌సలాత్: 41-42)

# కౌసర్ కాలువ

**అంశం : 173**

**'కౌసర్' అనేది స్వర్గంలోని ఒక సెలయేరు. అల్లాహ్ దానిని కేవలం తన ప్రవక్త అయిన హజ్రత్ ముహమ్మద్ (స)కు మాత్రమే ప్రసాదించాడు.**

**అంశం : 174**

**'కౌసర్ కాలువ' అనేది స్వర్గలోకపు అతి పెద్దదైన, ఉన్నతమైన కాలువ.**

హజ్రత్ అనస్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: "నేను (మేరాజ్ సందర్భంలో) స్వర్గం గుండా వెళ్ళే సమయంలో ఒక కాలువను చూశాను. దాని రెండు తీరాలపైనా ముత్యాల బురుజులు లోపలివైపు నుంచి చెక్కబడి ఉన్నాయి. నేను దైవదూత హజ్రత్ జిబ్రయీల్ (అ) ను ఇలా ప్రశ్నించాను: "ఇది ఏమిటి?" హజ్రత్ జిబ్రయీల్ (అ) ఇలా బదులిచ్చారు: "ఇది మీకు మీ ప్రభువు ప్రసాదించిన కౌసర్." (దైవప్రవక్త (స) ఇలా పేర్కొన్నారు) "దాని మట్టి లేదా సువాసన గాఢమైన కస్తూరి వలె ఉంది." (దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[1]

**అంశం : 175**

**కౌసర్ కాలువకు చెందిన రెండు తీరాలూ బంగారంతో చేయబడినవి. ముత్యాలు, వజ్రాలు దాని కొరకు గులకరాళ్ళుగా ఉపయోగించబడ్డాయి. అలాగే దాని మట్టి కస్తూరి కంటే సువాసన గలది.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: "కౌసర్ అనేది స్వర్గం లోని ఒక సెలయేరు. దాని రెండు తీరాలూ బంగారంతో చేయబడ్డాయి. దాని నీరు ముత్యాలపై, మణులపై ప్రవహిస్తుంది. దాని మట్టి కస్తూరి కంటే సువాసన గలది. దాని నీరు తేనె కంటే తియ్యగా, మంచు కంటే తెల్లగా ఉంటుంది." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు)[2]

**అంశం : 176**

**కౌసర్ కాలువలో ఒంటె మెడలను పోలిన మెడలను కలిగి ఉండే పక్షులు ఉంటాయి. వాటి మాంసాన్ని స్వర్గవాసులు ఆస్వాదిస్తారు.**

**వివరణ కొరకు అంశం–162లో పేర్కొనబడిన హదీసును అధ్యయనం చేయండి.**

గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే 'కౌసర్ కాలువ', 'కౌసర్ కొలను' అనేవి రెండూ వేర్వేరు వస్తువులు. కౌసర్ కాలువ స్వర్గం లోపల ఉంటుంది. అయితే కౌసర్ కొలను స్వర్గానికి బయట హషరు మైదానంలో ఉంటుంది. అక్కడ దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) పీఠం మీద నిలబడి తన పవిత్రమైన హస్తాలతో విశ్వాసుల దాహాన్ని దాని ద్వారా తీరుస్తారు. (అల్లాహ్‌కే సర్వం ఎరుక). కౌసర్‌తో సంబంధాన్ని కలిగి వున్న కారణంగా మేము 'కౌసర్ కొలను'కు సంబంధించిన హదీసులను కూడా ఇదే అధ్యాయంలో చేర్చాము.

అథః సూచికలు :

1. కితాబుర్రిఖాఖ్, బాబ్ ఫిల్ హౌజ్
2. అబ్వాబుత్తఫ్సీర్, బాబ్ తఫ్సీర్ సూరతుల్ కౌసర్ (3 / 2677)

# కౌసర్ కొలను

**అంశం : 177**

**కౌసర్ కొలను వద్ద దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) స్వయంగా నీటిని తాగించేవారయి ఉంటారు.**

**అంశం : 178**

**యమన్ వాసుల కొరకు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఇతరులను కౌసర్ కొలను నుంచి పక్కకు తప్పించి వేస్తారు.**

**అంశం : 179**

**కౌసర్ కొలనుకు చెందిన ఒక మూల పొడవు మదీనా నుంచి అమాన్ వరకు గల మధ్యదూరానికి సమానంగా ఉంటుంది.**

**అంశం : 180**

**కౌసర్ కొలను నీరు పాలకంటే తెల్లగా, తేనె కంటే తియ్యగా ఉంటుంది.**

హజ్రత్ సూబాన్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "కౌసర్ కొలను ఒడ్డున నేను యమన్ వాసుల కొరకు ఇతరులను నా లాఠీతో పక్కకు తొలగిస్తాను. చివరకు కొలను నీరు యమన్ వాసుల కొరకు ప్రవహిస్తుంది. (దానితో వారు కడుపునిండా త్రాగుతారు)" దైవప్రవక్త (స) ను ఎవరో ఇలా ప్రశ్నించారు: "కొలను వెడల్పు ఎంత ఉంటుంది?" దైవప్రవక్త (స) "మదీనా నుంచి అమాన్ వరకు గల మధ్యదూరానికి సమానంగా ఉంటుంది" అని బదులిచ్చారు. ఆ తర్వాత "కొలను నీరు ఎలా ఉంటుంది?" అని ప్రశ్నించగా దైవప్రవక్త(స) ఇలా బదులిచ్చారు: "పాల కంటే తెల్లగా, తేనె కంటే తియ్యగా ఉంటుంది" అని బదులిచ్చారు. ఆ తర్వాత ఆయన (స) ఇలా పేర్కొన్నారు: "నా కొలనులో స్వర్గానికి చెందిన రెండు సన్నని కాలువల నుంచి నీరు వస్తుంది. వాటిలో ఒకటి బంగారంతో చేయబడినదై ఉంటుంది, రెండవది వెండితో చేయబడినదై ఉంటుంది." (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[1]

వివరణ :

1) **'అమాన్' అనేది జోర్డాన్ రాజధాని పేరు. అది మదీనా నుంచి 1000 కిలోమీటర్ల దూరంలో ఉంది.**

**2) ఇతర హదీసుల ద్వారా కౌసర్ కొలను నాలుగు అంచులూ సమానంగా ఉంటాయి. దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: "కొలను వెడల్పు దాని పొడవుకు సమానంగా ఉంటుంది." (తిర్మిజీ)**

## అంశం : 181

**కౌసర్ కొలనుపై బంగారు, వెండి మధుపాత్రలు ఉంటాయి. వాటి సంఖ్య ఆకాశంలోని నక్షత్రాల సంఖ్యకు సమానంగా ఉంటుంది.**

హజ్రత్ అనస్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: "కౌసర్ కొలను మీద మీరు ఆకాశంలోని నక్షత్రాల సంఖ్యకు సమానంగా బంగారు, వెండి మధుపాత్రలు చూస్తారు." (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[2]

## అంశం : 182

**దైవప్రవక్త ముహమ్మద్ (స) ఉన్నతాసనం ప్రళయదినాన కౌసర్ కొలను మీద ఉంచబడుతుంది. దానిమీద కూర్చొని ఆయన(స) తన అనుచర సమాజానికి నీరు తాగిస్తారు.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "నా గదికి, మింబర్ (మసీదులో మూడు మెట్లతో కూడిన పీఠం)కు మధ్యలో ఉండే స్థలం స్వర్గలోకపు తోటల్లో ఒక తోట. నా మింబర్ (పీఠం) (ప్రళయదినాన) నా కొలను (కౌసర్) మీద ఉంచబడుతుంది." (దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[3]

## అంశం : 183

**ఒక్క పర్యాయం కౌసర్ కొలను నీటిని తాగిన వ్యక్తికి ఇక ఎన్నటికీ దాహం కలుగదు.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: "(స్వర్గంలో) మీ ముందు ఒక కొలను ఉంటుంది. దానికి చెందిన ఒక అంచు 'జర్బా' నుంచి 'అజ్రహ్' (సిరియా దేశానికి చెందిన రెండు నగరాలు పేర్లు) వరకు గల మధ్యదూరానికి సమానంగా ఉంటుంది. దానిమీద ఆకాశంలోని నక్షత్రాల సంఖ్యకు సమానంగా మధుపాత్రలు ఉంచబడి ఉంటాయి. ఒక్క పర్యాయం కౌసర్ కొలను నీటిని తాగిన వ్యక్తికి ఇక ఎన్నటికీ దాహం కలుగదు."

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[4]

## అంశం : 184

**కౌసర్ కొలను అందరికంటే ముందు పేదవారయిన ముహాజిర్లు (దైవప్రవక్త(స) కాలంలో మక్కా నుంచి మదీనాకు హిజ్రత్ చేసినవారు) హాజరవుతారు.**

హజ్‌రత్ సూబాన్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "నా కొలను వద్దకు అందరికంటే ముందు పేదవారయిన, దుమ్ము పేరుకుపోయిన తలలు కలిగిన, మురికి వస్త్రాలు ధరించిన, ఉన్నతమైన రీతిలో పెరిగిన స్త్రీలను వివాహమాడే స్థోమత లేని, ధనవంతుల చేత ఆహ్వానించబడని ముహాజిర్లు హాజరవుతారు." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[5]

## అంశం : 185

**ప్రతి దైవప్రవక్తకూ ప్రళయదినాన ఒక కొలను ఇవ్వబడుతుంది. తమకు ఇవ్వబడిన కొలనుల నుంచి వారు తమ అనుచర సమాజాలకు నీటిని తాగిస్తారు.**

## అంశం : 186

**దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్ (స)కు చెందిన కొలను వద్దకు వచ్చేవారి సంఖ్య ఇతర దైవప్రవక్తలందరి వద్దకు వచ్చేవారి సంఖ్య కంటే ఎక్కువగా ఉంటుంది.**

హజ్‌రత్ సమురహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ప్రతి దైవప్రవక్త కొరకు ఒక కొలను (ప్రళయదినాన) ఉంటుంది. దైవప్రవక్తలందరూ ఎవరి కొలను వద్ద నీటిని తాగేందుకు వచ్చేవారు ఎక్కువగా ఉన్నారు? అనే విషయం పట్ల పరస్పరం గర్విస్తారు. అయితే నా కొలను వద్ద నీటిని తాగేందుకు వచ్చేవారి సంఖ్య అందరికంటే ఎక్కువగా ఉంటుందని నేను ఆశిస్తున్నాను."

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[6]

## అంశం : 187

**దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్ (స) ప్రళయదినాన తన అనుచర సమాజానికి ఆతిథ్యమిచ్చేవారుగా ఉంటారు.**

## అంశం : 188

**ధర్మంలో క్రొత్త అంశాలను లేవదీసేవారు ప్రళయదినాన కౌసర్ కొలను నుంచి నీటిని తాగని స్థితిలో వెనుదిరుగుతారు.**

హజ్‌రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : "నేను కొలను వద్ద మీకు ఆతిథ్యమిచ్చేందుకై ఉంటాను. మీ లో కొందరు అక్కడకు తీసుకురాబడతారు. ఆ తర్వాత వారు నా నుంచి దూరం చేయబడతారు. అప్పుడు నేను "ఓ నా ప్రభువా! వీరు నా అనుచర సమాజానికి

చెందినవారు.'' అందుకు బదులుగా అల్లాహ్ ఈ విధంగా పలుకుతాడు: ''మీ తర్వాత వీరు ధర్మంలో ఎటువంటి కొత్త కొత్త విషయాలను లేవదీశారో మీకు తెలియదు''

(దీనిని బుఖారీ ఉల్లేఖించారు, సహీహ్)[7]

## అంశం : 189

**అవిశ్వాసులు కౌసర్ కొలను వద్దకు వచ్చి నీటిని తాగాలనుకుంటారు. కానీ దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) వారిని దూరం చేసివేస్తారు.**

## అంశం : 190

**దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) తన అనుచర సమాజానికి చెందినవారిని వుజూ కారణంగా మెరుస్తున్న నుదుటిని, చేతులను, కాళ్ళను చూసి గుర్తు పడతారు.**

హజ్రత్ హుజైఫహ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: ''ఎవరి అధీనంలోనయితే నా ప్రాణముందో ఆ అస్తిత్వం సాక్షిగా! ఒంటెల యజమాని ఇతర ఒంటెలను పక్కకు తప్పించే విధంగా నేను కౌసర్ కొలను నుంచి అవిశ్వాసులను పక్కకు తప్పించివేస్తాను.'' అప్పుడు ఆయన (స) సహచరులు (ర) ఈ విధంగా ప్రశ్నించారు: ''ఓ దైవప్రవక్తా (స)! మీరు మమ్మల్ని గుర్తుపడతారా?'' దైవప్రవక్త(స) ఇలా బదులిచ్చారు: ''అవును. మీరు నా వద్దకు వచ్చినప్పుడు వుజూ (నమాజ్ కొరకు చేయబడే శుద్ధికార్యం) కారణంగా మీ నుదుళ్ళు, చేతులు, కాళ్ళు మెరుస్తూ ఉంటాయి. మీరు కలిగి ఉండే ఆ లక్షణం ఇతర దైవప్రవక్తల అనుచర సమాజాలలో ఉండదు.

(దీనిని ఇబ్నెమాజహ్ ఉల్లేఖించారు, సహీహ్)[8]

---

**అథః సూచికలు :**

1. కితాబుల్ ఫజాయిల్, బాబ్ ఇస్బాత్ హౌజ్ నబీనా
2. కితాబుల్ ఫజాయిల్, బాబ్ ఇస్బాత్ హౌజ్ నబీనా
3. కితాబుర్రిఖాఖ్, బాబ్ ఫిల్ హౌజ్
4. కితాబుల్ ఫజాయిల్, బాబ్ ఇస్బాత్ హౌజ్ నబీనా
5. అబ్వాబ్ సిఫతుల్ ఖియామహ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతిల్ హౌజ్
6. అబ్వాబ్ సిఫతుల్ ఖియామహ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతిల్ హౌజ్ (2 / 1988)
7. కితాబుర్రిఖాఖ్, బాబ్ ఫిల్ హౌజ్
8. కితాబుజ్జుహద్, బాబ్ ఫిల్ హౌజ్ (2 / 3471)

# స్వర్గవాసుల అన్నపానీయాలు

## అంశం : 191

**స్వర్గవాసులకు అన్నింటికంటే ముందు చేప ద్వారా ఆతిథ్యం ఇవ్వబడుతుంది. ఆ తర్వాత స్వర్గవాసులకు రెండవ ఆహారంగా ఎద్దు మాంసం ఇవ్వబడుతుంది.**

## అంశం : 192

**స్వర్గవాసులకు అన్నింటికంటే ముందు 'సల్‌సబీల్' అనే సెలయేటి నీరు పానీయంగా ఇవ్వబడుతుంది.**

దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్ (స) ద్వారా బానిసత్వం నుంచి విముక్తి పొందిన హజ్‌రత్ సూబాన్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు: నేను దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్(స) వద్ద నిల్చున్నాను. ఇంతలో ఒక యూదు పండితుడు వచ్చి ఈ విధంగా ప్రశ్నించసాగాడు: "భూమ్యాకాశాలు తారుమారు చేయబడే సమయంలో మానవులు ఎక్కడ ఉంటారు?" దైవప్రవక్త (స) ఇలా బదులిచ్చారు: "సిరాత్ వంతెనకు సమీపంలో అంధకారంలో నిలబడి ఉంటారు." ఆ యూదు పండితుడు తిరిగి ఇలా ప్రశ్నించాడు: "సిరాత్ వంతెనను అందరి కంటే ముందు ఎవరు అధిగమిస్తారు?" దైవప్రవక్త (స) ఇలా బదులిచ్చారు: "పేదవారయిన ముహాజిర్లు (మక్కా నుంచి మదీనాకు హిజ్‌రత్ చేసినవారు)" ఆ యూదు పండితుడు తిరిగి ఇలా ప్రశ్నించాడు: "స్వర్గవాసులు స్వర్గంలోకి ప్రవేశించినప్పుడు అన్నింటికంటే ముందు వారికి ఏది కానుకగా సమర్పించబోతుంది? " దైవప్రవక్త (స) ఇలా బదులిచ్చారు: "చేప కాలేయం" యూదు పండితుడు తిరిగి ఇలా ప్రశ్నించాడు: "ఆ తర్వాత వారి ఆహారం ఏమయి ఉంటుంది?" దైవప్రవక్త (స) ఇలా బదులిచ్చారు: "స్వర్గవాసుల కొరకు స్వర్గంలో మేసే ఎద్దు జబహ్ (బలి) చేయబడుతుంది. (దాని మాంసం వారికి తినిపించ బడుతుంది)" యూదు పండితుడు తిరిగి ఇలా ప్రశ్నించాడు: "తిన్న తర్వాత తాగేందుకు స్వర్గవాసులకు ఏమి ఇవ్వబడుతుంది? " దైవప్రవక్త (స) ఇలా బదులిచ్చారు: "సల్‌సబీల్ సెలయేటి నీరు" అప్పుడు యూదు పండితుడు "మీరు నిజం పలికారు" అని పలికాడు.

(దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[1]

## అంశం : 193

**మనం నివసిస్తున్న భూమి స్వర్గవాసులకు రొట్టెగా మారుతుంది.**

హజ్‌రత్ అబూ సఈద్ ఖుద్‌రీ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్(స) ఇలా పేర్కొన్నారు: "ప్రళయదినాన ఈ భూమి ఒక రొట్టె వలె మారుతుంది.

మీలో ఎవరయినా ప్రయాణంలో ఏవిధంగానయితే తన రొట్టెను (చేతుల్లో) తలకిందులుగా మారుస్తూ ఉంటాడో అదేవిదంగా అల్లాహ్ తన చేతిలో దానిని (రొట్టె వలె మారిన భూమిని) తలకిందులుగా, పైకీ, కిందికీ మారుస్తాడు. ఆ రొట్టె ద్వారా స్వర్గవాసులకు ఆతిథ్యం ఇవ్వబడుతుంది. (దీనిని బుఖారీ మరియు ముస్లిమ్ ఉల్లేఖించారు)[2]

**అంశం : 194**

**స్వర్గంలోని అత్యుత్తమ పానీయమైన 'తస్‌నీమ్' కేవలం అల్లాహ్ సాన్నిధ్యం పొందినవారికి మాత్రమే ఇవ్వబడుతుంది.**

**అంశం : 195**

**స్వర్గానికి చెందిన శుద్ధమైన, పవిత్రమైన 'రహీఖ్' అనే మధువును స్వర్గవాసు లందరూ ఆస్వాదిస్తారు.**

**అంశం : 196**

**స్వర్గవాసులకు మూతలు బిగించబడి వున్న 'రహీఖ్' మధుపాత్రలు అందించబడతాయి.**

**అంశం : 197**

**స్వర్గవాసులు 'రహీఖ్' అనే మధువును సేవించి కస్తూరి రుచిని అనుభూతి చెందుతారు.**

**(వివరణ కొరకు 'అంశం-165'.లో పేర్కొనబడిన ఖుర్ఆన్ వాక్యాన్ని అధ్యయనం చేయండి)**

**అంశం : 198**

**స్వర్గవాసులు స్వర్గంలో కౌసర్ పానీయాన్ని కూడా పొందుతారు.**

వివరణ కొరకు 'అంశం-176'లోని హదీసును అధ్యయనం చేయండి.

**అంశం : 199**

**స్వర్గంలో తెల్లని, మెరుస్తున్న మధువు కూడా స్వర్గవాసుల ఆతిథ్యం కొరకు ఉంటుంది.**

**అంశం : 200**

**స్వర్గలోకపు మధువును సేవించిన తర్వాత స్పృహ కోల్పోవడమూ జరగదు, బుద్ధిలోనూ లోపం ఏర్పడదు.**

"మద్యపు చెలమల నుండి పాత్రలు మాటి మాటికీ నింపబడి వారి మధ్య తిప్పబడ తాయి. మెరిసిపోతున్న మధువు, త్రాగేవారికి అది ఎంతో మధురం. దాని వల్ల శరీరానికీ నష్టం ఉండదు, వారి బుద్ధి చెడిపోదు." (ఖుర్ఆన్, సాఫ్ఫాత్: 45-47)

"వారి మధ్య (స్వర్గవాసుల మధ్య) వెండి పాత్రలు, గాజు గ్లాసులు అటూ ఇటూ తిప్పబడుతూ ఉంటాయి. ఆ గాజుగ్లాసులు స్ఫటికం వలె తెల్లనైన వెండితో చేయబడిన టువంటివి. వాటిని (స్వర్గ నిర్వాహకులు) ఖచ్చితమైన అంచనా ప్రకారం నింపి ఉంటారు." (ఖుర్ఆన్, దహ్ర్:15-16)

## అంశం : 201

**స్వర్గవాసుల సేవలో 'తుహూర్' అనే మధువుతో నింపబడిన పాత్రలు సమర్పించబడతాయి.**

**వివరణ కొరకు 'అంశం-219'లోని ఖుర్ఆన్ వాక్యాన్ని అధ్యయనం చేయండి.**

## అంశం : 202

**శొంఠి కలపబడిన మధువు స్వర్గవాసులకు తాగించబడుతుంది.**

**వివరణ కొరకు 'అంశం-165'లోని ఖుర్ఆన్ వాక్యాన్ని అధ్యయనం చేయండి.**

## అంశం : 203

**కర్పూరం కలపబడిన మధుపాత్రలు కూడా స్వర్గవాసుల సేవలో సమర్పించబడతాయి.**

**వివరణ కొరకు 'అంశం-166'లోని ఖుర్ఆన్ వాక్యాన్ని అధ్యయనం చేయండి.**

## అంశం : 204

**స్వర్గవాసులు తాగేందుకై స్వర్గంలో తియ్యని నీరు, రుచికరమైన పాలు, రుచికరమైన మధువు, శుభ్రమైన తేనెలతో కూడిన కాలువలు కూడా ఉంటాయి.**

**వివరణ కొరకు 'అంశం-158'లోని ఖుర్ఆన్ వాక్యాన్ని అధ్యయనం చేయండి.**

## అంశం : 205

**ప్రవహించే సెలయేళ్ళ నీటిని కూడా స్వర్గవాసులు ఆస్వాదిస్తారు.**

"స్వర్గంలో ప్రవహించే సెలయేళ్ళు ఉంటాయి." (ఖుర్ఆన్, గాషియహ్:12)

**అంశం : 206**

**స్వర్గంలోని మధువును సేవించడం వల్ల స్వర్గవాసులకు తల తిప్పుడూ ఉండదు, బుద్ధిలోనూ లోపం ఏర్పడదు.**

**అంశం : 207**

**స్వర్గవాసులకు ఇష్టమైన పండ్లు వారి అభీష్టానుసారం విస్తృతంగా అందించబడతాయి**

**అంశం : 208**

**స్వర్గవాసులకు ఇష్టమైన పక్షుల మాంసం వేయించబడి వారి సేవలో సమర్పించ బడుతుంది.**

"వారి (స్వర్గవాసుల) సేవలో నిత్య బాల్యం కల బాలురు, మధువు ప్రవహించే చెలమ నుండి నింపిన మధుపాత్రలు, గిన్నెలు, గాజుపాత్రలు, కూజాలు తీసుకొని పరుగెడుతూ తిరుగుతూ ఉంటారు. దానిని తాగడం వల్ల వారి తల తిరగడం గానీ, వారికి బుద్ధిమాంద్యం కలగడం గానీ జరగదు. వారు తమకు ఇష్టమైన దానిని తీసుకునేందుకై వారి ముందు రకరకాల రుచికరమైన పండ్లను ఉంచుతారు. అలాగే తమకు ఇష్టమైన మాంసం తినేందుకై పక్షుల మాంసాన్ని ఉంచుతారు." (ఖుర్ఆన్, వాఖిఅహ్: 17-21)

**అంశం : 209**

**స్వర్గవాసుల ఆతిథ్యం కొరకు ఇతర ఫలాలతో పాటు ఖర్జూరం, ద్రాక్షపండ్లు, దానిమ్మ పండ్లు, రేగు పండ్లు, అత్తిపండ్లు కూడా విస్తృతంగా ఉంటాయి.**

**వివరణ కొరకు 'స్వర్గలోకపు పండ్లు' అనే అధ్యాయాన్ని చదవండి.**

**అంశం : 210**

**కౌసర్ కొలనులో ఎగిరే పక్షుల మాంసాన్ని సైతం స్వర్గవాసులు ఆస్వాదిస్తారు.**

**అంశం : 211**

**స్వర్గవాసులకు స్వర్గంలో రోజంతా విందులు ఇవ్వబడుతూ ఉంటాయి.**

"స్వర్గవాసుల కొరకు స్వర్గంలో ఉదయం మరియు సాయంత్ర వేళల్లో ఆహారం తయారవుతుంది." (ఖుర్ఆన్, మర్యమ్:62)

## అంశం : 212

## స్వర్గంలో ప్రతి వ్యక్తికీ వందమందితో సమానంగా తినగలిగే సామర్థ్యం ప్రసాదించబడుతుంది.

హజ్రత్ జైద్ బిన్ అర్ఖమ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఇలా పేర్కొన్నారు: "ప్రతి స్వర్గవాసికీ తినడంలో, తాగడంలో, లైంగిక కార్యంలో పాల్గొనడంలో వందమందికి సమానమైన శక్తి ప్రసాదించబడుతుంది. స్వర్గవాసుల మల విసర్జన విధానమేమిటంటే వారి శరీరం నుంచి చెమట వెలువడి నంతనే వారి శరీరాలు మునుపటి వలె తేలికయిపోతాయి." (తిబ్రానీ)[1]

## అంశం : 213

## స్వర్గవాసుల అన్నపానీయాలు వారు తేన్చడం వల్ల, చెమట వల్ల అరిగిపోతాయి.

వివరణ కొరకు 'అంశం-288'లో పేర్కొనబడిన హదీసును అధ్యయనం చేయండి.

## అంశం : 214

## స్వర్గవాసులకు వెండితోనూ, తెల్లగా మెరిసిపోయే గాజుతోనూ చేయబడిన పాత్రల్లో అన్నపానీయాలు సమర్పించబడతాయి.

"వారి మధ్య బంగారు పళ్ళాలూ, గిన్నెలూ తిప్పబడతాయి. మనసు ఇష్టపడే, కళ్ళకు ఇంపుగా ఉండే ప్రతి వస్తువూ అక్కడ ఉంటుంది. వారితో "ఇక మీరు ఇక్కడే శాశ్వతంగా ఉంటారు. మీరు ప్రపంచంలో చేసిన కర్మల కారణంగా మీరు ఈ స్వర్గానికి వారసుల య్యారు. మీకు ఇక్కడ పండ్లు పుష్కలంగా లభిస్తాయి. వాటిని మీరు తింటారు"

(ఖుర్ఆన్, జుఖ్రుఫ్ :71-73)

---

**అథః సూచికలు :**

1. కితాబుల్ హైజ్, బయాన్ మనియుర్రజులు వల్ మర్అతు
2. మిష్కాతుల్ మసాబీహ్, కితాబుల్ ఫితన్, బాబుల్ హషర్, అల్ ఫస్లుల్ అవ్వలు
3. సహీహుల్ జామిఉస్సగీర్, లిల్ అల్బానీ, హదీస్ నెం: 1623

# స్వర్గవాసుల వస్త్రాలు, ఆభరణాలు

## అంశం : 215

**స్వర్గవాసులు సన్నని జలతారు పట్టువస్త్రాలు ధరిస్తారు.**

## అంశం : 216

**స్వర్గవాసులు చేతులకు బంగారు కంకణాలు ధరిస్తారు.**

"ఇక విశ్వసించి సత్కార్యాలు చేసే వారి విషయం- మేము నిశ్చయంగా వారి ప్రతిఫలాన్ని వృధా చేయము. వారికై నిత్య హరిత వనాలు ఉన్నాయి; వాటి క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి; అక్కడ వారు బంగారు కంకణాలు ధరిస్తారు; ఆకుపచ్చని సన్నని జలతారు పట్టువస్త్రాలు ధరిస్తారు; ఎత్తయిన ఆసనాలపై దిండ్లకు ఆనుకొని ఆసీనులై ఉంటారు. అది ఎంత శ్రేష్ఠమైన ప్రతిఫలం! అది ఎంత మహోన్న తమైన నివాస స్థలం!"
(ఖుర్ఆన్, కహఫ్ :30-31)

## అంశం : 217

**శుద్ధమైన పట్టు వస్త్రాలను, శుద్ధమైన బంగారు ఆభరణాలను, శుద్ధమైన ముత్యాల ఆభరణాలను, అలాగే ముత్యాలు కూర్చబడిన బంగారు ఆభర ణాలను కూడా స్వర్గవాసులు వినియోగిస్తారు.**

"విశ్వసించి మంచి పనులు చేసినవారిని అల్లాహ్, క్రింద సెలయేళ్ళు ప్రవహించే ఉద్యానవనాలలో ప్రవేశింపజేస్తాడు. అక్కడ వారు స్వర్ణ కంకణాలతో, ముత్యాలతో అలంకరించబడతారు. వారు పట్టు వస్త్రాలు ధరిస్తారు." (ఖుర్ఆన్, హజ్: 23)

"శాశ్వతంగా ఉండే ఉద్యానవనాలలోకి వారు ప్రవేశిస్తారు. అక్కడ వారిని సువర్ణ కంకణాలతో, ముత్యాలతో అలంకరించడం జరుగుతుంది. అక్కడ వారు పట్టు వస్త్రాలు ధరిస్తారు."
(ఖుర్ఆన్, ఫాతిర్ : 33)

## అంశం : 218

**స్వర్గవాసులు స్వర్గంలో సన్నని జలతారు పట్టు వస్త్రాలతో పాటు సిల్కు వస్త్రాలను కూడా ధరిస్తారు.**

"దైవభీతి గలవారు శాంతిభద్రతలు గల ప్రదేశంలో ఉంటారు. ఉద్యానవనాలలో, సెలయేళ్ళలో, సన్నని పట్టు వస్త్రాలూ, జరీ పట్టు వస్త్రాలూ ధరించి, ఒకరికొకరు ఎదురుగా

కూర్చుండి ఉంటారు. ఇలా ఉంటుంది వారి దర్పం. పసిమి రంగు మేనులూ, అందమైన విశాలమైన కళ్ళూ గల స్త్రీలను వారికి ఇచ్చి వివాహం చేస్తాము. అక్కడ వారు రుచికరమైన అన్ని రకాల పదార్థాలనూ నిస్సంకోచంగా అడుగుతారు. అక్కడ వారు మరణాన్ని ఎన్నటికీ రుచి చూడరు. ప్రపంచంలో వచ్చిన మరణమే మరణం. అల్లాహ్ తన కృపతో వారిని నరక శిక్ష నుంచి కాపాడుతాడు. ఇదే గొప్ప సాఫల్యం." (ఖుర్ఆన్, దుఖాన్: 51-57)

## అంశం : 219

**స్వర్గవాసులు వెండి ఆభరణాలను కూడా ధరిస్తారు.**

"వారి (స్వర్గవాసుల) సేవ కొరకు పరుగెత్తుతూ అటూ ఇటూ తిరిగే బాలురు ఉంటారు; వారు ఎల్లప్పుడూ బాలురుగానే ఉంటారు. మీరు వారిని చూస్తే, వెదజల్లబడిన ఆణిముత్యాలుగా భావిస్తారు. అక్కడ మీరు ఎటుచూచినా దైవానుగ్రహాలే మీకు కనిపిస్తాయి; ఇంకా ఒక మహత్తరమైన సామ్రాజ్య వైభవం కనిపిస్తుంది. వారి ఒంటిపై సన్నని ఆకుపచ్చని పట్టువస్త్రాలు, ఖరీదైన జలతారు అల్లిన దుస్తులు ఉంటాయి. వారికి వెండి మురుగులు తొడుగుతారు. వారి ప్రభువు వారికి ఎంతో పరిశుద్ధమైన మధువును ప్రసాదిస్తాడు."

(ఖుర్ఆన్, దహ్ర్: 19-21)

## అంశం : 220

**స్వర్గవాసుల వస్త్రాలూ ఎప్పటికీ పాతబడవు.**

**వివరణ కొరకు 'అంశం - 286'లోని హదీసును అధ్యయనం చేయండి.**

## అంశం : 221

**స్వర్గలోకపు మహిళలు ఒకే సమయంలో 70 జతల వస్త్రాలు ధరిస్తారు. ఆ వస్త్రాలు ఎంత ఉత్తమంగా ఉంటాయంటే వాటి లోపలి నుంచి వారి కాలి పిక్కలలోని గుజ్జు సైతం కనిపిస్తుంది.**

**వివరణ కొరకు 'అంశం - 251'లోని హదీసును అధ్యయనం చేయండి.**

## అంశం : 222

**స్వర్గలోకపుస్త్రీల వోణీ ఇహలోకపు సమస్తసంపద కంటే విలువైనదిగా ఉంటుంది.**

**వివరణ కొరకు 'అంశం - 249'లోని హదీసును అధ్యయనం చేయండి.**

## అంశం : 223

**ఎర్రని బంగారు రంగులో ఉండే ఖర్జూరపు కొమ్మల పీచుతో స్వర్గవాసుల వస్త్రాలు తయారు చేయబడతాయి.**

**వివరణ కొరకు 'అంశం-137'లోని హదీసును అధ్యయనం చేయండి.**

## అంశం : 224

**స్వర్గవాసులు ఉత్తమమైన పట్టు రుమాళ్ళను వినియోగిస్తారు.**

హజ్రత్ బరా బిన్ ఆజిబ్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు : ఒక సందర్భంలో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) సన్నిధిలో ఒక పట్టు వస్త్రం సమర్పించబడింది. ప్రజలు దాని తెలుపు రంగు పట్ల, మృదుత్వం పట్ల ఆశ్చర్యచకితులయ్యారు. అప్పుడు దైవప్రవక్త(స) ఇలా పేర్కొన్నారు: "స్వర్గంలో సఅద్ బిన్ మఆజ్(ర)కు చెందిన రుమాళ్ళు వీటి కంటే ఉత్తమమైనవి." (దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[1]

## అంశం : 225

**వుజూ నీరు ఎక్కడెక్కడి వరకయితే చేరుకుంటుందో ఆ ప్రదేశం వరకు స్వర్గవాసులకు ఆభరణాలను తొడగడం జరుగుతుంది.**

హజ్రత్ అబూహురైరహ్(ర) ఈ విధంగా పేర్కొన్నారు : నేను నా మిత్రులయిన దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా ప్రవచిస్తుండగా విన్నాను: "స్వర్గంలో విశ్వాసికి అతడి వుజూ ఎక్కడి వరకయితే చేరుకుంటుందో అక్కడి వరకు ఆభరణాలు తొడిగించడం జరుగుతుంది. (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[2]

## అంశం : 226

**స్వర్గవాసులకు తొడగబడిన ఒక కంకణపు మెరుపు ముందు సూర్యుని కాంతి దిగదుడుపు అవుతుంది.**

హజ్రత్ సఅద్ బిన్ అబీ వఖాస్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : "స్వర్గంలోని వస్తువుల్లో ఒక గోటికి సమానమైన వస్తువేదయినా బహిర్గతమైనట్లయితే భూమ్యాకాశాల మధ్య ఉండే ప్రతి వస్తువునూ కాంతివంతం చేస్తుంది. ఒకవేళ ఒక స్వర్గవాసి తన కంకణాలన్నింటితో సహా ఒక్క పర్యాయం (ప్రపంచంలో) తొంగి చూసినట్లయితే సూర్యుని నక్షత్రాల కాంతిని అంతమొందించినట్లుగా సూర్యుని కాంతిని అంతమొందిస్తాడు." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[3]

## అంశం : 227

**స్వర్గలోకపు ఆభరణాలలో ఉపయోగించబడే ఒక ముత్యం ఇహలోకపు సమస్త సంపద కంటే విలువైనది.**

హజ్రత్ మిఖ్‌దామ్ బిన్ మఅదీ ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : “అల్లాహ్ దృష్టిలో అమరవీరులకు సంబంధించిన ఆరు మహిమలున్నాయి:

1. అమరగతిని పొందిన వెంటనే అతడి పాపాలన్నీ క్షమించివేయబడతాయి. అలాగే అతడికి ( అమరగతిని పొందుతున్న సమయంలోనే ) స్వర్గంలోని అతడి నివాసాన్ని చూపించడం జరుగుతుంది.
2. సమాధి శిక్ష నుంచి అతడు సురక్షితం కావించబడతాడు.
3. (ప్రళయదినాన) తీవ్రమైన ఆందోళన నుంచి అతడు రక్షించబడతాడు.
4. అతడి తల మీద ఎటువంటి గౌరవనీయమైన కిరీటం ఉంచబడుతుందంటే దానిలో పొదగబడిన ఒక వజ్రం ఇహలోకం, అందులో ఉన్న ప్రతి వస్తువు కంటే విలువైనదిగా ఉంటుంది.
5. స్వర్గంలో పెద్ద పెద్ద కళ్ళు గల 72 స్వర్గలోక కన్యలతో అతడి వివాహం జరిపించబడుతుంది.
6. అతడికి 70 మంది బంధుమిత్రుల కొరకు సిఫారసు చేసే అవకాశమివ్వ బడుతుంది.” (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు)[4]

---

**అథః సూచికలు :**

1. కితాబ్ బదఉల్ ఖల్ఖ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతిల్ జన్నహ్
2. కితాబుత్తహారత్, బాబ్ ఇస్తిజాబుత్తాలతుల్ ఫరహ్
3. అబ్వాబ్ సిఫతుల్ జన్నహ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతి అహ్లిల్ జన్నహ్ ( 2 / 2061 )
4. సహీహ్ జామిఉత్తిర్మిజీ, లిల్ అల్బానీ, అల్ జుజ్ఉస్సానీ, హదీస్ నెం: 1358

# స్వర్గవాసుల సభలు, సింహాసనాలు

## అంశం : 228

**స్వర్గవాసులు అపూర్వమైన, తెల్లని, పట్టు తివాచీల మీద దిండ్లు పరుచుకొని తమ తమ భవంతుల్లో, ఉద్యానవనాల్లో విరాజిల్లుతూ ఉంటారు.**

"స్వర్గవాసులు దళసరి పట్టు వస్త్రపు అంచు గల తివాచీలపై దిండ్లకు ఆనుకుని ఆసీనులై ఉంటారు. ఆ తోటలలోని చెట్ల కొమ్మలు పండ్లతో వంగిపోయి ఉంటాయి. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరించగలరు?"

(ఖుర్‌ఆన్, రహ్మాన్ : 54-55)

## అంశం : 229

**స్వర్గవాసులు వరుసలుగా, ఎదురెదురుగా ఉంచబడిన అందమైన ఆసనాల మీద ఆసీనులయి ఉంటారు.**

"వారు (స్వర్గవాసులు) వేయబడిన ఆసనాలపై దిండ్లకు ఆనుకుని ఎదురెదురుగా కూర్చొని ఉంటారు. మేము వారికి అందమైన కళ్ళు గల సుందరాంగులనిచ్చి వివాహం చేస్తాము." (ఖుర్‌ఆన్, తూర్ :20)

## అంశం : 230

**స్వర్గవాసులు ఎదురెదురుగా ఉంచబడిన సింహాసనాల మీద కూర్చొని రుచి కరమైన ఆహారపానీయాలను ఆస్వాదిస్తారు.**

"వారి కొరకు (స్వర్గవాసుల కొరకు) అందరూ ఎరిగిన ఆహారమే ఉన్నది, రుచికరమైన అన్ని రకాల పదార్థాలు ఉన్నాయి, భోగభాగ్యాలతో విలసిల్లే ఉద్యానవనాలు ఉన్నాయి. వాటిలో వారు సగౌరవంగా ఉంచబడతారు. సోఫాలపై ఎదురెదురుగా కూర్చుంటారు. మధువు చెలమల నుండి పాత్రలు మాటిమాటికీ నింపబడి వారి మధ్య తిప్పబడతాయి. మెరిసిపోతున్న మధువు, తాగేవారికి అది ఎంతో మధురం. దానివల్ల వారి శరీరానికి నష్టం ఉండదు, వారి బుద్ధీ చెడిపోదు." (ఖుర్‌ఆన్, సాఫ్ఫాత్ : 41-47)

## అంశం : 231

**సింహాసనాలతో అలంకరించబడిన, వెండి, వజ్రాలు పొదగబడిన ఆసనాలపై స్వర్గవాసులు ఎదురెదురుగా కూర్చొని మధుపాత్రలతో ఆనందిస్తారు.**

"ముందువారైతే ముందున్నవారే. వారే సాన్నిధ్యులు, సకల భోగభాగ్యాలతో నిండి ఉన్న స్వర్గవనాలలో ఉంటారు. వారిలో ముందువారి నుండి చాలామంది ఉంటారు, వెనుక వారి నుండి తక్కువ మంది ఉంటారు. బంగారు జలతారుతో అల్లిన ఆసనాలపై దిండ్లకు ఆనుకొని ఎదురెదురుగా కూర్చుండి ఉంటారు. వారి సమావేశాలలో నిత్య బాల్యం కల బాలురు, మధువు ప్రవహించే చెలమ నుండి నింపిన మధుపాత్రలు, గిన్నెలు, గాజుపాత్రలు, కూజాలు తీసుకొని పరుగెడుతూ తిరుగుతూ ఉంటారు. దానిని తాగడం వల్ల వారి తల తిరగడం గానీ, వారికి బుద్ధి మాంద్యం కలగడం గానీ జరగదు."

(ఖుర్‌ఆన్, వాఖిఅహ్: 10-19)

## అంశం : 232

**స్వర్గవాసుల ఆసనాలు ఆకుపచ్చని, అరుదైన, విలువయిన తివాచీలతో అలంకరించబడి ఉంటాయి.**

"స్వర్గవాసులు దళసరి పట్టు వస్త్రపు అంచు గల తివాచీలపై దిండ్లకు ఆనుకుని ఆసీనులై ఉంటారు. ఆ తోటలలోని చెట్ల కొమ్మలు పండ్లతో వంగిపోయి ఉంటాయి. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరించగలరు?"

(ఖుర్‌ఆన్, రహ్మాన్: 54-55)

## అంశం : 233

**కొన్ని ఆసనాలు ఎత్తయిన ప్రదేశాలపై ఉంటాయి. వాటి మీద ప్రతిచోటా ముత్యాల సింహాసనాలు, మృదువైన తివాచీలు, అందమైన పరుపులు, విలువైన దిండ్లు అలంకరించబడి ఉంటాయి. స్వర్గవాసులు తాము కోరుకున్న చోట సమావేశాలు ఏర్పాటు చేసుకుంటారు.**

"అక్కడ ఎత్తయిన పీఠాలు ఉంటాయి, పాత్రలు పెట్టబడి ఉంటాయి, పెద్ద పెద్ద దిండ్లు వరుసలు వరుసలుగా అమర్చబడి ఉంటాయి, అందమైన తివాచీలు పరచబడి ఉంటాయి."

(ఖుర్‌ఆన్, గాషిఅహ్: 13-16)

## అంశం : 234

**స్వర్గవాసులు గుబురు నీడల్లో, పీఠాల మీద తమ భార్యలతో ఆనందిస్తారు.**

"ఈనాడు స్వర్గవాసులు సుఖాలు అనుభవించడంలో నిమగ్నులై ఉంటారు. వారు, వారి సతీమణులూ చల్లని నీడలలో, మెత్తని పీఠాలపై విశ్రాంతి తీసుకుంటూ ఉంటారు."

(ఖుర్‌ఆన్, యాసీన్: 55-56)

# స్వర్గవాసుల సేవకులు

## అంశం : 235

**స్వర్గవాసుల సేవకులు ఎల్లప్పుడూ బాల్యావస్థలోనే ఉంటారు.**

## అంశం : 236

**స్వర్గవాసుల సేవకులు ముత్యాల వలె అందంగా కనిపిస్తారు.**

## అంశం : 237

**స్వర్గవాసుల సేవకులు ఎంత చురుకుగా ఉంటారంటే వారు అటూ ఇటూ తిరుగుతూ చెల్లాచెదురవుతూ, తిరిగి సమీకరించబడుతూ ఉన్న ముత్యాల వలె కనిపిస్తారు.**

"వారి (స్వర్గవాసుల) సేవ కొరకు పరుగెత్తుతూ అటూ ఇటూ తిరిగే బాలురు ఉంటారు; వారు ఎల్లప్పుడూ బాలురుగానే ఉంటారు. మీరు వారిని చూస్తే, వెదజల్లబడిన ఆణిముత్యాలుగా భావిస్తారు." (ఖుర్ఆన్, దహ్ర్ : 19)

## అంశం : 238

**స్వర్గవాసుల సేవకులు దుమ్మూ, ధూళి నుంచి సురక్షితం కావించబడిన ముత్యాల వలె శుభ్రంగా, సుందరంగా ఉంటారు.**

"వారి (స్వర్గవాసుల) సేవకొరకే ప్రత్యేకించబడిన, దాచబడిన ఆణిముత్యాల వంటి అందమైన బాలురు వారి సేవలో పరుగెడుతూ అటూ ఇటూ తిరుగుతూ ఉంటారు." (ఖుర్ఆన్, తూర్: 24)

## అంశం : 239

**కొంతమంది బహుదైవారాధకులకు చెందిన, యుక్తవయస్సుకు చేరుకోక ముందే మరణించిన పిల్లలు స్వర్గవాసుల సేవకులవుతారు.**

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు : నేను బహుదైవారాధకుల పిల్లల గురించి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ను ఈ విధంగా ప్రశ్నించాను: "శిక్షించేందుకై వారు పాపాలేమీ చేసి ఉండరు. మరి వారు నరకంలో ప్రవేశపెట్టబడతారా? స్వర్గలోకపు రాజులయ్యేందుకై వారు చేసిన పుణ్యకార్యాలూ ఉండవు. (మరి వారు ఎక్కడికి వెళ్తారు?) దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఇలా పేర్కొన్నారు: "వారు స్వర్గవాసుల సేవకులవుతారు." (దీనిని అబూ నఈమ్, అబూ యఅ్లా ఉల్లేఖించారు, సహీహ్)[1]

---

**అధః సూచిక : 1. సిల్ సిలహ్ అహాదీసుస్సహీహ, లిల్ అల్బానీ, హదీస్ నెం:1468**

# స్వర్గలోకపు స్త్రీలు

**అంశం : 240**

**స్వర్గలోకపు స్త్రీలు అన్నిరకాల బహిర్గత మాలిన్యాల నుంచి (ఉదా॥ ఋతుక్రమం), అన్నిరకాల అంతర్గత మాలిన్యాల నుంచి (ఉదా॥ కోపం, అసూయ, ద్వేషం మొదలైనవి) పవిత్రంగా ఉంటారు.**

"అక్కడ వారి కొరకు పవిత్రమైన భార్యలు ఉంటారు. వారు అక్కడే శాశ్వతంగా ఉంటారు." (ఖుర్ఆన్, బఖరహ్ : 25)

**అంశం : 241**

**స్వర్గంలో ప్రవేశించే స్త్రీలను అల్లాహ్ సరికొత్తగా సృష్టిస్తాడు. వారు కన్యలుగా స్వర్గంలోకి ప్రవేశిస్తారు.**

**అంశం : 242**

**స్వర్గలోకపు స్త్రీలు తమ భర్తలను కలుసుకున్న తర్వాత కూడా ఎల్లప్పుడూ కన్యలుగానే ఉంటారు.**

**అంశం : 243**

**స్వర్గలోకపు స్త్రీలు తమ భర్తలకు సమానమైన వయస్సును కలిగి ఉంటారు.**

**అంశం : 244**

**స్వర్గలోకపు స్త్రీలు తమ భర్తలను ఎంతగానో ప్రేమించేవారయి ఉంటారు.**

"వారి భార్యలను మేము ప్రత్యేకంగా, సరికొత్త పంథాలో సృష్టిస్తాము, వారిని కన్యలుగా చేస్తాము. వారు తమ భర్తలను అమితంగా ప్రేమిస్తారు, వయస్సులో సమంగా ఉంటారు. ఇదంతా కుడిపక్షం వారి కొరకు." (ఖుర్ఆన్, వాఖిఅహ్: 35-38)

**అంశం : 245**

**స్వర్గలోకపు స్త్రీలు సౌందర్యంలోనూ, సౌశీల్యంలోనూ అనుపమానమైనవారుగా ఉంటారు.**

"వారి భార్యలను మేము ప్రత్యేకంగా, సరికొత్త పంథాలో సృష్టిస్తాము, వారిని కన్యలుగా

చేస్తాము. వారు తమ భర్తలను అమితంగా ప్రేమిస్తారు, వయస్సులో సమంగా ఉంటారు. ఇదంతా కుడిపక్షం వారి కొరకు.'' (ఖుర్‌ఆన్, వాఖిఅహ్ : 35-38)

''ఈ మహాభాగ్యాల మధ్య శీలవతులూ, సౌందర్యవతులూ అయిన భార్యలు ఉంటారు. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరించగలరు?'' (ఖుర్‌ఆన్, రహ్మాన్: 70-71)

## అంశం : 246

**స్వర్గలోకపు సుఖాల పరిపూర్తి స్త్రీల సాన్నిధ్యం ద్వారానే జరుగుతుంది.**

''మీరూ, మీ భార్యలూ స్వర్గంలో ప్రవేశించండి, మిమ్మల్ని ఆనందింపజేయడం జరుగుతుంది.'' (ఖుర్‌ఆన్, జుఖ్‌రుఫ్ : 70)

## అంశం : 247

**విశ్వాసం, సదాచరణ ప్రాతిపదికన స్వర్గంలోకి ప్రవేశించే స్త్రీలు స్థాయిపరంగా స్వర్గంలోని దివ్యకన్యల (హూర్) కంటే ఉత్తములయి ఉంటారు.**

హజ్రత్ ఉమ్మె సల్‌మహ్ (ర) ఈ విధంగా ఉల్లేఖించారు : నేను ఒక సందర్భంలో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స)ను ఈ విధంగా ప్రశ్నించాను: ''దైవప్రవక్తా (స)! ఇహలోకపు స్త్రీలు ఉత్తములా? లేక స్వర్గంలోని దివ్యకన్యలా?'' దైవప్రవక్త (స) ఇలా బదులిచ్చారు: ''లోపలి వస్త్రం కంటే బయటి వస్త్రానికి ఏవిధంగా ప్రాధాన్యత ఉంటుందో అదేవిధంగా ఇహలోకపు స్త్రీలు స్వర్గలోకపు దివ్యకన్యలపై ప్రాధాన్యతను కలిగి ఉంటారు.'' అప్పుడు నేను ఇలా ప్రశ్నించాను: ''దైవప్రవక్తా ! దీనికి కారణమేమిటి?'' దైవప్రవక్త (స) ఇలా పలికారు: ''వారి నమాజులు, ఉపవాసాలు, ఇంకా అల్లాహ్ కొరకు వారు చేసిన ఇతర ఆరాధనలు'' (దీనిని తిబ్రానీ ఉల్లేఖించారు)[1]

## అంశం : 248

**స్వర్గలోకపు స్త్రీ ఒకవేళ ఇహలోకం వైపు ఒకసారి తొంగి చూసినట్లయితే తూర్పు నుంచి పడమర వరకు ఉన్న ప్రదేశమంతా కాంతివంతమవడమే కాకుండా సుగంధ భరితమవుతుంది.**

## అంశం : 249

**స్వర్గలోకపు స్త్రీ ఓణీ ఇహలోకం, అందులోని సమస్త సంపదల కంటే విలువైనది**

హజ్రత్ అనస్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : ''మొదటి జాములో లేదా చివరి జాములో అల్లాహ్ మార్గంలో

బయలుదేరడం ప్రపంచం, అందులో ఉన్న సమస్తం కంటే ఉత్తమమైనది. ఒకవేళ స్వర్గలోకపు స్త్రీలలో ఏ ఒక్క స్త్రీ అయినా (క్షణకాలం పాటు) ఇహలోకం వైపు తొంగి చూసినట్లయితే తూర్పు నుంచి పడమర వరకు ప్రతి వస్తువునూ కాంతివంతం చేసి వాతావరణాన్ని సుగంధభరితం చేస్తుంది. స్వర్గలోకపు స్త్రీ వోణీ ఇహలోకం, అందులోని సమస్త సంపదల కంటే విలువైనది.'' (దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[2]

## అంశం : 250

**స్వర్గంలో ప్రతి స్వర్గవాసి వివాహమూ హజ్రత్ ఆదమ్ (అ) సంతతికి చెందిన ఇద్దరు స్త్రీలతో జరుగుతుంది.**

## అంశం : 251

**స్వర్గలోకపు స్త్రీ ఒకే సమయంలో 70 జతల వస్త్రాలు ధరిస్తుంది. అవి ఎంత మహోన్నతంగా, తెల్లగా ఉంటాయంటే వాటి లోపలి నుంచి స్త్రీ శరీరం కనిపిస్తూ ఉంటుంది.**

## అంశం : 252

**స్వర్గలోకపు స్త్రీ ఎంత సుందరంగా ఉంటుందంటే ఆమె శరీరపు ఎముకల లోపలి గుజ్జు సైతం కనిపిస్తుంది.**

హజ్రత్ అబూ సఈద్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: '' ప్రళయదినాన మొట్టమొదట స్వర్గంలోకి ప్రవేశించే సమూహానికి చెందినవారి (స్త్రీ పురుషుల సమూహం) ముఖాలు పున్నమి నాటి చంద్రుని వలె మెరుస్తూ ఉంటాయి. మరొక సమూహానికి చెందినవారి ముఖాలు ఆకాశంలో మెరిసే అందమైన నక్షత్రాల వలె మెరుస్తూ ఉంటాయి. రెండు సమూహాలకు చెందిన పురుషులకూ ఇద్దరు ఇద్దరు చొప్పున భార్యలు ఇవ్వబడతారు. ప్రతి స్త్రీ 70 జతల వస్త్రాలు ధరించి ఉంటుంది. వాటిలో నుంచి ఆమె కాలి పిక్క లోపలి గుజ్జు కనిపిస్తూ ఉంటుంది.'' (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[3]

హజ్రత్ ముహమ్మద్ (ర) ఉల్లేఖనం ఈ విధంగా ఉంది :ప్రజలు 'స్వర్గంలో పురుషులు ఎక్కువగా ఉంటారా లేక స్త్రీలు ఎక్కువగా ఉంటారా?' అనే విషయం గురించి పరస్పరం చర్చించుకుంటూ ఉండగా హజ్రత్ అబూ హురైరహ్ (ర) ఈ విధంగా పలికారు: ''దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) మొట్టమొదట స్వర్గంలోకి

ప్రవేశించే సమూహానికి చెందినవారి (స్త్రీ పురుషుల సమూహం) ముఖాలు పున్నమి నాటి చంద్రుని వలె మెరుస్తూ ఉంటాయని, మరొక సమూహానికి చెందినవారి ముఖాలు ఆకాశంలో మెరిసే అందమైన నక్షత్రాల వలె మెరుస్తూ ఉంటాయని, రెండు సమూహాలకు చెందిన పురుషులకూ ఇద్దరు ఇద్దరు చొప్పున భార్యలు ఇవ్వడం జరుగుతుందని, ప్రతి స్త్రీ 70 జతల వస్త్రాలు ధరించి ఉంటుందని, వాటిలో నుంచి ఆమె కాలి పిక్క లోపలి గుజ్జు కనిపిస్తూ ఉంటుందని, స్వర్గంలో ఏ వ్యక్తీ అవివాహితుడిగా ఉండడని చెప్పి ఉండలేదా?'' (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[4]

ఇమామ్ ఇబ్నె కసీర్ (ర.అ) ఈ విధంగా పేర్కొన్నారు: '' పైన పేర్కొనబడిన హదీసులో ఇద్దరు భార్యలంటే ఆదమ్ (అ.స) సంతతికి చెందినవారని భావం. స్వర్గవాసులకు వారు కాకుండా స్వర్గలోకానికి చెందిన దివ్యకన్యలు విడిగా ప్రసాదించబడతారు.'' (అల్లాహ్‌కే సర్వం ఎరుక)[5]

## అంశం : 253

**స్వర్గలోకపు స్త్రీలు తమ ఇష్టానుసారం తమ ఇహలోకపు భర్తలకు భార్యలవుతారు (అయితే ఆ భర్తలు కూడా స్వర్గంలో ప్రవేశిస్తేనే సుమా). ఒకవేళ ఆ భర్తలు స్వర్గంలోకి ప్రవేశించకుంటే అల్లాహ్ ఆ స్త్రీలను స్వర్గంలోని ఇతర పురుషులకిచ్చి వివాహం చేస్తాడు.**

## అంశం : 254

**ఏ స్త్రీలకయితే ఇహలోకంలో (భర్తలు మరణించిన కారణంగా) రెండు లేదా మూడు లేదా అంతకంటే ఎక్కువమంది భర్తలు ఉండి ఉన్నట్లయితే వారికి తమ ఇష్టానుసారం ఒక భర్తతో భార్యగా ఉండే అనుమతి ఇవ్వబడుతుంది. ఆమె స్వయంగా ఎవరో ఒక భర్తను ఎంచుకొని అతడితో కలిసి ఉంటుంది.**

హజ్రత్ ఉమ్మె సల్‌మహ్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు: నేను ఒక సందర్భంలో దైవప్రవక్త (స)ను ఇలా ప్రశ్నించాను: ''ఓ దైవప్రవక్తా (స)! మా లో కొంతమంది స్త్రీలు (ఇహలోకంలో) ఇద్దరు లేదా ముగ్గురు లేదా నలుగురు పురుషులను (ఒకరి తర్వాత మరొకరిని) వివాహమాడతారు, మరణించిన తర్వాత స్వర్గంలోకి ప్రవేశిస్తారు. మరి వారిలో ఏ పురుషుడు వారికి (స్వర్గంలో) భర్తగా మారతాడు?'' దైవప్రవక్త (స) ఇలా బదులిచ్చారు: ''ఓ ఉమ్మె సల్‌మహ్! ఆ స్త్రీ ఆ పురుషులలో ఒకరిని ఎంచుకుంటుంది. ఆమె (నిశ్చయంగా) సద్గుణ సంపన్నుడినే

ఎంచుకుంటుంది. ఆ స్త్రీ అల్లాహ్‌తో ఈ విధంగా పేర్కొంటుంది: 'ఓ అల్లాహ్! ఈ పురుషుడు ఇహలోకంలో నా పట్ల అందరికంటే మంచిగా వ్యవహరించాడు. కనుక ఇతడితో నా వివాహాన్ని జరిపించండి.' ఉమ్మె సల్‌మహ్! మంచి నడవడిక ఇహపరలోకాల మేళ్ళన్నింటిపై ఆధిక్యతను కలిగి ఉంది." (దీనిని త్బ్రానీ ఉల్లేఖించారు)[6]

**అథః సూచికలు :**

1. మజ్‌మఉజ్జవాయిద్, అల్‌జుజ్‌ఉల్ ఆషిర్, పేజీ నెం: 417, 418
2. మిష్‌కాతుల్ మసాబీహ్, బాబ్ సిఫతుల్ జన్నహ్ వ అహ్‌లిహా, అల్ ఫస్‌లుల్ అవ్వలు
3. అబ్‌వాబుల్ జన్నహ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతిల్ జన్నహ్ (2 / 2057)
4. కితాబుల్ జన్నహ్ వ సిఫతు నఈమిహా
5. అన్నహాయ లి ఇబ్నె కసీర్, ఫిల్ ఫితన్ వల్ మలాహిమ్, అల్ జుజ్‌ఉస్సానీ, పేజీ నెం : 379
6. అన్నహాయ లి ఇబ్నె కసీర్, ఫిల్ ఫితన్ వల్ మలాహిమ్, అల్ జుజ్‌ఉస్సానీ, పేజీ నెం : 387

# స్వర్గలోకపు సుకన్యలు (హూర్)

**అంశం : 255**

**అంశం : 256**

**కొంతమంది స్వర్గలోకపు సుకన్యలు ఎర్రని వజ్రం వలె ఎర్రగా ఉంటారు.**

**అంశం : 257**

**స్వర్గలోకపు సుకన్యలు అనుపమాన సౌందర్యంతో పాటు సౌశీల్యంలోనూ, సిగ్గుబిడియాలలోనూ సాటిలేనివారుగా ఉంటారు.**

**అంశం : 258**

**మానవులకు చెందిన స్వర్గలోకపు సుకన్యలను అంతకుముందు ఏ మానవుడూ తాకి ఉండడు. అలాగే జిన్నులకు చెందిన స్వర్గలోకపు దివ్యకన్యలను అంతకు ముందు ఏ జిన్నాతూ తాకి ఉండడు.**

"ఈ మహాభాగ్యాల మధ్య సిగ్గులొలికే చూపులు గల సుకన్యలు ఉంటారు. ఈ స్వర్గవాసులకు పూర్వం వారిని ఏ మానవుడు గానీ, ఏ జిన్నాతు గానీ తాకి ఉండలేదు. కనుక మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు నిరాకరించగలరు? వారు కెంపుల మాదిరిగా ఎంతో అందంగా ఉంటారు. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరించగలరు?" (ఖుర్‌ఆన్, రహ్మాన్: 56-59)

**వివరణ :** గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే విశ్వసించి సత్కార్యాలు చేసిన మానవుల వలె విశ్వసించి సత్కార్యాలు చేసిన జిన్నాతులు (అగ్నితో సృజించ బడిన జీవులు) కూడా స్వర్గంలోకి ప్రవేశిస్తారు. ఏవిధంగానయితే మానవులయిన పురుషులకు స్వర్గంలో మానవజాతికి చెందిన స్త్రీలు, స్వర్గలోకపు దివ్యకన్యలు ప్రసాదిం చబడతాయో అదేవిధంగా పురుష జిన్నాతులకు కూడా స్వర్గంలో జిన్నాతులైన స్త్రీలు, స్వర్గలోకపు దివ్యకన్యలు ప్రసాదించబడతారు. అనగా మానవజాతికి చెందిన పురు షులకు సజాతీయులైన భార్యలు, జిన్నాతుల జాతికి చెందిన పురుషులకు సజా తీయులైన భార్యలు లభిస్తారు. (అల్లాహ్‌కే సర్వం ఎరుక)

**అంశం : 259**

**స్వర్గలోకపు సుకన్యలు ఎంత బిడియస్తులుగా ఉంటారంటే వారు తమ భర్తలను తప్ప ఏ పరపురుషుని వైపూ కన్నెత్తి చూడరు.**

## అంశం : 260

**స్వర్గలోకపు సుకన్యలు గ్రుడ్డు క్రింద దాగి ఉండే పొర కంటే మృదువుగా, నాజూకుగా ఉంటారు.**

"వారి దగ్గర తమ చూపులను నిగ్రహించుకునే అందమైన కళ్ళు గల స్త్రీలు ఉంటారు. వారు గ్రుడ్డు గుల్ల క్రింద దాగి ఉండే పొరలాంటి కోమలాంగులు."

(ఖుర్‌ఆన్, సాఫ్ఫాత్ : 48-49)

## అంశం : 261

**స్వర్గలోకపు సుకన్యలు ఎంత అందంగా, నల్లని కనులతో, ముత్యాల వలె తెల్లగా, ఆభరణాల పెట్టెలో సురక్షితంగా ఉంచబడిన వజ్రాల వలె ఉంటారు.**

"వారి కొరకు అందమైన కళ్ళు గల 'హూర్ లు' (స్వర్గలోకపు సుకన్యలు) ఉంటారు. వారు దాచిపెట్టిన ఆణిముత్యాల మాదిరిగా ఎంతో అందంగా ఉంటారు. ఇదంతా వారు ప్రపంచంలో చేస్తూ వచ్చిన కర్మలకు ప్రతిఫలంగా వారికి లభిస్తుంది."

(ఖుర్‌ఆన్, వాఖిఅహ్ : 22-24)

## అంశం : 262

**స్వర్గలోకపు దివ్యకన్యలతో స్వర్గవాసులైన పురుషుల వివాహం జరుగుతుంది.**

"(వారితో ఇలా అనబడుతుంది): 'మీరు చేస్తూ ఉండిన కర్మలకు ప్రతిఫలం గాహాయిగా తినండి, త్రాగండి. వారు వేయబడిన ఆసనాలపై దిండ్లకు ఆనుకుని ఎదురెదురుగా కూర్చొని ఉంటారు. మేము వారికి అందమైన కళ్ళు గల సుందరా ంగులనిచ్చి వివాహం చేస్తాము."

(ఖుర్‌ఆన్, తూర్ : 19-20)

## అంశం : 263

**స్వర్గలోకపు దివ్యకన్యలు తమ భర్తలతో సమానమైన వయస్సును కలిగి ఉంటారు.**

"వారి పక్కన సమ వయస్కులైన, బిడియస్తులైన భార్యలు ఉంటారు. ఈ వస్తువులే లెక్కల రోజున మీకు ప్రసాదించబడతాయని వాగ్దానం చేయబడుతోంది."

(ఖుర్‌ఆన్, సాద్ : 52-53)

## అంశం : 264

**అందమైన ముత్యాల గుడారాలు స్వర్గలోకపు దివ్యకన్యల నివాసాలయి ఉంటాయి. అక్కడ స్వర్గవాసులైన పురుషులు వారిని కలుసుకుంటారు.**

"గుడారాలలో సురక్షితంగా ఉంచబడిన సుందరీమణులు (హూర్) ఉంటారు. మీ ప్రభువు యొక్క ఏయే బహుమానాలను మీరు తిరస్కరించగలరు?"

(ఖుర్‌ఆన్, రహ్మాన్ : 70-71)

## అంశం : 265

**స్వర్గలోకపు దివ్యకన్యలు స్వర్గంలో తమ భర్తల గౌరవార్థం గీతమాలపిస్తారు.**

హజ్రత్ అనస్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "స్వర్గంలో పెద్ద పెద్ద కళ్ళు గల స్వర్గలోకపు సుకన్యలు 'మేము, అనగా అందమైన, సత్ప్రవర్తన గల సుకన్యలము, మా ప్రియమైన భర్తల కొరకు సురక్షితం కావించబడ్డాము' అంటూ పాడతారు. (దీనిని తిబ్రానీ ఉల్లేఖించారు, సహీహ్)[1]

## అంశం : 266

**విశ్వాసుల కొరకు అల్లాహ్ తరపున స్వర్గలోకపు దివ్యకన్యలు నిర్ణయించబడ్డారు.**

హజ్రత్ మఆజ్ బిన్ జబల్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఏ భార్య అయినా తన భర్తకు కష్టం కలిగించి నట్లయితే పెద్ద కళ్ళు గల స్వర్గలోకపు దివ్యకన్యల్లో నుంచి ఒక స్త్రీ ఈ విధంగా పలుకుతుంది: "అల్లాహ్ నిన్ను నాశనం చేయుగాక. ఇతడికి కష్టం కలిగించకు. ఇతడు కేవలం కొన్ని రోజుల కొరకు నీ వద్దకు వచ్చాడు. త్వరలోనే ఇతడు నిన్ను వదిలి మా వద్దకు వచ్చేస్తాడు."
(దీనిని ఇబ్నె మాజహ్ ఉల్లేఖించారు)[2]

హజ్రత్ బురైదహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "నేను స్వర్గంలో ప్రవేశించినప్పుడు ఒక యువతి నన్ను ఆహ్వానించింది. నేను ఆమెను ప్రశ్నించాను: "నీవు ఎవరికోసం?" ఆమె "జైద్ బిన్ హారిసహ్ కొరకు" అని సమాధానమిచ్చింది. (దీనిని ఇబ్నె అసాకిర్ ఉల్లేఖించారు, సహీహ్)[3]

## అంశం : 267

**ప్రతీకారం తీర్చుకునే సామర్థ్యముండి కూడా ఏ వ్యక్తయినా ప్రతీకారం తీర్చుకోకుంటే అతడు స్వర్గంలో తాను ఇష్టపడిన సుకన్య (స్వర్గలోకపు కన్య)ను వివాహమాడతాడు.**

**వివరణ కొరకు 'అంశం - 381'లోని హదీసును అధ్యయనం చేయండి.**

---

**అథః సూచికలు :**

1. సహీహుల్ జామిఉస్సగీర్, లిల్ అల్‌బానీ, హదీస్ నెం : 1598
2. సునన్ ఇబ్నెమాజహ్, లిల్ అల్‌బానీ, అల్ జుజ్‌ఉల్ అవ్వలు, హదీస్ నెం : 1638
3. సహీహ్, అల్ జామిఉస్సగీర్, లిల్ అల్‌బానీ, హదీసు నెం : 3361

# స్వర్గంలో అల్లాహ్ ప్రసన్నత

## అంశం : 268

**స్వర్గవాసులకు స్వర్గంలో అల్లాహ్ ప్రసన్నత ప్రాప్తమవుతుంది. అదే వాస్తవానికి అన్నింటికంటే గొప్ప సాఫల్యం.**

"ఈ ముస్లిమ్ పురుషులకు మరియు స్త్రీలకు క్రింద కాలువలు ప్రవహించే తోటలను ప్రసాదిస్తానని అల్లాహ్ వాగ్దానం చేశాడు. వారు వాటిలో శాశ్వతంగా ఉంటారు. నిత్యం కళకళలాడే ఆ వనాల్లో వారి కొరకు పరిశుద్ధమైన నివాసాలు ఉంటాయి, ఇంకా అన్నిటికంటే మించిన అల్లాహ్ ప్రసన్నత వారికి లభిస్తుంది. ఇదే గొప్ప సాఫల్యం."

(ఖుర్ఆన్, తౌబహ్: 72)

"వారి ప్రభువు వారికి తన కారుణ్యం, సంతోషం, శాశ్వతసుఖాల సామగ్రి గల స్వర్గాల శుభవార్తను ఇస్తున్నాడు. వాటిలో వారు సదా ఉంటారు." (ఖుర్ఆన్, తౌబహ్: 21)

## అంశం : 269

**స్వర్గవాసులకు అల్లాహ్ స్వర్గంలో స్వయంగా తన ప్రసన్నతకు సంబంధించిన శుభవార్తను తెలియజేస్తాడు.**

## అంశం : 270

**స్వర్గవాసులతో అల్లాహ్ స్వర్గంలో సంభాషిస్తాడు.**

హజ్రత్ అబూ సఈద్ ఖుద్రీ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : అల్లాహ్ స్వర్గవాసులతో ఈ విధంగా పలుకుతాడు: "ఓ స్వర్గవాసులారా!" అప్పుడు స్వర్గవాసులు ఇలా బదులిస్తారు : "ఓ మా ప్రభువా! మేము నీ సన్నిధిలో నీకు విధేయులై హాజరయి ఉన్నాము. మంచి అనేది నీ చేతిలోనే ఉంది" అప్పుడు అల్లాహ్ ఈ విధంగా పలుకుతాడు: " మీరు నా పట్ల సంతుష్టులయ్యారా?" అప్పుడు స్వర్గవాసులు ఇలా బదులిస్తారు: "ఓ మా ప్రభువా! మేము నీ పట్ల ఎందుకు సంతుష్టులము కాము? నీవు ఏ ఇతర జీవరాశులకూ ప్రసాదించని వరానుగ్రహాలను మాకు ప్రసాదించావు." అల్లాహ్ ఈ విధంగా పలుకుతాడు: "నేను ఇంతకంటే మించిన వస్తువును మీకు ప్రసాదించనా?" స్వర్గవాసులు ఇలా ప్రశ్నిస్తారు: "ఓ అల్లాహ్! ఇంతకంటే మించిన వస్తువు ఏది?" అల్లాహ్ ఈ విధంగా పలుకుతాడు : "నేను మీకు నా ప్రసన్నతను ప్రసాదిస్తున్నాను. ఈ రోజు తర్వాత ఇక ఎన్నడూ నేను మీ పట్ల ఆగ్రహించను."

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు, సహీహ్)[1]

---

**అథః సూచిక :** 1. కితాబుల్ జన్నహ్ వ సిఫతు నఈమిహా

# స్వర్గంలో అల్లాహ్ దర్శనం

## అంశం : 271

**అల్లాహ్‌ను దర్శించే సమయంలో స్వర్గవాసుల ముఖాలు సంతోషంతో వెలిగిపోతూ ఉంటాయి.**

"ఆ రోజున కొందరి ముఖాలు కళకళలాడుతూ ఉంటాయి, తమ ప్రభువు వైపు చూస్తూ ఉంటారు." (ఖుర్‌ఆన్, ఖియామహ్ : 22-23)

## అంశం : 272

**పున్నమినాటి చంద్రుని ఎంత స్పష్టంగా, సంపూర్ణంగా చూడడం జరుగుతుందో అదేరీతిలో స్వర్గంలో స్వర్గవాసులు స్పష్టంగా అల్లాహ్‌ను దర్శిస్తారు.**

"ఆ రోజున కొందరి ముఖాలు కళకళలాడుతూ ఉంటాయి, తమ ప్రభువు వైపు చూస్తూ ఉంటారు." (ఖుర్‌ఆన్, ఖియామహ్ : 22-23)

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఈ విధంగా ఉల్లేఖించారు: ప్రజలు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స)ను ఈ విధంగా ప్రశ్నించారు: "ఓ దైవప్రవక్తా(స)! మేము ప్రళయదినాన మా ప్రభువును చూస్తామా?" దైవప్రవక్త (స) ఇలా బదులిచ్చారు: "మీకు పున్నమినాటి చంద్రుని చూడడంలో ఏమయినా కష్టం కలుగుతుందా?" ప్రజలు "ఓ దైవప్రవక్తా (స)! కష్టం కలుగదు" అని సమాధానమిచ్చారు. దైవప్రవక్త(స) తిరిగి ఈ విధంగా పలికారు: "మబ్బులు లేని సమయంలో సూర్యుని చూడడంలో మీకు ఏమయినా కష్టం కలుగుతుందా?" ప్రజలు "లేదు" అని సమాధానమిచ్చారు. దైవప్రవక్త (స) తిరిగి ఈ విధంగా పలికారు: "అదేవిధంగా (ఎటువంటి కష్టమూ లేకుండా) మీరు (ప్రళయదినాన) మీ ప్రభువును దర్శిస్తారు." (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[1]

హజ్రత్ జరీర్ బిన్ అబ్దుల్లాహ్ (ర) ఈ విధంగా ఉల్లేఖించారు : మేము దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) సన్నిధిలో హాజరయి ఉన్నాము. దైవప్రవక్త(స) పున్నమి నాటి చంద్రుని వైపు చూసి ఈ విధంగా పలికారు : "అతిత్వరలో మీరు మీ ప్రభువును ఈ చంద్రుని ఎటువంటి కష్టమూ లేకుండా చూసే రీతిలోనే (ఎటువంటి కష్టమూ లేకుండా) చూస్తారు." (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[2]

హజ్రత్ సుహైబ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: స్వర్గవాసులు స్వర్గంలోకి ప్రవేశించిన తర్వాత అల్లాహ్ వారిని ఉద్దేశించి ఈ విధంగా పలుకుతాడు: "మీకు ఇంకా ఏమయినా కావాలా?"

అప్పుడు స్వర్గవాసులు ఈ విధంగా పేర్కొంటారు: “ఓ అల్లాహ్! నీవు మా ముఖాలను కాంతిమయం కావించలేదా? నీవు మమ్మల్ని స్వర్గంలోకి ప్రవేశింప జేయలేదా? నీవు మాకు నరకాగ్ని నుంచి విముక్తిని ప్రసాదించలేదా? (ఇంకా ఏం కావాలి?)” అప్పుడు అకస్మాత్తుగా (అల్లాహ్‌కు, స్వర్గవాసులకు నడుమ ఉన్న) పరదా తొలగిపోతుంది. అప్పుడు స్వర్గవాసులకు తమకు స్వర్గంలో ప్రసాదించబడిన ప్రతి వస్తువు కంటే తమ ప్రభువు వైపు చూడడం ఎంతో ప్రియమైనదయిపోతుంది. (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[3]

## అంశం : 273

### ఇహలోకంలో అల్లాహ్‌ను దర్శించడం సాధ్యం కాదు.

హజ్రత్ అబూజర్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు : నేను దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ను ఈ విధంగా ప్రశ్నించాను: “మీరు మీ ప్రభువును దర్శించారా?” దైవప్రవక్త (స) ఈ విధంగా బదులిచ్చారు: “అల్లాహ్ కాంతి స్వరూపుడు. నేను ఆయనను ఎలా దర్శించగలను?” (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[4]

హజ్రత్ అబ్దుల్లాహ్ (బిన్ మస్ఊద్) (ర) అల్లాహ్ పలికిన వాక్యం ‘మా కజబల్ ఫువాదు మా రఆ’ (కళ్ళు చూసిన దానిలో హృదయం అసత్యాన్ని కలుపలేదు) (ఖుర్ఆన్, నజ్మ్ :11) గురించి వ్యాఖ్యానిస్తూ “ఇక్కడ చూడడమంటే దైవదూత హజ్రత్ జిబ్రయీల్ (అ)ను చూడడమని భావం. దైవదూత 600 రెక్కలను కలిగి ఉండటాన్ని దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) చూశారు.” అని పేర్కొన్నారు.
(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[5]

హజ్రత్ అబూహురైరహ్ (ర) అల్లాహ్ పలికిన వాక్యం ‘లఖద్ రఆహు నజ్‌లతన్ ఉఖ్‌రా’ (మరొక పర్యాయం ముహమ్మద్ (స) ఆయనను సిద్రతుల్ మున్‌తహా సమీపంలో దిగుతుండగా చూశారు) (ఖుర్ఆన్, నజ్మ్ :13) గురించి వ్యాఖ్యానిస్తూ “హజ్రత్ ముహమ్మద్ (స) రెండవ పర్యాయం దైవదూత హజ్రత్ జిబ్రయీల్ (అ) ను చూశారు ” అని పేర్కొన్నారు. (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[6]

## అంశం : 274

### ప్రళయదినాన అల్లాహ్ దర్శనం పొందేందుకు దోహదపడే దుఆ (ప్రార్థన):

హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు : దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) (నమాజ్ లో దురూదె షరీఫ్ తర్వాత) ఈ విధంగా ప్రార్థించేవారు:

**“అల్లాహుమ్మ బి ఇల్‌మికల్ గైబి వ ఖుద్‌రతిక అలల్ ఖల్‌ఖి అహ్‌యినీ మా అలిమ్‌తల్ హయాత ఖైరల్లీ వ తవఫ్ఫనీ ఇజా అలిమ్‌తల్ వఫాత ఖైరల్లీ వ అస్‌అలుక ఖష్‌యతక ఫిల్ గైబి వష్షహాదతి వ కలిమతిల్ ఇఖ్‌లాసి**

**ఫిర్రజా వల్ గజబి వ అస్అలుక నఈమల్లా యన్ఫదు వ ఖుర్రత ఐనిల్లా తన్ఖతిఉ వ అస్అలుకర్రిజాఅ బిల్ ఖజాఇ వ బర్దల్ ఐషి బఅదల్ మౌతి వ లజ్జతన్నజ్రి ఇలా వజ్హిక వష్ షౌఖ ఇలా లిఖాఇక వ అఊజుబిక మిన్ జర్రాఅ ముజిర్రతిఁవ్వ ఫిత్నతిమ్ ముజిల్లతిన్ అల్లాహుమ్మ రబ్బనా బిజీనతిల్ ఈమాని వజ్అల్నా హదాతమ్ ముహ్తదీన్"**

"ఓ అల్లాహ్! నేను నీ అగోచర జ్ఞానం మరియు జీవరాశులపై నీ అధికారం మాధ్యమంగా అర్థిస్తున్నాను: నీ జ్ఞానం ప్రకారం నా జీవితం నా కొరకు మేలైనదిగా ఉండేంతవరకు నీవు నన్ను సజీవంగా ఉంచు. అలాగే నీ జ్ఞానం ప్రకారం నా మరణం నా కొరకు మేలైనదిగా అయినప్పుడు నాకు మరణాన్ని ప్రసాదించు. ఓ అల్లాహ్! ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ (ప్రతి సమయం, ప్రతి చోటా) నీకు భయపడే విధంగా సద్బుద్ధిని నాకు ప్రసాదించమని కోరుతున్నాను. అలాగే సంతోషంలోనూ, దుఃఖంలోనూ (అన్ని పరిస్థితుల్లోనూ) సత్యం పలికే విధంగా సద్బుద్ధిని ప్రసాదించమని నిన్ను అర్థిస్తున్నాను. అలాగే కలిమిలోనూ, లేమిలోనూ మధ్యేమార్గాన్ని అవలంబించే సద్బుద్ధిని ప్రసాదించమని నిన్ను అభ్యర్థిస్తున్నాను. అలాగే ఎన్నటికీ అంతరించని సౌఖ్యాన్ని ప్రసాదించవలసిందిగా నిన్ను అర్థిస్తున్నాను. నిత్యం కొనసాగే చల్లదనాన్ని కనులకు ప్రసాదించమని అర్థిస్తున్నాను. అలాగే నీ యొక్క ప్రతి తీర్పు పట్లా సంతుష్టుడినయ్యే సద్బుద్ధిని ప్రసాదించమని అర్థిస్తున్నాను. అలాగే మరణించిన తర్వాత సుఖవంతమైన జీవితాన్ని అర్థిస్తున్నాను. అలాగే నీ పవిత్రమైన అస్తిత్వాన్ని దర్శించే సౌభాగ్యాన్ని అర్థిస్తున్నాను. నిన్ను కలుసుకోవడం పట్ల ఆసక్తిని అభ్యర్థిస్తున్నాను. (నా ఇహపరాలకు) నష్టాన్ని కలిగించే కష్టం నుంచి రక్షణ పొందేందుకై నీ శరణు వేడుకుంటున్నాను. అలాగే సన్మార్గం నుంచి తప్పించే ఉపద్రవం నుంచి రక్షణ పొందేందుకై నీ శరణు వేడుకుంటున్నాను. ఓ అల్లాహ్! మమ్మల్ని విశ్వాసపు సౌందర్యంతో అలంకరించు. అలాగే మమ్మల్ని సన్మార్గం పొందినవారికి మార్గదర్శులుగా చేయి."

(దీనిని నసాయీ ఉల్లేఖించారు)[7]

---

**అథః సూచికలు :**

1. కితాబుల్ ఈమాన్, బాబ్ ఇస్బాత్ రూయతుల్ ముఅ్మినీన్ ఫిల్ ఆఖిరతి రబ్బిహిమ్ సుబ్హానహూ వ తఆలా
2. కితాబుల్ మసాజిద్ వ మవాజిఉస్సలాహ్, బాబ్ ఫజ్లి సలాతిస్సుబహ్ వల్ అస్ర్
3. కితాబుల్ ఈమాన్, బాబ్ ఇస్బాత్ రూయతుల్ ముఅ్మినీన ఫిల్ ఆఖిరతి రబ్బిహిమ్ సుబ్హానహూ వ తఆలా
4. కితాబుల్ ఈమాన్, బాబ్ మఅనీ ఖౌలుల్లాహి అజ్ వ జల్ల్ వ లఖద్ రఆహు నజ్లతన్ ఉఖ్రా
5. కితాబుల్ ఈమాన్, బాబ్ మఅనీ ఖౌలుల్లాహి అజ్ వ జల్ల్ వ లఖద్ రఆహు నజ్లతన్ ఉఖ్రా
6. కితాబుల్ ఈమాన్, బాబ్ మఅనీ ఖౌలుల్లాహి అజ్ వ జల్ల్ వ లఖద్ రఆహు నజ్లతన్ ఉఖ్రా
7. కితాబుస్సలాహ్, బాబుజ్జిక్ర్ బఅదుత్తషహ్హుద్

# స్వర్గవాసుల లక్షణాలు

## అంశం : 275

**స్వర్గవాసులు స్వర్గంలో ప్రవేశించిన తర్వాత అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపు కుంటారు.**

"వీరి (స్వర్గవాసుల) మనసుల్లో పరస్పరం ఏ కాస్త శత్రుభావం ఉన్నా దానిని మేము తొలగిస్తాము. వీరి క్రింద కాలువలు ప్రవహిస్తూ ఉంటాయి. వారు ఇలా పలుకుతారు: 'మాకు ఈ మార్గం చూపిన అల్లాహ్ కొరకే స్తోత్రాలు. ఆయనే గనక మాకు మార్గం చూపి ఉండకపోయినట్లయితే స్వయంగా మేము మార్గం పొంది ఉండేవారము కాదు. మా ప్రభువుచే పంపబడిన ప్రవక్తలు వాస్తవంగా సత్యాన్నే తీసుకువచ్చారు.' అప్పుడు వారికి ఈ వాణి వినిపిస్తుంది: 'ఈ స్వర్గం, దేనికయితే మీరు వారసులుగా చేయబడ్డారో, మీరు చేస్తూ ఉండిన పనులకు ప్రతిఫలంగా మీకు లభించింది." (ఖుర్ఆన్, ఆరాఫ్ : 43)

"(స్వర్గంలోకి ప్రవేశించిన తర్వాత) వారు (స్వర్గవాసులు) ఇలా అంటారు: 'మాకు చేసిన వాగ్దానాన్ని నిజం చేసి చూపిన, మమ్మల్ని భూమికి వారసులుగా చేసిన అల్లాహ్ కు కృతజ్ఞతలు. ఇక మేము స్వర్గంలో ఎక్కడ కోరుకుంటే అక్కడ నివాసం ఏర్పరచు కోగలము."
(ఖుర్ఆన్, జుమర్ : 74)

## అంశం : 276

**స్వర్గవాసులు స్వర్గంలో నిత్యం "సుబ్‌హానకల్లాహుమ్మ" (ఓ అల్లాహ్! నీవు పరమ పవిత్రుడివి) అని పలుకుతూ ఉంటారు. వారు పరస్పరం కలుసు కున్నప్పుడు "అస్సలాము అలైకుమ్" అని పలుకుతారు. అలాగే తమ ప్రతి మాట చివర "అల్‌హమ్‌దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్" (సర్వలోకాలకు ప్రభువైన అల్లాహ్‌కే సకల స్తోత్రాలు తగినవి) అని పలుకుతారు.**

"అక్కడ వారి నినాదం (ఒకరినొకరు పిలుచుకునేందుకు లేదా తమ సేవకులను పిలిచేందుకు) ఇది: 'ఓ అల్లాహ్! నీవు పరమ పవిత్రుడివి' వారి ప్రార్థన ఇది: 'శాంతి కలుగుగాక!' వారి ప్రతి మాటకు ముగింపు ఇది: 'స్తోత్రం సకల లోకాలకు ప్రభువైన అల్లాహ్ కొరకు మాత్రమే." (ఖుర్ఆన్,యూనుస్: 10)

## అంశం : 277

**స్వర్గవాసులు స్వర్గంలో ప్రవేశించినప్పుడు దైవదూతలు వారికి శుభాకాంక్షలు తెలియజేసేందుకు, వారి శ్రేయస్సు కొరకు ప్రార్థించేందుకు హాజరవుతారు.**

"తమ ప్రభువు పట్ల అవిధేయతకు దూరంగా ఉన్నవారిని, బృందాలు, బృందాలుగా స్వర్గం వైపునకు తీసుకుపోవడం జరుగుతుంది. చివరకు వారు అక్కడకు చేరినప్పుడు, దాని తలుపులు ముందుగానే తెరువబడి ఉంటాయి. దాని నిర్వహణా ధికారులు వారితో ఇలా అంటారు, 'మీకు శాంతి కలుగుగాక! మీరు చక్కగా ప్రవర్తించారు. ప్రవేశించండి ఇందులోకి, శాశ్వతంగా ఉండేందుకు" (ఖుర్ఆన్, జుమర్ : 73)

"ప్రతి వైపు నుండి దైవదూతలు వారిని స్వాగతించేందుకు వచ్చి వారితో ఇలా అంటారు: 'మీపై శాంతి వర్షించుగాక! ప్రపంచంలో మీరు సహనంతో వ్యవహరించిన కారణంగా ఈ రోజు మీరు దీనికి అర్హులయ్యారు' - ఎంత మంచిది ఈ పరలోక గృహం!"

(ఖుర్ఆన్, రఅద్: 23-24)

## అంశం : 278

**అల్లాహ్ స్వయంగా స్వర్గవాసులకు సలామ్ చేస్తాడు లేదా చేరవేస్తాడు.**

"కరుణామయుడైన ప్రభువు తరఫు నుండి వారికి సలామ్ (శాంతి వచనం) చెప్పబడుతుంది." (ఖుర్ఆన్, యాసీన్ : 58)

## అంశం : 279

**స్వర్గంలో అందరికంటే ముందు ప్రవేశించే సమూహానికి చెందినవారి ముఖాలు పున్నమినాటి చంద్రుని వలె మెరుస్తూ ఉంటాయి.**

## అంశం : 280

**ఇతర సమూహాలకు చెందినవారి ముఖాలు ఆకాశంలో మెరిసే నక్షత్రాల వలె మెరుస్తూ ఉంటాయి.**

## అంశం : 281

**స్వర్గంలో ఏ వ్యక్తీ అవివాహితుడిగా ఉండడు. ప్రతి స్వర్గవాసికీ కనీసం ఇద్దరు భార్యలు ఉంటారు.**

**వివరణ కొరకు అంశం - 250లో పేర్కొనబడిన హదీసును అధ్యయనం చేయండి.**

## అంశం : 282

**స్వర్గవాసుల ముఖాలు ఎల్లవేళలా తాజాగా, సంతోషభరితంగా, ఉల్లాసభరితంగా ఉంటాయి.**

**వివరణ కొరకు అంశం - 62లో పేర్కొనబడిన హదీసును అధ్యయనం చేయండి.**

## అంశం : 283

**స్వర్గవాసులు ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉంటారు. వారు ఎన్నటికీ అనారోగ్యానికి గురి కారు.**

## అంశం : 284

**స్వర్గవాసులు ఎల్లప్పుడూ యవ్వనావస్థలో ఉంటారు. వారు ఎన్నటికీ వృద్ధులు కారు.**

## అంశం : 285

**స్వర్గవాసులు ఎల్లప్పుడూ సజీవంగా ఉంటారు. వారు ఎన్నటికీ మరణించరు.**

## అంశం : 286

**స్వర్గవాసులు ఎల్లప్పుడూ సంతోషంగా ఉంటారు. వారు ఎన్నటికీ ఆందోళనకు, దుఃఖానికి గురి కారు.**

హజ్రత్ అబూ హురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: (ప్రళయదినాన) ఎలుగెత్తి చాటే ఒక దైవదూత (స్వర్గవాసులను సంబోధించి) ఈ విధంగా నినదిస్తాడు: 'మీరు నిత్యం ఆరోగ్యవంతులుగా ఉంటారు, ఎన్నటికీ వ్యాధిగ్రస్తులు కారు. అలాగే మీరు నిత్యం సజీవంగా ఉంటారు, ఎన్నటికీ మీరు మరణించరు. అలాగే మీరు నిత్యం యవ్వనంలో ఉంటారు. మీరు నిత్యం సంతోషంగా ఉంటారు, ఎన్నటికీ ఆందోళనకు గురి కారు. అల్లాహ్ యొక్క "స్వర్గవాసులతో ఈ విధంగా చెప్పడం జరుగుతుంది: 'మీరు చేస్తూ ఉండిన కర్మలకు ప్రతిఫలంగా మీరు దేనికయితే వారసులుగా చేయబడ్డారో ఆ స్వర్గం ఇదే!" అనే వాక్యానికి అర్థం ఇదే!"

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[1]

హజ్రత్ అబూ హురైరహ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "స్వర్గంలో ప్రవేశించిన వ్యక్తి నిత్యం సంతోషంగా ఉంటాడు. ఎన్నటికీ ఆందోళన చెందడు. ఆ వ్యక్తి వస్త్రాలు ఎన్నటికీ పాతబడవు. అలాగే యవ్వనమూ అంతరించదు." (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[2]

## అంశం : 287

**స్వర్గవాసులకు మలమూత్రాదులను విసర్జించే అవసరముండదు.**

## అంశం : 288

**స్వర్గవాసుల అన్నపానీయాలు తేన్పుడం వల్ల, చెమటను విసర్జించడం వల్ల జీర్ణమయిపోతాయి.**

## అంశం : 289

**స్వర్గవాసులు శ్వాసించే రీతిలో ప్రతిక్షణం అల్లాహ్ ను స్తుతిస్తూ ఉంటారు.**

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "స్వర్గవాసులు తింటారు, తాగుతారు. కానీ వారు ఉమ్మివేయరు, మలమూత్రాలను విసర్జించరు, ముక్కు చీదరు." దైవప్రవక్త సహచరులు (ర) ఈ విధంగా ప్రశ్నించారు: "మరి ఆహారం ఎక్కడికి వెళ్తుంది?" దైవప్రవక్త(స) ఇలా బదులిచ్చారు: "తేన్పు, చెమట వస్తాయి (వాటి ద్వారా ఆహారం జీర్ణమయిపోతుంది). స్వర్గవాసులు శ్వాసించే రీతిలోనే అల్లాహ్‌ను స్తుతిస్తూ ఉంటారు."

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[3]

## అంశం : 290

**స్వర్గవాసులకు నిద్రించే అవసరం రాదు.**

హజ్రత్ అబ్దుల్లాహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "నిద్ర మృత్యువు సోదరి. కనుక స్వర్గవాసులకు నిద్ర రాదు." (దీనిని అబూ నఈమ్ ఉల్లేఖించారు, సహీహ్)[4]

## అంశం : 291

**స్వర్గవాసులందరి ఎత్తు 60 చేతులు (సుమారు 90 అడుగులు) ఉంటుంది.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "స్వర్గంలో ప్రవేశించే వ్యక్తి హజ్రత్ ఆదమ్ (అ) వలె 60 చేతుల ఎత్తును కలిగి ఉంటాడు. ప్రారంభంలో మానవులు 60 చేతుల ఎత్తులో ఉండేవారు. క్రమక్రమంగా వారి ఎత్తు తగ్గుతూ ప్రస్తుత స్థితికి చేరుకుంది."

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[5]

## అంశం : 292

**స్వర్గవాసుల ముఖాలపై గడ్డం గానీ, మీసాలు గానీ ఉండవు. అలాగే (తల తప్ప) శరీరంలో ఇతర భాగాలన్నింటిపై వెంట్రుకలు ఉండవు.**

## అంశం : 293

### స్వర్గవాసుల కళ్ళు సహజసిద్ధంగా సుర్మహ్ పూయబడి ఉంటాయి.

## అంశం : 294

### స్వర్గవాసులు 30 లేదా 33 సంవత్సరాల వయస్సును కలిగి ఉంటారు.

హజ్రత్ మఆజ్ బిన్ జబల్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "స్వర్గవాసులు స్వర్గంలోకి ప్రవేశించినప్పుడు వారి శరీరాలపై వెంట్రుకలు ఉండవు, గడ్డమూ ఉండదు, మీసాలూ ఉండవు. కళ్ళు సుర్మహ్ పూయబడి ఉంటాయి. వారు 30 లేదా 33 సంవత్సరాల వయస్సును కలిగి ఉంటారు."

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, హసన్)[6]

## అంశం : 295

### స్వర్గవాసులు ఏది కోరినా అది క్షణాల్లో నెరవేరుతుంది.

హజ్రత్ అబూ సఈద్ ఖుద్రీ(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "విశ్వాసి ఒకవేళ (స్వర్గంలో) సంతానాన్ని కోరినట్లయితే బిడ్డకు సంబంధించిన గర్భధారణ, బిడ్డ పుట్టడం క్షణంలో పూర్తయిపోతుంది"

(దీనిని ఇబ్నెమాజహ్ ఉల్లేఖించారు, సహీహ్)[7]

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఈ విధంగా ఉల్లేఖించారు: ఒకరోజు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) (తన సహచరులతో) సంభాషిస్తున్నారు. ఆయన(స) ముందు ఒక గ్రామీణుడు కూర్చొని ఉన్నాడు. దైవప్రవక్త (స) ఇలా పేర్కొన్నారు : ఒక స్వర్గవాసి (స్వర్గంలో) తన ప్రభువును వ్యవసాయం చేసేందుకు అనుమతిని కోరతాడు. అల్లాహ్ ఈ విధంగా పలుకుతాడు: "నీవు కోరేవి నీ వద్ద లేవా?" ఆ స్వర్గవాసి ఈ విధంగా పలుకుతాడు : "ఎందుకు లేవు. అన్నీ ఉన్నాయి. అయితే నాకు వ్యవసాయం చేయడమంటే ఇష్టం కనుక చేయాలనుకుంటున్నాను." ఆ తర్వాత ఆ వ్యక్తి (భూమిలో) విత్తనం నాటుతాడు. ఒక్క క్షణంలో అది మొలకెత్తి పెద్దదయిపోతుంది. అలాగే పండి కోయబడటానికి సిద్ధంగా ఉంటుంది. ఇంకా చెప్పాలంటే పెద్ద కొండ వలె రూపొందుతుంది. అప్పుడు అల్లాహ్ ఈ విధంగా పలుకుతాడు : "ఓ ఆదమ్ సంతానమా! ఇప్పుడు సంతోషించు. నీ కడుపు దేనివల్లా నిండదు." అప్పుడు దైవప్రవక్త(స) ముందు కూర్చొని ఉన్న గ్రామీణుడు ఈ విధంగా పలికాడు: "అల్లాహ్ సాక్షిగా! ఆ స్వర్గవాసి తప్పకుండా ఖురైషీయుడై ఉంటాడు లేదా అన్సారీ అయి ఉంటాడు. ఎందుకంటే వారే వ్యవసాయం చేసేవారు. మేమయితే ఎప్పుడూ వ్యవసాయం చేయలేదు" అది విని దైవప్రవక్త (స) నవ్వేశారు. (దీనిని బుఖారీ ఉల్లేఖించారు, సహీహ్)[8]

## అంశం : 296

### స్వర్గవాసులు ఒక్కొక్క రోజు వందమంది స్త్రీల వద్దకు వెళ్తారు.

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు: "ఎవరో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ను ఈ విధంగా ప్రశ్నించారు: "మేము స్వర్గంలో మా స్త్రీల వద్దకు వెళ్తామా?" దైవప్రవక్త (స) ఈ విధంగా సమాధానమిచ్చారు: "మనిషి ఒక్క రోజులో వందమంది కన్యల వద్దకు వెళ్తాడు." (దీనిని అబూ నఈమ్ ఉల్లేఖించారు, సహీహ్)[9]

**అథః సూచికలు :**

1. కితాబుల్ జన్నహ్ వ సిఫతు నఈమిహా
2. కితాబుల్ జన్నహ్ వ సిఫతు నఈమిహా
3. సిల్సిలయె అహాదీసుస్సహీహ, లిల్ అల్బానీ, హదీస్ నెం: 367
4. సిల్సిలయె అహాదీసుస్సహీహ, హదీస్ నెం: 1087
5. కితాబుల్ జన్నహ్ వ సిఫతు నఈమిహా
6. సిఫతు అబ్వాబిల్ జన్నహ్, బాబ్ మా జాఅ ఫీ సిన్ని అహ్లిల్ జన్నహ్ (2 / 2064)
7. కితాబుజ్జుహద్, బాబ్ సిఫతుల్ జన్నహ్ (2 / 3500)
8. కితాబుల్ మజ్రఅహ్
9. సిల్సిలయె అహాదీసుస్సహీహ లిల్ అల్బానీ, అల్ జుజ్ఉల్ అవ్వలు, హదీస్ నెం: 367

# మానవజాతికి, స్వర్గవాసులకు నరకవాసులకు మధ్య నిష్పత్తి

**అంశం : 297**

**వేయి మందిలో కేవలం ఒక్క మనిషి మాత్రమే స్వర్గానికి వెళ్తాడు. మిగిలిన తొమ్మిది వందల తొంభై తొమ్మిది (999) మంది నరకానికి వెళ్తారు.**

హజ్రత్ అబూ సఈద్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: అల్లాహ్ ప్రళయదినాన హజ్రత్ ఆదమ్(అ)ను సంబోధించి ఈ విధంగా పలుకుతాడు: "ఓ ఆదమ్!" హజ్రత్ ఆదమ్(అ) ఈ విధంగా పలుకుతారు: "ఓ అల్లాహ్! నేను నీ సేవలో, నీకు విధేయుడనై హాజరయి ఉన్నాను. మంచి అనేది నీ చేతిలోనే ఉంది" అప్పుడు అల్లాహ్ ఈ విధంగా పలుకుతాడు: "(జీవుల్లో నుంచి) అగ్నికి అర్హులైన వ్యక్తుల సమూహాన్ని వేరు చేయి." హజ్రత్ ఆదమ్(అ) ఈ విధంగా పలుకుతారు: "అగ్నికి అర్హులైనవారు ఎంతమంది ఉంటారు?" అల్లాహ్ ఈ విధంగా పలుకుతాడు: "వెయ్యి మందిలో నుంచి 999 మంది.' దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పలికారు: "ఆ సమయంలోనే బాలుడు వృద్ధుడయిపోతాడు (ఆందోళన కారణంగా), గర్భవతుల గర్భాలు రాలి పోతాయి, అలాగే నీవు ప్రజలను స్పృహ కోల్పోయిన స్థితిలో చూస్తావు. వాస్తవానికి వారు స్పృహను కోల్పోరు. వాస్తవానికి అల్లాహ్ శిక్షే అంత కఠినంగా ఉంటుంది." (ఆ శిక్ష తీవ్రతలో ప్రజలు స్పృహను సైతం కోల్పోతారు) హజ్రత్ అబూ సఈద్ ఖుద్రీ(ర) ఇలా పేర్కొన్నారు: అది విని దైవప్రవక్త సహచరులు(ర) ఆందోళన చెంది ఈ విధంగా పలికారు: "ఓ దైవప్రవక్తా (స)! మరి మాలో ఏ (అదృష్టవంతుడైన) వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు?" దైవప్రవక్త (స) ఈ విధంగా పేర్కొన్నారు: "సంతుష్టులై ఉండండి. యాజూజ్ మాజూజ్‌లు (ఈ జీవరాశి సంఖ్యాపరంగా ఎంత ఎక్కువగా ఉంటుందంటే) 999 మంది, మీలోని ఒక వ్యక్తితో ఆ లెక్క పూర్తయిపోతుంది. (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[1]

---

**అధః సూచిక :**

1. కితాబుల్ ఈమాన్, బాబ్ బయాన్ కౌన్ హజల్ అమతు నిస్ఫు అహ్లిల్ జన్నహ్

# స్వర్గంలో దైవప్రవక్త ముహమ్మద్ (స) అనుచర సమాజమే (ఉమ్మత్) ఎక్కువ సంఖ్యలో ఉంటుంది

## అంశం : 298

**స్వర్గంలో మూడింట రెండు వంతులు ఆఖరి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) అనుచర సమాజానికి చెందినవారే ఉంటారు. మిగిలిన ఒక వంతు మిగిలిన దైవప్రవక్తలందరి అనుచర సమాజాలకు చెందినవారు ఉంటారు.**

హజ్రత్ బురైదహ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "స్వర్గవాసులు 120 వరుసల్లో ఉంటారు. వారిలో 80 వరుసలు నా అనుచర సమాజానికి చెందినవారు ఉంటారు. 40 వరుసల్లో మిగిలిన దైవప్రవక్తలకు చెందిన అనుచర సమాజాలకు చెందినవారు ఉంటారు."

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[1]

## అంశం : 299

**స్వర్గవాసుల్లో సగం మంది ఆఖరి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) అనుచర సమాజానికి చెందినవారయి ఉంటారు.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (ర) తమతో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నట్లుగా ఉల్లేఖించారు : "స్వర్గవాసుల్లో నాల్గవ వంతు మీరే అయి ఉంటారనే విషయం పట్ల మీరు సంతోషించడం లేదా?" అది విని మేము (సంతోషంతో) 'అల్లాహు అక్బర్' అని పలికాము. ఆ తర్వాత దైవప్రవక్త (స) తిరిగి ఈ విధంగా పలికారు: "స్వర్గవాసుల్లో మూడవ వంతు మీరే అయి ఉంటారనే విషయం పట్ల మీరు సంతోషించడం లేదా?" అది విని మేము తిరిగి (సంతోషంతో) 'అల్లాహు అక్బర్' అని పలికాము. అప్పుడు దైవప్రవక్త(స) తిరిగి ఈ విధంగా పలికారు: "స్వర్గవాసుల్లో సగం మంది మీరే అయి ఉంటారని నేను ఆశిస్తున్నాను. దీనికి కారణమేమిటంటే ముస్లింల సంఖ్య అవిశ్వాసులతో పోలిస్తే నల్లని ఎద్దు శరీరం మీద ఒక తెల్లని వెంట్రుక వంటిది లేదా తెల్లని ఎద్దు శరీరం మీద ఒక నల్లని వెంట్రుక వంటిది.

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[2]

**వివరణ : మొదటి హదీసులో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) స్వర్గవాసుల్లో మూడింట రెండు వంతులు తన అనుచర సమాజానికి చెందినవారయి ఉంటారని పేర్కొన్నారు. అయితే రెండవ హదీసులో స్వర్గవాసుల్లో సగం మంది తన అనుచర సమాజానికి చెందినవారయి**

ఉంటారని పేర్కొన్నారు. రెండు హదీసుల ద్వారా స్వర్గంలో ఆఖరి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) అనుచర సమాజానికి చెందినవారే ఎక్కువమంది ఉంటారని ఋజువు చేయడమే ఉద్దేశ్యమని అవగతమవుతోంది. (అల్లాహ్‌కే సర్వం ఎరుక)

**అంశం : 300**

**దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) అనుచర సమాజానికి చెందిన 70 వేల మంది కర్మల లెక్క తీసుకోబడకుండానే, శిక్షించబడకుండా నేరుగా స్వర్గంలోకి ప్రవేశిస్తారు.**

**అంశం : 301**

**ప్రతి వెయ్యి మందిలోనూ తిరిగి 70 వేల మంది (అనగా మొత్తం 49 లక్షలమంది) దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) అనుచర సమాజానికి చెందినవారు స్వర్గంలోకి ప్రవేశిస్తారు.**

**అంశం : 302**

**వారే కాకుండా ఇంకా అల్లాహ్ యొక్క మూడు గుప్పెళ్ళ నిండా (వారి సంఖ్య అల్లాహ్‌కు మాత్రమే తెలుసు) దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) అనుచర సమాజానికి చెందినవారు స్వర్గంలోకి ప్రవేశిస్తారు.**

హజ్రత్ అబూ ఉమామహ్(ర) తాను దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొంటుండగా విన్నట్లుగా ఉల్లేఖించారు : "నా ప్రభువు నా అనుచర సమాజానికి చెందిన 70 వేలమందిని కర్మల లెక్క తీసుకోకుండానే, శిక్షించకుండానే స్వర్గంలోకి ప్రవేశింపజేస్తానని, ప్రతి వెయ్యి మందితో పాటు మరో 70 వేలమందిని స్వర్గంలోకి ప్రవేశింపజేస్తానని, అలాగే నా ప్రభువు యొక్క మూడు గుప్పెళ్ళ నిండా వ్యక్తులను సైతం స్వర్గంలోకి ప్రవేశింపజేస్తానని నాకు వాగ్దానం చేశాడు." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[3]

హజ్రత్ ఇమ్రాన్ బిన్ హసీన్(ర)ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "నా అనుచర సమాజానికి చెందిన 70 వేల మంది కర్మల లెక్క తీసుకోబడకుండానే స్వర్గంలోకి ప్రవేశిస్తారు." దైవప్రవక్త సహచరులు(ర) ఈ విధంగా ప్రశ్నించారు: "ఓ దైవప్రవక్తా (స)! ఆ భాగ్యవంతులు ఎవరయి ఉంటారు?" దైవప్రవక్త(స) ఈ విధంగా పేర్కొన్నారు: "వారు జలాల మీద మంత్రించనివారు, అంజనం వేయించని వారు, వాతలు పెట్టుకోనివారయి కేవలం తమ ప్రభువు మీద మాత్రమే సంపూర్ణంగా నమ్మకముంచేవారయి ఉంటారు." అప్పుడు హజ్రత్ అకాషహ్(ర) లేచి నిలబడి ఈ విధంగా పలికారు: "ఓ దైవప్రవక్తా(స)! అల్లాహ్ నన్ను వారిలో ఒకడిగా చేసేలా ప్రార్థించండి" దైవప్రవక్త(స) ఇలా పలికారు: "నీవు వారిలో ఒకడివి" (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[4]

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "నా ముందుకు వివిధ అనుచర సమాజాలకు చెందినవారు తీసుకురాబడ్డారు. కొంతమంది దైవప్రవక్తలతో పదిమంది కంటే తక్కువ మంది వెంట ఉన్నారు. కొంతమంది దైవప్రవక్తల వెంట ఒకరు లేదా ఇద్దరు వ్యక్తులు మాత్రమే ఉన్నారు. ఒక దైవప్రవక్త వెంట ఏ ఒక్క వ్యక్తీ లేడు. ఇంతలో నా ముందుకు ఒక పెద్ద అనుచర సమాజం వచ్చింది. నేను బహుశా అది నా అనుచర సమాజమేమోనని భావించాను. అయితే అది దైవప్రవక్త హజ్రత్ మూసా(అ) మరియు ఆయన అనుచర సమాజమని నాకు తెలియజేయబడింది. అలాగే ఆకాశంలో ఒక వైపు చూడవలసిందిగా నేను ఆదేశించబడగా నేను చూసినప్పుడు అక్కడ కూడా ఒక పెద్ద ప్రజాసమూహం కనబడింది. అయితే ఆకాశంలో మరొక వైపు చూడవలసిందిగా నేను ఆదేశించబడగా నేను చూసినప్పుడు అక్కడ మరింత పెద్ద ప్రజా సమూహం కనబడింది. అది నా అనుచర సమాజంగా, అందులో నుంచి 70 వేలమంది కర్మల లెక్క తీసుకోబడకుండానే, శిక్షించబడకుండానే స్వర్గంలోకి ప్రవేశిస్తారు." (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[5]

---

**అథః సూచికలు :**

1. అబ్వాబుల్ జన్నహ్, బాబ్ మా జాఅ ఫీ కమ్ సఫ్ అహ్లిల్ జన్నహ్ (2 / 2065)
2. కితాబుల్ ఈమాన్, బాబ్ బయాన్ కౌన్ హజల అమతు నిస్ఫు అహ్లిల్ జన్నహ్
3. అబ్బాబ్ సిఫతుల్ ఖియామహ్, బాబ్ మా జాఅ ఫిష్షఫాఅహ్ (2 / 1984)
4. కితాబుల్ ఈమాన్, బాబుద్దలీల్ అలా దుఖూల్ తా ఇఫు మినల్ ముస్లిమీనల్ జన్నహ్ బిగైరి హిసాబ్
5. కితాబుల్ ఈమాన్, బాబుద్దలీల్ అలా దుఖూల్ తా ఇఫు మినల్ ముస్లిమీనల్ జన్నహ్ బిగైరి హిసాబ్

# స్వర్గానికి కొనిపోయే ఆచరణలు కష్టంతో కూడుకున్నవి

## అంశం : 303

**స్వర్గం బరువైన, కష్టాన్ని కోరే, మానవ నైజానికి కష్టభూయిష్ఠంగా అనిపించే ఆచరణలతో నింపివేయబడింది.**

హజ్రత్ అబూ హురైరహ్ (ర)ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "అల్లాహ్ స్వర్గనరకాలను సృజించినప్పుడు దైవదూత హజ్రత్ జిబ్రయీల్ (అ)ను స్వర్గానికి పంపించి ఈ విధంగా పలికాడు: "స్వర్గాన్ని సందర్శించి నేను స్వర్గవాసుల కొరకు సృజించిన వరానుగ్రహాలను చూడు" దైవదూత హజ్రత్ జిబ్రయీల్(అ) స్వర్గాన్ని, స్వర్గవాసుల కొరకు సృష్టించబడి ఉన్న వరానుగ్రహాలను చూసి తిరిగి అల్లాహ్ సన్నిధిలో హాజరయి ఈ విధంగా పలికారు: "నీ గౌరవం సాక్షిగా! ఏ వ్యక్తయితే దీని గురించి వింటాడో అతడు తప్పకుండా ఇందులోకి ప్రవేశిస్తాడు." అప్పుడు అల్లాహ్ తన దూతలను స్వర్గాన్ని కష్టనష్టాలతో నింపివేయవలసిందిగా ఆదేశించాడు. ఆ తర్వాత అల్లాహ్ తన దూత అయిన హజ్రత్ జిబ్రయీల్ (అ)ను స్వర్గాన్ని, స్వర్గవాసుల కొరకు తాను సిద్ధం చేసిన వరానుగ్రహాలను చూసి రావలసిందిగా పురమాయించాడు. దైవదూత హజ్రత్ జిబ్రయీల్(అ) వెళ్ళి చూడగా అది కష్టాలతో నిండిపోయి ఉంది. దానితో ఆయన అల్లాహ్ సన్నిధిలో హాజరయి ఈ విధంగా పలికారు :"నీ గౌరవం సాక్షిగా! ఇందులో ఎవరూ ప్రవేశించలేరేమోనని భయంగా ఉంది." ఆ తర్వాత అల్లాహ్ హజ్రత్ జిబ్రయీల్ (అ)ను ఈ విధంగా ఆదేశించాడు: "ఇప్పుడు నరకం వైపుకు వెళ్ళి దానిని చూడు. అలాగే నరకవాసుల కొరకు నేను సిద్ధం చేసి ఉంచిన శిక్షలను చూడు. అలాగే దాని ఒక భాగం మరొక దానిపైకి ఎలా ఎక్కుతున్నదో చూడు" హజ్రత్ జిబ్రయీల్ (అ) (అంతా చూసి) వెనుదిరిగి వచ్చి ఈ విధంగా పలికారు: "నీ గౌరవం సాక్షిగా! దీని గురించి విని కూడా ఇందులో ప్రవేశించే వ్యక్తి ఎవరూ ఉండరు". అప్పుడు అల్లాహ్ ఆదేశానుసారం నరకం మనోకాంక్షలతో, భోగాలతో కప్పివేయబడింది. ఆ తర్వాత అల్లాహ్ హజ్రత్ జిబ్రయీల్ (అ)ను తిరిగి నరకాన్ని చూసి రావలసిందిగా పురమాయించాడు. హజ్రత్ జిబ్రయీల్ (అ) రెండవసారి నరకానికి వెళ్ళి, (అంతా చూసి) తిరిగి వచ్చి ఈ విధంగా పలికారు: "నీ గౌరవం సాక్షిగా! ఇప్పుడయితే ఎవరూ దీని నుంచి రక్షించబడరేమోనని, ప్రతి వ్యక్తీ ఇందులో ప్రవేశిస్తాడేమోనని భయంగా ఉంది."

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, హసన్)[1]

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (ర)ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: " స్వర్గం రుచించని అంశాలతో చుట్టబడి ఉంది. నరకం మనసుకు ఆనందం కలిగించే అంశాలతో చుట్టబడి ఉంది.

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు, హసన్)[2]

## అంశం : 304

### స్వర్గాన్ని పొందేందుకై తీవ్రంగా శ్రమించవలసిన అవసరముంది.

హజ్రత్ అబూ హురైరహ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "భయపడిన వ్యక్తి పరుగెత్తాడు. పరుగెత్తిన వ్యక్తి గమ్యానికి చేరుకున్నాడు. వినండి, అల్లాహ్ సామాను ఎంతో ఖరీదయినది. అల్లాహ్ సామాను స్వర్గమనే విషయాన్ని తెలుసుకోండి."

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[3]

## అంశం : 305

### వరానుగ్రహాలతో కూడిన స్వర్గాన్ని కోరుకునే వ్యక్తి ఇహలోకంలో ఏనాడూ సుఖంగా నిద్రించలేడు.

హజ్రత్ అబూ హురైరహ్ (ర)ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "నేను నరకానికి దూరంగా పరుగెత్తే ఏ వ్యక్తినీ నిద్రిస్తుండగా చూడలేదు. అలాగే స్వర్గాన్ని కోరుకునే ఏ అభిలాషినీ నిద్రిస్తుండగా చూడలేదు." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, హసన్)[4]

## అంశం : 306

### పరలోకంలో గౌరవాన్ని, బహుమానాలను పొందే ఆచరణలు ఇహలోకపు దృష్టిలో ఎంతో చేదుగా ఉంటాయి.

హజ్రత్ అబూ మాలిక్ అష్అరీ(ర) దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొంటూ ఉండగా తాను విన్నట్లుగా ఉల్లేఖించారు: "ఇహలోకపు తీపి పరలోకంలో చేదుగా పరిగణించబడితే, ఇహలోకపు చేదు పరలోకంలో తీపిగా పరిగణించబడుతుంది."

(దీనిని అహ్మద్ మరియు హాకిమ్‌లు ఉల్లేఖించారు, సహీహ్)[5]

## అంశం : 307

### విశ్వాసి కొరకు ఇహలోకం ఒక బందీఖానా.

హజ్రత్ అబూహురైరహ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: “ఇహలోకం విశ్వాసి కొరకు బందీఖానా అయితే, అవిశ్వాసి కొరకు స్వర్గం.” (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[6]

---

**అథః సూచికలు :**

1. అబ్వాబ్ సిఫతి జహన్నమ్, మా జాఅ ఫీ అన్నల్ జన్నహ్ హఫ్త్ బాల్కారహ్ (2 / 2075)
2. కితాబుల్ జన్నహ్ వ సిఫతు నఈమిహా
3. అబ్వాబు సిఫతిల్ ఖియామహ్ (2 / 1993)
4. అబ్వాబ్ సిఫతి జహన్నమ్, బాబ్ అన్నన్నారు నఫ్సీన్ (2 / 2097)
5. సహీహుల్ జామిఉస్సగీర్, లిల్ అల్బానీ, అల్ జుజ్ఉస్సాలిసు, హదీస్ నెం : 3150
6. కితాబుజ్జుహద్

# స్వర్గలోకపు శుభవార్తను పొందినవారు

## అంశం : 308

**స్వర్గంలో అందరికంటే ముందు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ప్రవేశి స్తారు.**

వివరణ కొరకు అంశం -86లో పేర్కొనబడిన హదీసును అధ్యయనం చేయండి.

## అంశం : 309

**ఇహలోకంలో వృద్ధాప్యానికి చేరుకొని మరణించి స్వర్గస్తులైనవారికి హజ్రత్ అబూబకర్(ర) మరియు హజ్రత్ ఉమర్ (రలు నాయకులవుతారు.**

హజ్రత్ అలీ బిన్ అబూతాలిబ్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు: నేను దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) వెంట ఉన్నాను. అకస్మాత్తుగా హజ్రత్ అబూబకర్ (ర) మరియు హజ్రత్ ఉమర్ (ర) కూడా వచ్చేసారు. దైవప్రవక్త(స) ఈ విధంగా పలికారు: "ఈ ఇద్దరూ వృద్ధాప్యదశకు చేరుకొని మరణించినవారికి స్వర్గంలో నాయకులుగా ఉంటారు, దైవప్రవక్తలకు తప్ప. వారు (వృద్ధాప్యదశకు చేరుకొని మరణించినవారు) ఇకముందు రాబోయే సమాజాలకు చెందినవారయినా కావచ్చు లేదా పూర్వపు సమాజాలకు చెందినవారయినా కావచ్చు. ఓ అలీ! వారికి తెలుపకు." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[1]

## అంశం : 310

**హజ్రత్ హసన్(ర) మరియు హజ్రత్ హుసైన్(ర) ఇహలోకంలో యవ్వన దశలోనే మరణించి స్వర్గస్తులైనవారికి నాయకులవుతారు.**

హజ్రత్ అబూ సఈద్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "హజ్రత్ హసన్(ర) మరియు హజ్రత్ హుసైన్(ర) యువకులుగా మరణించిన స్వర్గస్తులైనవారికి నాయకులుగా ఉంటారు."

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[2]

## అంశం : 311

**దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఇహలోకంలోనే పదిమందికి స్వర్గలోక ప్రవేశపు శుభవార్తను అందజేశారు. వారిని ' అష్రయె ముబష్షిరహ్ ' అంటారు. వారి పేర్లు ఈ విధంగా ఉన్నాయి.**

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "అబూబకర్(ర) స్వర్గంలో ఉన్నారు, ఉమర్(ర) స్వర్గంలో ఉన్నారు, ఉస్మాన్(ర) స్వర్గంలో ఉన్నారు, అలీ(ర) స్వర్గంలో ఉన్నారు, తల్హా(ర) స్వర్గంలో ఉన్నారు, జుబైర్(ర) స్వర్గంలో ఉన్నారు, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(ర) స్వర్గంలో ఉన్నారు, సఅద్ బిన్ అబీ వఖాస్(ర) స్వర్గంలో ఉన్నారు, సఈద్ బిన్ జైద్(ర) స్వర్గంలో ఉన్నారు మరియు అబూ ఉబైదహ్ బిన్ జర్రాహ్ (ర)స్వర్గంలో ఉన్నారు."

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు)[3]

## అంశం : 312

**హజ్రత్ ఖదీజహ్(ర) (దైవప్రవక్త సతీమణి)కు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) స్వర్గలోకంలో ఇంటికి సంబంధించిన శుభవార్తను అంద జేశారు.**

హజ్రత్ ఆయిషహ్(ర) ఈ విధంగా పేర్కొన్నారు: "దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) హజ్రత్ ఖదీజహ్(ర)కు స్వర్గంలో ఇంటికి సంబంధించిన శుభవార్తను అందజేశారు."

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[4]

## అంశం : 313

**హజ్రత్ ఆయిషహ్(ర)కు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) స్వర్గలోక ప్రవేశపు శుభవార్తను అందజేశారు.**

హజ్రత్ ఆయిషహ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఆయిషహ్! ఇహపరలోకాల్లో నీవు నా భార్యగా ఉండటం పట్ల సంతుష్టురాలివి కావా?" హజ్రత్ ఆయిషహ్(ర) ఈ విధంగా పలికారు: "ఎందుకు కాను?" దైవప్రవక్త (స) ఇలా పలికారు: "నీవు ఇహపరలోకాల్లో నా భార్యవు."

(దీనిని హాకిమ్ ఉల్లేఖించారు, సహీహ్)[5]

## అంశం : 314

**హజ్రత్ ఉమ్మె సలీమ్(ర) (హజ్రత్ అబూ తల్హా(ర) భార్య)కు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) స్వర్గలోక ప్రవేశపు శుభవార్తను అందజేశారు.**

## అంశం : 315

**హజ్రత్ బిలాల్(ర)కు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) స్వర్గలోక ప్రవేశపు శుభవార్తను అందజేశారు.**

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "నాకు స్వర్గం చూపించబడింది. నేను అక్కడ అబూ తల్హా(ర) భార్యను చూశాను. అలాగే నా ముందు ఎవరో నడుస్తున్న శబ్దాన్ని విన్నాను. పరికించి చూడగా ఆ వ్యక్తి హజ్రత్ బిలాల్(ర)." (దీనిని హాకిమ్ ఉల్లేఖించారు)[6]

## అంశం : 316

**హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్(ర)కు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) స్వర్గంలో భవంతికి సంబంధించిన శుభవార్తను అందజేశారు.**

వివరణ కొరకు అంశం - 3లో పేర్కొనబడిన హదీసును అధ్యయనం చేయండి.

## అంశం : 317

**హజ్రత్ తల్హా బిన్ ఉబైదుల్లాహ్(ర)కు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) స్వర్గలోక ప్రవేశపు శుభవార్తను అందజేశారు.**

హజ్రత్ జుబైర్(ర) ఈ విధంగా పేర్కొన్నారు : ఉహుద్ యుద్ధం జరిగిన రోజు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) రెండు కవచాలు ధరించి ఉన్నారు. ఆయన (స) ఒక బండరాయి మీద ఎక్కాలని ప్రయత్నించినప్పటికీ ఎక్కలేకపోయారు. ఆయన(స) హజ్రత్ తల్హా(ర) ను తన క్రింద కూర్చోబెట్టి ఆయన మీద ఎక్కి బండరాయి మీదకు ఎక్కారు. హజ్రత్ జుబైర్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు: (ఆసమయంలో) "తల్హా కొరకు (స్వర్గం) తప్పనిసరి చేయబడింది" అని దైవప్రవక్త(స) పలుకుతుండగా విన్నాను."

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు)[7]

## అంశం : 318

**హజ్రత్ సఆద్ బిన్ మఆజ్(ర) స్వర్గవాసి.**

## అంశం : 319

**బదర్ యుద్ధంలో పాల్గొన్నవారు, హుదైబియాలో పాల్గొన్నవారు స్వర్గవాసులు.**

హజ్రత్ జాబిర్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "బదర్ యుద్ధంలోనూ, హుదైబియా లోనూ పాల్గొన్నవారిలో ఏ ఒక్కరూ నరకాగ్నిలోకి ప్రవేశించరు." (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు, సహీహ్)[8]

**వివరణ :** హుదైబియా ఒడంబడిక (హిజ్రీ 6వ సంవత్సరం, జీ ఖఅదహ్ మాసంలో జరిగింది) జరగడానికి ముందు దైవప్రవక్త సహచరులు(ర) హుదైబియా లోని ఒక చెట్టు

క్రింద తమ ప్రాణాలను సైతం అర్పిస్తామని దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) చేతిలో ప్రమాణం చేశారు. వారందరూ 'చెట్టువారు' (అస్హాబె షజర్) అని పిలువబడ్డారు.

## అంశం : 320

**హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ సలామ్(ర)కు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) స్వర్గలోక ప్రవేశపు శుభవార్తను అందజేశారు.**

హజ్రత్ సఅద్(ర) ఈ విధంగా పేర్కొన్నారు: దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ సలామ్(ర)ను తప్ప సజీవంగా తిరుగాడుతున్న మరే ఇతర వ్యక్తినీ స్వర్గవాసిగా పేర్కొనడాన్ని వినలేదు. (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[9]

**వివరణ :** హజ్రత్ సఅద్(ర) కేవలం హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ సలామ్(ర) విషయంలో మాత్రమే స్వర్గలోకపు శుభవార్త అందజేయబడటాన్ని విన్నారు. కనుక వారి విషయంలో మాత్రమే సాక్ష్యమిచ్చారు. అయితే ఇతర సహచరులు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఇతర సహచరులకు స్వర్గలోకపు శుభవార్తను అందజేయడం గురించి ఉల్లేఖించారు.

## అంశం : 321

**హజ్రత్ ఇమ్రాన్ కుమార్తె అయిన హజ్రత్ మర్యమ్(ర), దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) కుమార్తె అయిన హజ్రత్ ఫాతిమహ్(ర), దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) సతీమణి అయిన హజ్రత్ ఖదీజహ్(ర) మరియు ఫిర్ఔన్ భార్య అయిన హజ్రత్ ఆసియహ్(ర) స్వర్గలోకపు మహిళల నాయకురాళ్ళు.**

హజ్రత్ జాబిర్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "హజ్రత్ ఇమ్రాన్ కుమార్తె అయిన హజ్రత్ మర్యమ్(ర) తర్వాత హజ్రత్ ఫాతిమహ్(ర), హజ్రత్ ఖదీజహ్(ర) మరియు ఫిర్ఔన్ భార్య అయిన హజ్రత్ ఆసియహ్(ర)లు స్వర్గలోకపు మహిళల నాయకురాళ్ళయి ఉంటారు"

(దీనిని తిబ్రానీ ఉల్లేఖించారు, సహీహ్)[10]

## అంశం : 322

**హజ్రత్ జైద్ బిన్ అమ్ర్(ర) స్వర్గవాసి.**

హజ్రత్ ఆయిషహ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "నేను స్వర్గంలో ప్రవేశించినప్పుడు జైద్ బిన్ అమ్ర్ బిన్ నుఫైల్ యొక్క రెండు స్థాయిలను చూశాను." (దీనిని ఇబ్నె అసాకిర్ ఉల్లేఖించారు, హసన్)[1]

## అంశం : 323

### హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ హరామ్(ర) స్వర్గవాసి.

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(ర) ఈ విధంగా పేర్కొన్నారు: ఉహుద్ యుద్ధం జరిగిన రోజు హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ హరామ్(ర) అమరగతులయినప్పుడు దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "జాబిర్! అల్లాహ్ మీ తండ్రితో పలికిన మాటలను నీకు తెలుపనా?" నేను "తప్పకుండా తెలుపండి" అని పలికాను. దైవప్రవక్త(స) ఈ విధంగా పేర్కొన్నారు: అల్లాహ్ ఏ వ్యక్తితోనూ తెర లేకుండా మాట్లాడలేదు. కానీ నీ తండ్రితో మధ్యలో అడ్డుతెర లేకుండానే (నేరుగా) సంభాషిస్తూ ఈ విధంగా పలికాడు: "ఓ నా దాసుడా! నీకు ఏం కావాలో కోరుకో. నేను ప్రసాదిస్తాను" అప్పుడు నీ తండ్రి ఈ విధంగా పలికారు: "ఓ నా ప్రభువా! నేను తిరిగి నీ మార్గంలో మరణించేందుకు గాను నన్ను తిరిగి బ్రతికించు" అప్పుడు అల్లాహ్ ఈ విధంగా పలికాడు: "ఒక వ్యక్తి మరణించిన తర్వాత తిరిగి ప్రపంచంలోకి రావడమనేది జరగదని మా ద్వారా ముందే నిర్ణయించబడింది" అప్పుడు నీ తండ్రి ఇలా పలికారు : "అయితే నా తరపున (ప్రపంచ ప్రజలకు) నా సందేశాన్ని (తిరిగి బ్రతికించబడి వీరమరణం పొందాలనే అభిలాషను వ్యక్తం చేయడం) అందజేయండి" అప్పుడు అల్లాహ్ "అల్లాహ్ మార్గంలో హతమైనవారిని మృతులుగా పేర్కొనకండి. వాస్తవానికి వారు సజీవులై ఉన్నారు. అలాగే తమ ప్రభువు తరపు నుండి భుక్తిని పొందుతున్నారు."

(ఖుర్ఆన్, ఆలి ఇమ్రాన్, ఆయత్:169)

(దీనిని ఇబ్నె మాజహ్ ఉల్లేఖించారు, హసన్)[12]

## అంశం : 324

### హజ్రత్ అమార్ బిన్ యాసిర్(ర), హజ్రత్ సల్మాన్ ఫార్సీ(ర)లు స్వర్గవాసులు.

హజ్రత్ అనస్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "స్వర్గం ముగ్గురు వ్యక్తుల పట్ల ఆసక్తి చూపుతుంది. వారు హజ్రత్ అలీ(ర), హజ్రత్ అమార్(ర) మరియు హజ్రత్ సల్మాన్ ఫార్సీ (ర)లు"

(దీనిని హాకిమ్ ఉల్లేఖించారు, హసన్)[13]

## అంశం : 325

### హజ్రత్ జాఫర్ బిన్ అబూ తాలిబ్(ర) మరియు హజ్రత్ హమ్జహ్(ర)లు స్వర్గవాసులు.

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: "నేను నిన్న రాత్రి స్వర్గంలో ప్రవేశించాను.

అందులో హజ్రత్ జాఫర్ (ర) దైవదూతలతో పాటు ఎగురుతూ ఉండటాన్ని, హజ్రత్ హమ్జహ్(ర) సింహాసనానికి దిండు ఆన్చి కూర్చొని ఉండటాన్ని చూశాను."
(దీనిని తిబ్రానీ ఉల్లేఖించారు, సహీహ్)[14]

## అంశం : 326

### హజ్రత్ జైద్ బిన్ హారిసహ్(ర) స్వర్గవాసి.

హజ్రత్ బురైదహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు: "నేను స్వర్గంలో ప్రవేశించినప్పుడు ఒక యువతి నన్ను ఆహ్వానించింది. నేను ఆమెను "నీవు ఎవరికోసం?" అని ప్రశ్నించగా, "జైద్ బిన్ హారిసహ్ కొరకు" అని పలికింది. (దీనిని ఇబ్నె అసాకిర్ ఉల్లేఖించారు, సహీహ్)[15]

## అంశం : 327

### హజ్రత్ మిల్హాన్ (ర) కుమార్తె అయిన హజ్రత్ గుమీసా (ర) స్వర్గవాసి.

హజ్రత్ అనస్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "నేను స్వర్గంలో ప్రవేశించినప్పుడు నా ముందు ఎవరో నడుస్తున్న శబ్దం విన్నాను. 'ఈ శబ్దం ఎలా వస్తోంది?' అని నేను ప్రశ్నించాను. 'అది హజ్రత్ మిల్హాన్(ర) కుమార్తె అయిన హజ్రత్ గుమీసా(ర) నడుస్తున్న శబ్దం' అని నాకు తెలుపబడింది."
(దీనిని అహ్మద్ ఉల్లేఖించారు, సహీహ్)[16]

**వివరణ :** హజ్రత్ మిల్హాన్(ర) కుమార్తె అయిన హజ్రత్ గుమీసా(ర) భర్త మరియు కుమారుడు ఉహుద్ యుద్ధంలో మరణించారు. అంతేగాకుండా ఆమె సోదరులైన హజ్రత్ హరామ్బిన్ మిల్హాన్(ర) బర్ మఊనహ్ ప్రమాదంలో అమరగతి పొందారు. ఆమె స్వయంగా ఖబ్రస్ ద్వీపాన్ని తమ అదుపులోకి తీసుకున్న తర్వాత వెనుదిరిగి వస్తున్న యుద్ధవీరులతో కూడిన సైన్యంలో చేరి ఉండి ప్రయాణం మధ్యలో మరణించారు. (ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్)

## అంశం : 328

### హజ్రత్ హారిసహ్ బిన్ నుఅ్మాన్ (ర) స్వర్గవాసి.

హజ్రత్ ఆయిషహ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "నేను స్వర్గంలో ప్రవేశించినప్పుడు ఖుర్ఆన్ పఠనాన్ని విన్నాను. 'ఎవరది?' అని నేను ప్రశ్నించాను. "హజ్రత్ హారిసహ్ బిన్ నుఅ్మాన్ (ర)" అని దైవదూతలు సమాధానమిచ్చారు. (అది విని దైవప్రవక్త (స) ఇలా పలికారు) "పుణ్యకార్యానికి ప్రతిఫలం ఇదే. మంచిపనికి పుణ్యఫలం ఇలాగే ఉంటుంది." (దీనిని హాకిమ్ ఉల్లేఖించారు, సహీహ్)[17]

## అంశం : 329

**మక్కా నుంచి మదీనా కు హిజ్రత్ (అల్లాహ్ ఆదేశానుసారం వలస వెళ్ళడం) చేసినవారికి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) స్వర్గలోక ప్రవేశపు శుభవార్తను అందజేశారు.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "నా అనుచర సమాజంలో నుంచి ఏ సమూహం అందరికంటే ముందు స్వర్గం లోకి ప్రవేశిస్తుందో నీకు తెలుసా?" నేను "అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకే బాగా తెలుసు" అని బదులిచ్చాను. దైవప్రవక్త (స) ఈ విధంగా పలికారు: "ముహాజిర్లు (మక్కా నుంచి మదీనాకు హిజ్రత్ చేసినవారు) ప్రళయదినాన స్వర్గలోకపు ద్వారం వద్దకు వచ్చినప్పుడు ద్వారం తెరువబడుతుంది. స్వర్గలోకపు ద్వారపాలకుడు ఈ విధంగా ప్రశ్నిస్తాడు: "మీ లెక్క పూర్తయిపోయిందా?" వారు ఇలా బదులిస్తారు: "ఎటువంటి లెక్క ? మా కర వాలాలు అల్లాహ్ మార్గంలో మా భుజాల మీద ఉన్నాయి. అదే స్థితిలో మరణించాము." అప్పుడు స్వర్గలోకపు ద్వారం వారి కొరకు తెరువబడుతుంది. అప్పుడు ఇతరులు స్వర్గంలో ప్రవేశించడానికి 40 సంవత్సరాల ముందే స్వర్గంలోకి ప్రవేశించి సుఖభోగాలు అనుభవిస్తారు."

(దీనిని హాకిమ్ ఉల్లేఖించారు, సహీహ్)[18]

## అంశం : 330

**హజ్రత్ ఇబ్నె దహ్‌దాహ్ (ర) స్వర్గవాసి.**

హజ్రత్ జాబిర్ బిన్ సమురహ్(ర) ఈ విధంగా పేర్కొన్నారు: దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) హజ్రత్ ఇబ్నె దహ్‌దాహ్(ర) జనాజహ్ నమాజ్ చదివించారు. ఆ తర్వాత వీపు నగ్నంగా ఉన్న ఒక గుర్రం ఆయన(స) వద్దకు తీసుకురాబడింది. దైవప్రవక్త(స) ఆ గుర్రాన్ని అధిరోహించారు. అప్పుడు ఆ గుర్రం భయంతో ఉలిక్కిపడసాగింది. మేమంతా ఆయన(స) వెంట పరుగెత్తసాగాము. అప్పుడు ప్రజల్లో నుంచి ఒక వ్యక్తి ఈ విధంగా పలికాడు: "ఇబ్నె దహ్‌దాహ్(ర) కొరకు స్వర్గంలో ఎన్ని (పండ్ల) గుత్తులున్నాయో!' అని దైవప్రవక్త (స) పలికారు." (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[19]

## అంశం : 331

**విశ్వాసుల మాతృమూర్తి అయిన హజ్రత్ హఫ్సహ్ (ర) స్వర్గవాసి.**

హజ్రత్ అనస్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఈ విధంగా పేర్కొన్నారు: దైవదూత హజ్రత్ జిబ్రయీల్ (అ) నాతో ఇలా పలికారు: "మీరు హజ్రత్ హఫ్సహ్ (ర) వైపుకు మరలండి. ఎందుకంటే ఆమె ఎక్కువగా ఉపవాసాలు పాటించే, ఎక్కువగా నమాజ్ కొరకు నిలబడే స్త్రీ. అలాగే ఆమె స్వర్గంలో మీ సతీమణి."

(దీనిని హాకిమ్ ఉల్లేఖించారు, హసన్)[20]

**వివరణ :** గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) తన సతీమణి అయిన హజ్రత్ హఫ్సహ్ (ర) కు ‘ రజ్ఈ ’ తలాఖ్ ( భర్త తన భార్యను తిరిగి తన అభీష్టానుసారం దాంపత్యబంధం లోకి తెచ్చుకోవడానికి వీలయిన తలాఖ్) ఇచ్చి అల్లాహ్ ఆదేశానుసారం దానిని ఉపసంహరించుకొని ఆమెను స్వీకరించారు.

## అంశం : 332

### హజ్రత్ అకాషహ్ (ర) స్వర్గవాసి.

వివరణ కొరకు అంశం - 302లో పేర్కొనబడిన హదీసును అధ్యయనం చేయండి.

---

**అథః సూచికలు:**

1. అబ్వాబుల్ మనాఖిబ్, బాబ్ మనాఖిబ్ అబీ బకర్ అస్సిద్దీఖ్(ర) (3/ 2897)
2. అబ్వాబుల్ మనాఖిబ్, బాబ్ మనాఖిబ్ అబూ ముహమ్మద్ అల్ హసన్ వల్ హుసైన్
3. అబ్వాబుల్ మనాఖిబ్, బాబ్ మనాఖిబ్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (3 / 2946)
4. కితాబుల్ ఫజాయిల్, బాబ్ మిన్ ఫజాయిలె ఖదీజహ్
5. సిల్‌సిలయె అహాదీసుస్సహీహ, లిల్ అల్‌బానీ, హదీస్ నెం: 1142
6. కితాబుల్ ఫజాయిల్, బాబ్ మిన్ ఫజాయిలె ఉమ్మె సల్‌మహ్
7. అబ్వాబుల్ మనాఖిబ్, బాబ్ మనాఖిబ్ అబీ ముహమ్మద్ తల్‌హా బిన్ ఉబైదుల్లాహ్ (3 / 2939)
8. సిల్‌సిలయె అహాదీసుస్సహీహ, లిల్ అల్‌బానీ, హదీస్ నెం: 2160
9. అబ్‌బాబుల్ మనాఖిబ్, బాబ్ ఫజల్ మిన్ బయత్ తహతుష్షజరహ్ (3 / 3033)
10. సిల్‌సిలయె అహాదీసుస్సహీహ, లిల్ అల్‌బానీ, హదీస్ నెం: 1434
11. సిల్‌సిలయె అహాదీసుస్సహీహ, లిల్ అల్‌బానీ, హదీస్ నెం: 1406
12. సహీహ్ సునన్ ఇబ్నె మాజహ్, లిల్ అల్‌బానీ, అల్ జుజ్ఉస్సానీ, హదీస్ నెం: 2258
13. సహీహ్ జామిఉస్సగీర్, లిల్ అల్‌బానీ, హదీస్ నెం: 1594
14. సహీహ్ జామిఉస్సగీర్, లిల్ అల్‌బానీ, హదీస్ నెం: 3358
15. సహీహ్ జామిఉస్సగీర్, లిల్ అల్‌బానీ, హదీస్ నెం: 3361
16. సహీహ్ జామిఉస్సగీర్, లిల్ అల్‌బానీ, హదీస్ నెం: 3363
17. సహీహ్ జామిఉస్సగీర్, లిల్ అల్‌బానీ, హదీస్ నెం: 3366
18. సహీహ్ జామిఉస్సగీర్, లిల్ అల్‌బానీ, హదీస్ నెం: 852
19. కితాబుల్ జనాయిజ్, బాబ్ రకూబుల్ ముసల్లా అలల్ జనాజతి ఇజా అన్‌సరఫ
20. సహీహ్ జామిఉస్సగీర్, లిల్ అల్‌బానీ, అల్ జుజ్ఉర్రాబిఉ, హదీస్ నెం: 4727

# స్వర్గంలోకి ప్రవేశించేవారు

## అంశం : 333

**మృదు స్వభావులు, నిస్సహాయులు, సాధు స్వభావులు, అనునిత్యం అల్లాహ్‌కు భయపడేవారు, ఇతరులకు హాని చేయనివారు, సహనశీలురు స్వర్గంలోకి ప్రవేశిస్తారు.**

హజ్రత్ అబూహురైరహ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "స్వర్గంలో పక్షుల వలె మెత్తని హృదయం గలవారు ప్రవేశిస్తారు."

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[1]

## అంశం : 334

**స్వర్గంలో పేదవారు, అసహాయులు, ఇతరుల మీద ఆధారపడేవారు, బలహీనులు ఎక్కువ సంఖ్యలో ఉంటారు.**

హజ్రత్ హారిసహ్ బిన్ వహబ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) తన సహచరులతో ఈ విధంగా పేర్కొన్నారు: "స్వర్గంలో ఎవరు ప్రవేశిస్తారో మీకు తెలుపనా?" దైవప్రవక్త సహచరులు "తప్పకుండా తెలుపండి" అని పలికారు. దైవప్రవక్త(స) ఈ విధంగా పలికారు: "ప్రతి బలహీనుడు, ప్రజల దృష్టిలో బలహీనుడయి నప్పటికీ అల్లాహ్ దృష్టిలో ఎంతగా ఎంచబడినవాడంటే (ఒకవేళ ఏదయినా వ్యవహారంలో) అల్లాహ్ మీద ప్రమాణం చేసినట్లయితే అల్లాహ్ అతడిని సత్యసంధునిగా చేసివేస్తాడు." ఆ తర్వాత దైవప్రవక్త (స) తిరిగి ఈ విధంగా పలికారు: "నరకంలో ఎవరు ప్రవేశిస్తారో మీకు తెలుపనా?" దైవప్రవక్త సహచరులు "తప్పకుండా తెలుపండి." అని పలికారు. దైవప్రవక్త (స) ఈ విధంగా పలికారు : "పోట్లాడే ప్రతి వ్యక్తీ, చెడ్డ నడవడిక గల ప్రతి వ్యక్తీ, అహంకారంతో విర్రవీగే ప్రతి వ్యక్తీ నరకంలోకి ప్రవేశిస్తాడు" (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)

## అంశం : 335

**మృదుస్వభావులు, మంచి మనసు గలవారు, సాధుస్వభావులు, అందరికీ ప్రీతిపాత్రుల యినవారు స్వర్గంలో ప్రవేశిస్తారు.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "మృదుస్వభావం గల, మంచి మనసు గల, సాధుస్వభావం గల, ప్రజలకు ప్రీతిపాత్రుడయిన ప్రతి వ్యక్తిపై నరకాగ్ని నిషేధించబడింది."

(దీనిని అహ్మద్ ఉల్లేఖించారు, సహీహ్)[2]

## అంశం : 336

**దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స)కు విధేయులుగా మసలుకునేవారు స్వర్గంలోకి ప్రవేశిస్తారు.**

హజ్రత్ అబూహురైరహ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "నా అనుచర సమాజం మొత్తం స్వర్గంలోకి ప్రవేశిస్తుంది, తిరస్కరించిన వ్యక్తి తప్ప" దైవప్రవక్త సహచరులు(ర) ఈ విధంగా ప్రశ్నించారు: "ఓ దైవప్రవక్తా(స)! ఎవరు తిరస్కరించారు?" దైవప్రవక్త (స) ఈ విధంగా పలికారు: "ఏ వ్యక్తయితే నాకు విధేయుడై మెలిగాడో అతడు స్వర్గంలో ప్రవేశించాడు. ఏ వ్యక్తయితే నా పట్ల అవిధేయుడై మెలిగాడో అతడు తిరస్కరించాడు." (దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[3]

## అంశం : 337

**అల్లాహ్ ప్రీతి కొరకు ఏ వ్యక్తయితే ప్రతిరోజూ 12 రకాతుల నమాజ్ (ఫజర్ నమాజ్ కు ముందు 2 రకాతులు, జుహర్ నమాజ్ కు ముందు 4 రకాతులు, తర్వాత 2 రకాతులు, మగ్రిబ్ నమాజ్ తర్వాత 2 రకాతులు, ఇషా నమాజ్ తర్వాత 2 రకాతులు) చదువుతాడో అతడు స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) సతీమణి అయిన హజ్రత్ ఉమ్మె హబీబహ్(ర) తాను దైవప్రవక్త(స) ఈ విధంగా పేర్కొంటూ ఉండగా విన్నట్లుగా ఉల్లేఖించారు: "ఏ వ్యక్తయితే అల్లాహ్ ప్రీతి కొరకు ప్రతిరోజూ ఫరజ్ నమాజులతో పాటు 12 రకాతులు నఫిల్ నమాజులు చదువుతాడో అల్లాహ్ అతడి కొరకు స్వర్గంలో ఒక ఇంటిని నిర్మిస్తాడు?"

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[4]

## అంశం : 338

**బంధుమిత్రులతో మంచిగా వ్యవహరించేవారు స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ అబూ అయ్యూబ్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు: ఒక వ్యక్తి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) సన్నిధిలో హాజరయి ఈ విధంగా పలికాడు: "నన్ను నరకానికి దూరం చేసి స్వర్గానికి చేరువ చేసే ఆచరణ ఏదయినా ఉంటే నాకు తెలపండి" దైవప్రవక్త(స) ఈ విధంగా పలికారు: "అల్లాహ్‌కు దాస్యం చేయి, ఆయన దైవత్వంలో మరెవరినీ భాగస్వాములుగా ఎంచకు, నమాజ్‌ను స్థాపించు, జకాత్ చెల్లించు. అలాగే కరుణ గలవారితో సంబంధాలను పటిష్ఠంగా ఉంచుకో." ఆ వ్యక్తి వెనుదిరిగినప్పుడు దైవప్రవక్త (స) ఈ విధంగా పలికారు: "ఏయే విషయాలయితే అతడికి ఆదేశించబడ్డాయో ఒకవేళ అతడు వాటి ప్రకారం నడుచుకున్నట్లయితే స్వర్గంలోకి ప్రవేశిస్తాడు." (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[5]

## అంశం : 339

**సద్గుణ సంపన్నులు, తహజ్జుద్ నమాజ్ చదివేవారు, తరచుగా నఫిల్ ఉపవాసాలు పాటించేవారు, ఇతరులకు ఆహారం తినిపించేవారు స్వర్గంలోకి ప్రవేశిస్తారు.**

హజ్రత్ అలీ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "స్వర్గంలో ఎటువంటి భవంతులున్నాయంటే వాటి లోపల నిల్చుంటే బయట ఉన్న ప్రతి వస్తువూ కనబడుతుంది. అలాగే బయట నిల్చుంటే లోపల ఉన్న ప్రతి వస్తువూ కనిపిస్తుంది." ఇంతలో ఒక గ్రామీణులు లేచి ఇలా ప్రశ్నించాడు: "ఓ దైవప్రవక్తా(స)! అది ఎటువంటి వ్యక్తి కొరకు?" దైవప్రవక్త(స) ఇలా బదులిచ్చారు: "ఏ వ్యక్తయితే మంచి మాటను పలుకుతాడో, అన్నం తినిపిస్తాడో, తరచుగా ఉపవాసాలుంటాడో, ప్రజలు గాఢనిద్రలో ఉండే సమయంలో లేచి నమాజ్ చదువుతాడో అటువంటి వ్యక్తి కొరకు."

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, హసన్)[6]

## అంశం : 340

**న్యాయవంతుడైన పరిపాలకుడు,ఇతరులను కనికరించేవాడు, మెత్తని హృదయం గల వ్యక్తి, పవిత్రుడు, ఇతరులను యాచించని వ్యక్తి కూడా స్వర్గంలో ప్రవేశిస్తారు.**

హజ్రత్ అయ్యాజ్ బిన్ హిమార్ ముజాషిఈ (ర) ఈ విధంగా ఉల్లేఖించారు: దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఒకరోజు తన ప్రసంగంలో ఈ విధంగా పేర్కొన్నారు: "మూడు రకాల ప్రజలు స్వర్గంలో ప్రవేశిస్తారు: (1) న్యాయవంతుడైన పరిపాలకుడు, సత్యం పలికేవాడు, సత్కార్యాలు చేసే సద్బుద్ధి ప్రసాదించబడినవాడు (2) ప్రతి సంబంధీకుని పట్ల, ప్రతి ముస్లిం పట్ల కరుణతో వ్యవహరించేవాడు, మెత్తని హృదయం గలవాడు. (3) శీలవంతుడయిన, సంతానం కలిగి వుండి కూడా యాచించని వ్యక్తి."

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[7]

## అంశం : 341

**అల్లాహ్ మరియు ఆయన సందేశహరుని విశ్వసించడం పట్ల ఆనందించేవారు, ఇస్లాంను సంపూర్ణ సమ్మతితో తమ ధర్మంగా భావించేవారు స్వర్గంలో ప్రవేశిస్తారు.**

హజ్రత్ అబూ సఈద్ ఖుదరీ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఏ వ్యక్తయితే 'నేను అల్లాహ్ ప్రభువు అవడం పట్ల, ఇస్లాం ధర్మం అవడం పట్ల, హజ్రత్ ముహమ్మద్(స) దైవప్రవక్త అవడం పట్ల సంతుష్టి చెందాను' అని పలికాడో అతడి కొరకు స్వర్గం తప్పనిసరి కావించబడింది."

(దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు, సహీహ్)[8]

## అంశం ట : 342

**ఇద్దరు లేదా ఇద్దరి కంటే ఎక్కువమంది కుమార్తెలకు ధార్మిక విద్యను బోధించి వారు యవ్వనావస్థకు చేరుకున్నప్పుడు సత్పురుషులకు ఇచ్చి వారి వివాహాన్ని జరిపించే వ్యక్తి కూడా స్వర్గంలో ప్రవేశిస్తాడు.**

హజ్రత్ అనస్ బిన్ మాలిక్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) "ఏ వ్యక్తయితే ఇద్దరు కుమార్తెలను వారు యవ్వనావస్థకు చేరుకునేంత వరకు పెంచుతాడో ఆ వ్యక్తి, నేను ప్రళయదినాన ఈ విధంగా వస్తాము" అని పేర్కొని తన వేళ్ళను పరస్పరం కలిపివేశారు. (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[9]

## అంశం : 343

**వుజూ చేసిన తర్వాత 2 రకాతుల నఫిల్ నమాజ్ (తహియ్యాతుల్ వుజూ)ను శ్రద్ధగా చదివే వ్యక్తి స్వర్గంలో ప్రవేశిస్తాడు.**

హజ్రత్ అబూహురైరహ్(ర) ఈ విధంగా పేర్కొన్నారు: దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) (ఒకరోజు) ఫజర్ నమాజ్ తర్వాత హజ్రత్ బిలాల్(ర)ను ఈ విధంగా ప్రశ్నించారు: "ఓ బిలాల్! ఇస్లాంను స్వీకరించిన తర్వాత నీ యొక్క ఏ ఆచరణ ద్వారా నీకు ముక్తి లభిస్తుందని ఆశిస్తున్నావు? ఎందుకంటే ఈరోజు రాత్రి నేను స్వర్గంలో నా ముందు నీవు నడిచిన శబ్దాన్ని విన్నాను " హజ్రత్ బిలాల్(ర) ఈ విధంగా పేర్కొన్నారు: "పగటిపూట లేదా రాత్రివేళ ఎప్పుడయితే నేను వుజూ చేస్తానో అప్పుడు అల్లాహ్ సమ్మతించినంత మేరకు నమాజ్ చదువుతాను. ఇంతకు మించి ముక్తి కొరకు నేను ఆశలు పెట్టుకోదగ్గ ఆచరణ మరేదీ లేదు." (దీనిని బుఖారీ మరియు ముస్లిమ్ ఉల్లేఖించారు)[10]

## అంశం : 344

**నమాజులు శ్రద్ధగా చదివే, ఉపవాసాలను క్రమం తప్పకుండా పాటించే, శీలవతి, భర్తకు విధేయురాలయిన స్త్రీలు స్వర్గంలోకి ప్రవేశిస్తారు.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "ఏ స్త్రీ అయితే ప్రతిరోజూ ఐదుపూటలు నమాజ్ చదువుతుందో, రమజాన్ నెలలో ఉపవాసాలుంటుందో, తన శీలాన్ని సంరక్షించుకుంటుందో, తన భర్తకు విధేయురాలిగా నడుచుకుంటుందో (ప్రళయదినాన) ఆమెతో ఈ విధంగా చెప్పడం జరుగుతుంది: 'స్వర్గలోకపు (ఎనిమిది) ద్వారాలలో నీకు ఇష్టమైన ద్వారం గుండా ప్రవేశించు."

(దీనిని ఇబ్నె హబ్బాన్ ఉల్లేఖించారు, సహీహ్)[1]

## అంశం : 345

**దైవప్రవక్తలు, దైవమార్గంలో వీరమరణం పొందిన యోధులు మరియు విశ్వాసులకు చెందిన మరణించిన చిన్నపిల్లలు, సజీవంగా పాతిపెట్టబడిన అమ్మాయిలు స్వర్గంలోకి ప్రవేశిస్తారు.**

హజ్రత్ ముఆవియహ్(ర) కుమార్తె అయిన హజ్రత్ హస్నా(ర) ఈ విధంగా పేర్కొన్నారు: మాకు మా పినతండ్రి ఈ హదీసును తెలిపారు: స్వర్గంలో ఎవరెవరు ప్రవేశిస్తారని దైవప్రవక్త (స)ను నేను వాకబు చేయగా దైవప్రవక్త (స) ఈ విధంగా సమాధానమిచ్చారు: "దైవప్రవక్త స్వర్గంలోకి ప్రవేశిస్తాడు, దైవమార్గంలో వీరమరణం పొందిన యోధుడు స్వర్గంలోకి ప్రవేశిస్తాడు, మరణించిన శిశువు స్వర్గం లోకి ప్రవేశిస్తుంది. అలాగే సజీవంగా పాతిపెట్టబడిన బాలిక స్వర్గం లోకి ప్రవేశిస్తుంది." (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు, సహీహ్)[12]

## అంశం : 346

**అల్లాహ్ మార్గంలో జిహాద్ (ధర్మయుద్ధం) చేసేవారు స్వర్గంలోకి ప్రవేశిస్తారు.**

హజ్రత్ మఆజ్ బిన్ జబల్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఏ వ్యక్తయితే ఒంటె పాలు పితకడానికి ఎంత సమయం పడుతుందో అంత సమయం వరకు అల్లాహ్ మార్గంలో పోరాడాడో అతడిపై స్వర్గం తప్పనిసరి కావించబడింది." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[13]

## అంశం : 347

**అల్లాహ్‌కు భయపడే ధార్మిక పరాయణులు, సద్గుణ సంపన్నులు స్వర్గంలోకి ప్రవేశిస్తారు.**

హజ్రత్ అబూహురైరహ్(ర) ఈ విధంగా పేర్కొన్నారు: దైవప్రవక్త (స)ను ఈ విధంగా ప్రశ్నించడం జరిగింది: "అన్నింటికంటే ఎక్కువగా ప్రజల స్వర్గలోక ప్రవేశానికి కారణభూతమయ్యే ఆచరణ ఏది?" దైవప్రవక్త(స) ఈ విధంగా పేర్కొన్నారు: "దైవభీతి, మంచి నడవడిక" దైవప్రవక్త (స)ను తిరిగి ఇలా ప్రశ్నించడం జరిగింది:

"అన్నింటికంటే ఎక్కువగా ప్రజల నరకలోక ప్రవేశానికి కారణభూతమయ్యే ఆచరణ ఏది?" దైవప్రవక్త(స) ఇలా బదులిచ్చారు: "నోరు, మర్మావయవం."

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, హసన్)[14]

## అంశం : 348

**అనాథను పోషించే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "తన బంధువయిన లేదా బంధువు కాని అనాథను పోషించే వ్యక్తి, నేను స్వర్గంలో ఈ రెండు వేళ్ళ వలె (తోడుగా) ఉంటాము" ఇమామ్ మాలిక్(ర) తన చూపుడు వేలు మరియు మధ్య వేలి ద్వారా సూచిస్తూ తెలిపారు."

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[15]

## అంశం : 349

### స్వీకారయోగ్యమైన హజ్ చేసే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.

హజ్రత్ అబూహురైరహ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఉమ్రహ్ అనేది ప్రస్తుతం చేయబడే ఉమ్రహ్కు, చివరిసారి చేయబడిన ఉమ్రహ్కు నడుమ చేయబడిన పాపాలకు పరిహారమవుతుంది. ఇక స్వీకారయోగ్యమైన హజ్కు ప్రతిఫలమయితే స్వర్గమే."

(దీనిని బుఖారీ మరియు ముస్లిమ్ ఉల్లేఖించారు)[16]

## అంశం : 350

### మస్జిద్ ను నిర్మించే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.

హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఏ వ్యక్తయితే అల్లాహ్ కొరకు మస్జిద్ ను నిర్మిస్తాడో అతడి కొరకు అల్లాహ్ స్వర్గంలో అటువంటి ఇంటినే నిర్మిస్తాడు."

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[17]

## అంశం : 351

### తమ మర్మావయవాలను, నాలుకను సంరక్షించుకునేవారు స్వర్గంలోకి ప్రవేశిస్తారు.

హజ్రత్ సహల్ బిన్ సఅద్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఏ వ్యక్తయితే తన రెండు దవడల మధ్య ఉన్నదాని (నాలుక) విషయంలోనూ, తన రెండు కాళ్ళ మధ్య ఉన్నదాని (మర్మావయవం) విషయంలోనూ హామీ ఇచ్చినట్లయితే నేను అతడికి స్వర్గలోక ప్రవేశానికి సంబంధించిన హామీ ఇస్తాను."

(దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[18]

## అంశం:352

### తన పొరుగువారి పట్ల మంచిగా వ్యవహరించే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.

హజ్రత్ అబూహురైరహ్(ర) ఈ విధంగా పేర్కొన్నారు: ఒక వ్యక్తి దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) సన్నిధిలో హాజరయి ఈ విధంగా పలికాడు: "ఓ దైవప్రవక్తా(స)! ఫలానా

స్త్రీ పగటిపూట ఉపవాసముంటుంది, రాత్రివేళ నమాజ్ చదువుతుంది. కానీ తన పొరుగువారికి కష్టం కలిగిస్తుంది'' దైవప్రవక్త(స) ఇలా పేర్కొన్నారు: "ఆ స్త్రీ నరకవాసి" ఆ తర్వాత దైవప్రవక్త సహచరులు(ర) (మరొక స్త్రీ విషయంలో) ఈ విధంగా ప్రశ్నించారు: "ఫలానా స్త్రీ కేవలం ఫరజ్ నమాజులు మాత్రమే చదువుతుంది. అయితే వెన్న ముద్దలు దానం చేస్తుంది. కానీ పొరుగువారికి కష్టం కలిగించదు'' దైవప్రవక్త (స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఆ స్త్రీ స్వర్గవాసి.'' (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు, సహీహ్)[19]

## అంశం : 353

### అల్లాహ్‌కు చెందిన 99 పేర్లను కంఠస్థం చేసిన వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.

హజ్‌రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "అల్లాహ్ కు 99 పేర్లు ఉన్నాయి. ఏ వ్యక్తయితే వాటిని గుర్తుంచు కుంటాడో అతడు స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.'

(దీనిని బుఖారీ మరియు ముస్లిమ్ ఉల్లేఖించారు)[20]

## అంశం : 354

### ఖుర్‌ఆన్‌ను కంఠస్థం చేసిన వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.

హజ్‌రత్ అబూ సఈద్ ఖుద్‌రీ(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఖుర్‌ఆన్‌ను కంఠస్థం చేసిన వ్యక్తి (హాఫిజె ఖుర్‌ఆన్) స్వర్గంలోకి ప్రవేశించినప్పుడు అతడితో ఈ విధంగా చెప్పడం జరుగుతుంది: "ఖుర్‌ఆన్‌ను పఠిస్తూ ఉన్నత స్థానాలను అధిరోహిస్తూ వెళ్ళు. అప్పుడు ఆ వ్యక్తి (తాను పఠించే) ప్రతి ఖుర్‌ఆన్ వాక్యానికి బదులుగా ఒక్కొక్క స్థానాన్ని అధిరోహిస్తూ పోతాడు. చివరకు తనకు గుర్తున్న ఆఖరి వాక్యం దగ్గర ఆగిపోతాడు. అదే అతడి (శాశ్వత) స్థానం అయి ఉంటుంది.'' (దీనిని ఇబ్నెమాజహ్ ఉల్లేఖించారు, సహీహ్)[21]

## అంశం : 355

### ఎక్కువసార్లు సలామ్ చేసేవారు స్వర్గంలోకి ప్రవేశిస్తారు.

హజ్‌రత్ అబ్దుల్లాహ్ బిన్ సలామ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ప్రజలారా! సలామ్ చేసే సాంప్రదాయాన్ని వ్యాపింపజేయండి (అనగా తరచుగా సలామ్ పలకండి), (ప్రజలకు) అన్నం తినిపించండి, ప్రజలు నిద్రించే సమయంలో నమాజ్ చదవండి. (ఈ ఆచరణల పర్యవసానంగా) శ్రేయస్కరమైన రీతిలో స్వర్గంలోకి ప్రవేశిస్తారు.'' (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[22]

## అంశం : 356

**వ్యాధిగ్రస్తుని పరామర్శించే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ సూబాన్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "వ్యాధిగ్రస్తుని పరామర్శించే వ్యక్తి తిరిగి వచ్చేంత వరకు స్వర్గలోకపు వనంలో ఉంటాడు." (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[23]

## అంశం : 357

**అల్లాహ్ ప్రసన్నత కొరకు ధార్మిక జ్ఞానాన్ని ఆర్జించే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఏ వ్యక్తయితే ధార్మిక జ్ఞానాన్ని ఆర్జించేందుకై మార్గాన్ని అధిగమిస్తాడో అతడి కొరకు అల్లాహ్ స్వర్గలోకపు మార్గాన్ని (అధిగమించడాన్ని) సుగమం చేసివేస్తాడు."

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[24]

## అంశం : 358

**సరియైన రీతిలో వుజూ చేసి 'కలిమయె షహాదత్' చదివే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

వివరణ కొరకు అంశం - 92లో పేర్కొనబడిన హదీసును అధ్యయనం చేయండి.

## అంశం : 359

**ఉదయం మరియు సాయంత్రం 'సయ్యదుల్ ఇస్తిగ్ఫార్'ను పఠించే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ షద్దాద్ బిన్ ఔస్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: అన్నింటికంటే ఉత్తమమైన ఇస్తిగ్ఫార్ ఇది:

**"అల్లాహుమ్మ అన్త రబ్బీ లా ఇలాహ ఇల్లా అన్త ఖలఖ్తనీ వ అన అబ్దుక వ అన అలా అహ్దిక వ వఅ్దిక మస్తతఅ్తు అఊజుబిక మిన్ షర్రిమా సనఅ్తు అబూఅ లక బినిఅ్మతిక అలయ్యా అబూఉ బిజంబీ ఫగ్ఫిర్లీ ఫ ఇన్నహూ లా యగ్ఫిరు జ్జునూబ ఇల్లా అన్త"**

(ఓ అల్లాహ్! నీవు నా ప్రభువువి. నీవు తప్ప ఆరాధ్యుడు లేడు. నీవే నన్ను పుట్టించావు. నేను నీ దాసుడిని. నేను నీతో చేసిన వాగ్దానానికి నా శక్తిమేరకు కట్టుబడి ఉన్నాను. నేను చేసిన చెడ్డ పనుల భారం నుంచి నీ రక్షణ కోరుతున్నాను. నాకు నీవు చేసిన మేళ్ళను అంగీకరిస్తున్నాను. అలాగే నేను చేసిన పాపాలను అంగీకరిస్తున్నాను. నన్ను క్షమించు. ఎందుకంటే నీవు తప్ప పాపాలను క్షమించేవారెవరూ లేరు."

దైవప్రవక్త(స) ఈ విధంగా పేర్కొన్నారు : “ఏ వ్యక్తయితే ఈ వాక్యాలను విశ్వాసంతో పగటిపూట పఠించి సాయంత్రానికి ముందు మరణించినట్లయితే స్వర్గంలోకి ప్రవేశిస్తాడు. అలాగే ఏ వ్యక్తయితే ఈ వాక్యాలను విశ్వాసంతో రాత్రివేళ పఠించి తెల్లవారక ముందే మరణించినట్లయితే స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.” (దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[25]

## అంశం : 360

**ఒక వ్యక్తి కంటిచూపు అంతరించినప్పుడు ఆ వ్యక్తి సహనం వహిస్తే స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ అనస్ బిన్ మాలిక్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: అల్లాహ్ ఈ విధంగా పేర్కొంటున్నాడు: “నా దాసుడిని నేను అతడికి ప్రియమైన రెండు వస్తువుల (కళ్ళు) ద్వారా పరీక్షించినప్పుడు అతడు సహనం వహించినట్లయితే అందుకు ప్రతిఫలంగా నేను అతడికి స్వర్గాన్ని ప్రసాదిస్తాను.”

(దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[26]

## అంశం : 361

**తల్లిదండ్రులకు సేవచేసే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: “తన తల్లిదండ్రుల్లో ఇద్దరినీ లేదా ఒకరిని వారు వృద్ధాప్యదశలో ఉండగా పొంది కూడా ఏ వ్యక్తయితే (వారి ప్రసన్నతను పొంది) స్వర్గంలోకి ప్రవేశించడో అతడి ముక్కుకు మట్టి అంటుకొనుగాక, అతడు అవమానం పొందుగాక, నాశనమవుగాక.”

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[27]

## అంశం : 362

**ముస్లింల ఆందోళనను లేదా కష్టాన్ని దూరం చేసే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ అబూహురైరహ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: “ఒక చెట్టు ముస్లింలకు కష్టం కలిగిస్తూ ఉండేది. ఒక వ్యక్తి వచ్చి ఆ చెట్టును కోసివేసి స్వర్గంలోకి ప్రవేశించాడు.” (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[28]

## అంశం : 363

**వ్యాధి పట్ల సహనం వహించే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ అతా బిన్ అబీ రిబాహ్(ర) ఈ విధంగా పేర్కొన్నారు: హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(ర) నాతో ఈ విధంగా పలికారు: “నేను మీకు స్వర్గవాసి అయిన స్త్రీని

చూపించనా?'' నేను ''తప్పకుండా చూపించండి'' అని పలికాను. హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (ర) ( ఒక స్త్రీని సూచిస్తూ) ఈ విధంగా పలికారు: ''ఈ నల్లని స్త్రీ దైవప్రవక్త(స) సన్నిధిలో హాజరయి ఈ విధంగా పలికింది 'నేను మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాను. (మూర్ఛ వచ్చే సమయంలో అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయే కారణంగా) నా శరీరంపై వస్త్రాలు తొలగిపోతున్నాయి. కనుక మీరు నాకు ఆరోగ్యాన్ని ప్రసాదించవలసిందిగా అల్లాహ్ ను నా కొరకు ప్రార్థించండి'' దైవప్రవక్త(స) ఈ విధంగా పేర్కొన్నారు: ''ఒకవేళ నీవు కోరుకుంటే సహనం వహించు. నీ కొరకు స్వర్గం ఉంది. ఒకవేళ నీవు కోరుకున్నట్లయితే అల్లాహ్ ను నీ కొరకు ప్రార్థిస్తాను. ఆయన నీకు ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాడు. (అటువంటి పక్షంలో స్వర్గ ప్రవేశానికి సంబంధించి వాగ్దానం చేయను)'' ఆ స్త్రీ ఇలా పలికింది: ''నేను సహనం వహిస్తాను. అయితే మూర్ఛలు వచ్చే సమయంలో నా వస్త్రాలు శరీరంపై నుంచి తొలగిపోకుండా ఉండేందుకై అల్లాహ్‌ను ప్రార్థించండి.'' దైవప్రవక్త (స) ఆమె కొరకు ఆ విధంగా ప్రార్థించారు.''

(దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[29]

## అంశం : 364

**దైవప్రవక్త, దైవమార్గంలో అమరగతిని పొందిన వ్యక్తి, పుట్టిన వెంటనే మరణించే శిశువు, అల్లాహ్ ప్రసన్నత కొరకు తన సోదరుని కలుసుకునే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తారు.**

## అంశం : 365

**తన భర్తను ప్రేమించే, ఎక్కువమంది పిల్లల్ని కనే శ్రమ తీసుకునే, తన భర్త హింస పట్ల సహనం వహించే స్త్రీ స్వర్గంలోకి ప్రవేశిస్తుంది.**

హజ్రత్ కఅబ్ బిన్ ఉజ్రహ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: ''స్వర్గంలోకి ప్రవేశించే పురుషుల గురించి మీకు తెలుపనా? (వినండి) దైవప్రవక్త స్వర్గవాసి, దైవమార్గంలో మరణించే వ్యక్తి స్వర్గవాసి, సత్యసంధుడు స్వర్గవాసి, పుట్టిన వెంటనే మరణించే శిశువు స్వర్గవాసి, కేవలం అల్లాహ్ ప్రసన్నత కొరకు దూరం నుంచి తన సోదరుని కలుసుకునే వ్యక్తి స్వర్గవాసి. స్వర్గంలోకి ప్రవేశించే స్త్రీల గురించి తెలుపనా? తన భర్తను ప్రేమించే, ఎక్కువమంది పిల్లల్ని కనే శ్రమ తీసుకునే, భర్త హింసిస్తే 'నా చేయి నీ చేతిలో ఉంది. నీవు సంతుష్టుడివి కానంత వరకు నేను నిద్రించను' అని పలికే సాధ్వీమణి అయిన స్త్రీ స్వర్గవాసి.''

(దీనిని తిబ్రానీ ఉల్లేఖించారు, హసన్)[30]

## అంశం : 366

**ఇస్లామీయ శాసనాంగంలో ధర్మసమ్మతమైన వస్తువులను ధర్మసమ్మతమైనవిగా, నిషిద్ధమైనవాటిని నిషిద్ధమైనవిగా తెలుసుకొని వాటి ప్రకారం ఆచరించే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ జాబిర్(ర) ఈ విధంగా ఉల్లేఖించారు: ఒకవ్యక్తి దైవప్రవక్త (స)ను ఈ విధంగా ప్రశ్నించాడు: "ఓ దైవప్రవక్తా (స)! ఒకవేళ ఫరజ్ నమాజులు చదివినట్లయితే, రమజాన్ నెలలో ఉపవాసాలుంటే, ఇస్లామీయ శాసనాంగంలో ధర్మబద్ధమైన వాటిని ధర్మబద్ధమైనవిగా, నిషిద్ధమైనవాటిని నిషిద్ధమైనవిగా గ్రహించి, అంతకు మించి మరేమీ చేయకుంటే నేను స్వర్గంలోకి ప్రవేశిస్తానా?" దైవప్రవక్త(స) 'అవును' అని పేర్కొన్నారు."

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[31]

## అంశం : 367

**యుక్తవయస్సుకు చేరుకోకుండానే ఇద్దరు పిల్లలు మరణించడం పట్ల సహనం వహించే తల్లిదండ్రులు స్వర్గంలోకి ప్రవేశిస్తారు.**

హజ్రత్ అబూహురైరహ్(ర) ఈ విధంగా ఉల్లేఖించారు: దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) అన్సారీ స్త్రీ లతో ఈ విధంగా పేర్కొన్నారు: "మీలో ఏ స్త్రీ యొక్క ముగ్గురు పిల్లలయినా మరణించినప్పుడు ఆమె అల్లాహ్ ప్రసన్నత కొరకు సహనం వహించినట్లయితే స్వర్గంలోకి ప్రవేశిస్తుంది." ఒక స్త్రీ ఈ విధంగా ప్రశ్నించింది: "ఓ దైవప్రవక్తా(స)! ఒకవేళ ఇద్దరు పిల్లలు మరణించినట్లయితే ఆ స్త్రీ విషయమేమిటి?" దైవప్రవక్త (స) ఇలా బదులిచ్చారు: "ఒకవేళ ఇద్దరు (పిల్లలు) మరణించినప్పటికీ ఇదే పుణ్యఫలం లభిస్తుంది."

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[32]

## అంశం : 368

**ప్రతి నమాజ్ తర్వాత 'ఆయతుల్ కుర్సీ' చదివే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ అబూ ఉమామహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ప్రతి నమాజ్ తర్వాత ఆయతుల్ కుర్సీని చదివే వ్యక్తిని మృత్యువు తప్ప ఏ వస్తువూ స్వర్గంలోకి ప్రవేశించకుండా అడ్డుకోజాలదు."

(దీనిని నిసాయీ, ఇబ్నె హబ్బాన్ మరియు తిబ్రానీ ఉల్లేఖించారు, సహీహ్)[33]

## అంశం : 369

**"లా హౌల వలా ఖువ్వత ఇల్లాబిల్లాహ్" అనే వాక్యాన్ని విరివిగా పఠించే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ అబూ జర్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు: నాతో దైవప్రవక్త(స) ఈ విధంగా పలికారు: “నేను నీకు స్వర్గలోకపు ఖజానాల్లోంచి ఒక ఖజానా గురించి తెలుపనా?” నేను ఇలా పలికాను: “ఓ దైవప్రవక్తా(స)! తప్పకుండా తెలుపండి.” అప్పుడు దైవప్రవక్త(స) ఇలా పలికారు: ‘లా హౌల వలా ఖువ్వత ఇల్లాబిల్లాహ్’ (మంచి చేసేందుకు, చెడు నుంచి రక్షించబడేందుకు శక్తి కేవలం అల్లాహ్ ద్వారా మాత్రమే లభిస్తుంది)”

(దీనిని ఇబ్నె మాజహ్ ఉల్లేఖించారు, సహీహ్)[34]

## అంశం : 370

**“సుబ్‌హానల్లాహిల్ అజీమి వబిహమ్‌దిహీ” అనే వాక్యాన్ని విరివిగా పఠించే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ జాబిర్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: నాతో దైవప్రవక్త (స) ఈ విధంగా పలికారు: “ఏ వ్యక్తయితే ‘సుబ్‌హానల్లాహిల్ అజీమి వ బిహమ్‌దిహీ (సర్వోన్నతుడైన అల్లాహ్ తన స్తోత్రంతో సహా పరమ పవిత్రుడు) అని పలుకుతాడో అతడి కొరకు స్వర్గంలో ఒక ఖర్జూరపు చెట్టు నాటబడుతుంది.”

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[35]

## అంశం : 371

**ఏ వ్యక్తయితే తన సంపద కారణంగా హతమార్చబడతాడో అతడు స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ బిన్ ఆస్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: “ఏ వ్యక్తయితే తన సంపద కారణంగా దౌర్జన్య పూరితంగా హతమార్చబడతాడో అతడు స్వర్గంలోకి ప్రవేశిస్తాడు”

(దీనిని నసాయీ ఉల్లేఖించారు, సహీహ్)[36]

## అంశం : 372

**ఏ స్త్రీ అయితే గర్భస్రావం జరగడం పట్ల సహనం వహిస్తుందో ఆమె స్వర్గంలోకి ప్రవేశిస్తుంది.**

హజ్రత్ మఆజ్ బిన్ జబల్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: “ఎవరి అధీనంలోనయితే నా ప్రాణముందో ఆ అస్తిత్వం సాక్షిగా! గర్భస్రావం జరిగిన కారణంగా మరణించిన శిశువు తన తల్లిని వేలు పట్టుకొని స్వర్గానికి తీసుకెళ్తుంది. అయితే ఆ స్త్రీ పుణ్యఫలం పొందే ఉద్దేశ్యంతో సహనం వహించినప్పుడే అలా జరుగుతుంది.” (దీనిని ఇబ్నె మాజహ్ ఉల్లేఖించారు, సహీహ్)[37]

## అంశం : 373

**సత్యం ప్రకారం తీర్పు చేసే న్యాయమూర్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ బురైదహ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఇద్దరు న్యాయమూర్తులు నరకానికి వెళ్తారు. ఒక న్యాయమూర్తి స్వర్గానికి వెళ్తాడు. సత్యాన్ని గుర్తించి దానికనుగుణంగా తీర్పు చేసిన న్యాయమూర్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు. ఇక సత్యాన్ని గుర్తించినప్పటికీ, తెలిసీ దౌర్జన్యానికి పాల్పడిన (సత్యానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చిన) న్యాయమూర్తి మరియు సరియైన రీతిలో శోధించకుండా, విచారించకుండా తీర్పు ఇచ్చిన న్యాయమూర్తి నరకానికి వెళ్తారు."

(దీనిని హాకిమ్ ఉల్లేఖించారు, సహీహ్)[38]

## అంశం : 374

**ఒక ముస్లిం సోదరుడు లేని సమయంలో అతడి గౌరవాన్ని పరిరక్షించే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ అస్మా బిన్తె యజీద్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఏ వ్యక్తయితే ఒక ముస్లిం సోదరుడు లేని సమయంలో అతడి గౌరవాన్ని పరిరక్షిస్తాడో అతడు అల్లాహ్ చే నరకాగ్ని నుంచి విముక్తిని పొందే హక్కును కలిగి ఉన్నాడు." (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు, సహీహ్)[39]

## అంశం : 375

**ఎవరినీ యాచించని వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ సూబాన్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఏ వ్యక్తయితే తాను ఎవరినీ యాచించనని నాకు హామీ ఇస్తాడో నేను అతడికి స్వర్గపు హామీ ఇస్తాను." (దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు, సహీహ్)[40]

## అంశం : 376

**కోపాన్ని దిగమింగే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ అబుద్దర్దా(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఆగ్రహానికి లోను కాకు. నీ కొరకు స్వర్గమున్నది."

(దీనిని తిబ్రానీ ఉల్లేఖించారు, సహీహ్)[41]

## అంశం : 377

**అసర్ మరియు ఫజర్ నమాజులను జమాఅత్ తో కలిసి శ్రద్ధగా చదివే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ అబూబకర్ బిన్ అబూ మూసా అష్అరీ(ర) తన తండ్రి ద్వారా దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నట్లుగా ఉల్లేఖించారు: "ఏ వ్యక్తయితే చల్లని సమయాల్లో చదువబడే రెండు నమాజులు చదివాడో అతడు స్వర్గంలోకి ప్రవేశించాడు."

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[42]

## అంశం : 378

**జుహర్ నమాజ్ కు ముందు 4 రకాతుల సున్నత్ నమాజును క్రమం తప్పకుండా చదివే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ ఉమ్మె హబీబహ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఏ వ్యక్తయితే జుహర్ నమాజ్ కు ముందు 4 రకాతులు నమాజ్ చదువుతాడో అతడి కొరకు అల్లాహ్ నరకాగ్నిని నిషేధిస్తాడు."

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[43]

## అంశం : 379

**నిరంతరాయంగా 40 రోజుల పాటు 'తక్బీరె ఊలా' (నమాజ్ ప్రారంభించే సమయంలో 'అల్లాహు అక్బర్' పలకడం)ను సైతం విడచిపెట్టకుండా ప్రతిరోజూ ఐదుపూటలు నమాజ్ చదివిన వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఏ వ్యక్తయితే 40 రోజులపాటు (ఐదు నమాజులను) తక్బీరె ఊలానుసైతం విడచిపెట్టకుండా జమాఅత్ తో కలిసి నమాజ్ చదివాడో అతడి కొరకు రెండు విషయాల నుంచి విముక్తి వ్రాయబడుతుంది. ఒకటి నరకాగ్ని నుంచి, రెండు కాపట్యం నుంచి."

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, హసన్)[44]

## అంశం : 380

**క్రింద పేర్కొనబడిన ఏడుగురు వ్యక్తులు స్వర్గంలోకి ప్రవేశిస్తారు:**

1. న్యాయవంతుడైన పరిపాలకుడు
2. యవ్వనంలో దైవారాధన పట్ల ఆసక్తి గల వ్యక్తి
3. ఎక్కువ సమయం మసీదులో గడిపేవాడు
4. అల్లాహ్ కొరకు ఇతరులను ప్రేమించే వ్యక్తి
5. ఏకాంతంలో అల్లాహ్ పట్ల భయంతో ఏడ్చే వ్యక్తి
6. అల్లాహ్ పట్ల భయంతో అందమైన యువతి పాపకార్యం వైపుకు ఆహ్వానించినా ఆగిపోయేవాడు.
7. అల్లాహ్ మార్గంలో గుప్తంగా దానాలు చేసే వ్యక్తి

హజ్రత్ అబూ సఈద్ ఖుదరీ(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఏ రోజయితే ఏ నీడా ఉండదో ఆ రోజున అల్లాహ్ ఏడుగురు వ్యక్తులకు తన అర్ష్ నీడలో స్థలాన్ని ప్రసాదిస్తాడు. వారు:

**1. న్యాయవంతుడైన పరిపాలకుడు**
**2. అల్లాహ్ ఆరాధనలో నిమగ్నమైన యువకుడు**
**3. మసీదు నుంచి బయటికొచ్చిన తర్వాత తిరిగి మసీదుకు చేరుకునేంత వరకు హృదయాన్ని మసీదులోనే లగ్నం చేసి ఉంచే వ్యక్తి**
**4. అల్లాహ్ కొరకే పరస్పరం ప్రేమించేవారు. వారు కలుసుకోవడమైనా, విడిపోవడమైనా కేవలం అల్లాహ్ కొరకు మాత్రమే జరుగుతుంది.**
**5. ఏకాంతంలో అల్లాహ్ ను స్మరించి అశ్రువులు చిందించే వ్యక్తి**
**6. ఉన్నత వంశానికి చెందిన అందమైన స్త్రీ పాపకార్యం వైపుకు ఆహ్వానించినప్పటికీ 'నేను అల్లాహ్ కు భయపడుతున్నాను' అని పలికే వ్యక్తి**
**7. కుడిచేతితో దానం చేస్తే ఎడమచేతికి సైతం తెలియనంతగా గుప్తంగా దానాలు చేసే వ్యక్తి."** (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[45]

## అంశం : 381

**ఇతరులను క్షమించే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ మఆజ్ బిన్ అనస్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఏ వ్యక్తయితే ప్రతీకారం తీర్చుకునేందుకై పూర్తిగా శక్తిని కలిగి ఉన్నప్పటికీ (ప్రతీకారం తీర్చుకోకుండా) కోపాన్ని దిగమింగుతాడో (ప్రళయదినాన) అల్లాహ్ ఆ వ్యక్తిని జీవులందరి ముందు పిలిచి 'నీకు ఇష్టమైన స్వర్గలోకపు సుకన్యలను వివాహమాడు' అని పేర్కొంటాడు." (దీనిని అహ్మద్ ఉల్లేఖించారు, హసన్)[46]

## అంశం : 382

**అహంకారం, అవినీతి, ఋణాల నుంచి దూరంగాఉండే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ సూబాన్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఏ వ్యక్తయితే అహంకారం, అవినీతి, ఋణాలు లేని స్థితిలో మరణిస్తాడో అతడు స్వర్గంలోకి ప్రవేశిస్తాడు." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[47]

## అంశం : 382-అ

**అజాన్ (నమాజ్ కొరకు పిలుపు)కు సమాధానమిచ్చే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.**

హజ్రత్ అబూహురైరహ్(ర) ఈ విధంగా పేర్కొన్నారు :మేము దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) వెంట ఉన్నాము. అప్పుడు హజ్రత్ బిలాల్ (ర) నిల్చొని అజాన్ పలికారు. హజ్రత్ బిలాల్(ర) అజాన్ ముగించి మౌనం వహించినప్పుడు దైవప్రవక్త(స) ఇలా పేర్కొన్నారు: “ఏ వ్యక్తయితే ముఅజ్జిన్ (అజాన్ పలికే వ్యక్తి) పలికిన పలుకులను విశ్వాసంతో తిరిగి ఉచ్చరిస్తాడో అతడు స్వర్గంలోకి ప్రవేశిస్తాడు.”

(దీనిని నసాయిూ ఉల్లేఖించారు, హసన్)[48]

---

**అథః సూచికలు :**

1. కితాబుల్ జన్నహ్ వ సిఫతు నఈమిహా
2. సహీహ్ జామిఉస్సగీర్, లిల్ అల్‌బానీ, అల్ జుజ్‌ఉస్సాలిసు, హదీస్ నెం: 3130
3. కితాబుల్ ఇఅ్‌తిసామ్ బిల్ కితాబి వస్సున్నహ్, బాబుల్ ఇఖ్‌తిదాఇ బి సునని రసూలుల్లాహ్
4. కితాబుస్సలాతుల్ ముసాఫిరీన్, బాబ్ ఫజ్‌లుస్సునన్‌రాతిబహ్
5. కితాబుల్ ఈమాన్, బాబ్ బయానుల్ ఈమాన్ అల్లజీ యద్‌ఖులుల్ జన్నహ్
6. అబ్‌వాబుల్ జన్నహ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతి గర్‌ఫిల్ జన్నహ్ (2 / 2051)
7. కితాబుల్ జన్నహ్ వ సిఫతు నఈమిహా, బాబ్ సిఫాతు అహ్‌లిల్ జన్నహ్ వన్నార్
8. అబ్‌వాబుల్ బాబ్ ఫిల్ ఇస్తిగ్‌ఫార్ (1/ 1353)
9. కితాబుల్ బిర్ర్ వస్సిలహ్, బాబ్ ఫజలుల్ ఇహ్‌సాన్ ఇలల్ బనాత్
10. ముఖ్‌తసర్ సహీహ్ ముస్లిమ్, లిల్ అల్‌బానీ, హదీస్ నెం : 1682
11. సహీహ్ జామిఉస్సగీర్ వ జియాదతిహీ, లిల్ అల్‌బానీ, అల్ జుజ్‌ఉల్ అవ్వలు, హదీస్ నెం: 673
12. కితాబుల్ జిహాద్, బాబ్ ఫీ ఫజలుష్షహాదహ్ (2 / 2200)

13. అబ్వాబ్ ఫజలుల్ జిహాద్, బాబ్ మా జాఅ ఫిల్ ముజాహిదు వల్ మకాతిబ్ వన్నాకిహు (2/1353)
14. కితాబుల్ బిర్ర్ వస్సిలహ్, బాబ్ మా జాఅ ఫీ హుస్నుల్ ఖలఖ్
15. కితాబుజ్జుహద్, బాబ్ ఫజ్లులుల్ ఇహ్సాని ఇలల్ అర్మలహ్ వల్ మిస్కీని వల్ యతీమ్
16. కితాబుల్ ఉమ్రహ్, బాబ్ వుజూబుల్ ఉమ్రహ్ వ ఫజ్లిహీ
17. కితాబుజ్జుహద్, బాబ్ ఫజల్ బినాఅల్ మస్జిద్
18. కితాబుర్రిఖాఖ్, బాబ్ హిఫ్జుల్లిసాన్
19. తమాముల్ మనహ్ బయానుల్ ఖసాలుల్ మూజిబహ్ బిల్ జన్నహ్, హదీస్ నెం: 136
20. అల్ లుల్ లుల్ వల్ మర్జాన్, అల్ జుజ్ఉస్సానీ, హదీస్ నెం: 1714
21. కితాబుల్ అదబ్, అబ్వాబుజ్జిక్ర్, బాబ్ సవాబుల్ ఖుర్ఆన్ (2 / 3047)
22. అబ్వాబ్ సిఫతుల్ ఖియామహ్, బాబ్ నెం:10 (2 / 2019)
23. కితాబుల్ బిర్ర్ వస్సిలహ్, బాబ్ ఫజ్లి ఇయాదతుల్ మరీజి
24. కితాబుజ్జిక్రి వద్దుఆఇ, బాబ్ ఫజ్లులుల్ ఇజ్తిమాఇ అలా తిలావతిల్ ఖుర్ఆన్
25. ముఖ్తసర్ సహీహ్ బుఖారీ లిజ్జుబైదీ, హదీస్ నెం: 2070
26. కితాబుల్ మరజ్, బాబ్ ఫజ్లుమ్ మిన్ జహబ బసరహ్
27. కితాబుల్ బిర్రి వస్సిలహ్, బాబ్ తఖ్దీమ్ బిరల్ వాలిదైని అలత్తతూఅ బిస్సలాహ్
28. కితాబుల్ బిర్రి వస్సిలహ్, బాబ్ ఫజ్లుమ్ మిన్ ఇజాలతుల్ అజా మినత్తరీఖి
29. కితాబుల్ మర్జా, బాబ్ ఫజ్లుమ్ మిన యస్రత్ మినర్రీహ్
30. అల్ జామిఉస్సగీర్, లిల్ అల్బానీ, హదీస్ నెం : 2601
31. కితాబుల్ ఈమాన్, బాబ్ బయాన్ అల్లజీ యద్ఖులుల్ జన్నహ్
32. కితాబుల్ బిర్రి వస్సిలహ్, బాబ్ ఫజ్లుమ్ మిన్ యమూతు లహూ వలద్ ఫీహసిబహ్
33. సిల్సిలయె అహాదీసుస్సహీహ లిల్ అల్బానీ, అల్జుజ్ఉస్సానీ, హదీస్ నెం: 972
34. సునన్ అబీ మాజహ్, లిల్ అల్బానీ, అల్ జుజ్ఉస్సానీ, హదీస్ నెం : 3083
35. సహీహ్ జామిఉత్తిర్మిజీ, లిల్ అల్బానీ, అల్ జుజ్ఉస్సాలిసు, హదీస్ నెం : 2757
36. కితాబు తహ్రీముద్దమ్, బాబ్ మిన్ ఖతల దౌను మాలిహీ (3 / 3808)
37. కితాబుల్ జనాఇజ్, బాబ్ మా జాఅ ఫీమన్ అసీబ్ బిమస్ఖత్ (1 / 1305)
38. సహీహ్ జామిఉస్సగీర్, లిల్ అల్బానీ, అల్ జుజ్ఉస్సాలిస్, హదీస్ నెం: 4174
39. సహీహ్ జామిఉస్సగీర్, లిల్ అల్బానీ, అల్ జుజ్ఉల్ ఖామిసు, హదీస్ నెం: 6116
40. కితాబుజ్జకాత్, బాబ్ కరాహియతుల్ మస్అలహ్ (1 / 1446)
41. సహీహ్ జామిఉస్సగీర్, లిల్ అల్బానీ, అల్ జుజ్ఉస్సాదిసు, హదీస్ నెం : 7251
42. కితాబుస్సలాహ్, బాబ్ ఫజ్లి సలాతుస్సుబహ్ వల్ అస్ర్
43. కితాబుస్సలాహ్, బాబ్ (1 / 351)
44. అబ్వాబుస్సలాహ్, బాబ్ ఫీ ఫజ్లుత్తక్బీరతుల్ ఊలా (1 / 200)
45. కితాబుజ్జుహద్, బాబ్ మా జాఅ ఫీ హుబ్బిల్లాహ్ (2 / 1949)
46. సహీహ్ జామిస్సగీర్, లిల్ అల్బానీ, అల్ జుజ్ఉల్ ఖామిసు, హదీస్ నెం : 6394
47. అబ్వాబుల్ యసీర్, బాబుల్ గులూల్ (2 / 1278)
48. కితాబుల్ అజాన్, బాబ్ సవాబ్ జాలిక్ (1 / 650)

# ప్రారంభంలో స్వర్గానికి దూరంగా ఉండేవారు

## అంశం : 383

**అబద్ధపు సాక్ష్యం పలికి ఇతరుల హక్కును కొల్లగొట్టే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశించడు.**

హజ్రత్ అబూ ఉమామహ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఏ వ్యక్తయితే (అబద్ధపు) ప్రమాణం చేసి ఒక ముస్లిం హక్కును కొల్లగొట్టాడో అల్లాహ్ అతడి కొరకు నరకాన్ని తప్పనిసరి చేశాడు, స్వర్గాన్ని నిషేధించాడు" ఒక వ్యక్తి ఇలా ప్రశ్నించాడు: "ఓ దైవప్రవక్తా(స)! ఒకవేళ అది మామూలు వస్తువయినా కూడానా?" దైవప్రవక్త(స) ఇలా పలికారు: "ఒకవేళ అది పీలూ చెట్టు కొమ్మయినా సరే."

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[1]

## అంశం : 384

**అధర్మ మార్గంలో సంపాదిస్తూ, అధర్మసొమ్ముతో తినే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశించడు.**

హజ్రత్ అబూబకర్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "అధర్మంగా సంపాదించిన ఆహారంతో పోషించబడిన శరీరం స్వర్గంలోకి ప్రవేశించదు." (దీనిని బైహఖీ ఉల్లేఖించారు, సహీహ్)[2]

## అంశం : 385

**తల్లిదండ్రుల పట్ల అవిధేయుడైన వ్యక్తి, లజ్జావిహీనుడు (సిగ్గు లేని వ్యక్తి), పురుషులను అనుకరించే స్త్రీ స్వర్గంలోకి ప్రవేశించరు.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "ముగ్గురు వ్యక్తులు స్వర్గంలోకి ప్రవేశించరు: (1) తల్లిదండ్రుల పట్ల అవిధేయుడైన వ్యక్తి, (2) లజ్జావిహీనుడైన వ్యక్తి (3) పురుషులను అనుకరించే స్త్రీలు." (దీనిని హాకిమ్ ఉల్లేఖించారు, సహీహ్)[3]

## అంశం : 386

**సంబంధాలను తెంచే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశించడు.**

హజ్రత్ ముహమ్మద్ బిన్ జుబైర్ బిన్ ముత్ఇమ్(ర) తన తండ్రి ద్వారా దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నట్లుగా ఉల్లేఖించారు : "సంబంధాలను తెంచే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశించడు." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[4]

**అంశం : 387**

**తన ప్రజలను మోసపుచ్చే పరిపాలకుడు స్వర్గంలోకి ప్రవేశించడు.**

హజ్రత్ మఅ్ఖల్ బిన్ యసార్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "ముస్లిం ప్రజలను పరిపాలించే పరిపాలకుడు ఒకవేళ తన ప్రజలను మోసపుచ్చుతున్న స్థితిలో మరణించినట్లయితే అల్లాహ్ అతడి కొరకు స్వర్గాన్ని నిషేధిస్తాడు." (దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[5]

**అంశం : 388**

**చేసిన మేలును గుర్తు చేసే వ్యక్తి, తల్లిదండ్రుల పట్ల అవిధేయునిగా మెలిగే వ్యక్తి, నిత్యం మద్యపాన సేవనంలో గడిపే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశించరు.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "చేసిన మేలును గుర్తు చేసే వ్యక్తి, తల్లిదండ్రుల పట్ల అవిధేయునిగా మెలిగే వ్యక్తి, నిత్యం మద్యం సేవించే వ్యక్తి (అనగా వృద్ధుడైన తాగుబోతు) స్వర్గంలోకి ప్రవేశించరు." (దీనిని నసాయీ ఉల్లేఖించారు, సహీహ్)[6]

**అంశం : 389**

**పొరుగువానికి కష్టం కలిగించే వ్యక్తి స్వర్గానికి దూరంగా ఉంటాడు.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "ఏ వ్యక్తి పొరుగువాడయితే అతడి చెడు నుంచి సురక్షితంగా ఉండడో అతడు స్వర్గంలోకి ప్రవేశించడు." (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[7]

**అంశం : 390**

**చెడ్డ నోరు గల (నోటి ద్వారా పాపాలకు పాల్పడే) వ్యక్తి, చెడ్డ వైఖరిని కలిగిన వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశించరు.**

హజ్రత్ హారిసహ్ బిన్ వహబ్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "చెడ్డ నోరు గల (నోటి ద్వారా పాపాలకు పాల్పడే) వ్యక్తి, చెడ్డ వైఖరిని కలిగిన వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశించరు."

(దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు, సహీహ్)[8]

**అంశం : 391**

**అహంకారి స్వర్గంలోకి ప్రవేశించడు.**

హజ్రత్ అబ్దుల్లాహ్ (బిన్ మస్ఊద్) (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : "ఏ వ్యక్తి హృదయంలోనయితే ఆవ గింజంత అహంకారం ఉంటుందో ఆ వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశించడు."

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[9]

## అంశం : 392

**చాడీలు చెప్పే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశించడు.**

హజ్రత్ హుజైఫహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "చాడీలు చెప్పే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశించడు."

(దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు, సహీహ్)[10]

**వివరణ: కొన్ని హదీసుల్లో 'నమామున్' పదం పేర్కొనబడింది. రెండింటి అర్థం ఒక్కటే.**

## అంశం : 393

**తెలిసి కూడా తన తండ్రి కాని వ్యక్తిని తన తండ్రిగా పేర్కొనే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశించడు.**

హజ్రత్ సఅద్ బిన్ అబీ వఖాస్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "తెలిసి కూడా తన తండ్రి కాని వ్యక్తిని తన తండ్రిగా పేర్కొనే వ్యక్తి కొరకు స్వర్గం నిషేధించబడింది." (దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[11]

## అంశం : 394

**అకారణంగా తలాఖ్ (విడాకులు) కోరే స్త్రీ స్వర్గంలోకి ప్రవేశించదు.**

హజ్రత్ సూబాన్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పేర్కొన్నారు : "ఏ స్త్రీ అయితే అకారణంగా తన భర్త నుంచి తలాఖ్ (విడాకులు) కోరుతుందో ఆ స్త్రీ కొరకు స్వర్గలోకపు సువాసన నిషేధించబడింది."

(దీనిని తిర్మిజీ మరియు ఇబ్నెమాజహ్‌లు ఉల్లేఖించారు, సహీహ్)[12]

## అంశం : 395

**జుట్టుకు నల్లరంగు పూసే వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశించడు.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ఆఖరి కాలంలో కొంతమంది పావురపు ఉదరభాగంలో ఉండే రీతిలో నల్లని రంగును జుట్టుకు పూసుకుంటారు. అటువంటి ప్రజలు స్వర్గలోకపు సువాసనను సైతం పొందలేరు."

(దీనిని అబూదావూద్ ఉల్లేఖించారు, సహీహ్)[13]

**అథః సూచికలు :**

1. కితాబుల్ ఈమాన్, బాబ్ రఈద్ మిన్ అఖ్తతల్ హఖి ముస్లిమి బియమీని
2. మిష్కాతుల్ మసాబీహ్, లిల్ అల్బానీ, కితాబుల్ బుయూఅ్, బాబుల్ కస్బి వ తల్బుల్ హలాలి (2 / 2787)
3. కితాబుల్ జామిఉస్సగీర్, లిల్ అల్బానీ, అల్ జుజ్ఉస్సాలిసు, హదీస్ నెం : 3058
4. అబ్వాబుల్ బిర్రి వస్సిలహ్, బాబ్ సిలతుర్రహమ్ (2 / 1559)
5. కితాబుల్ అహ్కామ్, బాబ్ మిన్ అస్తర్ఈ దఇయతు ఖలమి యన్ఫఉ
6. కితాబుల్ అస్తర్ బిహీ బాబుర్రూయతు ఫిల్ ముద్మినీన ఫిల్ ఖమర్ (3 / 5241)
7. కితాబుల్ ఈమాన్, బాబ్ బయాన్ తహ్రీమి ఈజాఇల్ జార్
8. కితాబుల్ అదబ్, బాబ్ ఫీ హుస్నుల్ ఖలఖ్ (3 / 4017)
9. కితాబుల్ ఈమాన్, బాబ్ తహ్రీముల్ కిబర్
10. కితాబుద్దబ్, బాబ్ ఫిల్ ఖత్తాత్ (3 / 4076)
11. కితాబుల్ ఫరాయిజ్, బాబ్ మిన్ అద్ఈ గైరి అబీహి
12. సహీహ్ సుననుత్తిర్మిజీ, ‘ అబ్వాబుత్తలాఖ్ ’ బాబ్ ఫిల్ ముఖ్తలిఅత్ (1 / 948)
13. కితాబుల్లిబాస్, బాబ్ మా జాఅ ఫీ ఖిజాబిస్సాదా (2 / 3548)

# ఒక నిర్ణీత వ్యక్తిని స్వర్గవాసిగా పేర్కొనడం ధర్మసమ్మతం కాదు

**అంశం : 396**

**ఒక వ్యక్తి గురించి ఖచ్చితంగా స్వర్గవాసిగా పేర్కొనడం ధర్మసమ్మతం కాదు.**

**అంశం : 397**

**ఒక వ్యక్తి ఖచ్చితంగా స్వర్గవాసి లేదా నరకవాసి అనే జ్ఞానం కేవలం అల్లాహ్‌కు మాత్రమే ఉంటుంది.**

హజ్రత్ ఉమ్ముల్ అలా(ర) మదీనాలోని అన్సార్లకు చెందిన, దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) చేతిపై విధేయతాప్రమాణం చేసిన స్త్రీలలో ఒకరు. ఆమె ఈ విధంగా పేర్కొన్నారు: చీటీలు వేసి ముహాజిర్లు (మక్కా నుంచి మదీనాకు హిజ్రత్ చేసిన ముస్లింలు) అన్సార్లలో (మక్కా నుంచి హిజ్రత్ చేసి మదీనాకు వచ్చిన ముస్లింలకు సహకరించిన మదీనావాసులు) పంచివేయడం జరుగగా హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్ఊన్(ర) మా భాగంగా వచ్చారు. మేము ఆయనను మా ఇంటిలో ఉంచాము. అయితే ఆ తర్వాత ఆయన ప్రాణాంతక వ్యాధితో మరణించారు. ఆయనకు గుసుల్ (స్నానం) చేయించి, శవ వస్త్రం తొడిగించబడింది. అప్పుడు దైవప్రవక్త (స) అక్కడకు విచ్చేయగా నేను ఈ విధంగా పలికాను: "ఓ అబూ సాయిబ్! (హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్ఊన్ (ర) గారు ఆ విధంగా పిలువబడేవారు) నీపై అల్లాహ్ కారుణ్యమున్నది. అల్లాహ్ నీకు గౌరవాన్ని ప్రసాదించాడని నేను నీ విషయంలో సాక్ష్యమిస్తున్నాను." దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) ఈ విధంగా పలికారు : "(ఉమ్ముల్ అలా!) ఆయనకు అల్లాహ్ గౌరవాన్ని ప్రసాదించిన విషయం నీకెలా తెలుసు?" నేను ఇలా పలికాను: "ఓ దైవప్రవక్తా (స)! నా తల్లిదండ్రులు మీ కొరకు సమర్పించబడుగాక! అల్లాహ్ మరెవరికి గౌరవాన్ని ప్రసాదిస్తాడు?" దైవప్రవక్త(స) ఇలా పలికారు: "నిస్సందేహంగా ఉస్మాన్ మరణించారు. అల్లాహ్ సాక్షిగా! నేను కూడా ఆయన కొరకు (అల్లాహ్ నుంచి) శ్రేయస్సును, సంక్షేమాన్ని ఆశిస్తున్నాను. కానీ అల్లాహ్ సాక్షిగా! నేను దైవప్రవక్తనయినప్పటికీ (ప్రళయదినాన) నా పరిస్థితి ఏమవుతుందో నాకు తెలియదు" హజ్రత్ ఉమ్ముల్ అలా(ర) ఈ విధంగా పేర్కొన్నారు : "అల్లాహ్ సాక్షిగా! ఆ తర్వాత నేను ఏనాడూ ఏ వ్యక్తినీ (పాపాల నుంచి) పవిత్రుడిగా పేర్కొనలేదు."

(దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[1]

వివరణ :

1. ఏయే సహాబీలను (దైవప్రవక్త సహచరులను) పేర్లతో సహా దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) స్వర్గవాసులుగా పేర్కొన్నారో వారిని స్వర్గవాసులుగా పేర్కొనడం ధర్మ సమ్మతమే.

2. అల్లాహ్ ఔన్నత్యాన్ని, గొప్పదనాన్ని, నిరపేక్షతను, వైభవాన్ని దృష్టిలో ఉంచుకొని దైవప్రవక్త (స) తన గురించి ఆ విధంగా పేర్కొన్నారు. ఆ విషయాన్ని మరొక హదీసులో దైవప్రవక్త (స) ఈ విధంగా తెలియజేశారు: "ఏ వ్యక్తీ తన ఆచరణల ద్వారా స్వర్గంలోకి ప్రవేశించలేడు." అప్పుడు దైవప్రవక్త(స) ఈ విధంగా ప్రశ్నించబడ్డారు: "ఓ దైవప్రవక్తా (స)! మీరు కూడానా?" "అవును. నేను కూడా, నా ప్రభువు తన కారుణ్యంతో నన్ను కప్పివేస్తే తప్ప." (ముస్లిమ్)

3. గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే హజ్రత్ ఉస్మాన్ బిన్ మజ్ఊన్ (ర) రెండు సార్లు అబీసీనియాకు హిజ్రత్ చేసే భాగ్యాన్ని పొందారు. అలాగే మూడవసారి మక్కా నుంచి మదీనాకు హిజ్రత్ చేసే భాగ్యాన్ని పొందారు. ఆయన(ర) మరణించిన తర్వాత దైవప్రవక్త(స) మూడుసార్లు ఆయన(స) నుదుటిని చుంబించి ఈ విధంగా పలికారు: "మీరు ఇహలోకం నుంచి ఏ విధంగా నిష్క్రమించారంటే మీ అస్తిత్వం ఇహలోకంతో కలుషితమవలేదు." అయినప్పటికీ దైవప్రవక్త(స) ఆయనను ఖచ్చితంగా స్వర్గవాసిగా పేర్కొన్న స్త్రీని వారించారు.

## అంశం : 398

**దైవప్రవక్త సహచరులు(ర) యుద్ధ మైదానంలో హతమార్చబడిన ఒక వ్యక్తిని స్వర్గవాసిగా పేర్కొనగా దైవప్రవక్త (స) ఇలా పలికారు: "ఎంతమాత్రం కాదు. అతడు నరకంలో ఉన్నాడు."**

హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు : దైవప్రవక్త (స)తో ఈ విధంగా పేర్కొనడం జరిగింది: "ఫలానా వ్యక్తి అమరగతులయ్యారు. (వీరమరణం పొంది స్వర్గంలో ఉన్నారు)" దైవప్రవక్త (స) ఈ విధంగా పలికారు: "ఎంతమాత్రం కాదు. నేను అతడిని యుద్ధసొత్తులోని ఒక దుప్పటిని దొంగిలించిన కారణంగా నరకంలో చూశాను."

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[2]

## అంశం : 399

**జీవించి ఉన్న లేదా మరణించిన వ్యక్తిని, బయటికి అతడు ఎంత దైవభీతిపరునిగా, జ్ఞానిగా, దేవునికి ప్రీతిపాత్రునిగా (వలీగా), సాధువుగా కనిపించినప్పటికీ ఖచ్చితంగా స్వర్గవాసిగా భావించడం ధర్మసమ్మతం కాదు.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: “ఒక వ్యక్తి సుదీర్ఘకాలం పాటు స్వర్గవాసులకు చెందిన పనులు చేస్తూ ఉంటాడు. అయితే అతడి ముగింపు నరకవాసులకు చెందిన పనితో జరుగుతుంది. మరొక వ్యక్తి సుదీర్ఘకాలం పాటు నరకవాసులకు చెందిన పనులు చేస్తూ ఉంటాడు. అయితే అతడి ముగింపు స్వర్గవాసులకు చెందిన పనితో జరుగుతుంది.”

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[3]

హజ్రత్ సహల్ బిన్ సఅద్ సాఅదీ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: “ఒక వ్యక్తి ప్రజల దృష్టిలో స్వర్గవాసులకు చెందిన పనులు చేస్తాడు. కానీ అతడు నరకవాసి అయి ఉంటాడు. మరొక వ్యక్తి ప్రజల దృష్టిలో నరకవాసులకు చెందిన పనులు చేస్తాడు. కానీ అతడు స్వర్గవాసి అయి ఉంటాడు.”

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[4]

**వివరణ : ఔలియాల సమాధులపై వస్త్రాలు కప్పడం, మొక్కుబడులు చెల్లించుకోవడం మొదలైనవి 'షిర్కె అక్బర్' (అతి పెద్ద షిర్క్, అనగా అల్లాహ్ కు ఇతరులను సాటి కల్పించడమనే మహాపాపం) అయితే పైన పేర్కొనబడిన హదీసుల వెలుగులో మరొక వ్యర్థమైన ఆచరణ గురించి కూడా బోధపడింది. మరణించిన వ్యక్తి సమాధిలో సుఖంగా నిద్రిస్తున్నాడో లేక అల్లాహ్ శిక్షకు గురయి ఉన్నాడో కేవలం అల్లాహ్‌కు మాత్రమే తెలుసు.**

---

**అథః సూచికలు :**

1. కితాబుల్ జనాయిజ్, బాబుద్దుఖూల్ అలల్ మయ్యితి బఅదల్ మౌతి ఇజా అద్‌రజ ఫిల్ కిఫాఅహ్
2. అబ్‌వాబుస్సైర్, బాబుల్ గులూల్ (2 / 1279) (3) కితాబుల్ ఖద్ర్ (4) కితాబుల్ ఖద్ర్

# స్వర్గంలో గడచిన దినాల జ్ఞాపకాలు

## అంశం : 400

**పాత స్నేహితుని జ్ఞాపకం, అతడిని కలుసుకోవడానికి సంబంధించిన గుణపాఠం గరిపే వృత్తాంతం.**

"తర్వాత వారు (స్వర్గవాసుల) ఒకరివైపుకు మరొకరు తిరిగి పరిస్థితులను గురించి పరస్పరం అడిగి తెలుసుకుంటారు. వారిలో ఒక వ్యక్తి ఇలా పలుకుతాడు: ప్రపంచంలో నాకు ఒక మిత్రుడు ఉండేవాడు. అతడు నాతో ఇలా అంటూ ఉండేవాడు: 'నీవు కూడా ధృవీకరించేవారిలో చేరిపోయావా? మనం చనిపోయి,మట్టిగా మారి, అస్థిపంజరంగా మిగిలి పోయినప్పుడు నిజంగానే మనకు ప్రతిఫలం, శిక్ష అనేవి ఉంటాయా?' ఇప్పుడు అతడు ఎక్కడున్నాడో మీరు చూడదలుచుకున్నారా? ఇలా చెప్పి అతడు తొంగి చూడగానే, అతడికి నరకంలోని ఒక అగాధంలో అతడు కనిపిస్తాడు. అప్పుడు అతడిని సంబోధిస్తూ ఇలా అంటాడు: 'దేవుని సాక్షిగా! నీవు నన్ను సర్వనాశనం చేసి ఉండేవాడివి. నా ప్రభువు అనుగ్రహం లేకపోయి ఉంటే, ఈరోజు నేను కూడా పట్టుబడి వచ్చిన వారిలో ఒకడినై ఉండేవాడిని. సరే, అయితే ఇక మేము చనిపోమా? మాకు రావలసిన చావేదో ముందు వచ్చేసిందా? ఇక మాకు ఎలాంటి శిక్షా పడదా?' నిశ్చయంగా ఇదే మహత్తర విజయం. ఇలాంటి విజయం కోసమే కర్మశీలురు కర్మలు చేయాలి." (ఖుర్ఆన్, సాఫ్ఫాత్ : 50-61)

## అంశం : 401

**స్వర్గవాసులు తమ సమావేశాలలో ఇహలోక జీవితపు జ్ఞాపకాలను నెమరు వేసుకుంటారు.**

"వారు (స్వర్గవాసులు) పరస్పరం (ప్రపంచంలో జరిగిన) పరిస్థితులను గురించి అడిగి తెలుసుకుంటారు. వారు, 'మేము మొదట మా కుటుంబ సభ్యుల మధ్య (దేవునికి) భయపడుతూ జీవితం గడిపేవారం. చివరకు అల్లాహ్ మా పై కనికరం చూపాడు, మమ్మల్ని తీవ్రమైన వడగాలి శిక్ష నుంచి రక్షించాడు. మేము గత జీవితంలో ఆయననే వేడుకుంటూ ఉండేవారము. ఆయన నిజంగానే మహోపకారి మరియు అనంత కరుణామయుడు."

(ఖుర్ఆన్,తూర్: 25-28)

# ఆరాఫ్ ప్రజలు

## అంశం : 402

**స్వర్గనరకాలకు నడుమ ఒక ఎత్తయిన ప్రదేశంలో కొంతమంది మానవులు నిలిచి ఉంటారు. వారిని 'అస్‌హాబుల్ ఆరాఫ్' (ఎత్తయిన ప్రదేశాలకు చెందినవారు) అంటారు.**

## అంశం : 403

**ఆరాఫ్ ప్రజల పుణ్యఫలాలు, పాపాలు సమానంగా ఉంటాయి. ఆ కారణంగా వారు స్వర్గానికీ వెళ్ళలేరు, నరకానికీ వెళ్ళలేరు. కానీ అల్లాహ్ కారుణ్యం ద్వారా స్వర్గంలోకి ప్రవేశిస్తామని ఆశిస్తూ ఉంటారు.**

"ఈ ఉభయ వర్గాల మధ్య ఒక తెర అడ్డుగా నిలుస్తుంది. దాని ఎత్తుల (ఆరాఫ్)పై మరి కొందరు ప్రజలు ఉంటారు. వారు ప్రతి ఒకడినీ అతడి ముఖ చిహ్నాలను బట్టి గుర్తు పడతారు, స్వర్గవాసులను పిలిచి, 'మీకు శాంతి కలుగు గాక' అంటారు. వారు స్వర్గంలోకి ప్రవేశించనయితే లేదు, కానీ దాన్ని ఆశిస్తున్నారు." (ఖుర్‌ఆన్, ఆరాఫ్: 46)

## అంశం : 404

**ఆరాఫ్ ప్రజలు నరకవాసులను చూసి ఈ క్రింది విధంగా ప్రార్థిస్తారు**

"వారి దృష్టి నరకవాసుల వైపుకు మళ్ళినప్పుడు ఇలా అంటారు : 'ఓ ప్రభూ! మమ్మల్ని మాత్రం ఈ దుర్మార్గుల్లో చేర్చకు." (ఖుర్‌ఆన్, ఆరాఫ్: 47)

## అంశం : 405

**ఆరాఫ్ ప్రజలు తమ పూర్వ స్నేహితులైన నరకవాసులను సంబోధిస్తూ గుణపాఠం గరిపే రీతిలో ఈ విధంగా ప్రసంగిస్తారు :**

"తర్వాత ఆరాఫ్ పై ఉన్న ఈ ప్రజలు నరకంలో ఉన్న కొందరు పెద్ద మనుషులను, వారి ఆనవాళ్ళ ద్వారా గుర్తుపట్టి ఇలా అంటారు, 'చూశారా మీరు, మీ ముఠాలు గానీ, మీరు గొప్పగా భావించిన వస్తు సామగ్రి గానీ ఈరోజు మీకు ఏ విధంగానూ పనికి రాలేదుగా! ఎవరిని గురించయితే మీరు 'వీరికయితే అల్లాహ్ తన కారుణ్యాన్ని ఏమాత్రం ప్రసాదించడు' అని ప్రమాణాలు చేసి అంటూ ఉండేవారో, వారే కదా ఈ స్వర్గవాసులు. ఈరోజు వారికే చెప్పడం జరిగింది, 'స్వర్గంలో ప్రవేశించండి. మీకు భయం గానీ, దుఃఖం గానీ లేదు."

(ఖుర్‌ఆన్,ఆరాఫ్: 48, 49)

# రెండు విరుద్ధమైన విశ్వాసాలు, రెండు విరుద్ధమైన పర్యవసానాలు

**అంశం : 406**

**ఇహలోకంలో సుఖభోగాల్లో మునిగి తేలుతూ, పసందైన జీవితాన్ని గడిపే అవిశ్వాసులు ప్రాపంచిక జీవితంలో విశ్వాసుల వివశత్వం, నిస్సహాయతలను చూసి నవ్వుతారు, హేళన చేస్తారు. అయితే పరలోకంలో విశ్వాసులు పసందైన జీవితం గడుపుతూ అవిశ్వాసుల వివశత్వం, నిస్సహాయతలను చూసి నవ్వుతారు, హేళన చేస్తారు.**

"ప్రపంచంలో విశ్వసించినవారిని నేరస్తులు హేళన చేస్తుంటారు. వారిముందు నుండి వెళ్ళేటప్పుడు మాటిమాటికీ కళ్ళు గీటుతూ వారి వైపు సైగలు చేసేవారు. తమ కుటుంబ సభ్యుల దగ్గరకు వెళ్ళేటప్పుడు సంబరపడుతూ వెళ్ళేవారు. వారిని చూసినప్పుడు, 'వీరు దారి తప్పారు' అని అనేవారు. వాస్తవానికి వారు వారిపై కాపలాదారులుగా నియమించి పంపబడలేదు. ఈనాడు విశ్వసించినవారు అవిశ్వా సులను చూసి నవ్వుతున్నారు, ఉన్నత పీఠాలపై కూర్చుండి వారి స్థితిని చూస్తున్నారు. దొరికింది గదా అవిశ్వాసులకు వారు చేస్తూ ఉండిన చేష్టలకు పుణ్యఫలం." (ఖుర్ఆన్, ముతఫ్ఫిఫీన్: 29-36)

# ఇహలోకంలో కొన్ని స్వర్గలోకపు సౌఖ్యాలు

## అంశం : 407

**'హజ్‌రె అస్వద్' (కాబాగృహం వద్ద ఉన్న నల్లనిరాయి) స్వర్గలోకపు రాళ్ళలోని ఒక రాయి.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "హజ్‌రె అస్వద్ స్వర్గం నుంచి దింపబడిన రాయి. అది పాల కంటే తెల్లగా ఉండేది. కానీ ప్రజల పాపాలు దానిని నల్లగా మార్చివేశాయి."

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[1]

## అంశం : 408

**అజ్‌వహ్ (మదీనాలో లభ్యమయ్యే ఒక విధమైన ఖర్జూరపండు) స్వర్గలోకపు ఫలం.**

## అంశం : 409

**'మఖామె ఇబ్రాహీమ్' స్వర్గలోకపు రాయి. (ఈ రాయి మీద నిలబడి దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్ (అ) కాబాగృహాన్ని నిర్మించారు)**

## అంశం : 410

**'ఆలివ్' స్వర్గలోకపు చెట్టు.**

హజ్రత్ రాఫిఅ్ బిన్ అమ్ర్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "అజ్‌వహ్ (ఖర్జూరం), రాయి (మఖామెఇబ్రాహీమ్), వృక్షం (ఆలివ్ చెట్టు) స్వర్గానికి చెందినవి." (దీనిని హాకిమ్ ఉల్లేఖించారు, సహీహ్)[2]

## అంశం : 411

**దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) గదికి, మింబర్ (మసీదులో మూడు మెట్లతో కూడిన పీఠం)కు నడుమ ఉన్న స్థలం స్వర్గలోకంలో భాగం.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "నా గదికి, మింబర్ కు నడుమ ఉన్న స్థలం స్వర్గలోకపు ఉద్యానవనాలలోని ఒక ఉద్యానవనం. నా మింబర్ నా కొలను (కౌసర్) మీద ఉంది."

(దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[3]

## అంశం : 412

**గోరింటాకు స్వర్గలోకపు సువాసనల్లో ఒకటి.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "స్వర్గవాసుల కొరకు సుగంధాల నాయకురాలైన గోరింటాకు ఉంది." (దీనిని తిబ్రానీ ఉల్లేఖించారు)[4]

## అంశం : 413

**మేక స్వర్గలోకపు జంతువుల్లో ఒకటి.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "మేక స్వర్గంలోని జంతువుల్లో ఒకటి. దాని చీమిడి , ఉమ్మి మొదలైనవాటిని శుభ్రం చేసి దానిమీద నమాజ్ చదువుకోండి."

(దీనిని బైహఖీ ఉల్లేఖించారు, హసన్)[5]

## అంశం : 414

**'బుత్‌హాన్' స్వర్గలోకపు లోయల్లో ఒకటి.**

హజ్రత్ ఆయిషహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "బుత్‌హాన్ స్వర్గంలోని ఒకానొక కొలను మీద ఉంది."

(దీనిని బజ్జార్ ఉల్లేఖించారు, హసన్)[6]

**వివరణ : 'బుత్‌హాన్' అనేది మదీనాకు ఆనుకొని ఉన్న 'ఖుబా' అనే బస్తీకు సమీపంలో ఉన్న ఒక లోయ.**

---

**అధః సూచికలు :**

1. అబ్‌వాబుల్ హజ్, బాబ్ ఫజ్‌లుల్ హజ్‌రుల్ అస్వదు (1 / 695)
2. తహ్ఖీఖ్ ముస్తఫా అబ్దుల్ ఖాదిర్, దారుల్ కుతుబుల్ ఇల్మియహ్, బీరూత్ (4 / 226)
3. కితాబుస్సలాహ్, ఫీ మస్‌జిదె మక్కహ్ వ మదీనహ్
4. సిల్‌సిలయె అహాదీసుస్సహీహ లిల్ అల్‌బానీ, అల్ జుజ్‌ఉస్సాలిసు, హదీస్ నెం: 1420
5. సిల్‌సిలయె అహాదీసుస్సహీహ లిల్ అల్‌బానీ, అల్ జుజ్‌ఉస్సాలిసు, హదీస్ నెం: 1128
6. సిల్‌సిలయె అహాదీసుస్సహీహ లిల్ అల్‌బానీ, అల్ జుజ్‌ఉస్సానీ, హదీస్ నెం: 769

# స్వర్గాన్ని కోరుకునేందుకు ఉద్దేశించబడిన కొన్ని ప్రార్థనలు

**అంశం : 415**

**స్వర్గాన్ని ప్రసాదించమని అల్లాహ్‌ను వేడుకునేందుకై ఉద్దేశించబడిన కొన్ని ప్రార్థనలు క్రింద పేర్కొనబడుతున్నాయి :**

**(1) "అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుక మినల్ ఖైరి కుల్లిహీ ఆజిలిహీ వ ఆజిలిహీ మా అలిమ్‌తు మిన్‌హు వ మాలమ్ అఅ్‌లమ్ వ అఊజుబిక మినష్షర్రి కుల్లిహీ ఆజిలిహీ వ ఆజిలిహీ మా అలిమ్‌తు మిన్‌హు వ మాలమ్ అఅ్‌లమ్ అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుక మిన్ ఖైరి మా సఅలక అబ్‌దుక వ నబియ్యుక వ అఊజుబిక మిన్ షర్రి మా ఆజ బిహీ అబ్‌దుక వ నబియ్యుక అల్లాహుమ్మ ఇన్నీ అస్అలుకల్ జన్నత వ మా ఖర్రబ ఇలైహా మిన్ ఖౌలిన్ ఔ అమలి౯వ్వ అఊజుబిక మినన్నారి వ మా ఖర్రబ ఇలైహా మిన్ ఖౌలిన్ ఔ అమలి౯వ్వ అస్అలుక అన్ తజ్అల కుల్ల ఖుజాఇ ఖజైతహూ లీ ఖైరా"** [1] **(సహీహ్)**

తర్జుమా : ''ఓ అల్లాహ్! నేను త్వరగా చేకూరే లేదా ఆలస్యంగా చేకూరే, నాకు తెలిసిన లేదా నాకు తెలియని అన్ని రకాల మంచిని నీ నుంచి కోరుతున్నాను. అలాగే నేను త్వరగా జరిగే లేదా ఆలస్యంగా జరిగే, నాకు తెలిసిన లేదా నాకు తెలియని అన్నిరకాల చెడుగుల నుంచి నీ రక్షణ కోరుతున్నాను. ఓ అల్లాహ్! నీ నుంచి నీ దాసులు మరియు ప్రవక్త(స) కోరిన ప్రతి మంచినీ కోరుతున్నాను. అలాగే నీ దాసులు మరియు ప్రవక్త(స) కోరినట్లుగానే ప్రతి చెడుగు నుంచి రక్షణ కోరుతున్నాను. ఓ అల్లాహ్! నేను నీ నుంచి స్వర్గాన్ని కోరుతున్నాను. అలాగే స్వర్గానికి చేరువ చేసే వాక్కును, ఆచరణను కోరుతున్నాను. ఓ అల్లాహ్! నరకాగ్ని నుంచి నేను నీ రక్షణ కోరుతున్నాను. అలాగే నరకాగ్నికి చేరువ చేసే వాక్కు నుంచి మరియు ఆచరణ నుంచి నీ రక్షణ కోరుతున్నాను. ఓ అల్లాహ్! నీవు నా కొరకు నిర్ణయించిన విధిని నా కొరకు ఉత్తమమైనదిగా మలచవలసిందిగా నిన్ను అభ్యర్థిస్తున్నాను.''

**(2) "అల్లాహుమ్మఖ్‌సిమ్ లనా మిన్ ఖష్‌యతిక మా తహూలు బిహీ బైననా వ బైన మఆసీక వ మిన్ తాఅతిక మా తుబల్లిగునా బిహీ జన్నతక వ మినల్ యఖీని మా తుహవ్విను బిహీ అలైనా ముసీబా తిద్దున్‌యా వ మత్తిఅ్‌నా బిఅస్‌మాఇనా వ అబ్‌సారినా వ ఖువ్వతినా**

**మా అహ్యైతనా వజ్అల్‌హుల్ వారిస మిన్నా వజ్అల్ సారనా అలా మన్ జలమ్‌నా వన్‌సుర్‌నా అలా మన్ ఆదానా వలా తజ్అల్ ముసీబతునా ఫీ దీనినా వలా తజ్అలిద్దున్‌యా అక్‌బరు హమ్మినా వలా మబ్‌లగ ఇల్‌మినా వలా తుసల్లిత్ అలైనా మల్లా యర్‌హమ్‌నా"** [2] **(సహీహ్)**

తర్జుమా : "ఓ అల్లాహ్! మాకు, మా పాపాలకు నడుమ అడ్డంకిగా ఉండగలిగేంతటి భీతిని మాకు ప్రసాదించు. అలాగే మమ్మల్ని స్వర్గానికి చేరవేయగలిగేంతటి సామర్థ్యాన్ని మాకు ప్రసాదించు. అలాగే ప్రాపంచిక కష్టాలను సహించటానికి సరిపోయేంతటి విశ్వాసాన్ని మాకు ప్రసాదించు. ఓ అల్లాహ్! నీవు మమ్మల్ని సజీవంగా ఉంచినంత వరకు మాకు మా చెవులు, కళ్ళు, ఇంకా ఇతర శక్తుల ద్వారా ప్రయోజనాన్ని చేకూర్చు. అలాగే ఆ ప్రయోజనానికి మమ్మల్ని వారసులుగా చేయి. (అనగా జీవితాంతం మా జ్ఞానేంద్రియాలను ఆరోగ్యంగా ఉంచు). మా పై దౌర్జన్యం చేసే వ్యక్తిపై నీవు ప్రతీకారం తీర్చుకో. అలాగే శత్రువుల విషయంలో మాకు సహకరించు. ధర్మం విషయంలో మా పై కష్టాన్ని అవతరింపజేయకు. ఇహలోకాన్ని మా సర్వోన్నత లక్ష్యంగా చేయకు. అలాగే ఇహలోకాన్ని మా జ్ఞానపు గమ్యంగా చేయకు. అలాగే మా పై కరుణ చూపని వ్యక్తి బారిన మమ్మల్ని పడనీయకు."

**(3) "అల్లాహుమ్మ ఇన్నా నస్‌అలుక మూజిబాతి రహ్మతిక వ అజాఇమ మగ్‌ఫిరతిక వల్ గనీమత మిన్ కుల్లి బిర్రి c వల్ ఫౌజ బిల్ జన్నతి వన్నజాత మినన్నార్."** [3]

తర్జుమా : "ఓ అల్లాహ్! మేము నీ నుంచి నీ కారుణ్యాన్ని పొందేందుకు దోహదపడే సాధనాలను, నీ మన్నింపుకు దోహదపడే సాధనాలను, ప్రతి మంచిలో భాగస్వామ్యాన్నీ కోరుతున్నాము. ఓ అల్లాహ్! మేము నీ నుంచి స్వర్గాన్ని పొందడంలో విజయాన్ని, నరకాగ్ని నుంచి విముక్తిని కోరుతున్నాము."

**(4) "అల్లాహుమ్మ ఇన్నీ అస్‌అలుక అన్ తర్‌ఫఅ జిక్‌రీ వ తజఅ విజ్‌రీ వ తుస్‌లిహ అమ్‌రీ వ తుతహ్హిర ఖల్‌బీ వ తుహస్సిన ఫర్‌జీ వ తునవ్విర ఖల్‌బీ వ తగ్‌ఫిరలీ జంబీ వ అస్‌అలుకద్దరజాతిల్ ఉలా మినల్ జన్నహ్"** [4]

తర్జుమా : "ఓ అల్లాహ్! నా స్మరణను ఉన్నతంగా మలచమని, నా బరువును తేలికపరచమని, నా పరిస్థితులను చక్కదిద్దమని, నా హృదయాన్ని పరిశుద్ధం కావించమని, నా మర్మావయవాన్ని రక్షించమని, నా హృదయాన్ని కాంతిమయం కావించమని, నా పాపాలు క్షమించమని అభ్యర్థిస్తున్నాను. అలాగే స్వర్గంలో మహోన్నత స్థాయిని నీ నుంచి అర్థిస్తున్నాను."

**(5) "అల్లాహుమ్మ ఇన్నీ అస్‌అలుకల్ జన్నత వస్తజీరు బిక మినన్నార్"[5]**
**(హసన్)**

తర్జుమా : "ఓ అల్లాహ్! నేను నిన్ను స్వర్గాన్ని అర్థిస్తున్నాను. అలాగే నరకాగ్ని నుంచి రక్షణ కోరుతున్నాను." (ఈ వాక్యాన్ని మూడుసార్లు పఠించాలి)

**అథః సూచికలు :**

1. సహీహ్ సునన్ ఇబ్నె మాజహ్, లిల్ అల్‌బానీ, అల్ జుజ్‌ఉస్సానీ, హదీస్ నెం : 3102
2. సహీహ్ జామిఉత్తిర్మిజీ, లిల్ అల్‌బానీ, అల్ జుజ్‌ఉస్సాలిసు, హదీస్ నెం : 2730
3. ముస్తదరిక్ హాకిమ్ 1 / 525
4. ముస్తదరిక్ హాకిమ్ 1 / 520
5. అద్దుఆఉ మినల్ కితాబి వస్సున్నహ్, పేజీ నెం : 88

# వివిధ అంశాలు

## అంశం : 416

**స్వర్గలోకంలో ప్రవేశం కేవలం అల్లాహ్ కారుణ్యం ద్వారా మాత్రమే సాధ్యమవు తుంది.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "ఏ వ్యక్తీ తన ఆచరణల ద్వారా స్వర్గంలోకి ప్రవేశించడు." దైవప్రవక్త(స) ఈ విధంగా ప్రశ్నించబడ్డారు: "ఓ దైవప్రవక్తా (స)! మీరు కూడానా ?" దైవప్రవక్త(స) ఇలా పేర్కొన్నారు: "అవును. నేను కూడా, నా ప్రభువు తన కారుణ్యంతో నన్ను కప్పివేస్తే తప్ప." (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[1]

## అంశం : 417

**మూడుసార్లు అల్లాహ్‌ను స్వర్గం కొరకు అభ్యర్థించే వ్యక్తికొరకు స్వర్గం స్వయంగా సిఫారసు చేస్తుంది.**

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "ఏ వ్యక్తయితే మూడుసార్లు అల్లాహ్‌ను స్వర్గం కొరకు అభ్యర్థిస్తాడో (ఆ వ్యక్తి కొరకు) స్వర్గం ఇలా పలుకుతుంది : 'ఓ అల్లాహ్! ఇతడిని స్వర్గంలోకి ప్రవేశింపజేయి' అలాగే ఏ వ్యక్తయితే మూడుసార్లు నరకం నుంచి రక్షించమని అల్లాహ్‌ను వేడుకుంటాడో (ఆ వ్యక్తి కొరకు) నరకం ఇలా పలుకుతుంది : 'ఓ అల్లాహ్! ఇతడిని నరకం నుంచి రక్షించు." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[2]

## అంశం:418

**అల్లాహ్ మార్గంలో హిజ్రత్ చేసే పేదవారు ధనవంతుల కంటే ఐదువందల సంవత్సరాలు ముందే స్వర్గంలోకి ప్రవేశిస్తారు.**

హజ్రత్ అబూ సఈద్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "హిజ్రత్ చేసిన పేదవారు ధనవంతుల కంటే ఐదువందల సంవత్సరాలు ముందే స్వర్గంలోకి ప్రవేశిస్తారు." (దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[3]

## అంశం : 419

**ప్రతి వ్యక్తికీ స్వర్గంలో లేదా నరకంలో స్థలం ఉంటుంది. అయితే ఎప్పుడయితే ఒక వ్యక్తి నరకంలోకి ప్రవేశిస్తాడో స్వర్గంలో అతడికి చెందిన స్థలం స్వర్గ వాసులకు ఇచ్చివేయబడుతుంది.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు : "మీలో రెండు స్థలాలను కలిగి ఉండని వ్యక్తి ఎవడూ లేడు. ఒకటి స్వర్గంలో, మరొకటి నరకంలో. కానీ ఒక వ్యక్తి మరణించిన తర్వాత నరకానికి వెళ్ళినట్లయితే స్వర్గవాసులు అతడికి చెందిన స్వర్గలోకపు స్థలానికి వారసులుగా చేయబడతారు. ఖుర్ఆన్ లో అల్లాహ్ పేర్కొన్న "ఉలాఇక హుముల్ వారిసూన్" (వీరే వారసులు) (మోమినీన్ :10) అనే వాక్యానికి భావం ఇదే.

(దీనిని ఇబ్నె మాజహ్ ఉల్లేఖించారు, సహీహ్)[4]

## అంశం : 420

**నరకంలోకి వెళ్ళిన తర్వాత దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) సిఫారసు మీద నరకం నుంచి వెలికితీయబడి స్వర్గంలోకి ప్రవేశపెట్టబడేవారిని స్వర్గవాసులు 'నరకవాసులు' అని పిలుస్తారు.**

హజ్రత్ ఇమ్రాన్ బిన్ హుసీన్(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "కొంతమంది హజ్రత్ ముహమ్మద్ (స) సిఫారసు మేరకు నరకాగ్ని నుంచి వెలికి తీయబడి స్వర్గంలో ప్రవేశపెట్టబడతారు. వారిని ప్రజలు (స్వర్గవాసులు) 'నరకవాసులు' అని పిలుస్తారు. (దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[5]

**వివరణ :** 'నరకవాసులు' అని దూషణపూర్వకంగా పిలవబడతారని భావం కాదు. ఆ విధంగా పిలవడం ద్వారా వారికి అల్లాహ్ కారుణ్యాన్ని, అనగా అల్లాహ్ తన అమేయ కారుణ్యంతో వారికి నరకం నుంచి విముక్తిని ప్రసాదించి అల్లాహ్‌కు మరింతగా కృతజ్ఞులయ్యే అవకాశాన్ని కల్పించిన విషయాన్ని గుర్తుచేయడమే దీని వెనుక గల ఉద్దేశ్యం.

## అంశం : 421

**స్వర్గవాసి ఆత్మ ప్రళయదినానికి ముందే స్వర్గంలోకి చేరుకుంటుంది.**

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ కఅబ్ అన్సారీ (ర) తన తండ్రి దైవప్రవక్త(స) హదీసును ఈ విధంగా ప్రస్తావించేవారని ఉల్లేఖించారు :దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "విశ్వాసి ఆత్మ (మరణించిన తర్వాత) స్వర్గలోకపు చెట్ల మీద మృతులు లేపబడేంతవరకు విహరిస్తూ ఉంటుంది. ఆ రోజు (మృతులు లేపబడే రోజు) ఆ ఆత్మ తన శరీరంలోకి తిరిగి ప్రవేశపెట్టబడుతుంది." (దీనిని ఇబ్నెమాజహ్ ఉల్లేఖించారు, సహీహ్)[6]

## అంశం : 422

**విశ్వాసి ఎల్లప్పుడూ అల్లాహ్ కారుణ్యం పట్ల నమ్మకాన్ని, ఆయన శిక్ష పట్ల భయాన్ని కలిగి ఉండాలి.**

హజ్రత్ అబూహురైరహ్ (ర) తాను దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పలుకుతుండగా విన్నట్లుగా ఉల్లేఖించారు :ఒకవేళ అవిశ్వాసికి అల్లాహ్ కారుణ్యపు విస్తృతి గురించి తెలిసినట్లయితే అతడు స్వర్గం పట్ల ఎన్నడూ నిరాశ చెందజాలడు. అలాగే విశ్వాసికి అల్లాహ్ వద్ద ఎటువంటి శిక్షలున్నాయో తెలిసినట్లయితే అతడు ఎన్నడూ నరకం పట్ల నిర్భయునిగా ఉండజాలడు.'' (దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[7]

హజ్రత్ అనస్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు: ఒకానొక సమయంలో దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) మరణానికి చేరువలో ఉన్న ఒక యువకుని వద్దకు వెళ్ళి ఈ విధంగా ప్రశ్నించారు: ''నీవు ఎలా అనుభూతి చెందుతున్నావు?'' ఆ యువకుడు ఇలా బదులిచ్చాడు: ''ఓ దైవప్రవక్తా (స)! అల్లాహ్ సాక్షిగా! నేను భయపడుతున్నాను. అలాగే అల్లాహ్ కారుణ్యం పట్ల పూర్తి నమ్మకంతోనూ ఉన్నాను.'' అప్పుడు దైవప్రవక్త(స) ఇలా పలికారు: ''ఇటువంటి పరిస్థితిలో ఏ వ్యక్తి హృదయంలోనయినా భయం మరియు నమ్మకం చోటుచేసుకున్నట్లయితే అల్లాహ్ అతడి నమ్మకానికనుగుణంగా కరుణిస్తాడు. అలాగే అతడి భయానికనుగుణంగా అతడిని రక్షిస్తాడు.''

(దీనిని తిర్మిజీ మరియు ఇబ్నెమాజహ్‌లు ఉల్లేఖించారు, హసన్)[8]

## అంశం : 423

**బహుదైవారాధకులకు చెందిన, యుక్తవయస్సుకు చేరుకోకుండానే మరణించే పిల్లల పరిస్థితి గురించి అల్లాహ్‌కే బాగా తెలుసు.**

హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (ర) ఈ విధంగా పేర్కొన్నారు : దైవప్రవక్త(స) ను బహుదైవారాధకులకు చెందిన, యుక్తవయస్సుకు చేరుకోకుండానే మరణించే పిల్లల గురించి ప్రశ్నించినప్పుడు దైవప్రవక్త(స) ఇలా పలికారు : ''వారు ఏం చేస్తారో (పెద్దవారయినప్పుడు) అల్లాహ్‌కు బాగా తెలుసు.'' (దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[9]

## అంశం : 424

**స్వర్గంలో ముస్లింలకు చెందిన, యుక్తవయస్సుకు చేరుకోకుండానే మరణించిన పిల్లలను దైవప్రవక్త హజ్రత్ ఇబ్రాహీమ్ (అ), ఆయన సతీమణి హజ్రత్ సారహ్(ర) పోషిస్తారు.**

హజ్‌రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "ముస్లింల పిల్లలు (మరణించిన తర్వాత) స్వర్గంలో పోషించబడతారు. హజ్‌రత్ ఇబ్రాహీమ్(అ), ఆయన సతీమణి హజ్‌రత్ సారహ్(ర) వారిని పోషిస్తారు. చివరకు ప్రళయదినాన వారు వారిని వారి తల్లిదండ్రులకు అప్పగిస్తారు."

(దీనిని ఇబ్నె అసాకిర్ ఉల్లేఖించారు, హసన్)[1]

## అంశం : 425

**స్వర్గం, అందులోని సౌఖ్యాలు అల్లాహ్ కారుణ్యానికి, కృపకు నిదర్శనాలు.**

## అంశం : 426

**నరకం, అందులోని కష్టాలు అల్లాహ్ శిక్షకు నిదర్శనాలు.**

హజ్‌రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు :స్వర్గనరకాలు పరస్పరం వాదించు కున్నాయి. నరకం ఈ విధంగా పలికింది: "నా లోకి అహంకారులు, దౌర్జన్యపరులు ప్రవేశిస్తారు." స్వర్గం ఇలా పలికింది: "నా లోకి కేవలం బలహీనులు, నిస్సహాయులు మాత్రమే ప్రవేశిస్తారు" అప్పుడు అల్లాహ్ స్వర్గంతో ఈ విధంగా పలికాడు : "నీవు నా కారుణ్యానివి. నేను నా దాసుల్లో నేను కోరినవారిపై నీ ద్వారా కరుణిస్తాను." అల్లాహ్ నరకంతో ఈ విధంగా పలికాడు: "నీవు నా శిక్షవు. నా దాసుల్లో నేను కోరినవారిని నీ ద్వారా శిక్షిస్తాను. నీవు నింపివేయబడతావు." (దైవప్రవక్త(స) ఈ విధంగా పేర్కొన్నారు) నరకం మానవులతోనయితే నిండదు. అయితే అల్లాహ్ దానిమీద తన పవిత్రమైన కాలిని ఉంచుతాడు. అప్పుడు నరకం ఇలా పలుకుతుంది: "చాలు చాలు" అప్పుడు నరకం నిండిపోతుంది. దానికి చెందిన ఒక భాగం మరొక భాగంతో కలిసిపోతుంది.

(దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[1]

## అంశం : 427

**ప్రతిస్వర్గవాసీ స్వర్గంలోని తన భవంతిని ఇహలోకపు ఇంటికంటే బాగా గుర్తుపడతాడు.**

## అంశం : 428

**స్వర్గంలోకి ప్రవేశించడానికి ముందు అందరూ పరస్పర హక్కులను నెరవేర్చవలసి ఉంటుంది.**

హజ్‌రత్ అబూ సఈద్ ఖుద్‌రీ(ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్‌రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: "విశ్వాసులు నరకం పైనుంచి దానిమీద ఉంచబడిన 'సిరాత్' అనే వంతెన మీదుగా) కొనసాగిపోగా వారు స్వర్గనరకాలకు నడుమ ఒక వంతెన మీద ఆపివేయబడతారు. అప్పుడు ఇహలోకంలో ప్రజలు ఒకరిని మరొకరు

హింసించి ఉన్నట్లయితే లేదా హింసించబడి ఉన్నట్లయితే వాటికి బదులు తీర్చుకోవడం జరుగుతుంది. విశ్వాసులందరూ పవిత్రులైన తర్వాత వారికి స్వర్గంలోకి ప్రవేశించేందుకు అనుమతి ఇవ్వబడుతుంది. ఎవరి అధీనంలోనయితే నా ప్రాణముందో ఆ అస్తిత్వం సాక్షిగా! ప్రతి స్వర్గవాసీ స్వర్గంలో తన స్థలాన్ని ఇహలోకపు నివాసం కంటే బాగా గుర్తిస్తాడు.''

(దీనిని బుఖారీ ఉల్లేఖించారు)[12]

## అంశం : 429

### మృత్యువు బలి ఇవ్వబడే దృశ్యం

హజ్రత్ అబూహురైరహ్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: ''అల్లాహ్ స్వర్గవాసులను స్వర్గంలోకి, నరకవాసులను నరకంలోకి ప్రవేశింపజేసిన తర్వాత మృత్యువు తీసుకురాబడి స్వర్గవాసులకు, నరకవాసులకు నడుమ ఉండే గోడ మీద నిల్చోపెట్టబడుతుంది. అప్పుడు అల్లాహ్ ఈ విధంగా పలుకుతాడు: 'ఓ స్వర్గవాసులారా!' వారు భయంతో తమ దృష్టిని కేంద్రీకరిస్తారు. తిరిగి అల్లాహ్ 'ఓ నరకవాసులారా!' అని పలుకుతాడు. వారు సంతోషంతో తమ దృష్టిని కేంద్రీకరిస్తారు. వారు తాము సిఫారసు చేయబడతామేమోనని ఆశిస్తారు. ఆ తర్వాత స్వర్గవాసులను, నరకవాసులను ఉద్దేశించి ఈ విధంగా ప్రశ్నించడం జరుగుతుంది: ''మీరు దీనిని గుర్తించగలరా?'' స్వర్గవాసులు, నరకవాసులు ''మేము గుర్తిస్తాము. ఇది మృత్యువు. ఇది ఇహలోకంలో మమ్మల్ని కబళించింది'' అని పలుకుతారు. ఆ తర్వాత మృత్యువును గోడ మీద పడుకోబెట్టి బలి ఇవ్వడం జరుగుతుంది. ఆ తర్వాత ఈ విధంగా పేర్కొనబడుతుంది: 'ఓ స్వర్గవాసులారా! నేటి తర్వాత మరణమనేది లేదు. శాశ్వతంగా స్వర్గంలో ఉండండి. ఓ నరకవాసులారా! నేటి తర్వాత మరణమనేది లేదు. శాశ్వతంగా నరకంలో ఉండండి.''

(దీనిని తిర్మిజీ ఉల్లేఖించారు, సహీహ్)[13]

## అంశం : 430

### ఏ వ్యక్తి హృదయంలోనయితే ఆవగింజంత విశ్వాసముంటుందో అతడిని చివరకు అల్లాహ్ తన కారుణ్యంతో నరకం నుంచి వెలికితీసి స్వర్గంలోకి ప్రవేశింపజేస్తాడు.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (ర) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త హజ్రత్ ముహమ్మద్(స) ఈ విధంగా పేర్కొన్నారు: ''ఏ వ్యక్తయితే ' లా ఇలాహ ఇల్లల్లాహ్' (అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు లేడు) అని పలుకుతాడో, అతడి హృదయంలో ఒకవేళ బార్లీ గింజంత మంచి ఉన్నట్లయితే అతడు కూడా నరకం నుంచి విముక్తిని పొందుతాడు. (స్వర్గంలోకి ప్రవేశిస్తాడు). ఏ వ్యక్తయితే 'లా ఇలాహ ఇల్లల్లాహ్' అని పలుకుతాడో, అతడి హృదయంలో ఒకవేళ గోధుమ గింజంత మంచి ఉన్నట్లయితే అతడు కూడా నరకం నుంచి విముక్తిని పొందుతాడు. ఏ వ్యక్తయితే

‘ లా ఇలాహ ఇల్లల్లాహ్’ అని పలుకుతాడో, అతడి హృదయంలో రవ్వంత మంచి ఉన్నా అతడు కూడా నరకం నుంచి విముక్తిని పొందుతాడు. (దీనిని ముస్లిమ్ ఉల్లేఖించారు)[14]

**అల్‌హమ్‌దులిల్లాహిల్లజీ బి నిఅ్‌మతిహీ తతిమ్ముస్సాలిహాతు వ అల్‌ఫు అల్‌ఫు సలాతింవ్వ సలామిన్ అలా అఫ్‌జలిల్ బరియ్యతి వ అలా ఆలిహీ వ అస్‌హాబిహీ అజ్‌మఈన బి రహ్మతిక యా అర్‌హమర్రాహిమీన్**

---

**అథః సూచికలు :**

1. కితాబ్ సిఫాతుల్ మునాఫిఖీన్, బాబ్ లంయ్యద్‌ఖులుల్ జన్నహ్ అహద్ బిఅమలిహీ
2. అబ్‌వాబుల్ జన్నహ్, బాబ్ మా జాఅ ఫీ సిఫతి అన్‌హారుల్ జన్నహ్
3. అబ్‌వాబుజ్జుహద్, బాబ్ మా జాఅ అన్నల్ ఫుఖరాఉల్ ముహాజిరీన యద్‌ఖులూనల్ జన్నత ఖబ్‌ల అగ్నియాయిహిమ్
4. కితాబుజ్జుహద్, బాబ్ సిఫతుల్ జన్నహ్ (2 / 3503)
5. కితాబుజ్జిక్రి వద్దుఆ, బాబ్ అక్సర్ అహ్‌లుల్ జన్నతి వన్నార్
6. కితాబుజ్జుహద్, బాబ్ జిక్రుల్ ఖబర్ (2 / 3446)
7. కితాబుర్రిఖాఖ్, బాబుర్రిజాఅ మఅల్ ఖౌఫ్
8. సహీహ్ జామిఉత్తిర్మిజీ, లిల్ అల్‌బానీ, అల్ జుజ్‌ఉల్ అవ్వలు, హదీస్ నెం : 785
9. ముఖ్‌తసర్ సహీహ్ బుఖారీ లిజ్జుబైదీ, హదీస్ నెం : 696
10. సిల్‌సిలయె అహాదీసుస్సహీహ లిల్ అల్‌బానీ, అల్ జుజ్‌ఉస్సాలిసు, హదీస్ నెం : 1467
11. కితాబుల్ జన్నహ్ వ సిఫతు నఈమిహా
12. కితాబుల్ మజాలిమ్, బాబ్ ఖిసాసుల్ మజాలిమ్
13. అబ్‌వాబ్ సిఫతుల్ జన్నహ్, బాబ్ మా జాఅ ఫీ ఖులూద అహ్‌లుల్ జన్నహ్ వ అహ్‌లున్నార్ (2 / 2072)
14. కితాబుల్ ఈమాన్, బాబ్ ఇస్‌బాతుష్షఫాఅహ్ వ ఇఖ్‌రాజుల్ మువహ్హిదీన ఫిన్నార్